
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 129
బుధవారం 30-7-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



నువ్వు గ్రౌండ్స్‌మన్‌వి మాత్రమే

ఓవల్ క్యురేటర్‌తో గంభీర్ వాగ్వాదం. పిచ్‌కు దగ్గరగా రావడంపై వివాదం -14లో



ఎగుమతుల్లో భారత్ టాప్

చైనాను మించి అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల సరఫరా.. కెనాలిస్ నివేదిక వెల్లడి -15లో



'ప్రళయ్' ప్రయోగం సక్సెస్

ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే నూతన 'ప్రళయ్' క్షిపణి టెస్ట్-ఫైర్ పూర్తిస్థాయిలో విజయవంతమైంది.

- వివరాలు 6లో



...మోసం చేస్తోంది

మాజీ మంత్రి సెంథిల్‌పై ఉన్న కేసు విచారణను తమిళనాడు ప్రభుత్వం కావాలని జాప్యం అయ్యేలా చేస్తోందని సుప్రీం వ్యాఖ్యానించింది.

- వివరాలు 6లో



భారీగా ఓట్లను తొలగిస్తే..

'ఎస్ఐఆర్' ప్రక్రియలో భారీ స్థాయిలో ఓట్లను తొలగిస్తే మాత్రం తాము కచ్చితంగా జోక్యం చేసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 6లో



'సృష్టి'పై కేసులే కేసులు!

సరోగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌తో పాటు డాక్టర్ నమ్రత చరిత్రను పోలీసులు తవ్వి తీస్తున్నారు.

- వివరాలు 5లో

సిందూర్ ఆపాలని ఏ దేశాధినేతా చెప్పలేదు

'ఆపరేషన్ సిందూర్'పై చర్చలో మోదీ స్పష్టీకరణ... కాంగ్రెస్‌పై నిప్పులు

పాక్ మీపై దాడి చేయబోతోందని అమెరికా ముందే సమాచారమిచ్చింది

బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెప్తామని వాన్స్‌కు చెప్పానన్న ప్రధాని



- పాక్ బతిమాలితేనే ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశాం
- మన దాడుల ధాటికి ఇప్పటికీ పాక్ ఎయిర్ బేస్‌లు ఐసీయూలో ఉన్నాయి
- అణుబాంబుల బెదిరింపులు ఇకమీదట సాగవని పాక్‌ను హెచ్చరించాం
- సిందూర్ విషయంలో మెజారిటీ దేశాలు భారత్‌ను సమర్థించాయి
- పాకిస్తాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం
- ఆనాడు సర్జికల్ స్ట్రైక్స్ విషయంలోనూ కాంగ్రెస్ ఇలాగే మాట్లాడింది
- నాడు నెహ్రూ చేసిన తప్పిదాలకు నేటికీ మనం గాయాలను భరిస్తున్నాం
- సింధూ నదీజలాల ఒప్పందం ద్వారా నీళ్లతోపాటు డ్యామ్‌లు కట్టుకునేందుకూ నెహ్రూ పాక్‌కు నిధులిచ్చారు... భారత ప్రయోజనాలను దెబ్బతీసిన సింధూ ఒప్పందం నెహ్రూ చేసిన అతిపెద్ద తప్పిదం
- ఆపరేషన్ మహదేవ్‌తో పహల్గాం ముష్కరులను సైన్యం మట్టుబెట్టింది
- వాళ్లను చంపడానికి తేదీలు చూడాలా అన్న మోదీ

- వివరాలు 6లో

మోదీకి ఆ ధైర్యం ఉందా?



"ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను తిప్పికొట్టే ధైర్యం మోదీకి లేదు. ఇందిరకు ఉన్న ధైర్యంలో మోదీకి కనీసం 50 శాతం ఉన్నా ట్రంప్ వ్యాఖ్యలు తప్పు అని పార్లమెంట్‌లో చెప్పాలి. - రాహుల్‌గాంధీ

6 లో

ఆ ముగ్గురూ పహల్గాం ముష్కరులే

అందరూ గ్రేడ్-ఏ ఉగ్రవాదులే

- సుదీర్ఘ శ్రమకు ఫలితమే 'మహదేవ్'
- లోక్‌సభకు వెల్లడించిన హోం మంత్రి అమిత్ షా



6 లో

మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తలసాని. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, బండ ప్రకాశ్, గంగుల కమలాకర్ తదితరులు



ఆగస్టు 8న కరీంనగర్‌లో బీఆర్ఎస్ 'బీసీ గర్జన'

త్వరలో రాష్ట్రపతిని కలవనున్న బీఆర్ఎస్ బీసీ ప్రతినిధుల బృందం

తలసాని అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో బీసీ నాయకుల సమావేశం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 8న కరీంనగర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. బీసీల కు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ సభ ద్వారా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై త్వరలో బీఆర్ఎస్ బీసీ ప్రతినిధులం ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. తెలంగాణభవన్‌లో తలసాని అధ్యక్షతన మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన బీసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, కాంగ్రెస్, బీజేపీ విధానాలపై చర్చించారు. అనంతరం మాజీమంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ తదితరులతో కలిసి తలసాని మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగానే, ఆర్డినెన్స్ తెస్తామనడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల పెంపు అంశాన్ని చేర్చితేనే చట్టబద్ధత లభిస్తుందని తాము అసెంబ్లీ వేదికగా చెప్పామన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రజలను మభ్యపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఢిల్లీలో ధర్నాపేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామాను మొదలు మిగతా 3వ పేజీలో ▶

ప్రభుత్వ వైఫల్యాలపై రాజీలేని పోరు: కేసీఆర్ -3లో

న్యూస్‌రీల్

బీసీ బిల్లుకు కేంద్రం అడ్డంకులు



రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ విషయమై త్వరలోనే రాష్ట్రపతిని కలవనున్నట్లు చెప్పారు.

- వివరాలు 2లో▶

మళ్లీ భూముల వేలం



రాష్ట్ర ప్రభుత్వానికి పన్నేతర ఆదాయాన్ని సమకూర్చడంలో కీలకంగా మారిన టీజీఐఐసీ మరోమారు అత్యంత విలువైన భూముల వేలానికి సిద్ధమైంది. అత్యంత ఖరీదైన రాయదుర్గ్, ఉస్మాన్‌నగర్ ప్రాంతాల్లోని 66 ఎకరాలను విక్రయించాలని భావిస్తోంది.

- వివరాలు 2లో▶

డీఎస్సీ-2003 టీచర్లకు పాత పింఛన్



డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు మంగళవారం ఆదేశించింది. 2004, ఆగస్టు 31 వరకు పాత పింఛన్ విధానం (ఓపీఎస్) అమల్లో ఉన్నందున వారంతా అందుకు అర్హులని తేల్చిచెప్పింది.

- వివరాలు 2లో▶

కాంగ్రెస్ సైన్యాన్ని సిద్ధం చేయండి

3 లో

కాలుష్యరహితంగా హైదరాబాద్

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- వచ్చే 25 ఏళ్ల అవసరాలు దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు
- ఔటర్ రింగు రోడ్డు వెలుపలకు పరిశ్రమలు
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం
- భూగర్భ డ్రైనేజీ, కేబులింగ్‌పై సమగ్ర డీపీఆర్‌లు
- పుర పాలక, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష



పురపాలక శాఖపై జరిగిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చి పర్యావరణ హితంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగరానికి అవసరమైన భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నగరం నడిబొడ్డున (కోర్ సిటీ) ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు వెలుపలకు తరలించాలని ఆదేశించారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ప్రత్యేక ప్రణాళిక రూపొందించండి

హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చెప్పారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని శాఖలు మిగతా 2వ పేజీలో ▶

'సరస్వతి' షేర్ల బదిలీ చెల్లదు

తేల్చిచెప్పిన జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాదనలతో ఏకీభవించిన బెంచ్
- షర్మిల చేసుకున్న షేర్ల అక్రమ బదిలీని నిలిపేయాలన్న పిటిషన్‌కు అనుమతి
- షేర్ల బదిలీ అక్రమమేనని ఎన్సీఎల్‌టీ తుది ఉత్తర్వులు



- వివరాలు 12లో



మనవాళ్ల ఫోన్ సార్! 'గ్రాఫిక్స్' తప్ప ఏదయినా సాధించుకొని తీసుకురమ్మంటున్నారు!

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ వి.రామసుబ్రమణియన్



గురుకుల విషాహార మృతులు 48 మంది

- రాష్ట్రంలోని గురుకులాల్లో 886 ఫుడ్ పాయిజన్ ఘటనలు
- విద్యార్థుల మరణాలపై 4 వారాల్లో నివేదిక కోరాం
- లగచర్ల ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది
- ఎన్‌హెచ్‌ఆర్సీ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్
- ప్రభుత్వ అధికారులు, వివిధ సంఘాలతో సమావేశం


16 లో

జీఎస్ఎల్వీ ఎఫ్16 ప్రయోగం నేడే

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) తొలిసారిగా సంయుక్తంగా రూపొందించిన నాసా-ఇస్రో సింథటిక్ ఆపార్చర్ రాడార్ (నిసార్) అనే ఉపగ్రహాన్ని బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2.10కి ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.నారాయణన్ ఆధ్వర్యంలో కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



- వివరాలు 12లో



నాగార్జునసాగర్ మొత్తం 26 గేట్ల నుంచి పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

గోదావరి వెలవెల.. కృష్ణమ్మ కళకళ..

- కృష్ణా ప్రాజెక్టుల్లో 89 శాతానికి చేరిన నిల్వలు
- గోదావరి జలాశయాల్లో నిల్వలు 32 శాతమే

సాగర్ 26 గేట్లు ఎత్తివేత

5 లో

క్లుప్తంగా...

ఐదేళ్లలో తెలుగు రాష్ట్రాలకు రూ.463 కోట్లకుపైగా నిధులు

అందులో తెలంగాణ వాటా రూ.32.87 కోట్లు: కేంద్ర మంత్రి జార్జి కురియన్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎంఎస్వై) పథకం కింద తెలుగు రాష్ట్రాలకు రూ.463 కోట్లకు పైగా కేంద్రం వాటా విడుదల చేశామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మొత్తం 2020–21 నుంచి 2024–25 వరకు ఇచ్చామని మంగళవారం లోక్సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. విడుదల చేసిన మొత్తంలో ఆంధ్రప్రదేశ్కు రూ.463.13 కోట్లు, తెలంగాణకు రూ.32.87 కోట్లకుపైగా ఉన్నాయని తెలిపారు. అలాగే.. ఇదే పథకం కింద ఏపీకి రూ.88.08 కోట్లు విలువైన ఒక ఇంటిగ్రేటెడ్ ఆక్వాపార్క్కు ఆమోదం తెలిపామని ఇందులో కేంద్రం వాటా రూ.52.85 కోట్లు ఉన్నదని పేర్కొన్నారు.

ఏపీలో ఉప్పునీటి ఆక్వా, తెలంగాణలో కొర్రమీను క్లస్టర్లు

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద (పీఎంఎంఎస్వై) ఆంధ్రప్రదేశ్లోని భీమవరంలో ఉప్పునీటి ఆక్వా క్లస్టర్, తెలంగాణలోని మంచిర్యాలలో కొర్రమీను క్లస్టర్ను నోటిఫై చేశామని కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం లోక్సభలో అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2020–21 నుంచి 2024–25 వరకు వీటిని నోటిఫై చేశామన్నారు. ఫిషింగ్, ఆక్వాకల్చర్, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, చెరువుల నిర్మాణం వంటి మత్స్య.. దాని అనుబంధ కార్యకలాపాల్లో పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు సృష్టించడంలో పీఎంఎంఎస్వై కీలక పాత్ర పోషిస్తున్నదని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

రేపు కొత్త జడ్జీల ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకమైన నలుగురు కొత్త జడ్జీలు ఈనెల 31న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్కుమార్ను జడ్జీలుగా నియమిస్తూ రెండు రోజుల కిందట కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీరు గురువారం ఉదయం 10 గంటలకు మొదటి కోర్టు హాల్లో అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరిస్తారని రిజిస్ట్రార్ జనరల్ తెలిపారు.

సహజ వ్యవసాయం లక్ష్యంగా 'ఎనీ టైమ్ మనీ'

సెస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనకు హాజరైన కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) ఆధ్వర్యంలో సహజ వ్యవసాయం ద్వారా భవిష్యత్తుకు మార్గం అనే అంశంపై 'ఏటీఎం: ఎనీ టైమ్ మనీ'డాక్యుమెంటరీని యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్బర్గ్లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ (సీఎస్ఏ), యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్బర్గ్కు చెందిన సెంటర్ ఫర్ పెస్టిసైడ్ సూసైడ్ ప్రివెన్షన్ (సీపీసీపీ) సంయుక్తంగా నిర్వహించాయి. ఈ డాక్యుమెంటరీ సినిమాలో ఆంధ్రప్రదేశ్లో సహజ వ్యవసాయం వైపునకు మారుతున్న రైతుల ప్రయాణాన్ని చూపించారు. భూమిని రసాయనాల నుంచి విముక్తి చేసి, మళ్లీ పునరుజ్జీవం చేయడమే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయం సాగుతుందని పేర్కొన్నారు. చిత్ర ప్రదర్శన అనంతరం 'సహజ వ్యవసాయం – ముందుకు వెళ్లే దారి'అనే అంశంపై ప్యానల్ చర్చ జరిగింది. ఇందులో రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొన్నారు. ఈ చర్చలో తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, రైతులపై రసాయన వినియోగం వల్ల వచ్చే ప్రభావాలు వివరించారు. సహజ వ్యవసాయానికి మద్దతుగా ధరలు, సబ్సిడీలు అవసరమన్నారు. ఏటీఏఆర్ఐ డైరెక్టర్ డా.షేక్ ఎన్.మీరా మాట్లాడుతూ సహజ వ్యవసాయం విషయమై ఇప్పటికే వ్యవసాయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, అందుకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్నారు.

ఆవాలు, నువ్వులు.. అక్కడక్కడే!



తగ్గిపోతున్న ప్రధాన సంప్రదాయ పంటలు

- సోయాబీన్ మినహా పలు నూనె గింజల పంటలు దాదాపు కనుమరుగు
- పాలమూరు, నిజామాబాద్ జిల్లాల్లో సైతం కానరాని వేరుశనగ
- పప్పు దినుసు పంటలదీ అదే దారి.. కంది ఓకే.. పెసర, మినుములు అంతంతే..!
- రాష్ట్రంలో వరి, పత్తిదే హవా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రధాన సంప్రదాయ పంటల సాగు తగ్గిపోతోంది. సోయాబీన్ మినహా పలు నూనె గింజల పంటల సాగు తగ్గుతుండగా కొన్ని దాదాపు కనుమరుగై పోతున్నాయి. వేరుశనగ, నువ్వులు, ఆముదం, ఆవాలు, సన్ఫ్లవర్, కుసుమ, వెర్రి నువ్వులు నామమాత్రంగానే సాగవుతున్నాయి. మరోవైపు పప్పు దినుసులదీ అదే పరిస్థితి కావడం గమనార్హం. రాష్ట్రంలో ప్రతి ఏటా రైతులు కొన్ని పంటలనే సాగు చేస్తుండడం, సంప్రదాయ పంటలు కనుమరుగవుతుండడంపై వ్యవసాయ శాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. పంటల మార్పిడి జరపాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. సులభంగా సాగు చేసే పంటల వైపే మొగ్గు చూపుతున్నారు.

నువ్వులు, కుసుమ, ఆవాలు ఏవీ?

సోయాబీన్ మినహా సంప్రదాయ వేరుశనగ, నువ్వులు, ఆముదం, ఆవాలు, సన్ఫ్లవర్ వంటి పంటలన్నీ కలిపినా 2 వేల ఎకరాల్లో కూడా లేకపోవడం రాష్ట్రంలో పంటల సాగు తీరును తేటతెల్లం చేస్తుంది. ఆవాలు, కుసుమ, వెర్రి నువ్వులు మొదలైన నూనె పంటలు ఏకంగా 1.12 లక్షల ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తే కేవలం 57 ఎకరాల్లో మాత్రమే ఈ పంటలు సాగయ్యాయి.

అంతంత మాత్రంగానే ఉలవలు, బొబ్బర్లు

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్లో సుమారు 7.92 లక్షల ఎకరాల్లో పప్పుదినుసు పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇప్పటివరకు సాగైంది కేవలం 4.86 లక్షల ఎకరాలే. అయితే అందులో కేవలం కంది, పెసర పంటలదే 60 శాతం వాటా. వాటి తరువాత స్థానంలో మినుములు ఉన్నాయి. అయితే ఈ పంటల విస్తీర్ణం తీసుకుంటే కంది పంట ఒక్కటే 4.21 లక్షల ఎకరాల్లో సాగవడం గమనార్హం. సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే దాదాపు 2.23 లక్షల ఎకరాలు లోటు సాగుగా చెప్పుకోవచ్చు. పెసర పంట 86 వేల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను కష్టంగా 50 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇక మినుములు 15 వేల ఎకరాల్లో సాగవ్వగా, ఉలవలు 171 ఎకరాల్లో, బొబ్బర్లు, అనుములు 362 ఎకరాల్లో సాగయ్యాయి.

తగ్గుతున్న వేరుశనగ వైభవం

వేరుశనగ పంటకు పదేళ్ల క్రితం వరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రసిద్ధి. ఈ ప్రాంతంతో పాటు నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో కూడా కొన్ని మండలాల్లో వేరుశనగ పంటను సాగు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. రాష్ట్రంలో ఈసారి ఇప్పటివరకు 1,227 ఎకరాల్లో మాత్రమే వేరుశనగ సాగవడం గమనార్హం. వేరుశనగతో పాటు నూనె గింజల పంటలు రాష్ట్రంలో దాదాపుగా కనుమరుగయ్యాయి. నూనె పంటల కేటగిరీలో సోయాబీన్ ఒక్కటే రాష్ట్రంలో అత్యధికంగా 3.49 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. సోయాబీన్ పూర్తిగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్లతో పాటు సంగారెడ్డి జిల్లాకు మాత్రమే పరిమితం కావడం గమనార్హం. ఇతర జిల్లాల్లో దాని ఆనవాళ్లు కూడా లేవు. రాష్ట్రం మొత్తం మీద నూనె గింజల పంటలు 3.51 లక్షల ఎకరాల్లో సాగువుతుంటే, అందులో సోయాబీన్ ఒక్కటే 3.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ వానాకాలం సీజన్లో నూనె పంటల సాధారణ సాగు విస్తీర్ణం 5.69 లక్షల ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేయగా, అటు ఇటుగా అందులో సగం విస్తీర్ణంలో సోయాబీన్ పంట ఒక్కటే సాగవడం గమనార్హం.

సంప్రదాయ పంటలను మింగేస్తున్న వరి, పత్తి

దశాబ్ద కాలం క్రితం వరకు సంప్రదాయ పంటలకు నిలయమైన తెలంగాణ పల్లెలు ఇప్పుడు కేవలం వరి, పత్తి పంటలకే నిలయంగా మారాయని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్లో అత్యధికంగా వరి 60 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యే పరిస్థితి ఉండగా, ఇప్పటికే 20 లక్షల ఎకరాలు దాటింది. పత్తి ఈ సంవత్సరం 50 లక్షల ఎకరాల వరకు సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటికే 43 లక్షల ఎకరాలు దాటింది. సాగునీటి సదుపాయం పెరగడంతో మిశ్రమ పంటలు సాగు చేసే ఉమ్మడి మహబూబ్నగర్ , మెదక్, నిజామాబాద్ జిల్లాల రైతులు వరి సాగువైపు ఆకర్షితులయ్యారు. సాగునీటి సదుపాయం లేని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో లాభదాయకమనే ఉద్దేశంతో అధిక శాతం పత్తి పంటను సాగు చేస్తున్నారు. అలాగే డిమాండ్ ఎక్కువగా ఉండే సోయాబీన్, కూరగాయలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో పత్తి, వరితో పాటు మొక్కజొన్న, కంది పంటలు కలిపి ఏకంగా కోటి ఎకరాల్లో సాగవుతుండడంతో ప్రధాన సంప్రదాయ పంటలు తగ్గిపోతున్నాయి.

సీఎం రేవంత్కు సుప్రీంకోర్టులో ఊరట

పిటిషనర్ పెద్దిరాజుపై సీజేఐ జస్టిస్ గవాయ్ ఆగ్రహం

- గోపనపల్లి భూవివాదంపై పిటిషన్ కొట్టివేత
- కేసు విత్డ్రా చేసుకొనేందుకు అనుమతించని సీజేఐ



సాక్షి, న్యూఢిల్లీ: గోపన్పల్లి భూ వివాదం కేసులో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో రేవంత్రెడ్డికి వ్యతిరేకంగా ఎన్.పెద్దిరాజు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ట్రాన్స్ఫర్ పిటిషన్ను మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసుమి భట్టాచార్యపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు పిటిషనర్ పెద్దిరాజు, అతని తరపు న్యాయవాదులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. వారిపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో ఆగస్టు 11న తదుపరి విచారణ సందర్భంగా వ్యక్తిగతంగా హాజరై సమాధానం ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. 'న్యాయమూర్తులను ఇబ్బందికర స్థితిలోకి నెట్టేలా ఎవరైనా ఆరోపణలు చేయడం మేము సహించం. ఇలాంటి వ్యవహారాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. ఇలాంటి చర్యలతో న్యాయవ్యవస్థ పరువు పోతుంది. అలాంటి వ్యాఖ్యలపై కఠినంగా వ్యవహరించాలి. ఇక్కడ మేము న్యాయవాదులను కూడా రక్షించాలనే ఉద్దేశంతో ఉన్నాం'అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రేవంత్ రెడ్డికి అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇతర న్యాయస్థానానికి బదిలీ చేయాలంటూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును రద్దుచేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆరోపణలు చేస్తూ పెద్దిరాజు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

క్షమాపణలతో తప్పించుకోలేరు

విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాది రితేష్ పాటిల్ ట్రాన్స్ఫర్ పిటిషన్ను వెనక్కు తీసుకుంటామని సుప్రీంకోర్టును కోరారు. అయితే ధర్మాసనం నిరాకరించింది. 'ఇది కేవలం లిటిగెంట్ తప్పు మాత్రమే కాదు, అలాంటి వ్యాఖ్యలపై సంతకం చేసిన న్యాయవాది కూడా కోర్టు ధిక్కారానికి బాధ్యత వహించాలి. 'మీరంతా మొదట న్యాయమూర్తిపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు సమర్పించండి. అవి నిజాయితీగా ఉన్నాయో లేదో చూస్తాం. అంతే తప్ప, మీరు పిటిషన్ వెనక్కు తీసుకుంటామంటే క్షమించలేం'అని ధర్మాసనం స్పష్టం చేసింది. రేవంత్ రెడ్డి తరఫున సీనియర్ అడ్వొకేట్ సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు.

అసలు ఏం జరిగిందంటే..

గోపన్పల్లిలో సర్వే నంబర్ 127లోని సొసైటీకి సంబంధించిన భూమిని ఆక్రమించడంతోపాటు నిర్మాణాలను జేసీబీతో కూల్చేశారంటూ గచ్చిబౌలి పోలీస్స్టేషన్లో 2016లో కేసు నమోదైంది. పెద్దిరాజు ఫిర్యాదు మేరకు.. ఏ–1గా కొండల్ రెడ్డి (రేవంత్ రెడ్డి సోదరుడు), ఏ–2గా ఈ.లక్ష్మయ్య, ఏ–3గా రేవంత్ రెడ్డిని చేర్చారు. ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని రేవంత్ 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో వాదనలు విన్న జడ్జి జస్టిస్ మౌషుమీ భట్టాచార్య ధర్మాసనం.. రేవంత్ రెడ్డి ఘటనా స్థలంలో లేరనే విషయాన్ని ఫిర్యాదుదారు సైతం అంగీకరించారని పేర్కొంది. తాను లేను కాబట్టి తనపై కేసు కొట్టేయాలని అడుగుతున్నారని, మిగతా వారిపై కేసుకొట్టేయాలని అడగటం లేదని వ్యాఖ్యానించింది. రేవంత్రెడ్డి ఆదేశాలమేరకే దూషించాడనే ఆరోపణలకు ఆధారాలు లేవని తెలిపింది. ఈ క్రమంలో జూలై 18న రేవంత్పై నమోదైన కేసును కొట్టేసింది.

డీఎస్సీ–2003 టీచర్లకు పాత పింఛన్

- ఓపీఎస్ వర్తింపజేయాలని సర్కార్కు హైకోర్టు ఆదేశం
- ఉన్నత న్యాయస్థానంలో 1,739 మంది పిటిషన్లు
- ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పిస్తూ కోర్టు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు మంగళవారం ఆదేశించింది. 2004, ఆగస్టు 31 వరకు పాత పింఛన్ విధానం (ఓపీఎస్) అమల్లో ఉన్నందున వారంతా అందుకు అర్హులని తేల్చిచెప్పింది. కొత్త కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం (సీపీఎస్) 2004, సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. అంతకుముందే వీరి నియామకం పూర్తయిందని స్పష్టం చేసింది. 2004, సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని తమకు వర్తింపజేయడాన్ని సవాల్ చేస్తూ మెదక్ జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాస్రెడ్డి సహా మరో 1,738 మంది హైకోర్టులో 2019, 2020లో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. '2003, నవంబర్ 13న డీఎస్సీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. 2004, జూన్ వరకల్లా వీరంతా ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. కేవలం పరిపాలనాపరమైన ఆలస్యం కారణంగా 2005, నవంబర్లో నియామక ఉత్తర్వులు ఇచ్చారు. అలాంటప్పుడు సెప్టెంబర్లో వచ్చిన పింఛన్ విధానాన్ని ఎలా వర్తింపజేస్తారు. పిటిషనర్లంతా పాత పింఛన్కు అర్హులు'అని చెప్పారు. ప్రభుత్వం తరఫున జీపీ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రిట్ పిటిషనర్లు పాత పింఛన్ పథకానికి అర్హులని, వారందరికీ ఆ ప్రయోజనాలందించాలని ఆదేశించారు.

పాత పింఛన్ విధానంలో..

ఉద్యోగిపై ఎలాంటి భారం లేకుండా భవిష్యత్కు భద్రత కల్పిస్తుంది. ఒకవేళ పెన్షన్దారుడు మరణిస్తే.. అతని కుటుంబ సభ్యులకు ఎలాంటి కోత లేకుండా పూర్తి పింఛన్ వస్తుంది. ఒక ఉద్యోగి పదవీ విరమణ సమయానికి చివరి నెల బేసిక్ వేతనంలో 50శాతాన్ని నెలసరి పింఛన్గా నిర్ధారిస్తారు. ఈ విధానంలో కరువు భత్యం(డీఏ), కరువు ఉపశమనం(డీఆర్), వేతన సవరణ కమిషన్(పీఆర్సీ) సిఫార్సులుండేవి.

కొత్త పింఛన్ విధానంలో...

ఉద్యోగి వేతనంలోంచి నెలనెలా కొంత వెచ్చించాలి. చివరకు వచ్చే పింఛన్ చాలా తక్కువ. ఈ విధానంలో మూలవేతనం , డీఏను కలిపి.. దానిపై 10 శాతం ఉద్యోగి, 10 శాతం ప్రభుత్వం నెలనెలా జమచేయాలి. ఈ మొత్తాన్ని ఎస్బీఐ, యూటీఐ, ఎల్ఐసీ షేర్లలో పెడతారు. విరమణ పొందాక 60 శాతం ఒకేసారి ఇస్తారు. మిగతా 40 శాతాన్ని నెలవారీగా లెక్కగట్టి ఇస్తారు.

ఆరోగ్య రక్షణ, లైఫ్ సైన్సెస్ రంగాలకు చిరునామాగా హైదరాబాద్

ఎజిలెంట్ టెక్నాలజీస్ బయో ఫార్మా ఎక్స్పీరియెన్స్ సెంటర్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్బాబు



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య రక్షణ, లైఫ్సైన్సెస్ రంగాలకు హైదరాబాద్ చిరునామాగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఔషధ ఆవిష్కరణలు మొదలుకుని ఔషధ పరీక్షల వరకు, ప్రపంచ స్థాయి ఆసుపత్రుల నుంచి అత్యున్నత వైద్య సేవల వరకు హైదరాబాద్లో అందుబాటులోకి వచ్చాయన్నారు. 'ఎజిలెంట్ టెక్నాలజీస్'హైదరాబాద్లో కొత్తగా ఏర్పాటు చేసిన 'బయోఫార్మా ఎక్స్పీరియెన్స్ సెంటర్'ను శ్రీధర్బాబు మంగళవారం ప్రారంభించారు. ప్రపంచంలోని పది అగ్రశ్రేణి ఫార్మా కంపెనీల్లో ఎనిమిది తెలంగాణలోనే ఉండటం గర్వకారణమని శ్రీధర్బాబు పేర్కొన్నారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో మూడింట ఒక వంతు, బల్క్ డ్రగ్ ఎగుమతుల్లో 40 శాతం తెలంగాణ నుంచే జరుగుతున్నాయన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆవిష్కరణలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా భవిష్యత్తు ఆరోగ్య రక్షణ వ్యవస్థను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. బయోఫార్మా ఆవిష్కరణల్లో ముందు వరుసలోఉన్న హైదరాబాద్లో తమ ఎక్స్పీరియెన్స్ సెంటర్ను ప్రారంభించడంపై ఎజిలెంట్ టెక్నాలజీస్ సీఈఓ పాడ్రాగ్ మెక్డొనెల్ హర్షం వ్యక్తం చేశారు. తమ సెంటర్ వైద్య చికిత్స విధానాలకు అవసరమయ్యే పరిష్కారాలను అందజేస్తుందన్నారు.

బీసీ బిల్లుకు కేంద్రం అడ్డంకులు

దీనిపై త్వరలో రాష్ట్రపతిని కలుస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- తాండూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాండూరు: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ విషయమై త్వరలోనే మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్రపతిని కలవనున్నట్లు చెప్పారు. బీసీ బిల్లు ఆమోదాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని కేంద్రానికి సూచించారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్రెడ్డితో కలిసి భట్టి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణ శివారులోని జీపీఆర్ గార్డెన్లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో విసిగిపోయిన ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేయించామన్నారు.



మొక్కజొన్న కంకులు కాలుస్తున్న భట్టి విక్రమార్క

95 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నాం

రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకుగాను 95 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రేషన్ కార్డు కలిగిన వారికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్నామని భట్టి తెలిపారు. సీఎం రేవంత్రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ పథకం కింద పేదలకు సొంత ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు మంజూరు చేశామన్నారు.

కాన్వాయ్ ఆపి.. చిరు వ్యాపారిని పలకరించి..

ధారూరు: తాండూరు పర్యటన ముగించుకొని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ తిరిగి వెళ్తున్న డిప్యూటీ సీఎం భట్టి ధారూరు మండలం అనంతగిరి చివరి గుట్ట వద్ద తన కాన్వాయ్ను ఆపి మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్న మహ్మద్ చాంద్ వద్దకు వెళ్లి కంకులు కొనుగోలు చేశారు. రోజుకు ఎంత సంపాదిస్తావని అతన్ని అడగ్గా కూలీ సైతం గిట్టడం లేదని చాంద్ ఆవేదన వ్యక్తంచేశాడు. దీనిపై స్పందించిన భట్టి మీలాంటి చిరు వ్యాపారులకు త్వరలోనే ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పేద విద్యార్థుల దశదిశ మారుతుంది

యాలాల మండలం దౌలాపూర్ శివారులో రూ. 250 కోట్ల నిధులతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి భట్టి శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 104 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. పోటీ ప్రపంచంలో నిలబడేలా ఇందులో విద్యార్థులను తీర్చిదిద్దుతామని.. తద్వారా పేద, బలహీన వర్గాల విద్యార్థుల దశ, దిశ మారుతుందన్నారు. తాండూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ సీఎం చెన్నారెడ్డి, మాణిక్రావు, చంద్రశేఖర్రావు వంటి వారు తమదైన ముద్రవేశారని గుర్తుచేశారు.

మళ్లీ భూముల వేలం

రాయదుర్గ్, ఉస్మాన్నగర్లో 66 ఎకరాలను విక్రయించనున్న ప్రభుత్వం

- ఆగస్టు 8 వరకు బిడ్ల స్వీకరణ, 12న వేలానికి సన్నాహాలు
- 17 చోట్ల ప్లాట్ల వేలం, అప్సెట్ ధరను ప్రకటించిన టీజీఐఐసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి పన్నేతర ఆదాయాన్ని సమకూర్చడంలో కీలకంగా మారిన టీజీఐఐసీ మరోమారు అత్యంత విలువైన భూముల వేలానికి సిద్ధమైంది. రాయదుర్గ్, ఉస్మాన్నగర్ ప్రాంతాల్లోని 66 ఎకరాలను వేలం ద్వారా విక్రయించాలని భావిస్తోంది. వేలం విధివిధానాల్లో సహకరించేందుకు సలహాదారుల కోసం ఈ నెల 25న టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చే నెల 8 వరకు వేలం కోసం బిడ్లను స్వీకరించి 12న వేలం ప్రక్రియను పూర్తిచేసేలా టీజీఐఐసీ షెడ్యూల్ విడుదల చేసింది. 17 ప్లాట్ల వేలానికి సంబంధించిన అప్సెట్ ధరను టీజీఐఐసీ ప్లాట్లవారీగా నిర్ణయించింది. రాయదుర్గ్లోని 15ఏ/2, 14ఏ/1 ప్లాట్ల అప్సెట్ ధరను చదరపు గజానికి రూ. 1,51,484గా ఖరారు చేసింది. ఈ లెక్కన ఎకరం ధర రూ. 104 కోట్లుగా తేల్చింది. మిగతా ప్లాట్లలో అప్సెట్ ధరను కనిష్టంగా రూ. 12.20 కోట్ల నుంచి రూ. 50.10 కోట్లుగా నిర్ణయించింది. మొత్తం 66 ఎకరాలను టీజీఐఐసీ విక్రయించనుండగా వాటిలో 4 ప్లాట్లు రాయదుర్గంలో, మరో 13 ప్లాట్లు ఉస్మాన్నగర్లో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం మొదలుకొని 2014–23 మధ్య టీజీఐఐసీ భూముల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 21 వేల కోట్ల ఆదాయం సమకూర్చినట్లు సమాచారం.

పార్లమెంట్లో తెలంగాణ

విద్యుత్ బస్సుల విస్తరణకు తెలంగాణ ప్రతిపాదన

2,800 బస్సుల కోసం కేంద్రానికి రాష్ట్రం వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రవాణా వ్యవస్థను విద్యుదీకరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో 2,800 విద్యుత్ బస్సుల వినియోగానికి కేంద్రానికి ప్రతిపాదన పంపిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. అయితే ఉద్యోగ భద్రత కోణంలో రాష్ట్రం సూచించిన హైబ్రిడ్ జీసీసీ మోడల్కు కేంద్రం మద్దతు ఇవ్వడం లేదని కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు మంగళవారం లోక్సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్రమంత్రి స్పష్టం చేశారు. వాహనాల పంపిణీ ఓఈఎం (ఒరిజినల్ ఎక్విప్మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్) ద్వారా జరిగితే, వాటిని నడిపే, నిర్వహించే బాధ్యత టీజీఎస్ఆర్టీసీ సిబ్బందిదే కావాలని తెలంగాణ రాష్ట్రం సూచించింది. దీన్ని హైబ్రిడ్ జీసీసీ మోడల్ గా వ్యవహరిస్తారు. కానీ ఈ మోడల్ను కేంద్రం ప్రస్తుత పీఎం ఈ–డ్రైవ్ ఫ్రేమ్వర్క్లో పరిగణనలోకి తీసుకోవడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు.

నల్లగొండకు కోల్డ్ స్టోరేజ్ అవసరం

నల్లగొండ జిల్లాలో పండే తీపిచింతలు (కమలాపండు), మిరప పంటల నిల్వకు తగిన కోల్డ్ స్టోరేజ్ సదుపాయాల లేమితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రఘువీర్ ప్రశ్నకు కేంద్ర మంత్రి రామనాథ్ ఠాకూర్ లిఖిత పూర్వక సమాధానమిస్తూ ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో 8 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయని, రంగారెడ్డి (44), ఖమ్మం (42) జిల్లాల్లోని కోల్డ్ స్టోరేజీలు కూడా నల్లగొండ రైతులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు.

కాలుష్యరహితంగా హైదరాబాద్

▶ మొదటి పేజీ తరువాయి

సమగ్ర డీపీఆర్లు తయారు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను నిషేధించడంతో పాటు నిర్మాణ రంగ వ్యర్థాలను ఇష్టారీతిన డంప్ చేయకుండా చూడాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా డంప్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీరు, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సీవరేజీ బోర్డు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

పర్యాటక ప్రదేశాలుగా వారసత్వ కట్టడాలు

ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న వారసత్వ కట్టడాలను సంరక్షించడంతో పాటు పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించాలని సీఎం రేవంత్ సూచించారు. పాతబస్తీలో మెట్రో రైలు మార్గం పనులపైనా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆరా తీశారు. మెట్రో పనులు వేగవంతం చేయాలన్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా హిమాయత్సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్గూడ జంక్షన్లో మూసీ రివర్ ఫ్రంట్కు ప్రతీకగా గేట్ వే ఆఫ్ ఇండియా, ఇండియా గేట్, చార్మినార్ తరహాలో ల్యాండ్ మార్క్ను నిర్మించాలని ఆదేశించారు.

మీరాలం ట్యాంకు వద్ద అధునాతన హోటల్

నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపైనా సీఎం రేవంత్రెడ్డి సమీక్ష నిర్వహించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హోటల్ నిర్మించాలని ఆదేశించారు. జూపార్క్, మీరాలం ట్యాంక్తో పాటు నగరాన్ని వీక్షించేలా హోటల్ ఉండాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

హైదరాబాద్‌లో శివశంకర్, ముఖేశ్ విగ్రహాలు: పొన్నం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్, మాజీ మంత్రి ఎం.ముఖేశ్‌గౌడ్‌ల విగ్రహాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్టు బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆయన మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీ నాయకులుగా శివశంకర్, ముఖేశ్ గౌడ్ చేసిన సేవలకు గుర్తింపుగా విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవించుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించిందని చెప్పారు. ఈ విగ్రహాలను ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి ప్రకటిస్తామని పొన్నం తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు 72 గంటల దీక్ష: కవిత



పంజగుట్ట (హైదరాబాద్): బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల పాటు నిరాహారదీక్ష చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఆగస్టు 4న ఉదయం 11 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో నిరాహారదీక్ష చేస్తానన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ధర్నాను ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీనే పట్టించుకోలేదు. ఇప్పుడు మరోసారి బీసీలను మోసం చేసేందుకు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లకుండా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామంటున్నారు. ఆ ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం అంటున్నారు. ఢిల్లీలో ధర్నా అంటే అదేమైనా సత్రం భోజనమా?' అని కవిత ప్రశ్నించారు. తాను చేసే నిరాహారదీక్షకు ప్రభుత్వం అనుమతి కోరుతామని, ఒకవేళ అనుమతివ్వకపోతే ఎక్కడ ఉంటే అక్కడే నిరాహారదీక్షకు దిగుతానని కవిత చెప్పారు.

కవిత లీడరా? ఆమె కెపాసిటీ ఏంటి? : జగ్గారెడ్డి




సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత లీడరా, అసలు ఆమె కెపాసిటీ ఏంటి? అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఆమె గురించి మాట్లాడాల్సిన అవసరం లేదని, తన తండ్రి దుకాణం బంద్ కావడంతో ఇప్పుడు ఆమె దుకాణం పెట్టిందని వ్యాఖ్యానించారు. మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీసీ కులగణన అనేది రాహుల్‌గాంధీ నినాదమని చెప్పిన జగ్గారెడ్డి అధికారంలో ఉన్న పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ నేతలకు బీసీలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. పార్టీ బలోపేతంతో పాటు జిల్లా కమిటీల నియామకం గురించి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమీక్షించారని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నాయకత్వానికి ప్రభుత్వ, పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆ జిల్లా ఇన్‌చార్జిగా మీనాక్షిని కోరానని జగ్గారెడ్డి వెల్లడించారు.

72 గంటల దీక్ష గల్లీలో కాదు ఢిల్లీలో చేయాలి: దయాకర్



సాక్షి, హైదరాబాద్: బీసీల పట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు నిజమైన ప్రేమ, గౌరవం ఉంటే ఢిల్లీలోని మోదీ ప్రభుత్వంపై పోరాటం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ సూచించారు. ఆమె 72 గంటల దీక్ష చేయాల్సింది గల్లీలో కాదని ఢిల్లీలో అని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్ని రోజులు బీసీ వర్గాల గురించి పల్లెత్తు మాట మాట్లాడని ఆమె ఇప్పుడు తన రాజకీయ అవసరం కోసం బీసీ నినాదం ఎత్తుకుందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నేతలు సరైన అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, బీజేపీ నేతలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈనెల 5, 6, 7 తేదీల్లో కేంద్రంపై ఒత్తిడి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని దయాకర్ హితవు పలికారు.

పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలి: దాసు సురేష్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ల అమలుకు పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలు.. అవసరమైన రాజ్యాంగ సవరణ, రాష్ట్రపతి ఆమోదానికి దేశ రాజధానిలో కలసికట్టుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వాన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎమ్మెల్యేలు మంత్రులు, ఎమ్మెల్సీలతో తలపెట్టిన ప్రజాప్రతినిధుల దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

హ్యూమనాయిడ్ రోబో కేవలం రూ.5 లక్షలే!

భలే మంచి చౌక బేరము.. రూ.5.12 లక్షలకే హ్యూమనాయిడ్ రోబో అంటోంది చైనాకు చెందిన ఓ కంపెనీ. రోబో.. అంటేనే ఖరీదైన వ్యవహారం. అందులోకి, అచ్చం మనిషిలా ఉండి, మనిషి చేయగలిగే చాలా పనులు చేసే హ్యూమనాయిడ్ రోబో అంటే.. ఇంకా ఖరీదు. కానీ.. అస్సలు కాదు అంటోంది చైనా దిగ్గజం యూనిట్రీ రోబోటిక్స్. రోబోల తయారీలో మంచి పేరున్న ఈ కంపెనీ ఆర్1 హ్యూమనాయిడ్‌ను తయారుచేసింది. దీని ధర కేవలం 5,900 డాలర్లు (రూ.5.12 లక్షలు) మాత్రమేనట. కంపెనీ గతంలో అందుబాటులోకి తెచ్చిన జీ1తో పోలిస్తే కొత్త మోడల్ ధర 63 శాతం తక్కువ కావడం విశేషం.

\- సాక్షి, స్పెషల్ డెస్క్

యూనిట్రీ రోబోటిక్స్ ఆర్1 హ్యూమనాయిడ్.. పరుగెడుతుంది, నడుస్తుంది, పిల్లిమొగ్గలు వేస్తుంది, చేతుల మీద నిలబడుతుంది. మనం ఇచ్చే వాయిస్ ఆదేశాలకు ప్రతిస్పందిస్తుంది. పరిసరాలను అర్థం చేసుకుంటుంది. ప్రయోగాలకు అనువుగా ఇది పనిచేస్తుంది. అంటే టెక్ కంపెనీలు ఈ హ్యూమనాయిడ్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు వీలు కూడా ఉండటం దీనిలోని మరో ప్రత్యేకత. ఆఫీసులు, ఇంటి పనుల కోసం పని మనుషులను పెట్టాలనుకునేవాళ్లు దీన్ని ట్రై చేయొచ్చు అంటోంది కంపెనీ.



గంటపాటు నిర్విరామంగా..
ఈ హ్యూమనాయిడ్ ఎత్తు 121 సెంటీమీటర్లు, వెడల్పు 35.7 సెం.మీ. మందం 19 సెం.మీ.

కేవలం 25 కేజీల బరువే ఉండటం కూడా వాడకందారులకు చాలా సౌలభ్యం.

వాయిస్ గుర్తించేందుకు నాలుగు మైక్రోఫోన్స్, అల్ట్రావైడ్ యాంగిల్ విజువల్స్ కోసం బైనాక్యులర్ కెమెరా పొందుపరిచారు. వైఫై 6, బ్లూటూత్ 5.2 కనెక్టివిటీ ఉంది.

బ్యాటరీ ఒకసారి రీచార్జ్ చేస్తే రోబో గంటపాటు పనులు చక్కబెడుతుంది.

మాన్యువల్ రిమోట్ కంట్రోల్‌తో పనిచేస్తుంది.

పూర్తి కస్టమైజేబుల్.. అంటే కస్టమర్ కోరిన విధంగా మార్పులు చేసి కూడా తయారు చేస్తారు.

అందుబాటులోకి తెచ్చిన చైనా కంపెనీ

ఇంట్లో మనిషిలా, ఇంటి పనిమనిషిలా

ప్రయోగాలకు కూడా అనువుగా తయారీ

ఆర్1.. ఒక మైలురాయి

ఫ్యాక్టరీలు, ఇంటి పనులకు సంబంధించి హ్యూమనాయిడ్‌ల తయారీలో ఇంతవరకు అమెరికన్ కంపెనీల ఆధిపత్యం ఉండేది. ఇప్పుడు చైనా కంపెనీలు ఈ రేసులోకి 'తక్కువ ధరకే' ట్యాగుతో వచ్చాయి. ఇవి పై రెండు రకాల పనులతోపాటు మిలటరీలో కూడా ఉపయోగపడతాయట. చైనాలోని పరిశోధనా ప్రయోగశాలలు, పాఠశాలల్లో వాడుతున్న యూనిట్రీ కంపెనీ తయారీ జీ1 రోబో ధర 16,000 డాలర్లుగా ఉంది. మరింత అధునాతన, పెద్ద సైజులో ఉండే హెచ్1 మోడల్ ధర 90,000 డాలర్ల కంటే ఎక్కువ. అందరికీ అందుబాటు ధరలో ఏకంగా 5,900 డాలర్లకే ఇప్పుడు ఆర్1 హ్యూమనాయిడ్‌ను తీసుకొచ్చింది. ఇది సంక్లిష్ట హ్యూమనాయిడ్‌ల విభాగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.



- మీరు ఉదయం లేవగానే మీ కదలికలను రోబో గుర్తిస్తుంది.
- కాఫీ మెషీన్‌ను ఆన్ చేస్తుంది.
- ఒకవేళ మీకు కళ్లజోడు అలవాటు ఉంటే.. అది ఎక్కడ ఉన్నా తెచ్చి మీ చేతికి ఇస్తుంది.
- ఆ రోజు చేయాల్సిన మీ షెడ్యూల్‌ను చదువుతుంది.
- మీ బిడ్డకు సైన్స్, మ్యాథ్స్.. ఇలా ఏదైనా సబ్జెక్టులో సందేహాలు ఉంటే సమాధానాలతో సహాయపడుతుంది. సంభాషణను సరదా క్విజ్‌గా కూడా మారుస్తుంది.
- అమ్మమ్మ, తాతయ్యల వంటి పెద్దలకు.. ఎత్తైన షెల్ఫ్ నుండి మందులను తీసుకొచ్చి చేతిలో పెడుతుంది.
- ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తే వారిని ఆకట్టుకోవడానికి పిల్లిమొగ్గల వంటివి వేస్తుంది.

ప్రభుత్వ వైఫల్యాలపై రాజీ లేని పోరు

చంద్రబాబు, మోదీ ప్రయోజనాలను కాపాడేందుకు రేవంత్ తహతహ: కేసీఆర్
ఏపీ నిర్మించే బనకచర్లను నిలువరించాల్సిందే
కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డితో భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రైతాంగ సంక్షేమాన్ని కాపాడటం, వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయాలని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై ఎర్రవల్లి నివాసంలో మంగళవారం కేసీఆర్ సుదీర్ఘ భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధినేత పలు అంశాలపై సూచనలతోపాటు దిశా నిర్దేశం చేశారు. 'తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఏపీ ప్రయోజనాలను కాపాడేందుకు స్వయంగా తెలంగాణ ప్రభుత్వమే పాలనా విధానాలను అమలుచేయడం దుర్మార్గం. తమను నమ్మిన పాపానికి, తెలంగాణ రైతాంగానికి శాశ్వత అన్యాయం ఒడిగడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు వైఖరిని ఎండగట్టాలి. ఇక్కడ చంద్రబాబు, కేంద్రంలో మోదీ ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర సీఎం తహతహలాడుతుండటాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోంది' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో నిలువరించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

ఉద్దేశపూర్వకంగా కాళేశ్వరం మూలకు

'కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా పండబెట్టి వానాకాలం నాట్లు అయిపోతున్నా ఇంతవరకు రైతాంగానికి సాగునీరు అందించని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజాక్షేత్రంలో నిలదీయాలి. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసి చెరువులు కుంటలు, రిజర్వాయర్లను నింపాలి. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. రైతులు వరి నాట్లు వేసుకుంటున్న సందర్భంలో ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడంపై పోరాటాలు చేయాలి. కాంగ్రెస్, బీజేపీ పరస్పర విమర్శలతో రాష్ట్ర ప్రజల సమస్యలను గాలికి వదిలేస్తున్నారు. ఇప్పటికే ప్రజా సమస్యలపై పోరాడేందుకు బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేస్తున్న తరహాలో పార్టీ ఇతర అనుబంధ విభాగాలను కూడా బలోపేతం చేయాలి' అని కేసీఆర్ పేర్కొన్నారు.

మంత్రి తుమ్మల రాజీనామాకు సిద్ధమా?

యూరియా లెక్కలు తప్పయితే నేను రాజీనామా చేస్తా: రాంచందర్‌రావు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'యూరియా సరఫరాపై నేను అవగాహన లేకుండా మాట్లాడుతున్నానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంటున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ ఇచ్చిన లెక్కలే నేను చెప్పా. 2024–25లో 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ రాష్ట్రానికి అవసరమైతే కేంద్ర ప్రభుత్వం 12.47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచింది. ఈ ఏడాది కూడా ప్రతీ గ్రామం, ప్రతీ రైతుకు సరిపడా యూరియా సరఫరా అవుతోంది. ఈ లెక్కలు తప్పయితే నేను రాజీనామా చేస్తా.. లేదంటే తుమ్మల రాజీనామా చేసేందుకు సిద్ధమేనా' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సవాల్ విసిరారు. ఖమ్మంలో మంగళవారం బీజేపీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రైతుల విషయంలో మంత్రి తుమ్మలవి అబద్ధాలేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం యూరియా కేటాయిస్తున్నా, ఎందుకు కొరత ఏర్పడుతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని రాంచందర్‌రావు తెలిపారు. డిక్లరేషన్ ప్రకటించి ఓట్లు దండుకున్నందున రిజర్వేషన్ల అమలు బాధ్యత కూడా కాంగ్రెస్‌దేనని చెప్పారు. ప్రస్తుతం ఇచ్చింది బీసీల రిజర్వేషన్ బిల్లు కాదని, ముస్లిం రిజర్వేషన్ బిల్లు అని తెలిపారు. ముస్లింలకు తాము వ్యతిరేకం కాదని, వారికి ఈబీసీ కోటా కింద 10 శాతం రిజర్వేషన్ ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎవరు నడుపుతున్నారో అర్థం కావడం లేదని రాంచందర్‌రావు విమర్శించారు. పార్టీ నాయకుడో, ముఖ్యమంత్రో పాదయాత్ర చేస్తారు కానీ ఇక్కడ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. ఖమ్మం, నల్లగొండ బ్యాచ్‌లు ముఖ్యమంత్రిని పని చేయనివ్వడం లేదని పేర్కొన్నారు.

బీసీ ఎమ్మెల్యేల్లో నాకు తప్ప అందరికీ పదవులున్నాయి

మీడియాతో ఇష్టాగోష్టిలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన బీసీ ఎమ్మెల్యేల్లో తనకు తప్ప అందరికీ అదనపు పదవులు లభించాయని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంత్రులు, విప్‌లుగా బీసీ ఎమ్మెల్యేలకు అదనపు పదవులు వచ్చినా తనకే ఎలాంటి పదవులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాలవారీ సమీక్ష సమావేశానికి వచ్చిన ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నాయకులందరికీ పదవులు రావడం తనకు మైనస్ అయిందని వ్యాఖ్యానించారు. తాను మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్‌కు చెందిన మనిషినని, మంత్రి పదవికి మోస్ట్ ఎలిజిబుల్ లీడర్‌నని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం తాము ఢిల్లీ వెళ్తున్నామని, ఈ పోరాటానికి కలిసిరాని వారందరూ బీసీ ద్రోహులేనన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితతో సహా తామెవరికీ లేఖలు రాయబోమని, ఆమెతో సహా బీఆర్‌ఎస్ నేతలు వస్తామంటే ఢిల్లీ తీసుకెళ్తామని, బీసీలపై ప్రేమ ఉంటే తమతో కలిసి రావాలని చెప్పారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సింప్లిసిటీపై రాష్ట్రంలో ఎక్కువగా చర్చ జరుగుతోందని, ఆమె కామన్ ఉమెన్‌గా పార్టీకి చేస్తున్న సేవ తమకు కలిసివస్తుందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అభిప్రాయపడ్డారు.

హామీలు వదిలి.. అరాచకాలు

ఎన్నికల హామీలకు తిలోదకాలిచ్చిన కాంగ్రెస్
స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు: కేటీఆర్



సిరిసిల్ల టౌన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు విమర్శించారు. సిరిసిల్లలోని బీఆర్‌ఎస్ భవన్‌లో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, అవినీతి అరాచకాలకు ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. కేవలం ఓట్ల సమయంలోనే రైతుబంధు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. వ్యవసాయం బాగుపడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని రైతులు కోరుకుంటున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్ర యువతను, విద్యార్థులను తీవ్రంగా దగా చేసిందని దుయ్యబట్టారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెబుతారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో జరుగుతున్న మోసాన్ని బీసీలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

మనల్ని ఓడించే నాయకుడే లేడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తూ గులాబీ జెండాను ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. సిరిసిల్లలో మనల్ని ఓడించే నాయకుడే లేడని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులే కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తే ప్రస్తుతం ప్రజలను, పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు మీకు సహకరిస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, రవిశంకర్ మాట్లాడారు.

బీజేపీవి తలాతోకలేని మాటలు: జాజుల



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర బీజేపీ అగ్రనేతలు రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు పెంచడానికి బీజేపీ అడ్డంకిగా మారిందని, రిజర్వేషన్లు పెంచలేని బీజేపీ పార్లమెంట్ సభ్యులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరిగే ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి బీసీలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రిజర్వేషన్లపై హస్తినకు ప్రభుత్వం తరఫున పోరుబాట పట్టాలని నిర్ణయించడం సరైన నిర్ణయమని, ఈ పోరుకు రెండున్నర కోట్ల మంది బీసీలు అండగా ఉంటారని చెప్పారు.

ధాన్యం స్కాం.. రూ.1,100 కోట్లు

టెండర్ల కుంభకోణంపై విచారణ జరపండి
ఈడీకి బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు
రూ.423 కోట్ల ప్రభుత్వ సొమ్ము వివిధ ఖాతాల్లోకి వెళ్లిందని ఆరోపణ



ఈడీ ఆఫీసు వద్ద గంగుల, పెద్ది సుదర్శన్, ముఠా గోపాల్, కాలేరు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోలు కుంభకోణంలో రూ.1100 కోట్ల మేర అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను కోరింది. ఈ మేరకు మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం ఈడీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. అవినీతి జరిగిన తీరు తెన్నులను వివరిస్తూ 700 పేజీలకుపైగా ఉన్న బుక్‌లెట్‌ను అందజేసింది. ఈ వ్యవహారంలో అక్రమంగా డబ్బులు బదిలీ అయిన ఖాతాల వివరాలు సేకరించామని చెప్పింది. రూ.423 కోట్లు అక్రమంగా వివిధ ఖాతాల్లోకి బదిలీ అయినట్లుగా తేలిందని ఫిర్యాదులో పేర్కొంది. గంటకు పైగా ఈడీ అధికారులతో భేటీ అయిన బీఆర్‌ఎస్ బృందం అక్రమాలు జరిగిన తీరును వివరించారు. ఈడీ అధికారులు తమ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారని పెద్ది సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. బృందంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్యాదరి బాలమల్లు, వై.సతీశ్‌రెడ్డి, డాక్టర్ వాసుదేవరెడ్డి ఉన్నారు.

టెండర్లలో అవకతవకలు: అనంతరం పార్టీ నేతలతో కలిసి గంగుల తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు టెండర్ల కుంభకోణంలో ప్రభుత్వ సొమ్ము ప్రైవేటు ఖాతాల్లోకి వెళ్లిందని ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 90 రోజుల్లో విక్రయించేందుకు జరిగిన టెండర్లలో అవకతవకలు జరిగాయన్నారు. దీనిపై పంజగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని.. ఈడీ, ఏసీబీ వంటి సంస్థలు ఈ కుంభకోణంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇతర కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. 18 నెలల క్రితం జరిగిన ధాన్యం కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాత్ర ఉందని పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బిడ్డర్లు మిల్లర్ల నుంచి ఒక్కో టన్ను ధాన్యంపై రూ.2,230 చొప్పున అక్రమంగా వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారన్నారు.

ఆగస్టు 8న కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ 'బీసీ గర్జన'

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టిందని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 42% ఇవ్వడంతోపాటు ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులనూ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలవుతున్నదని మధుసూదనాచారి విమర్శించారు. బీసీలకు రక్షణ కవచంలా బీఆర్‌ఎస్ నిలుస్తుందని, బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ కుటిలనీతిని ఎండగడతామన్నారు.
- ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలో రెండేసి అసెంబ్లీ స్థానాల్లో బీసీలకు టికెట్లు ఇస్తామని ప్రకటించి కాంగ్రెస్ మోసగించిందని గంగుల కమలాకర్ విమర్శించారు. వచ్చే నెల 5 నుంచి మూడురోజుల పాటు ఢిల్లీలో ఉంటామని చెబుతున్న సీఎం, మంత్రులు ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి ఏం చేస్తారో చెప్పాలన్నారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలను మోసగిస్తూ మంత్రి పదవులు, కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో మొండిచేయి చూపుతోందని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ప్రచారయావ మినహా బీసీ బిల్లు ఆమోదంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు.

అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోండి

- వివిధ దర్యాప్తులపై లీకుల ద్వారా ప్రభుత్వం వివక్ష
- ఎన్‌హెచ్‌ఆర్‌సీకి బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోలీసుల పక్షపాతం, ఏకపక్ష అరెస్టులు, చట్టాల దుర్వినియోగంపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మపర్సన్ జస్టిస్ వి రామసుబ్రమణియన్‌ను కోరారు. బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పట్నం నరేందర్‌రెడ్డి; గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఈ మేరకు పిటిషన్ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల భూముల ఆక్రమణ, మీడియా ట్రయల్స్, పిల్లల మరణాలతో సహా అన్ని ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో పారదర్శక సంస్కరణలు తేవాలని, ఏ బిడ్డకు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరగకూడదని అన్నారు. వివిధ అంశాలపై దర్యాప్తు వివరాల లీక్‌కు బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని, న్యాయమైన విచారణ హక్కును గౌరవించాలని కోరారు. ప్రభుత్వ స్నేహపూర్వక వార్తా సంస్థలకు దర్యాప్తు వివరాలను లీక్ చేయడం ద్వారా చట్టపరమైన ప్రక్రియలను సంచలనాత్మక మీడియా ట్రయల్స్‌గా మార్చుతోందని ఆరోపించారు. ఈ లీకులు న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను, పౌరులను భయపెట్టడానికి అరెస్ట్ అధికారాలు, లుక్‌ఔట్ సర్క్యులర్ల (ఎల్‌ఓసీ) దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతలు ఫిర్యాదు చేస్తే పట్టించుకోని పోలీసు.. కాంగ్రెస్ నేతలు ఫిర్యాదులను మాత్రం పట్టించుకుంటున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్ సైన్యాన్ని సిద్ధం చేయండి

స్థానిక ఎన్నికల నాటికి పూర్తిస్థాయి యంత్రాంగం ఉండాలి
రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి మార్గనిర్దేశం
పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో కలిసి ఉమ్మడి జిల్లాలవారీగా సమీక్ష

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నాటికి క్షేత్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కాంగ్రెస్ సైన్యాన్ని సిద్ధం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నేతలను ఆదేశించారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌లతో కలిసి ఆమె ఉమ్మడి జిల్లాలవారీగా సమీక్షలు నిర్వహించారు. హైదరాబాద్, మెదక్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలపై సమీక్షలు జరిగాయి. ఈ సమీక్షల్లో పార్టీ సంస్థాగత నిర్మాణంతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా చర్చించారు. మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ కమిటీలతో పాటు అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున నామినేటెడ్ పదవుల కోసం ఇన్‌చార్జిలు ఇచ్చిన జాబితాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి వారంలోగా కార్పొరేషన్లకు డైరెక్టర్లు, పలు బోర్డులకు సభ్యులను నియమిస్తామని ప్రకటించారు.

వ్యతిరేకత రావద్దు: పార్టీ పదవుల భర్తీలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని మీనాక్షి భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసేవారికి ప్రాధాన్యత ఇస్తామని, ఖాళీగా ఉన్న మండలాల్లోనే కొత్త అధ్యక్షులను నియమిస్తారని చెప్పారు. ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ అనుబంధ సంఘాలకు కూడా జిల్లా, మండల కమిటీల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి కమిటీలో మహిళా ప్రాతినిధ్యం ఉండేలా చూస్తామని చెప్పారు. పార్టీ పదవుల్లో 50 ఏళ్ల లోపు వారికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ ఆలోచనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై దృష్టి సారించాలని నేతలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలవారీగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో పాదయాత్రలు పూర్తయిన తర్వాత ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా పాదయాత్రలు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు.

మేమే బీసీ చాంపియన్స్: పార్టీ పదవుల భర్తీలో అన్ని నిబంధనలు పాటిస్తామని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సమీక్షల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నామినేటెడ్ పోస్టులపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి మాట్లాడని ఎమ్మెల్సీ కవిత.. ఇప్పుడు ఆ వర్గాలపై ఎంత ప్రేమ వలకబోసినా ఎవరూ నమ్మరని అన్నారు. ఎవరెన్ని చెప్పినా బీసీలకు కాంగ్రెస్ పార్టీనే న్యాయం చేస్తుందని, సామాజిక న్యాయంతో పాటు బీసీ చాంపియన్స్ తామేనని స్పష్టంచేశారు. ఈనెల 31 నుంచి ఆగస్టు ఆరో తేదీ వరకు పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలు పరిగి నుంచి ప్రారంభమై వర్ధన్నపేటతో ముగుస్తాయని మహేశ్‌గౌడ్ వెల్లడించారు.



మెదక్ జిల్లా సమీక్షలో మీనాక్షి, మహేశ్‌గౌడ్, పొన్నం తదితరులు



చివరికి మూడు మాత్రమే మిగులుతాయి.
మీరు ఎంత ప్రేమించారు? ఎంత గౌరవంగా జీవించారు?
మీకు సంబంధించని వాటిని ఎంత హుందాగా వదిలేశారు?
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 30 జూలై 2025

యునెస్కోకు వెన్నుపోటు

'సంస్కృతి అనే పదం విన్నప్పుడల్లా నా చేయి తుపాకీ కోసం వెదుకుతుంది' అని జర్మన్ నాటక రచయిత, కవి హాన్స్ జాట్ విరచిత నాటకంలోని పాత్ర అంటుంది. హాన్స్ తొమ్మిది దశాబ్దాల క్రితమే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వంటి అధినేతను ఊహించారా అనిపించేలా ఆయన వరస నిర్ణయాలుంటున్నాయి. వచ్చే ఏడాది డిసెంబర్‌తో యునెస్కో నుంచి తప్పుకుంటున్నట్టు చేసిన తాజా ప్రకటన ఆ కోవలోనిదే. రెండో ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచ శాంతిని సాధించాలన్న లక్ష్యంలో భాగంగా ఐక్యరాజ్యసమితి ఛత్రఛాయలో ఏర్పడిన అనేకానేక సంస్థల్లో యునెస్కో ఒకటి. విద్య, శాస్త్ర విజ్ఞానం, సంస్కృతి అంశాల్లో ప్రపంచ దేశాల పరస్పర సహకారం కోసం ఆ సంస్థ ఆవిర్భవించింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలి, ప్యారిస్ ఒడంబడిక వగైరాల నుంచి ఇప్పటికే అమెరికా తప్పుకుంది. ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక దేశంలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం వంటి అంతర్జాతీయ కీర్తిప్రతిష్ఠలు కలిగిన అగ్రశ్రేణి విద్యాసంస్థకే దిక్కు లేదు గనుక యునెస్కో నుంచి అది తప్పుకోవటం ఆశ్చర్యం కలిగించదు. ట్రంప్ గత ఏలుబడిలో కూడా 2017లో యునెస్కో నుంచి ఆ దేశం నిష్క్రమించింది. అసలు యునెస్కో పుట్టినప్పటి నుంచీ దానితో అమెరికాకు పేచీయే. అక్కడ ఎవరున్నారన్నదాంతో నిమిత్తం లేదు. ప్రపంచంలో గిట్టని ప్రభుత్వాలను కుట్రపూరితంగా కూలదోస్తూ, దారికి రాని దేశాలపై సొంతంగా ఆంక్షలు విధిస్తూ తననే అందరూ అనుసరించాలంటూ ఒత్తిళ్లు తెచ్చే దేశానికి సంస్కృతితో ఏం పని? నిరాయుధ పాలస్తీనియన్ల ఊచకోతకు పాల్పడుతూ, ఆకలితో మాడ్చి చంపుతూ వీరంగం వేస్తున్న ఇజ్రాయెల్‌ను పల్లెత్తు మాట అనకుండా... భారత్–పాక్‌లను బెదిరించి యుద్ధం ఆపానని గప్పాలు పోయే ప్రభుత్వానికి విద్యాసంస్థల విలువ, శాస్త్ర విజ్ఞానం అవసరం తెలిసేదెలా?

రోనాల్డ్ రీగన్ ఏలుబడిలో 1983లో తొలిసారి యునెస్కో నుంచి ఆ దేశం తప్పుకుంది. ప్రతి అంశాన్నీ యునెస్కో రాజకీయమయం చేస్తున్నదని, పాశ్చాత్య ప్రపంచానికి అది బద్ధ వ్యతిరేకి అని ఆరోపించింది. అటుపై జార్జి డబ్ల్యూ బుష్ వచ్చాక సంస్థ సంస్కరణలు సంతృప్తి కలిగించాయంటూ 2003లో తిరిగి చేరింది. రీగన్, జార్జి బుష్‌లిద్దరూ రిపబ్లికన్లు. డెమొక్రాటిక్ పార్టీ నుంచి అధ్యక్షుడైన బరాక్ ఒబామాకు సైతం యునెస్కో కంటగింపే అయింది. ఐక్యరాజ్యసమితి సభ్య దేశంగా అమెరికా ఇంకా లాంఛనంగా గుర్తించని పాలస్తీనాను యునెస్కోలో చేర్చుకోవటంపై ఆయన గారు ఆగ్రహించి ఆ సంస్థకు చెల్లించాల్సిన విరాళాన్ని నిలిపేశారు. 2023లో బైడెన్ హయాంలో తిరిగి అందులో చేరినా 60 లక్షల డాలర్ల పైగా బకాయిల్ని చెల్లించనే లేదు. చిత్రమేమంటే బకాయి భారాన్నీ, ఇజ్రాయెల్‌ను దోషిగా చూపుతున్నారని కారణాన్నీ చూపించి ట్రంప్ తన తొలి ఏలుబడిలో దాన్నుంచి తప్పుకున్నారు. ట్రంప్‌కు ముందున్న అధ్యక్షులు నేరుగా చెప్పటానికి మొహమాటపడ్డారు గానీ...ఇజ్రాయెల్‌ను పల్లెత్తు మాటన్నా, దాని ప్రయోజనాలకు కించిత్తు విఘాతం కలిగినా అమెరికా సహించలేదు. అలాచేస్తే యూదు వ్యతిరేకతగా పరిగణిస్తుంది. హిట్లర్ హయాంలో యూదుల్ని ఊచకోత కోసిన వైనంపై బహువిధ మాధ్యమాల ద్వారా చైతన్యం కలిగిస్తున్న యునెస్కోపై యూదు వ్యతిరేక ముద్రేయటం అమెరికాకే చెల్లింది.

పురావస్తు సంపద సమస్త మానవాళికీ చెందుతుందని, ఆ వారసత్వ సంపదను అపురూపంగా భావించి పరిరక్షించటం మనందరి కర్తవ్యమని 1945లో ఆవిర్భవించినప్పుడే యునెస్కో ప్రకటించింది. 200 దేశాలకు సభ్యత్వం, మరో 12 దేశాలకు సహ సభ్యత్వమిచ్చి 170 దేశాల్లోవున్న 1,248 చరిత్రాత్మక స్థలాలను సంరక్షించటానికి అది కృషి చేస్తోంది. ఇరాక్‌లోని యూఫ్రటీస్ నదీతీరంలో నిర్మితమైన నాలుగువేల ఏళ్లనాటి బాబిలాన్ నగరం, ఈజిప్టులోని క్రీ.పూ. 13 శతాబ్దంలో నిర్మించిన అబూసింబెల్ సూర్య దేవాలయం, బిహార్‌లోని క్రీ.పూ. మూడో శతాబ్దంనాటి నలందా విశ్వవిద్యాలయ ఆనవాళ్లు, ప్రస్తుత మెక్సికో, గ్వాటెమాలా, ఎల్‌సాల్వెడార్ ప్రాంతాల్లో వ్యాపించిన క్రీ.పూ. 2000నాటి మయన్‌ల సంస్కృతి, తొమ్మిదో శతాబ్దంలో యశోధరపురంగా వెలిగిన అంకోర్‌వాట్‌లోని అపురూప దేవాలయాలు, ఇంకా... మన తాజ్‌మహల్, తెలంగాణలోని రామప్ప దేవాలయం తదితరాలు అందులో ఉన్నాయి. వాటిలో అమెరికాకు సంబంధించిన చారిత్రక స్థలాలే 26. ఈ వారసత్వ సంపద పరిరక్షణకు నిధులు వెచ్చించటం, ఆ పరిరక్షణకు తోడ్పడే ఉపకరణాల అభివృద్ధి, లోతైన పరిశోధన, వాటికి సంబంధించిన కచ్చితమైన శాస్త్రీయ ఆధారాల సేకరణ, ప్రమాణాలు నిర్దేశించటం వగైరాలు యునెస్కో పనుల్లో అంతర్భాగం. ఇవే కాదు... జీవవైవిధ్య పరిరక్షణ, ప్రామాణిక విద్యనందించటం, అంతరిస్తున్న మాతృభాషలను బతికించటానికి అనువైన చర్యలు తీసుకోవటం, మన దేశంతో సహా ప్రపంచంలో అనేకచోట్ల అణగారిన వర్గాల్లో నైపుణ్యాభివృద్ధి వంటివి, అందుకు కృత్రిమ మేధ సాయం తీసుకోవటం యునెస్కో చేపట్టిన పనుల్లో కొన్ని.

రేపు అమెరికాతో పాటు దాని మిత్ర దేశాలూ యునెస్కో నుంచి వైదొలగవచ్చు. విరాళాలు ఆగి సంస్థ నిర్వాహణ సంక్షోభంలో పడినా పడొచ్చు. సిబ్బందిని తగ్గించాల్సిరావొచ్చు. ప్రాచీన సంపద పరిరక్షణలో సమస్యలు తలెత్తవచ్చు. రేపటి తరాల భవిష్యత్తుకై కృషిచేస్తున్న సంస్థలు ఆర్థిక ఇబ్బందుల్లో పడటం విచారకరం. ఈ లోటు పూడ్చేందుకు చైనా సాయం అందిస్తామంటోంది. కొందరు నేతల మూర్ఖత్వం కారణంగా యునెస్కో వంటి సంస్థలు కనుమరుగు కాకుండా కాపాడుకోవటం ప్రపంచ పౌరులందరూ బాధ్యతగా భావించినప్పుడే ఇలాంటి బెదిరింపుల బెడద విరగడవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.2.06 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** హస్త రా.10.31 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.31 వరకు, **అమృతఘడియలు:** సా.4.02 నుండి 5.46 వరకు

సూర్యోదయం : 5.41
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

చైనా బలం ఏమిటి?!

విశ్లేషణ



టంకశాల అశోక్

ప్రపంచాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా పాలించి శాసిస్తున్న పాశ్చాత్య దేశాలను తట్టుకుని నిలవాలని, వాటితో సమాన స్థాయికి ఎదగాలని భావిస్తున్న చైనా... ఆ లక్ష్యం వైపు ముందుకు సాగుతున్నట్లుగానే కనిపిస్తోంది. అయితే తన లక్ష్య సాధన కోసం చైనా వ్యూహం ఏమిటి? ఆ వ్యూహంలోని బలమెంత? అనే ఆలోచనలు– చైనా గురించి కొంత తెలిసి ఉండి, కొన్నాళ్లు అక్కడికి వెళ్లి గమనించిన మీదట కలుగుతాయి. అవమానాల శతాబ్దం (1839–1949) నుంచి పునరుజ్జీవన శతాబ్దం (1949–2049) లోకి ప్రవేశించదలచిన చైనా, అందుకు అవసరమైన విధంగా వరుసగా కొన్ని పాఠాలను చరిత్ర నుంచి, వర్తమానం నుంచి తీసుకుంటూ వస్తున్నది. చైనా వ్యూహానికి పునాదులు వేసినది ఆ పాఠాలే!

మావో ప్రయోగాల ప్రభావం

చైనాకు మొదట అవమానాల శతాబ్ది ఎదురు కావటానికి ప్రధాన కారణం... చివరిదైన ఛింగ్ రాజ వంశ కాలంలో ఫ్యూడల్ వ్యవస్థాపరమైన అభివృద్ధి నిజంగానే గొప్పగా ఉండినా, ఆ కాలపు యూరప్, జపాన్‌లలో వలె పరిశ్రమలు, సైన్స్, టెక్నాలజీ, సైన్యం, చైనాలో ఆధునికం కాకపోవటం. ఇక రెండవ కారణం... సువిశాల దేశమైన చైనాలోని వేర్వేరు ప్రాంతాలు, ప్రజల మధ్య తగిన ఐక్యత లేకపోవటం. కనుక, కమ్యూనిస్టు విప్లవం తర్వాత పునరుజ్జీవన కాలంలో ఈ రెండూ సాధించటం చైనా ప్రాధాన్య లక్ష్యం అయింది. అయితే, మావో ఒక సోషలిస్టు స్వాప్నికుడు అయినందున, ఆర్థికాభివృద్ధిని కోరుకుంటూనే సామాజిక సమానత్వానికి అంతకన్న పెద్ద పీట వేయాలని భావించటంతో 1976 వరకు ఆయన జీవిత కాలంలో పలు ప్రయోగాల వల్ల చైనా ఒడుదొడుకులకు లోనైంది. మరొకవైపు, అవమానాల శతాబ్ది నాటి సైనిక పరాజయాలు గుర్తున్నందున కొరియా యుద్ధంలో, ఇతరత్రా కూడా తమ సైన్యం బలహీనమైనదయినప్పటికీ అమెరికా, రష్యా, జపాన్‌లను ధిక్కరించి చైనా నిలిచింది తప్ప గతంలో వలె లొంగిపోలేదు. అది చైనా ప్రజలకు స్ఫూర్తిదాయకమైన ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది.

'తియానన్మెన్' తిరుగుబాటు

మావో అనంతరం డెంగ్ శియావో పింగ్ కాలం మొదలుకొని చైనా, ప్రపంచాన్ని చూసి ఆధునీకరణ పాఠాలు నేర్చుకోవటం ఆరంభించింది. ఆర్థికంగా, సైనికంగా, విద్యా–వైజ్ఞానికపరంగా. ఆర్థిక సంస్కరణలు అందుకు తొలి అడుగయ్యాయి. అదే సమయంలో – పేదరికం, నిరుద్యోగం వల్ల విద్యార్థులు, యువకుల నుంచి సామాజికంగా ఒక పెద్ద కుదుపు మొదలై 1989లో తియానన్మెన్ స్క్వేర్ తిరుగుబాటు తలెత్తింది. తియానన్మెన్ తిరుగుబాటు... సామాజికాభివృద్ధితో పాటు, ఆర్థికాభివృద్ధి కూడా వేగంగా జరిగి, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకూ చేరాలన్న పాఠాన్ని చైనాకు నేర్పింది. ఇరాక్–అమెరికా కూటమి మధ్య జరిగిన గల్ఫ్ యుద్ధం (1991), సైనికంగా ఇరాక్ వంటి స్థితిలోనే గల తమపై ఒకవేళ అమెరికా దాడి జరిపితే ఏమి కావచ్చునో అర్థం చేయించింది. తర్వాత అదే సంవత్సరం (1991) చివరలో సాటి సోషలిస్టు దేశమైన సోవియెట్ యూనియన్ పతనం చైనాకు అనేక పాఠాలను నేర్పింది. ఒక విధంగా ఈ మూడు పరిణామాలు లేదా పాఠాలు చైనా నాయకత్వపు ఆలోచనలకు, భవిష్యత్ వ్యూహానికి పదును పెట్టాయి.



నేటి తియానన్మెన్ స్క్వేర్, బీజింగ్

వ్యూహాత్మకంగా 'డబ్ల్యూటీవో'లోకి!

భవిష్యత్తులో ఏమి సాధించాలన్నా ఆర్థికాభివృద్ధి అందుకు ప్రాతిపదిక కాగలదని బోధపడటంతో, ఒకవైపు అంతర్గతంగా సంస్కరణలను కొనసాగిస్తూనే మరొకవైపు విదేశీ సాయాలు, పెట్టుబడులు, వాణిజ్యం కోసం డబ్ల్యూటీవోలో చేరటం తప్పనిసరి అనే నిర్ణయానికి చైనా వచ్చింది. అందుకు అమెరికా అంగీకారం అవసరం గనుక, 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండు' అనే వ్యూహాన్ని పాటిస్తూ అమెరికాను మెప్పించి 2001లో ఆ సంస్థలో సభ్యత్వం సంపాదించింది. అప్పటినుంచి చైనా ఇక వెనుదిరిగి చూడలేదు. అయితే ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. కమ్యూనిస్టు రష్యా కూలిన తర్వాత కమ్యూనిస్టు చైనా బలహీనపడాలని అమెరికా కోరుకోవాలి గానీ, డబ్ల్యూటీవోలో చేరి బలపడాలని ఎందుకు భావిస్తుంది? దీనికి స్వయంగా అమెరికన్లు ఇచ్చే వివరణను బట్టి అప్పటి అధ్యక్షుడు జార్జ్ బుష్, చైనా ఆర్థికంగా అభివృద్ధి చెందే కొద్దీ వారి సంపదలు, కోరికలు, సమాజం, సంస్కృతి వంటివి మారి క్రమంగా పాశ్చాత్య సమాజం వలె మారుతుందని, దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కోరుకున్న తియానన్మెన్ నాటి ధోరణి బలపడుతుందని, ఆ విధంగా కమ్యూనిజం అంతర్ధానమై పెట్టుబడిదారీ వ్యవస్థ, పశ్చిమ దేశాల తరహా ప్రజాస్వామ్యం రాగలవని అంచనా వేశారు. కానీ, అది గ్రహించిన చైనా నాయకత్వం తన తరహా వ్యవస్థను తాను నిర్మించుకుంటూ ముందుకు సాగింది. బుష్ ఆలోచన నెరవేరలేదు.

కేంద్రీకృత మార్క్సియన్ పాలన

ఇప్పుడు వెనుదిరిగి సమీక్షిస్తే చైనాకు తన తరహా వ్యవస్థ అంటే ఏమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం మనకు కనిపిస్తున్నవి. అవి : దేశ అవసరాలు, ప్రజల అవసరాలు, రక్షణ అవసరాలు, విద్యా వైజ్ఞానిక అవసరాలు తీరటంతో పాటు; తమ అంతర్గత పెట్టుబడులకు, విదేశాలలో పెట్టుబడులకు, అమెరికా కూటమి ఒత్తిళ్లను తట్టుకునేందుకు చాలినంతగా సంపదలు వృద్ధి చెందటం. ప్రజల అవసరాలు తీరి, తలసరి ఆదాయాలు పెరుగుతూ, పేదరికం వేగంగా తొలగిపోతూ తియానన్మెన్ వంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా ఉండటం. ఈ తరహా వృద్ధి అన్నదే చైనీస్ సోషలిజంగా స్థిరపడి క్లాసికల్ సోషలిజం భావన మరుగున పడటం. అదే సమయంలో ఈ నమూనాకు ఆటంకాలు అంతర్గతంగా కానీ, బయటి నుంచి గానీ ఎదురవకుండా, కేంద్రీకృత మార్క్సియన్ పాలనా వ్యవస్థ అమలు అవటం. అసలు వ్యవస్థనే వ్యతిరేకించని మేరకు ప్రజలు స్వేచ్ఛగా ఉండటం.

◆ చైనాలో 1989లో తలెత్తిన తియానన్మెన్ స్క్వేర్ తిరుగుబాటు... సామాజికాభివృద్ధి పాటు, ఆర్థికాభివృద్ధి కూడా వేగంగా జరిగి, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకూ చేరాలన్న పాఠాన్ని చైనాకు నేర్పింది. ఇరాక్–అమెరికా కూటమి మధ్య 1991లో జరిగిన గల్ఫ్ యుద్ధం, సైనికంగా ఇరాక్ వంటి స్థితిలోనే గల తమపై ఒకవేళ అమెరికా దాడి జరిపితే ఏమి కావచ్చునో చైనాకు అర్థం చేయించింది. తర్వాత అదే ఏడాది చివరలో సాటి సోషలిస్టు దేశమైన సోవియెట్ యూనియన్ పతనం చైనాకు అనేక పాఠాలను నేర్పింది. ఒక విధంగా ఈ మూడు పరిణామాలు లేదా పాఠాలు చైనా నాయకత్వపు ఆలోచనలకు పదును పెట్టాయి.


'బహుళ ధ్రువ' నినాదం

ఈ క్రమంలో, తమ నమూనా సరైనదని చైనా నాయకత్వానికి గల నమ్మకాన్ని మరింత పెంచిన పరిణామాలు మరొక రెండు చోటు చేసుకున్నాయి. మొదటిది, 2008లో పాశ్చాత్య ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని 1930ల నాటి ఆర్థిక మాంద్యాన్ని గుర్తు చేయగా, చైనాలో వృద్ధి రేటు మరింత పెరిగింది. ఆ తర్వాత 2019లో కోవిడ్ సమస్యను అమెరికా ఎదుర్కొనలేకపోగా, చైనా సమర్థవంతంగా బయటపడింది. ఇదే 21వ శతాబ్దంలో మరో స్థాయిలో ఇంకొకటి కూడా జరిగింది. తమ పలుకుబడిని ప్రపంచవ్యాప్తం చేసుకుంటూ పోతేగానీ అమెరికాను తట్టుకుంటూ, క్రమంగా అమెరికాను బలహీనపరచలేమని భావించిన చైనా నాయకత్వం అందుకు తగిన వ్యూహం తయారు చేసింది. ఆ ప్రకారం 2009 నుంచి బ్రిక్స్‌ను, 2013 నుంచి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌ను బలోపేతం చేస్తూ, ఏకధ్రువ ప్రపంచం స్థానంలో బహుళ ధ్రువ ప్రపంచమే వాంఛనీయమన్న నినాదాన్ని ముందుకు తెచ్చింది. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందం, ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ న్యాయస్థానం, యునిసెఫ్ మొదలైన వాటిని అమెరికా తన స్వార్థం కోసం బలహీనపరుస్తున్నందున, వాటిని ప్రపంచ దేశాలు పరిరక్షించుకోవాలని వాదిస్తున్నది. ఈ క్రమంలో తాజాగా తలెత్తిన సమస్య... డబ్ల్యూటీవో నిబంధనలకు పూర్తి విరుద్ధంగా అమెరికా అన్ని దేశాలపై ఏకపక్షంగా సుంకాలు పెంచి, వారిని ఒత్తిడి చేసి, తమకు అనుకూలంగా ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకోవటానికి ప్రయత్నించటం. ఆ తీరును చైనా తీవ్రంగా వ్యతిరేకించటం మిగతా సభ్యదేశాలను ఆకర్షిస్తున్నది. ఈ విధమైన అంతరంగిక, ప్రాపంచిక విధానాలు, వ్యూహాలూ కలిసి చైనా సమగ్ర, దీర్ఘకాలిక వ్యూహానికి బలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నది. 2049 నాటికి పునరుజ్జీవనం పూర్తయి, తైవాన్ విలీనంతో ప్రపంచంలో ఆర్థికంగా చైనా మొదటి స్థానానికి చేరటం జరుగుతుందా? వేచి చూడాలి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సింహ గర్జన



భారత్ ఇకపై బంగారు పక్షిలా ఉండిపోలేదు. నేటి పరిస్థితులు భారత్ సింహంలా మారవలసిన అవసరాన్ని కల్పిస్తున్నాయి. భారత్ ఆర్థికంగా మరింత బలోపేతం కావాలి. ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతలు ఇక్కడ కూడా కనిపించాలి. అది లేకుండా ప్రపంచం మనకు విలువ ఇవ్వలేదు.

– మోహన్ భాగవత్, ఆరెస్సెస్ చీఫ్

ఫ్యాషన్ డైట్!



'ఆరోగ్య గురూ'లుగా చెప్పకుంటున్న వ్యక్తులు సోషల్ మీడియాను తమ ఫ్యాషన్ డైట్ ప్రణాళికలతో ముంచెత్తుతున్నారు. శాస్త్రీయంగా రుజువు కాని ఆ సలహాలను నమ్ముతున్నవారు గుడ్డిగా సప్లిమెంట్‌లను తీసుకుంటున్నారు. ప్రజారోగ్య రంగంలో ప్రస్తుతం తీవ్రమైన ఆందోళనను కలిగిస్తున్న ఈ ప్రాణాంతక ధోరణికి ప్రభుత్వమే అడ్డుకట్ట వేయాలి.

– అనూ సెహగల్, సోషల్ మీడియా పర్సనాలిటీ

మహిళల భాగస్వామ్యం



ఉపాధి రంగంలోకి ఎక్కువ మంది మహిళలను తీసుకు రాగలిగితే భారత ఆర్థిక వ్యవస్థ గణనీయమైన అభివృద్ధిని చూడగలుగుతుంది. కార్మిక మార్కెట్‌లో మహిళల భాగస్వామ్యం అన్నది వేగవంతమైన ఆర్థికవృద్ధిని సాధించటానికి ఎంతో అవసరం.

– ఎస్. మహేంద్ర దేవ్, ఛైర్మన్, ఇ.ఎ.సి.– పి.ఎం.

తిప్పల ప్రపంచం



ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ రుణ సంక్షోభంలో ఉన్నాయి. పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధి మందగమనం అనేవి దేశాలకు సవాళ్లుగా మారాయి.

– నగేశ్ కుమార్, ఎక్స్‌టర్నల్ మెంబర్, ఆర్బీఐ మానెటరీ పాలసీ కమిటీ

మానవ ముద్రలు



నడక అన్నిటినీ సరైన నిష్పత్తిలో ఉంచుతుంది. మహా నగరాలను మళ్లీ మానవీయం చేస్తుంది. మనుషుల అడుగులు క్రమశిక్షణతో 'అడుగు తర్వాత అడుగు'గా స్థిమితంగా కదులుతాయి. యంత్రాల్లో ప్రయాణిస్తున్నప్పుడు కాదు, కాలి బాటపై నడుస్తున్నప్పుడే నగరాలు మనుషుల్ని చక్కగా అర్థం చేసుకుంటాయి. మనుషులంతా తిరిగి నడవటం నేర్చుకోవాలి.

– పర్మీందర్ సింగ్, అంట్రప్రెన్యూర్

మనం మారాలి



ఇండియాలో 'విజయం' కోసం ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ విజయం అంటే సంపద. కానీ సిలికాన్ వ్యాలీలో వైఫల్యం కూడా విజయంలో భాగమే. అక్కడ 100 స్టార్టప్‌లలో 95 విఫలం అవుతాయి. విజయం సాధించిన మిగతా 5 స్టార్టప్‌లు ప్రపంచాన్ని మారుస్తాయి. భారతదేశం ఆ మనస్తత్వాన్ని అలవరుచుకోవాలి.

– నసీర్ భాటియా, ఇండో–అమెరికన్ బిజినెస్‌మేన్

బయటికి రండి



ఆఫ్రికన్ సామెత : తేనె అరటిపండు కంటే తియ్యగా ఉంటుందని కోతిని ఒప్పించలేము.
దీనర్థం : మనుషులు తమకు అలవాటై ఉన్నదానికే కట్టుబడి ఉంటారు. మీరు మీ సౌకర్యవంతమైన ప్రదేశం నుండి బయటికి వచ్చినప్పుడు మీ కోసం పూర్తిగా ఒక కొత్త ప్రపంచం తెరుచుకుంటుంది.

– హర్ష్ గోయెంకా, ఆర్.పి.జి. ఛైర్మన్

ఇన్ బాక్స్

మరో ముందడుగు

ప్రకృతి పరిరక్షణ మన ధర్మమే. ఇది మన భవిష్యత్ తరాలకు సుస్థిర జీవన ప్రమాణాల పునాది. కాబట్టి, ప్రకృతితో ఐక్యం అనేది మానవ వికాసానికి మార్గదర్శకమైన తత్త్వం. ఇస్రో–నాసా సంయుక్తంగా రూపొందించిన 'నిసార్' మిషన్ ఈ తత్త్వాన్ని భవిష్యత్ తరం వరకు నిలిపే సంకేతమే! భూమి, పర్యావరణ మార్పులను కచ్చితంగా గుర్తించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ఉపగ్రహ ప్రయోగం జూలై 30న జరగనుంది. ఇది ప్రపంచంలోనే తొలి డ్యూయల్–ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపర్చర్ రాడార్ శాటిలైట్ కావడం విశేషం.



నిసార్ శాటిలైట్ 2,393 కిలోల బరువుతో, భూమి నుంచి 743 కిలోమీటర్ల ఎత్తులో భూమి చుట్టూ తిరుగనున్నది. ఇది ప్రతి 12 రోజులకు భూమిని క్షుణ్ణంగా పరిశీలించి అత్యంత కచ్చితత్వంతో; అధిక నాణ్యత, స్పష్టతలతో కూడిన ఛాయ చిత్రాలనూ, సమాచారాన్నీ అందిస్తుంది. ఇందులో నాసా అభివృద్ధి చేసిన ఎల్–బ్యాండ్ ఎస్ఏఆర్, ఇస్రో రూపొందించిన ఎస్–బ్యాండ్ రాడార్లను కలిపిన డ్యూయల్ ఎస్ఏఆర్ సాంకేతికత ఉంది. ఇది పగలు, రాత్రి, వర్షం, పొగ, మేఘాలు వంటి ఏ పరిస్థితిలోనైనా స్పష్టమైన హై రిజల్యూషన్ డేటాను సేకరించగలదు.

ఈ ఉపగ్రహం ద్వారా భూకంపాలు, అగ్నిపర్వతాలు, కొండల కదలికలు, మంచు కరుగుదల, నేలలో తేమ సాంద్రత, అటవీ విస్తీర్ణ మార్పులు వంటి అంశాలను విశ్లేషించవచ్చు. ఈ సమాచారాన్ని విపత్తు నిర్వహణ, వ్యవసాయ, అటవీ సంరక్షణ, పర్యవేక్షణల కోసం వినియోగించవచ్చు. 'నీటి అడుగున ఉన్న భూభాగాన్ని మ్యాప్ చేయటం నిసార్ మిషన్‌లో ఒక ముఖ్యమైన అంశం. ఇది సముద్ర శాస్త్రం, రక్షణ, చేపలు వంటి రంగాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. తీరప్రాంత మార్పులు... అంటే కోస్తా నేలల క్షీణత వంటి విషయాల్లో ముందస్తు సమాచారం అందించగలదు.

నిసార్ రోజుకు సుమారు 4,300 గిగాబైట్ల హై రిజల్యూషన్ డేటా సేకరిస్తుంది. ఈ డేటా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే 80కి పైగా సంస్థలు ఈ డేటాను వినియోగించేందుకు ఒప్పందం చేసుకున్నాయి. నిసార్... నాసా–ఇస్రో సాంకేతిక భాగస్వామ్యానికి ఒక కొత్త మైలురాయి. అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు, సహాయక సంస్థలకు ఇది అమూల్య సమాచార వనరుగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం సుమారు రూ. 12,500 కోట్లు, ఇందులో భారత్ వాటా రూ. 1,000 కోట్లు కావడం గమనార్హం.

– వాడవల్లి శ్రీధర్ । హైదరాబాద్

సంక్షేమంలో ముందడుగు

అభిప్రాయం



బి.టి. గోవిందరెడ్డి

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నిటిలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే మహాలక్ష్మి పథకం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. సామాజిక సాధికారితను ప్రసాదించడంలో ఉచిత బస్సు ప్రయాణ పథకం పాత్ర అసామాన్యమైనది. బస్సుల్లో సగానికంటే ఎక్కువ మంది ప్రయాణికులు ఇప్పుడు మహిళలే. గుళ్లు, గోపురాలు, పర్యాటక ప్రదేశాల సందర్శనకు వెళ్లేటప్పుడు తెలిసిన వారితో కలిసి సమూహంగా వెళ్తున్నారు. క్షేమంగా తిరిగి వస్తున్నారు. ఫ్రీ బస్సు ప్రయాణం వల్ల రాష్ట్ర దేవాదాయ శాఖకు అదనంగా రూ. 50 కోట్ల ఆదాయం వచ్చిందని ఆ శాఖ మంత్రి చెబుతున్నారు. ఈ 50 కోట్లే కాక పుణ్య క్షేత్రాలకు వెళ్లినప్పునపుడు బస్టాండు నుంచి ఆటోల్లో వెళ్లడానికీ, గదులు అద్దెకు తీసుకోవడానికీ; స్థానిక హోటళ్లలో భోజనం, టిఫిన్, టీల ఖర్చులకూ దాదాపు రూ. 100 కోట్ల దాకా వ్యయం చేశారని అంచనా.



తెలంగాణ ఆర్టీసీ మొత్తం 9,700 బస్సులను నడుపుతుండగా సూపర్ డీలక్స్, లగ్జరీ, ఏసీ బస్సులను మినహాయిస్తే మొత్తం 82 శాతం బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అర్హత మహిళలకు కల్పించింది ప్రజా ప్రభుత్వం.

ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడులకు మరో రెండు వేలు పెంచి 'రైతు భరోసా' పేరిట రూ. 12 వేలు అందిస్తోంది. ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చిన 18 నెలల్లో రూ. 12,682 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. రుణమాఫీ కింద 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్లు విడుదల చేయడం అతి పెద్ద సంక్షేమ కార్యక్రమంగా చెప్పుకోవచ్చు.

ఇందిరమ్మ హౌజింగ్ స్కీమ్ కింద ఈ ఏడాది నాలుగున్నర లక్షల కుటుంబాలకు ఇళ్ల కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకోగా మొదటి విడతగా 3 లక్షల మందిని ఎంపిక చేశారు. వీరికి నాలుగు విడతల్లో ఇంటి నిర్మాణ పురోగతిని బట్టి మొత్తం 5 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. 2.37 లక్షల మందికి కేటాయింపు లెటర్లు అందించగా... అందులో నిర్మాణాలు మొదలై వివిధ దశల్లో ఉన్నవి 1.25 వేల ఇళ్లు. తెలంగాణలో 36 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉండగా ఒక్కో పరిశ్రమ సరాసరిన 18 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు (జీసీసీ), ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఈ ఏడాదిన్నరలో 80 వేల మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగింది. ఇటీవల మహేశ్వరంలో ప్రారంభించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ పరిశ్రమలో 2,500 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉచిత పథకాలపై విమర్శలు గుప్పిస్తున్నవారు ఒకటి గమనించాలి. ప్రతి ప్రభుత్వం రెండంచెల ప్రగతి వ్యూహాన్ని అనుసరిస్తుంది. ఒకటి – తక్షణ అవసరాలకు ప్రోత్సాహకాలు సమకూర్చి ఆదుకోవడం. రెండోది – దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి పెట్టి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం. ప్రస్తుత ప్రభుత్వం ఈ రెండు అంశాలను సమతూకం చేసుకుంటూ సరైన దారిలోనే వెళుతోంది.

◆ ప్రతి ప్రభుత్వం రెండంచెల ప్రగతి వ్యూహాన్ని అనుసరిస్తుంది. ఒకటి–తక్షణ అవసరాలకు ప్రోత్సాహకాలు సమకూర్చి ఆదుకోవడం. రెండోది – దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి పెట్టి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం. ప్రస్తుత ప్రభుత్వం ఈ రెండు అంశాలను సమతూకం చేసుకుంటూ సరైన దారిలోనే వెళ్తోంది.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి ముఖ్య సమాచార అధికారి

భక్తునికి మారుపేరు

జ్యోతిర్మయం

హిరణ్యకశిపుడి వధ అనంతరం ఉగ్ర నరసింహ రూపంలో ఉన్న నారాయణుని ప్రసన్నుడిని చేయటం బాలభక్తుడు ప్రహ్లాదునికి మాత్రమే సాధ్యమయ్యింది. శాంతించి 'నాయనా ఏదైనా వరం కోరుకో' అన్నాడు.

'దేవా! వరాలు కోరుకొమ్మన్న ఎరతో నన్ను ప్రలోభ పెట్టకు. పుట్టుకతోనే నాకు కోరికలంటే భయమూ, అనాసక్తీ! అందుకే మోక్షం కోసం నిన్ను ఆశ్రయించాను' అన్నాడు జ్ఞాన వృద్ధుడైన ఆ బాలుడు. 'కోరికలే దుఃఖ బీజాలని నీకు తెలియదా? నన్ను పరీక్షిస్తున్నావు! నీ నుంచి వరాలు పొంది, కోరికలు తీర్చుకోవాలని అనుకునేవాడు నీ భక్తుడు కాడు. వ్యాపారి! 'న స భృత్యః స వై వణిక్' (భాగవతం).

'నువ్వు స్వామివి. నేను భక్తుడిని. స్వామి సేవ చేసి తద్వారా కోరికలు తీర్చుకోవాలని ఆశించేవాడు నిజమైన భృత్యుడు కాదు. తన కార్యార్థం భృత్యుడి కోరికలు తీర్చేవాడు స్వామీ కాదు. నేను అకాముడైన భక్తుడిని. నువ్వు నా నుంచి ఏమీ కోరని స్వామివి. మనది వరాలు ఇచ్చి పుచ్చుకునే సంబంధం కాదు.

'అయినా సరే, నువ్వు వరం ఇచ్చి తీరవలసిందే అంటే నీ నుండి నేను ఒకే వరం కోరుకుంటాను.

కామానాం హృది అ సంరోహం
భవతః తు వృణే వరమ్.

నా హృదిలో కోరిక అనేదే మొలకెత్తకూడదు అన్న వరం నీ నుండి కోరుకుంటాను. కోరిక అనేది మనసులో పుట్టిందంటే మనిషి సకల శక్తులూ, సర్వ సద్గుణాలూ వ్యర్థమై పోతాయి. కోరికలు త్యజించిన మానవుడు భగవంతునితో సమానమవుతాడు. **విముంచతి యదా కామాన్... భగవత్త్వాయ కల్పతే.**' అన్నాడు.

భగవంతుడి పరీక్షలో భక్తుడు నెగ్గాడు. 'నాయనా! నీలాంటి అనన్య భక్తులు నా నుంచి ఏమీ కోరరు. అయినా, నువ్వు ఈ మన్వంతరమంతా దైత్యేశ్వరుడిగా ఉండి, సుఖానుభవాల వల్ల పుణ్యఫలాన్నీ, నిష్కామ కర్మాచరణ వలన పాపాన్నీ క్షయింపచేసుకో. నన్ను చిత్తంలో నిలుపుకొని, నా కథలు వింటూ, నన్ను పూజిస్తూ, యోగివై ప్రారబ్ధ కర్మ వదిలించుకో. కాల క్రమంలో దేహం వదిలినప్పుడు నువ్వు నన్నే పొందుతావు' అని అనుగ్రహించాడు నరహరి.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

గోదావరి బోర్డు చైర్మన్‌గా పాండే

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ) చైర్మన్‌గా బీపీ పాండేను కేంద్ర జలశక్తి శాఖ మంగళవారం నియమించింది. ఆగస్టు 1 నుంచి ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

ఆగస్టు 2న 'కాళేశ్వరం' నివేదిక

- 3 రోజులు గడువు కోరిన కమిషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్.. ఆగస్టు 3 వరకు గడువును పొడిగించాలని కోరింది. ఈ మేరకు కమిషన్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటం తెలిసిందే. ఈ నెలాఖరులోగా నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉండగా, వివిధ కారణాలతో జాప్యం జరిగింది. దీంతో మరో మూడు రోజులపాటు గడువు పొడిగించాలని కమిషన్ కోరింది. ఆగస్టు 2న ప్రభుత్వానికి కమిషన్ నివేదికను సమర్పించే అవకాశం ఉంది.

సాగర్ వద్ద తెలంగాణ ఇంజనీర్లకు అనుమతి

- కృష్ణా బోర్డు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్‌కు భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో.. ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ కోసం తమ ఇంజనీర్లు, సిబ్బందిని అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సానుకూలంగా స్పందించింది. డిసెంబర్ 24 వరకు ప్రాజెక్టుపై తెలంగాణ ఇంజనీర్లు, సిబ్బందికి అనుమతిస్తున్నట్టు పేర్కొంటూ బోర్డు మంగళవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుసేన్‌కు లేఖ రాసింది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కి.. ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోలు పోసుకున్న వ్యక్తి

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కిన ఒక వ్యక్తి.. కేసు నమోదవుతుందన్న భయంతో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. వివరాలివి. నల్లగొండ పట్టణానికి చెందిన రావిళ్ల నర్సింహ మద్యం తాగి బైక్‌పై వెళ్తుండగా.. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో భాగంగా అతన్ని తనిఖీ చేశారు. పరీక్షలో 155ఎంజీ/100 ఎంఎల్ ఆల్కహాల్ రీడింగ్ వచ్చింది. దీంతో అతన్ని పక్కనే ఉన్న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి తీసుకొచ్చి వివరాలు అడుగుతుండగా.. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని లైటర్‌తో నిప్పంటించుకున్నాడు. వెంటనే అక్కడున్న హోంగార్డు, కానిస్టేబుల్ మంటలు ఆర్పి అతన్ని ఆసుపత్రికి తరలించారు. నర్సింహను కాపాడే ప్రయత్నంలో హోంగార్డు ప్రవీణ్ చేతులకు గాయాలయ్యాయి. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి.. అర్ధరాత్రి మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం చేసిన నర్సింహపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పురుగులమందు తాగి విద్యార్థి ఆత్మహత్య

యాజమాన్యం వేధింపులే కారణమని ఆరోపణ.. స్కూల్ ఎదుట తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన



విద్యార్థి వెంకటచైతన్య మృతదేహం

తొర్రూరు రూరల్: స్కూల్ యాజమాన్యం వేధిస్తోందని ఆరోపిస్తూ పురుగుల మందు తాగి ఓ టెన్త్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్ట గ్రామంలోని ఓ స్కూల్‌లో జరిగింది. సీఐ గణేశ్, ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మర్రికుంట తండాకు చెందిన వెంకటచైతన్య తొర్రూరులోని అభ్యాస్ హైస్కూల్ హాస్టల్‌లో ఉంటూ టెన్త్ చదువుతున్నాడు. సోమవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న యాజమాన్యం ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినా పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘం నేతలు మృతదేహంతో స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


బాగా చంపి ఫేమస్ అయ్యేదా!

- అక్కను చంపేముందు ఇన్‌స్టాగ్రామ్‌లో తమ్ముడి రీల్

షాద్‌నగర్: తన అక్క ఓ యువకుడితో ఫోన్లో మాట్లాడుతోందనే కారణంతో ఆమెను హత్య చేసిన నిందితుడు.. పథకం ప్రకారమే ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లకు చెందిన రుచిత (21)ను సోమవారం ఆమె తమ్ముడు రోహిత్ (18) గొంతు నులిమి చంపగా పోలీసులు అతన్ని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. స్వగ్రామానికి చెందిన యువకుడితో అక్క ఫోన్లో మాట్లాడుతుండటంతో స్నేహితుల వద్ద పరువు పోతోందని రోహిత్ భావించాడు. దీంతో ఆమెను చంపాలనుకున్నట్లు సమాచారం. అంతకుముందే ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఫేమస్ అవ్వాలి మామా.. బాగా బతికి పేరు తెచ్చుకునే ఓపిక లేదు.. బాగా చంపి ఫేమస్ అయ్యేదా?'అనే సినీ డైలాగ్‌కు తాను చేసిన రీల్‌ను షేర్ చేశాడు.

గోదావరి వెలవెల.. కృష్ణా కళకళ

- కృష్ణా ప్రాజెక్టుల్లో 89 శాతానికి చేరిన నిల్వలు
- గోదావరి జలాశయాల్లో నిల్వలు 32 శాతమే
- ఎగువ గోదావరిలో వరదలు లేకపోవడమే కారణం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రధాన నదులైన గోదావరి, కృష్ణాలలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలతో కృష్ణమ్మ కళకళలాడుతుండగా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో వర్షాల్లేక గోదావరి మాత్రం వెలవెలబోతోంది. రాష్ట్ర పరిధిలో కృష్ణా పరీవాహకంలో మొత్తం 649.53 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 30 జలాశయాలుండగా ప్రస్తుతం వాటిలో 578.19 (89%) టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. మరోవైపు గోదావరి బేసిన్‌లో మొత్తం 419.81 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 57 జలాశయాలుండగా ప్రస్తుతం వాటిలో కేవలం 135.35 (32.24%) టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి.

కృష్ణమ్మ పరుగులు..

ఆల్మట్టి నుంచి 1.40 లక్షల క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 1.45 లక్షల క్యూసెక్కులు, తుంగభద్ర నుంచి 1.09 లక్షల క్యూసెక్కులు, జూరాల నుంచి 1.5లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తుండగా శ్రీశైలం జలాశయంలోకి వస్తున్న వరద 2.68 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో డ్యామ్ 8 గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా 2.16 లక్షల క్యూసెక్కులతోపాటు విద్యుదుత్పత్తి ద్వారా 65,712 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. అలాగే దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు 2.55 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా 26 గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా 1.56 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 28,420 క్యూసెక్కులను కిందికి విడిచిపెడుతున్నారు. దిగువన ఉన్న పులిచింతల రిజర్వాయర్‌కు వరద 29,222 క్యూసెక్కులకు పెరగ్గా విద్యుదుత్పత్తి ద్వారా 17,600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

ఎగువన నిండితేనే తెలంగాణలో గోదారి గలగలలు

పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎగువన గోదావరి ప్రధాన పాయలోని కొన్ని ప్రాజెక్టులకు చెప్పుకోదగ్గ వరద ప్రారంభమైంది. మహారాష్ట్రలోని జైక్వాడ్ ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయానికి 33.76 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రస్తుతం నీటి నిల్వ 93.05 టీఎంసీలకు చేరుకుంది. జైక్వాడ్ ప్రాజెక్టు నిండితే తెలంగాణలోని గోదావరి ప్రధాన పాయకు వరద పెరగనుంది. మరోవైపు మంజీరాపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం ఎలాంటి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నిల్వలు 4.6 టీఎంసీలకు పడిపోయాయి. గోదావరి ప్రధాన పాయపై ఉన్న శ్రీరామ్‌సాగర్ గరిష్ఠ నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా కేవలం 67,401 క్యూసెక్కుల వరద వస్తుండగా, జలాశయంలో నిల్వలు 35.78 టీఎంసీలకు చేరాయి. కడెం నదిపై నిర్మించిన కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 1,488 క్యూసెక్కుల వరద వస్తుండటంతో నిల్వలు 3.6 టీఎంసీలకు చేరాయి. గోదావరి ప్రధాన పాయపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 440 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తుండటం వల్ల నిల్వలు 11.23 టీఎంసీలకు పరిమితమయ్యాయి.

గోదావరి, కృష్ణా పరీవాహకం కింద రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల్లో మొత్తం నీటి నిల్వలు ఇలా..

పరీవాహకం	రిజర్వాయర్ల సంఖ్య	మొత్తం సామర్థ్యం	ప్రస్తుత నిల్వలు (టీఎంసీల్లో)
గోదావరి	57	419.81	135.35 (32.24%)
కృష్ణా	30	649.53	578.19 (89%)
మొత్తం	87	1069.34	713.54 (66.72%)

దిగువ గోదావరిలో ఉధృతి...

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని దిగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, వాగులు, వంకల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. గోదావరిలో ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద నిర్మించిన మేడిగడ్డ బరాజ్ నుంచి ధవళేశ్వరం బరాజ్‌కు దిగువన సముద్రంలో కలిసే వరకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణహితలో వరద పెరగడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లోకి 4.29 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. దానికి ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ఇంద్రావతి వరద కలుస్తుండటంతో తుపాకులగూడెం (సమ్మక్క-సాగర్) బరాజ్‌లోకి 5.21 లక్షల క్యూసెక్కులు చేరుతున్నాయి. దీంతో అంతే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం బరాజ్)లోకి చేరుతున్న 6.23 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

తెరుచుకున్న సాగర్ 26 గేట్లు

- కృష్ణమ్మకు వాయినం ఇచ్చి అన్ని గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- అన్ని ప్రాజెక్టులను ఆధునీకరించి పూడికతీత చేపడతామని వెల్లడి
- 2 లక్షలకుపైగా క్యూసెక్కుల నీరు దిగువకు ఉరకలు
- కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి గైర్హాజరు



కృష్ణమ్మకు వాయినమిస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/నాగార్జునసాగర్: రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరించడంతోపాటు వాటిల్లో పూడికతీత చేపడతామని నీటిపారుదశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఉత్తమ్ కృష్ణమ్మకు వాయినమిచ్చారు. అనంతరం ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను స్విచ్ ఆన్ చేయడం ద్వారా గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అదేవిధంగా ఎడమ కాల్వకు సాగునీటిని విడిచిపెట్టారు. దీంతో ప్రాజెక్టులోని మొత్తం 26 గేట్ల నుంచి దిగువకు 2,04,048 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. విద్యుదుత్పాదన ద్వారా మరో 2,825 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా లోలెవల్ వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా (312.0450 టీఎంసీలు) ప్రస్తుతం 587 అడుగులకు (305.8626 టీఎంసీలకు) చేరుకుంది. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ప్రాజెక్టు చరిత్రలో 18 ఏళ్ల తర్వాత తొలిసారి జూలైలోనే సాగర్ ద్వారా సాగునీటిని విడుదల చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా భారీగా వరి ధాన్యం పండిందని.. ఇందులో సాగర్ ప్రాజెక్టు కీలకపాత్ర పోషించిందన్నారు. సాగునీటితోపాటు సాగర్ ప్రాజెక్టు ద్వారా 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, శ్రీశైలానికి మంగళవారం 2.68 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో రాత్రి 10 గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 8 గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,16,520 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,397 మొత్తం 65,712 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి.

కోమటిరెడ్డి అలక!

నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదల కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన కూడా పాల్గొనేలా అధికారులు షెడ్యూల్ సిద్ధం చేశారు. దీని ప్రకారం హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 9 గంటలకు హెలికాప్టర్‌లో మంత్రులు ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్, కోమటిరెడ్డి బయలుదేరాల్సి ఉంది. ఇందుకోసం 9 గంటలకే మంత్రులు కోమటిరెడ్డి, అడ్లూరి హెలిపాడ్ వద్దకు చేరుకోగా మంత్రి ఉత్తమ్ మాత్రం ఉదయం 10 గంటల వరకు కూడా రాలేదని తెలిసింది. గంటసేపు ఎదురుచూసినా ఉత్తమ్ రాకపోవడంతో కాస్త కోపం తెచ్చుకున్న వెంకన్న అలిగి ఇంటికి వెళ్లిపోయారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

కాళేశ్వరంతో ఉపయోగం లేకపోవడంతో ఎల్లంపల్లి నుంచి నీళ్లు ఇస్తున్నాం: వివేక్



షాదీముబారక్ చెక్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్

సాక్షి, సిద్దిపేట: కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల పేరు చెప్పి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని గత ప్రభుత్వంపై రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ మండిపడ్డారు. ప్రస్తుతం అవి ఉపయోగం లేకుండా పోయాయని, దీంతో ఇప్పుడు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి సాగునీరు తీసుకువచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నూతన రేషన్ కార్డుల మంజూరు పత్రాలను, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్‌లను మంత్రి వివేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ, పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. అలాగే పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దివంగత నేత వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రూ.2 లక్షలు అమలు చేస్తే ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వం రూ. 10 లక్షలకు పెంచిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొన్నారు.

మల్లన్నసాగర్‌పై మంత్రికి అవగాహన లేదు

- వివేక్‌పై ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం



చిన్నకోడూరు (సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌పై మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దండగ అని ఆయనకు దిమాక్ ఉండే మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ వల్ల నేడు హైదరాబాద్‌కు, ఐదు జిల్లాలకు తాగు, సాగునీరు అందుతోందని చెప్పారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్‌లో రైతు ఏలేటి రాజిరెడ్డి తోటలో ఆయిల్ పామ్ గింజలు కోశారు. అనంతరం సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు రావాల్సి ఉండగా, రాలేకపోవడంతో ఫోన్ ద్వారా రైతులకు సందేశం ఇచ్చారు. మాచాపూర్‌లో ఇంత బాగా పంటలు పండుతున్నాయంటే కాళేశ్వరం ఫలితమేనని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరంతో ఈ ప్రాంత రైతులకు మేలు జరుగుతోందన్నారు. మల్లన్నసాగర్ దండగ అన్న మంత్రికి అవగాహన లేకపోవడమేనని అన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగువైపు మొగ్గు చూపాలన్నారు.

పులితోనే జీవవైవిధ్యం

- ఎన్‌టీసీఏ మాజీ సభ్యుడు అనూప్‌కుమార్
- ఫారెస్ట్ అకాడమీలో ఇంటర్నేషనల్ టైగర్స్ డే కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: పెద్దపులి అంటే శక్తి, అందం వంటి చిహ్నాలకే కాకుండా ప్రకృతి సమతుల్యత పరిరక్షణకు సహాయపడే కీలక జాతి అని అందరూ అర్థం చేసుకోవాలని నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ (ఎన్‌టీసీఏ) మాజీ సభ్యుడు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి అనూప్‌కుమార్ నాయక్ అన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక పులి మీద అడవి, పర్యావరణం, ప్రకృతి, జంతుజాలం, గడ్డి భూములు, జీవవైవిధ్యం వంటివి ఆధారపడి ఉన్నందున వాటి మనుగడే మానవాళి మనుగడ అన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. మంగళవారం దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో ఇంటర్నేషనల్ టైగర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన పర్యావరణ వ్యవస్థలో పులుల పాత్రను గుర్తించి అందుకు తగ్గట్టు వ్యవహరించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ డా. సువర్ణ మాట్లాడుతూ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల సమర్థ నిర్వహణతో పులుల సంఖ్య పెరుగుతోందన్నారు. చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలూ సింగ్ మేరు మాట్లాడుతూ పులుల సహజ ఆవాసాల సమీప ప్రాంతాలలో నివసించే ప్రజల శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వైల్డ్ లైఫ్‌కు విశేష సేవలు అందించిన వైల్డ్‌లైఫ్ విభాగం ఓఎస్‌డీ శంకరన్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కవ్వాల్ ప్రాజెక్ట్ టైగర్ డైరెక్టర్ శాంతారాం, నాగర్ కర్నూల్ డీఎఫ్‌వో రోహిత్ గొప్పిడి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

'సృష్టి'పై కేసులే కేసులు!

- తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోనూ..
- నిందితుల కస్టడీ కోరుతూ కోర్టులో పోలీసుల పిటిషన్
- 'సాక్షి' పరిశీలనలో వెలుగులోకి కీలకాంశాలు



సాక్షి, హైదరాబాద్: సరోగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌తో పాటు దాని నిర్వాహకులు, డాక్టర్ నమ్రత చరిత్రను పోలీసులు తవ్వి తీస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన వివరాల ప్రకారం వీరిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కలిపి దాదాపు 20 కేసులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ బ్రాంచీలపై 'సాక్షి'పరిశీలనలో కొన్ని కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. మరోపక్క ఈ కేసులో అరెస్టు అయిన 8 మంది నిందితులను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ గోపాలపురం పోలీసులు మంగళవారం సికింద్రాబాద్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఎక్కడెక్కడ ఎన్ని బ్రాంచీలు..

హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, కూకట్‌పల్లి, కొండాపూర్‌లతోపాటు విజయవాడ, విశాఖపట్నంలో సృష్టి బ్రాంచ్‌లు ఉన్నట్లు పోలీసులు ప్రకటించగా.. వీటిలో కొన్ని బ్రాంచ్‌ల్ని ఇప్పటికే మూసేసిన నిర్వాహకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ సెంటర్ వ్యవహారాలపై ఇండియన్‌కానూన్.ఆర్గ్ వెబ్‌సైట్ సహకారంతో 'సాక్షి'ఆరా తీయగా.. మద్రాస్ హైకోర్టులో నడిచిన ఓ కేసు (సీఎస్ నం.6 / 2016) వెలుగులోకి వచ్చింది. సృష్టి అనే పేరు వినియోగానికి సంబంధించి సృష్టి హాస్పిటల్ దాఖలు చేసిన ఈ కేసులో.. కూకట్‌పల్లి, సికింద్రాబాద్, మహారాణిపేట (విశాఖ), విజయవాడ, భువనేశ్వర్‌ల్లో ఉన్న సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లు, డాక్టర్ నమ్రత, డాక్టర్ ఫణీంద్రనాథ్ రెడ్డిని ప్రతివాదులుగా చేర్చింది. మరోవైపు సృష్టి సెంటర్‌కు చెందిన ఫేస్‌బుక్ పేజీలో డాక్టర్ నమ్రత 2023లో పోస్టు చేసిన వీడియోలో హైదరాబాద్, విజయవాడ, విశాఖలతోపాటు కోల్‌కతా, రాజమండ్రి, భువనేశ్వర్‌ల్లో బ్రాంచ్‌లు ఉన్నట్లు పేర్కొంటూ వాటి ఫోన్ నంబర్లు కూడా పొందుపరిచారు. అయితే వీటిలో ప్రస్తుతం పనిచేస్తున్న బ్రాంచీలు ఎన్ని? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

చిన్నారుల ట్రాఫికింగ్‌తో పాటు మోసం కేసులు

డాక్టర్ నమ్రతతో పాటు సృష్టి సెంటర్‌పై చిన్నారుల అక్రమ రవాణా, చీటింగ్ సహా అనేక కేసులు ఉన్నాయి. ఐవీఎఫ్ వైద్యం పేరుతో 2016లో అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుల్ని మోసం చేయడం, 2015లో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందడం, 2021లో ఐవీఎఫ్ పేరుతో మరో జంట నుంచి రూ.2.5 లక్షలు తీసుకుని తప్పించుకుని తిరగడం వంటి కేసులు హైదరాబాద్‌లో ఉన్నాయి. 2020లో విశాఖపట్నంలోని బ్రాంచీ ద్వారా ఓ జంటకు సరోగసీ పేరుతో వేరే వారికి పుట్టిన బిడ్డను అప్పగించడంపై కేసులు నమోదయ్యాయి. వీటిల్లో కొన్నింటిని నమ్రత రాజీ చేసుకున్నట్లు పోలీసులు చెప్తున్నారు. మరోపక్క 2022లో విశాఖపట్నానికి చెందిన భార్యాభర్తలు యుగంధర్, ఏక్తా అక్కడి వినియోగదారుల ఫోరంలో నమ్రతతో సహా ముగ్గురిపై ఫిర్యాదు చేశారు. ఈ జంట నుంచి సరోగసీ పేరుతో రూ.15 లక్షలు తీసుకుని వేరే వాళ్లకు పుట్టిన చిన్నారిని అంటగట్టారనేది ఆరోపణ కాగా.. దీనిపై 2023లో తీర్పు ఇచ్చిన ఫోరం.. బాధితుల నుంచి తీసుకున్న రూ.15 లక్షలతో పాటు నష్టపరిహారం కింద మరో రూ.5 లక్షలు చెల్లించాలని నమ్రత తదితరుల్ని ఆదేశించింది.

అనాథగా శిశు విహార్‌లో చిన్నారి

డాక్టర్ నమ్రత నిర్వాకం కారణంగా అసోం దంపతులకు పుట్టి, రాజస్తాన్ దంపతుల వద్దకు చేరిన మగ శిశువు ప్రస్తుతం అనాథగా మారింది. ఆ చిన్నారిని తమ వద్ద ఉంచుకోవడానికి, పెంచుకోవడానికి రాజస్తాన్ జంట అంగీకరించలేదు. ఒకవేళ వీళ్లు అంగీకరించినప్పటికీ.. ఇది అక్రమ సరోగసీ కావడంతో అధికారికంగా అందుకు అవకాశం లేకుండా పోయింది. మరోవైపు చిన్నారికి జన్మనిచ్చిన అసోం జంట ప్రస్తుతం జైల్లో ఉన్నారు. దీంతో పోలీసులు ఆ చిన్నారిని అమీర్‌పేటలోని శిశు విహార్‌కు తరలించారు.

తెగిన రైల్వే హైటెన్షన్ కరెంట్ వైర్

- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



తెగిన విద్యుత్ తీగలను సరిచేస్తున్న రైల్వే సిబ్బంది

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో లూప్‌లైన్‌లోని మూడో ట్రాక్‌పై గల హైటెన్షన్ విద్యుత్ తీగ మంగళవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా తెగిపడింది. ఆ ప్రాంతంలోని కోతులు విద్యుత్ తీగలను పట్టుకుని వేలాడుతుండగా.. అకస్మాత్తుగా ఒక తీగ తెగి బొగ్గులోడ్‌తో ఆగిఉన్న గూడ్స్‌రైలుపై పడింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడం, ఓ కోతి చనిపోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. తర్వాత రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకునేలోగానే కోతి కళేబరం వద్దకు వానర గుంపు వచ్చిచేరింది. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది.. వాటిని చెల్లాచెదురు చేసి కోతి కళేబరాన్ని దూరంగా తీసుకెళ్లి పడేశారు. మూడోనంబరు ప్లాట్‌ఫాం ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో లూప్‌లైన్‌లోని 2, 3 ప్లాట్‌ఫామ్స్‌కు కాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అయితే, రైల్వేసిబ్బంది యుద్ధప్రాతిపదికన విద్యుత్ తీగలు సరిచేశారు. విద్యుదాఘాతంతో కోతి బలైందని, అదే ప్రాంతంలో ప్రయాణికులు ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోనని స్థానికులు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి

- కాన్పు జరిగిన ఐదు రోజులకు ఘటన



న్యాయం చేయాలంటూ మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న మృతురాలి బంధువులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో పురుడు పోసుకున్న ఐదురోజులకు బాలింత ఢిల్లీ ఉమ (29) మృతి చెందారు. ఉమ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పెద్దపల్లిలోని తెనుగువాడకు చెందిన ఢిల్లీ ఉమ రెండో కాన్పుకోసం జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో చేరగా.. ఈనెల 25న సిజేరియన్ ఆపరేషన్ చేయడంతో ఆడశిశువుకు జన్మనిచ్చింది. అయితే, తన ఒంటిపై దురదగా ఉందని బాలింత మంగళవారం చెప్పగా ఇంజక్షన్ వేశారు. కాసేపటికే శరీరం వాపువచ్చి ఉమ స్పృహ కోల్పోయింది. వైద్యులకు సమాచారం ఇస్తే కరీంనగర్‌కు రెఫర్ చేశారు. అక్కడకు వెళ్లాక పరీక్షించిన డాక్టర్లు చనిపోయిందని నిర్ధారించి తిరిగి ఆస్పత్రికి పంపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యులతో శాంతియుతంగా చర్చించాలని సూచించినా ఆందోళనకారులు వినలేదు. చివరకు బుధవారం మాట్లాడదామని చెప్పి మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఇంటికి పంపించారు. ఆగ్రహించిన మృతురాలి బంధువులు మార్గమధ్యలోని మసీదు ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, నరేశ్ తదితరులు అధికారులతో మాట్లాడిస్తామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఉమకు హార్ట్‌బీట్ తగ్గిందని ఎనిమిది మందితో కూడిన వైద్యబృందం పరీక్షించి గుర్తించిందని, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు రెఫర్ చేసిందని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీలేదని, మృతురాలి బంధువుల ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు.

సిందూర్ ఆపాలని ఏ దేశాధినేతా చెప్పలేదు

‘ఆపరేషన్ సిందూర్’ చర్చలో మోదీ స్పష్టీకరణ • కాంగ్రెస్‌పై నిప్పులు


మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: నిఘా వైఫల్యం కారణంగా పహల్గాంలో అత్యంత పాశవిక దాడి జరిగిందని, ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సాధించిన కీలక విజయాలేంటో చెప్పాలంటూ విపక్షాల డిమాండ్ల మధ్య లోక్‌సభలో ప్రధాని మోదీ సూటిగా సమాధానమిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటల ప్రత్యేక చర్చకు సమాధానంగా ప్రధాని మోదీ వివరణ ఇస్తూనే గత కాంగ్రెస్ ప్రభుత్వాలు, విపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. భారత్, పాక్ పరస్పర సైనిక చర్యలు పరిసమాప్తం కావడానికి తానే ముఖ్యకారణమని ఇప్పటికే పాతికసార్లు ఢంకా భజాయించిన ట్రంప్ మాటల్లో రవ్వంతైనా నిజంలేదని స్పష్టంచేశారు. ఉగ్రవాదాన్ని కాళ్లకింద నలిపేసేటప్పుడు ప్రపంచంలో ఏ దేశం వారించినా ఊరుకునేది లేదని వ్యాఖ్యానించారు. సిందూర్ తక్షణం ఆపేయాలని ప్రపంచంలో ఏ దేశ నేతా తమకు చెప్పలేదని మోదీ స్పష్టం చేశారు. 102 నిమిషాల ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

విజయోత్సవంలో ప్రసంగిస్తున్నా..

‘‘ఉగ్రవాదానికి కుంభస్థలం వంటి పాక్‌లోని ఉగ్రస్థావరాలను మనం నేలమట్టంచేసినందుకు ఈరోజు పార్లమెంట్‌లో విజయోత్సవం జరుపుకుంటున్నట్లు అనిపిస్తోంది. భారత వాణిని ప్రపంచానికి వినిపించేందుకు, భారత్ అంటే ఎంటో అందరికీ మరోసారి చాటిచెప్పేందుకే మాట్లాడుతున్నా. సిందూర్ వేళ నాపై నమ్మకం ఉంచిన ప్రజలందరికీ రుణపడిపోయా. ఉగ్రవాదానికి తల్లివేరు వంటి పాక్‌కు ఆపరేషన్ సిందూర్‌తో అసాధారణరీతిలో గుణపాఠం చెప్పాం. ఆ భీకర దాడుల నుంచి పాక్ ఇంకా కోలుకోలేదు. దాడులు మళ్లీ జరగొచ్చని వాళ్ల ఇప్పటికీ భయంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఆపరేష్ సిందూర్ అమలుకోసం మేం సైనిక బలగాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చాం. పహల్గాం దుశ్చర్యకు దీటుగా బదులిస్తూ పాక్ నడిబొడ్డున క్షిపణుల వర్షం కురిపించాం. కేవలం 22 నిమిషాల్లో భిన్న ప్రాంతాల్లోని కీలక ఉగ్రస్థావరాలను నేలమట్టంచేశాం. అణు బెదిరింపులు మన దగ్గర పనిచేయవని పాక్‌ను గట్టిగానే హెచ్చరించాం. మన దాడుల ధాటికి పాక్ వైమానిక స్థావరాలు సర్వనాశనమై ఇప్పటికీ అలాగే ఐసీయూలో ఉన్నాయి’’.

ఆత్మనిర్భరతను ప్రపంచం కళ్లారా చూసింది

‘‘ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ వంటి స్వదేశీ క్షిపణులుసహా సొంత డ్రోన్ల వినియోగంతో భారత్ సాధించిన స్వావలంభన, ఆత్మనిర్భరతను ప్రపంచం కళ్లారా చూసింది. అమాయకులను ఉగ్రదా డులతో బలితీసుకుంటే ఎలాంటి స్పందనా ఉండదని ఇన్నాళ్లూ ఉగ్రదాడుల సూత్రధారులు భావించారు. ఇకపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే భారత్ దండయాత్ర చేయగలదని ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులక బాగా తెలిసొచ్చింది. ఆపరేషన్ సిందూర్ నుంచి సింధు దాకా భారత్ భిన్నకోణాల్లో ప్రతీకార చర్యలు చేపట్టింది. భవిష్య త్తులో తోకజాడిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పాక్‌కు బోధపడింది. ఉగ్రపోషకులు, పాక్ పాలకులు ఒక్కరే అనే భావనతోనే భారత్ ముందుకెళ్తోంది. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఆపరేషన్ సిందూర్ మొదలెడితే ప్రపంచంలో మూడు దేశాలు తప్ప ఏ దేశమూ భారత్‌కు అడ్డుచెప్పలేదు. పాక్‌కు ఆ మూడుదేశాలే మద్దతు పలికాయి. ఇలా ప్రపంచదేశాలన్నీ భార త్‌కు అండగా నిలిస్తే కాంగ్రెస్ మాత్రం మన సైనికుల వీరత్వానికి సలామ్ చేయలేదు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం. గతంలో సర్జికల్ దాడులు చేసినప్పుడూ కాంగ్రెస్ ఇదే పాట పాడింది’’.

నిమిషాల్లో నాశనం చేశాం

‘‘పాక్ నడిబొడ్డున, ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలపై మన బలగాలు మేలో మెరుపుదాడులు చేశాయి. నిమిషాల్లోనే మీ స్థావరాలను సమాధులుగా మార్చగలమని పాక్‌కు నిరూపించాం. తొలుత ఉగ్రస్థావరాలను మన బలగాలు ధ్వంసం చేశాయి. ఉగ్రవాదులకు సాయంగా పాక్ బలగాలు ప్రతిదాడులకు సిద్ధపడడంతోనే వాళ్ల వైమానిక స్థావరాలపై బాంబుల వర్షం కురిపించి కోలుకోలేని దెబ్బతీశాం. దీంతో పాక్ కాళ్లబేరానికి వచ్చింది. పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) నుంచి ఫోన్ వచ్చింది. ఇంతకుమించి దాడులు చేస్తే ఇప్పట్లో కోలుకోలేమని ప్రాధేయపడ్డారు. అందుకే సిందూర్‌కు ముగింపు పలికాం. ఆపరేషన్‌ను ఆపడానికి ఇదే ఏకైక కారణం. అంతేగానీ ప్రపంచంలో మరే దేశాధినేత కారణంగానో సిందూర్ ఆగలేదు. ఆపాలని ఎవరూ మాకు చెప్పలేదు. మే 9వ తేదీ రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పదేపదే నాకు ఫోన్ చేశారు. అప్పటికే త్రివిధ దళాధిపతులతో భేటీలో బిజీగా ఉన్నాను. భేటీ తర్వాత నేనే ఫోన్‌కాల్ చేసి మాట్లాడా. పాక్ దాడి చేయబోతోందని ఉప్పందించారు. ఎలాంటి దాడినైనా అడ్డుకోగలమని ఆయనకు స్పష్టంచేశా. దాడికి ప్రతిదాడి దారుణంగా ఉంటుందని చెప్పా. బుల్లెట్లకు బాంబులతో సమాధానం చెప్తామన్నా. ఎన్నో విషయల్లో భారత్ స్వావలంబన సాధిస్తోంది. కాంగ్రెస్ మాత్రం చాలా అంశాలను ఎత్తిచూపేందుకు పాక్ పేరును మధ్యలోకి లాక్కొస్తోంది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు పరోక్షంగా పాక్ అజెండాను ప్రకటించే అధికారిక ప్రతినిధులుగా తయార య్యారు. గతంలో మేం సర్జికల్ దాడులుచేస్తే కాంగ్రెస్ వాళ్లు ఆధారాలు కావాలన్నారు. ఆనాడు పైలట్ అభినందన్ పాక్ బలగాలకు దొరికిపోతే ఎలా విడిపించుకొస్తారో చూస్తామని మాట్లాడారు. తీరా మేం తీసుకొచ్చాక ఇదే కాంగ్రెస్ నేతలు నోరుమూశారు. ఉగ్రవాదులకు జరిగిన భారీ నష్టాన్ని చూసి అక్కడ పాక్ మాత్రమే కాదు ఇక్కడ భారత్‌లోనూ కొందరు ఏడుస్తున్నారు’’ అని మోదీ ఎద్దేవా చేశారు.

విశ్వశాంతికి ఇది అవసరం

‘‘విశ్వశాంతి సాధనలో ఆయుధ సంపత్తితో తులతూగడం కూడా ముఖ్యమే. అందుకే రక్షణరంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ద్వారాలు తెరిచాం. ఇప్పుడు వందకు పైగా అంకురసంస్థలు రక్షణరంగంలో కృషిచేస్తున్నాయి. కొన్ని సంస్థలను మహిళలు ముందుండి నడిపిస్తున్నారు. ఇలాంటి జాతీయ భద్రతా ముందుచూపు కాంగ్రెస్‌కు గతంలోలేదు. ఇకమీదట కూడా రాదు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఇప్పటికీ భారత్ ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయిందన్న ప్రశ్నకంటే ముందు అసలు అదెలా మన చేయిజారిందనే ప్రశ్న వేసుకోవాలి. విశాల కశ్మీరం చేజారడానికి కారకులెవరు? నెహ్రూ హయాం నుంచి మొదలుపెడితే గత కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన ఘోర పరిపాలనా తప్పిదాల కారణంగానే భారత్ ఇప్పటికీ ఉగ్రదాడులు, ఇతర గాయాలతో బాధపడుతోంది’’ అని అన్నారు.

వేయి క్షిపణులు ప్రయోగిస్తే అన్నింటినీ గాల్లోనే కూల్చేశాం

‘‘భారత గగనతల రక్షణ వ్యవస్థల సత్తాను చూసి ప్రపంచదేశాలు నివ్వెరపోయాయి. సిందూర్‌కు ప్రతిగా పాక్ 1,000కిపైగా క్షిపణులను ప్రయోగిస్తే మన గగనతల రక్షణవ్యవస్థలు వాటన్నింటినీ గాల్లోనే పేల్చేశాయి. అదంపూర్ వైమానికస్థావరం నాశనమైందని పాక్ కారుకూతలు కూస్తే తెల్లారే అక్కడికెళ్లి అది నిక్షేపంగా ఉందని ప్రపంచానికి చాటిచెప్పా. భారత సైనిక సత్తాను దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ నమ్మకపోవడం దారుణం. మన రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి, హోం మంత్రులు చెప్పిన మాటలకూ కాంగ్రెస్ విలువ ఇవ్వట్లేదు. పాక్ రిమోట్ కంట్రోల్‌తో కాంగ్రెస్ పనిచేస్తుందేమో. కొందరు కాంగ్రెస్ యువనేత (రాహుల్)లు ఆపరేషన్ సిందూర్‌ను తమాషాగా కొట్టిపారేశారు. మన సైనికుల అద్భుత విజయాన్ని చూసి కాంగ్రెస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు. లోక్‌సభలో ప్రత్యేక చర్చ మొదలైన నాడే ఆపరేషన్ మహదేవ్‌లో పహల్గాం ముష్కరులు ఎలా చనిపోయారని ప్రశ్నిస్తున్నారు. జాడ కనిపెట్టి ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి వారాలు, తేదీలు చూడాలా?’’ అని మోదీ ఆగ్రహంవ్యక్తం చేశారు.

సిందూ నదీజలాల ఒప్పందం నెహ్రూ పాపమే

‘‘మన నదీజలాలపై ప్రపంచబ్యాంక్ అజమాయిషీ చేసేలా నెహ్రూ ప్రభుత్వం ఘోర తప్పుడు నిర్ణయం తీసుకుంది. భారతనేలపై పారే సిందూ నదీజలాల్లో 80 శాతం వాటా పాక్‌కు ఆయనే ధారాదత్తంచేశారు. ఇంతటి జనాభా ఉన్నప్పటికీ మనకు 20 శాతం మాత్రమే హక్కులు దఖలుపడ్డాయి. మన భారతీయ రైతుల నీటికష్టాలు నెహ్రూకు పట్టలేదు. నీళ్లివ్వడంతోపాటు నెహ్రూ పాక్‌కు నిధులు కూడా ఇచ్చారు. సిందూ నదీజలాలపై డ్యామ్‌లు కట్టుకునేందుకు నెహ్రూ ప్రభుత్వం పాక్‌కు ఆర్థికసాయం చేసింది. సిందూ నదీజలాల ఒప్పందంలో నెహ్రూ చేసిన భారీ తప్పిదాలను తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలూ సరిచేయలేదు. మేం వచ్చాకే ఆ తప్పులను సవరించాం. ఉగ్రదాడులతో భారతీయుల రక్తం పారేలా చేస్తున్నారు. అందుకే సిందూ నదీజలాల ఒప్పందం నుంచి వైదొలిగాం. నీళ్లు, రక్తం కలిసి ప్రవహించబోవని స్పష్టంచేశాం. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదు. పాక్ మళ్లీ కుయుక్తులతో పేట్రేగిపోతే సిందూర్ మళ్లీ మొదలవుతుంది’’ అని మోదీ స్పష్టం చేశారు.

ఆ ముగ్గురూ పహల్గాం ముష్కరులే

అందరూ గ్రేడ్ -ఏ ఉగ్రవాదులే

- సుదీర్ఘ శ్రమకు ఫలితమే ‘మహదేవ్’
- లోక్‌సభకు వెల్లడించిన అమిత్ షా
- ఇద్దరు ముష్కరుల వద్ద పాకిస్తాన్ ఓటర్ ఐడీలు
- వారి ఆయుధాలు కూడా పాక్‌వే
- పాక్‌కు కాంగ్రెస్ క్లీన్‌చిట్ అంటూ నిప్పులు చెరిగిన అమిత్ షా



న్యూఢిల్లీ: వేలాది మంది విచారణ. అనుమానితులపై నిరంతర నిఘా. ఆశ్రయమిచ్చిన వారి నిర్బంధం. గత ఏప్రిల్ 22న పహల్గాంలో పాశవిక దాడికి పాల్పడి 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల కోసం ‘ఆపరేషన్ మహదేవ్’లో భాగంగా భద్రతా దళాలు నెలల తరబడి వేటాడిన తీరిది. శాటిలైట్ ఫోన్ సిగ్నల్స్ సాయంతో అనుపానులు చిక్కడంతో ఎట్టకేలకు వారి పాపం పండింది. సోమవారం జమ్మూ కశ్మీర్‌లో భద్రతా దళాల చేతుల్లో హతమయ్యారు. ఆ ముగ్గురూ పహల్గాం దాడిలో పాల్గొన్న ముష్కరు లేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. వారిని గుర్తించేందుకే నెలల సమయం పట్టిందని వెల్లడించారు. సాంకేతికత, మానవ నిఘా సాయంతో ఉగ్రవాదులను కదలికలను కనిపెట్ట గలిగినట్టు వివరించారు. ఆపరేషన్ సిందూర్‌పై మంగళవారం లోక్‌స భలో ప్రత్యేక చర్చలో ఆ యన ప్రసంగించారు. ఆ పాశవిక దాడితో గాయ పడ్డ దేశ ప్రజల హృద యాలకు సాంత్వన చేకూ ర్చిన ఆపరేషన్ మహదేవ్ తాలూకు వివరాలను సభకు వెల్లడించారు. హతులైన ముగ్గురిని సులేమాన్ అలియాస్ ఫైజల్, అఫ్గాన్, జిబ్రాన్‌గా గుర్తించారు. వారంతా ఏ గ్రేడ్ ఉగ్రవాదులేనని తెలిపారు. సైన్యం తాలూకు 4 పారా మిలిటరీ బలగాలు, సీఆర్పీఎఫ్ జవాన్లు, జమ్మూ కశ్మీర్ పోలీసులు కలసి కట్టుగా ఆపరేషన్‌లో పాలుపంచుకున్నట్టు వివరించారు. పహల్గాం దాడికి పాల్పడ్డ ముష్కరులను ఏరివేసి జాతికి ఊరట కల్పించామని చెప్పారు. ‘‘ఇంత మంచి వార్త విని అధికార పక్షంతో పాటు విపక్షాలు ఆనందిస్తాయని ఆశించా. కానీ వారి ముఖాలన్నీ కళతప్పి కనిపిస్తున్నాయి’’ అంటూ ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ తప్పిదమే ‘పాక్’!

ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమవుతూ వస్తోందని అమిత్ షా ఎద్దేవా చేశారు. దేశ సమస్యలన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమంటూ తూర్పారబట్టారు. పాక్ ఆక్రమిత భూభాగాలను స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన అవకాశాలన్నింటినీ కాంగ్రెస్ ఎప్పటికప్పుడు కాలదన్నుతూ వచ్చిందని ఆరోపణలు గుప్పించారు. అలాంటి పార్టీకి మోదీ ప్రభుత్వం పాక్‌పై పూర్తిస్థాయిలో నిర్ణాయక చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించే నైతిక అర్హత కూడా లేదన్నారు. పహల్గాం దాడిలో పాక్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకు ఎక్కడ లేని ఉత్సాహమూ చూపిన చరిత్ర ఆ పార్టీది అంటూ మండిపడ్డారు. పహల్గాం దాడికి పాల్పడింది స్థానిక ఉగ్రవాదులే కావచ్చని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ హోం మంత్రి పి.చిదంబరం ఇటీవల కూడా వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. పీఓకేను స్వాధీనం చేసుకునే అవకాశం చేతికందిన వేళ సైనిక చర్యను కేంద్రం నిలిపేసిందా అంటూ కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగొయ్ సభలో ప్రశ్నించడంపై అమిత్ షా మండిపడ్డారు. ‘‘వాళ్లు ఏం నిరూపించాలని అనుకుంటున్నారు? ఎవరిని కాపాడాలనుకుంటున్నారు? ఇదంతా పాక్‌ను కాపాడేందుకు స్పష్టమైన కుట్రే’’ అంటూ తూర్పారబట్టారు. స్వాతంత్య్రం వచ్చిన వేళ దేశ విభజనను కాంగ్రెస్ వ్యతిరేకించి ఉంటే జమ్మూ కశ్మీర్‌లో అసలు ఉగ్ర భూతం జడలు విప్పేదే కాదన్నారు. ఉగ్రవాదానికి పాక్ తల్లివేరుగా మారిందంటూ దుయ్యబట్టారు. ఆ దేశం ఏర్పాటును కాంగ్రెస్ తాలూకు తప్పిదంగా అభివర్ణించారు. పాక్‌కు బుద్ధి చెప్పేందుకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే జారవిడిచిందని ఆరోపించారు. ‘‘1948లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మన సైన్యం పూర్తిగా విముక్తం చేసే సమయంలో నాటి కాంగ్రెస్ ప్రధాని నెహ్రూ ఏకపక్షంగా కాల్పుల విమరణ ప్రకటించారు. 1962 యుద్ధం వేళ అస్సాంను చైనా దఖలు పరుస్తున్నట్టు బాహాటంగా ప్రకటన చేశారు. పైగా ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ హోదా అవకాశాన్నీ కాలదన్నారు. 1971లో 90,000 మంది పాక్ సైనికులు భారత్‌కు లొంగిపోయారు. ఆ సంఖ్య నాటి పాక్ సైన్యంలో ఏకంగా 42 శాతం. అంతేగాక 15 వేల చదరపు కి.మీ. పాక్ భూభాగం కూడా మన అదుపులోకి వచ్చింది. అయినా పీఓకేను వెనక్కు తీసుకునేందుకు నాటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. సరికదా, ఆ యుద్ధంలో స్వాధీనం చేసుకున్న పాక్ భూభాగాన్ని కూడా పువ్వుల్లో పెట్టి వెనక్కిచ్చారు. ఇలాంటి చరిత్ర ఉన్నవాళ్లు, పహల్గాం దాడికి పాల్పడ్డవారిని ఎందుకు పారిపోనిచ్చారని నన్ను అడుగుతున్నారు. వారిని తుదముట్టించడం ద్వారా ఈ ప్రశ్నకు నా తరఫున భద్రతా దళాలే బదులిచ్చాయి. 1986లో అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం పాక్‌కు పారిపోయింది కూడా కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ హయాంలోనే. 1993లో ఉగ్రవాదులు సయీద్ సలాహుద్దీన్, టైగర్ మెమన్, అనీస్ ఇబ్రహీం కస్కర్, 2007లో రియాజ్ భత్కల్, 2010లో ఇక్బాల్ భత్కల్ దేశం వీడి పారిపోయినప్పుడు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెసే. వీళ్లందరినీ ఎందుకు పారిపోనిచ్చారో విపక్ష నేత రాహుల్‌గాంధీ నుంచి తెలుసుకోవాలని అనుకుంటున్నా’’ అని అన్నారు.

‘ఆపరేషన్ సిందూర్’పై ప్రత్యేక చర్చలో ఎవరేమన్నారంటే..

మోదీకి ఆ ధైర్యం ఉందా?



‘‘పహల్గాం దాడి తర్వాత ప్రధాని మోదీ సొంత ప్రతిష్టను కాపాడుకోవడానికి సైనిక దళాలను వాడుకుంటున్నారు. భారత్–పాక్‌ను బెదిరించి కాల్పుల విరమణకు ఒప్పించానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను తిప్పికొట్టే ధైర్యం మోదీకి లేదు. ఇందిరా గాంధీకి ఉన్న ధైర్యంలో మోదీకి కనీసం 50 శాతం ఉన్నా ట్రంప్ వ్యాఖ్యలు తప్పు అని పార్లమెంట్‌లో చెప్పాలి. చైనా, పాకిస్తాన్‌ల కుట్రల గురించి కొన్ని నెలల క్రితమే లోక్‌సభలో హెచ్చరించా. ప్రభుత్వం నా మాట విని ఉంటే ఐదు యుద్ధ విమానాలను కోల్పోయేవాళ్లం కాదు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించగానే కొన్ని సున్నితమైన విషయాలను మన ప్రభుత్వం పాకిస్తాన్‌కు చేరవేసింది. సైనిక స్థావరాలపై దాడులు చేయడం లేదని, ఘర్షణ ఇష్టం లేదని చెప్పేసింది. అలా చేయడం లొంగిపోయినట్లు కాదా? కేవలం 30 నిమిషాల్లో మోదీ ప్రభుత్వం పాకిస్తాన్‌కు లొంగిపోయింది. పాకిస్తాన్ సైనిక స్థావరాలపై, గగనతల రక్షణ వ్యవస్థలపై దాడులు చేయకుండా భారత వైమానిక దళం చేతులు కట్టేసింది ఎవరు? మోదీ ప్రతిష్టను కాపాడే ప్రయత్నం జరిగింది. పహల్గాం బాధితుల రక్తంతో మోదీ చేతులు తడిశాయి. చైనా, పాకిస్తాన్ ఒక్కటి కాకుండా చూడాలని నాలుగు నెలల క్రితం నేను చెబితే చాలామంది ఎగతాళి చేశారు. మన విదేశాంగ విధాన వైఫల్యం వల్ల ఈ రెండు దేశాలు చేతులు కలిపాయి. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌తో పాటు చైనాతోనూ యుద్ధం చేయాల్సి వచ్చింది. పాకిస్తాన్‌కు చైనా అన్ని విధాలుగా సహకరించింది. యు ద్ధంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. పులిని వదిలిపెట్టాలి అనుకుంటే దానికి బంధనాలు విధించడం తగదు. శత్రువును ఓడించాలనుకుంటే పూర్తిగా ఓడించాలి. భారత్–పాక్ యుద్ధం తానే ఆపేశానని ట్రంప్ 29 సార్లు చెప్పారు. ‘మమ్మల్ని మీరు ఆపలేరు, కచ్చితంగా యుద్ధం కొనసాగిస్తాం’ అని ట్రంప్‌తో మన ప్రభుత్వ పెద్దలు ఎందుకు చెప్పలేకపోయారు. మనం ఇప్పుడు ప్రమాదకరమైన దశలో ఉన్నాం. చైనా–పాకిస్తాన్‌ల కూటమిని ఎదుర్కొంటున్నాం. సైనిక శక్తిని సక్రమంగా వాడుకోలేని ప్రధానమంత్రిని మనం ఇక భరించలేం. డొనాల్డ్ ట్రంప్ అబద్ధాలకోరు అని ధైర్యంగా చెప్పలేని ప్రధానిమంత్రిని భరించలేం. ఇందిరాగాంధీ చేసినట్లుగానే.. త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి, ‘పని పూర్తి చేసుకొని రండి’ అని చెప్పే ప్రధానమంత్రి ప్రస్తుతం మనకు కావాలి. పహల్గాం దాడికి సృష్టికర్త అయిన పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్ విందు ఇస్తే మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణం’’


– లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

అమిత్ షా రాజీనామా చేస్తారా?




‘‘నాయకత్వం అంటే ఏదైనా మంచి జరిగితే పేరు ప్రఖ్యాతలు కొట్టేయడం కాదు, తప్పు జరిగితే అందుకు బాధ్యత వహించాలి. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలతోపాటు నా తల్లి సోనియా గాంధీ పెట్టుకున్న కన్నీళ్ల గురించి మాట్లాడుతున్న హోంమంత్రి అమిత్ షా పాకిస్తాన్‌పై యుద్ధం అర్ధాంతరంగా ఎందుకు ఆపారో మాత్రం చెప్పడం లేదు. భద్రతాపరమైన లోపాలే పహల్గాంలో ఉగ్రవాద దాడికి కారణం. పాకిస్తాన్ దాడిలో మనం యుద్ధ విమానాలకు నష్టం జరగకపోతే ఆ విషయం పార్లమెంట్‌లో చెప్పడానికి ప్రభుత్వానికి భయం ఎందుకు? పహల్గాంలో నిఘా వైఫల్యానికి బాధ్యత ఎవరు తీసుకుంటారో చెప్పాలి. అమిత్ షా రాజీనామా చేస్తారా? లేక బాధ్యత వహిస్తారా? గతంలో జరిగిపోయిన విషయాలు పక్కనపెట్టి, ఇప్పుడు జరుగుతున్న దానిపై ప్రభుత్వం స్పందించాలి’’. – కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ వాద్రా

ప్రభుత్వ వైఫల్యానికి గుర్తు



‘‘ఆపరేషన్ సిందూర్ మోదీ ప్రభుత్వ వైఫల్యానికి గుర్తు. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సాకులు చెప్పి తప్పించుకోవద్దు. ఎవరి ఒత్తిడితో కాల్పుల విరమణ పాటించారో చెప్పాలి. భారత విదేశాంగ విధానం పూర్తిగా కుప్పకూలింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన దేశం ఒంటరిగా మిగిలిపోయింది, ఎవరూ మనకు మద్దతుగా రాలేదు. భారతదేశ దౌత్య విధానంలో ఇదొక చీకటి దశ. పుల్వామా, పహల్గాం లాంటి ఉగ్రవాద దాడులు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరణ ఇవ్వాలి’’. – సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్

ప్రజలను పరాజితులను చేశారు




‘‘విశ్వగురు(నరేంద్ర మోదీ) దేశ ప్రజలను పరాజితులను చేశారు. ఆపరేషన్ సిందూర్ ఘోరంగా విఫలమైంది. శత్రువులను పూర్తిగా ఓడించకుండానే యుద్ధం విరమించడం ఏమిటి? విశ్వగురు ప్రధానమంత్రిగా ఉన్న దేశంలో ఉగ్రవాద దాడులు తరచుగా ఎందుకు జరుగుతున్నాయి? ఈ దాడుల నుంచి ప్రభుత్వం గుణపాఠాలు నేర్చుకోవడం లేదు’’. –డీఎంకే ఎంపీ కనిమొళి

పాకిస్తాన్‌కు చేతకాకపోతే.. సాయం చేస్తాం




‘‘పాకిస్తాన్ సహా ప్రపంచమంతటా ఉగ్రవాదం అంతం కావాలని భారత్ కోరుకుంటోంది. పాక్ ఇకనైనా నిద్ర నుంచి మేల్కోవాలి. ఉగ్రవాదంపై కఠినంగా వ్యవహరించాలి. మీకు(పాక్) చేతకాకపోతే చెప్పండి మేము రంగంలోకి దిగుతాం. పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)ను ఎందుకు స్వాధీనం చేసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం ఆశ్చర్యంగా ఉంది. వారు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పాలి. పీఓకే ప్రజలు భారత పరిపాలనా వ్యవస్థలో భాగమయ్యే రోజు ఎంతో దూరంలో లేదు’’. – రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

సమగ్ర నివేదిక విడుదల చేయాలి



‘‘పహల్గాం ఉగ్రవాద దాడికి భద్రతాపరమైన లోపాలే కారణం. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇందుకు బాధ్యత వహించాలి, పదవికి రాజీనామా చేయాలి. భారత్, పాక్ యుద్ధాన్ని ఆపేశానంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెబుతున్నా ప్రధాని మోదీ నోరుమెదపడం లేదు. మూడో వ్యక్తి మధ్యవర్తిత్వాన్ని ప్రభుత్వం అంగీకరించిందా? హౌడీ మోదీ, నమస్తే ట్రంప్ వంటి కార్యక్రమాలతో మనకు ఒరిగిందేమీ లేదు. వాటితో మన వ్యూహాత్మక ప్రయోజనాలకు ఏమాత్రం లాభం లేదు. ప్రపంచ నాయకులతో నరేంద్ర మోదీకి గొప్ప స్నేహ సంబంధాలున్నప్పటికీ పాక్‌తో యుద్ధం సమయంలో ఇండియాకు ఎవరూ మద్దతు ఇవ్వలేదు. పాక్ దురాగతాలను కనీసం అమెరికా కూడా బహిరంగంగా ఖండించలేదు. పాక్ ఓడిపోయే దశలో ఉన్నప్పుడు అనూహ్యంగా కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారు. అమెరికా జోక్యం నిజమేనా? దీనిపై ప్రభుత్వం కచ్చితంగా సమాధానం చెప్పాలి? కార్గిల్ యుద్ధంపై అప్పటి ప్రభుత్వం సమగ్ర నివేదిక విడుదల చేసింది. అదే తరహాలో పహల్గాం దాడిపై మోదీ సర్కార్ నివేదిక ఇవ్వాలి’’. – రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే

మోదీ నరాల్లో రాజకీయాల ప్రవాహం



‘‘ప్రధాని నరేంద్ర మోదీ నరాల్లో సిందూరం ప్రవహించడం లేదు. కేవలం రాజకీయాలే ప్రవహిస్తున్నాయి. నిజంగా సిందూరమే ప్రవహిస్తే పహల్గాం ఉగ్రవాద దాడి జరిగేదే కాదు. మన ప్రజలను బలి తీసుకుంటున్న పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడడం ఏమిటి? ఇదేనా మన విదేశాంగ విధానం?’’

– రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్

కాల్పుల విరమణకు దిగిరాకుంటే ప్రత్యేక పాలస్తీనాకు ఐరాసలో మద్దతిస్తాం

ఇజ్రాయెల్‌కు బ్రిటన్ ప్రధాని స్టార్మర్ వార్నింగ్

లండన్: పాలస్తీనా విషయంలో ఫ్రాన్స్ దారినే బ్రిటన్ సైతం అనుసరిస్తోంది. కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించకుంటే ప్రత్యేక పాలస్తీనా ఏర్పాటుకు వచ్చే సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో జరిగే సర్వప్రతినిధి సభలో ప్రవేశపెట్టే తీర్మానానికి మద్దతిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ దిశగా ఇజ్రాయెల్ చర్యలు తీసుకోకుంటే పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ఆయన ప్రకటించారు. అదే సమయంలో, హమాస్ తన వద్ద ఉన్న బందీలందరినీ తక్షణమే విడుదల చేయాలని కోరారు. కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకం చేసి, ఆయుధాలను అప్పగించాలన్నారు. భవిష్యత్తులో గాజాలో ఎటువంటి భూమిక పోషించబోమనే హామీని హమాస్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇదే సరైన అదను అని స్టార్మర్ తెలిపారు. ఇటీవలే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సైతం రెండు దేశాల విధానానికి మద్దతు ప్రకటించడం గమనార్హం.

న్యాయవ్యవస్థను మోసం చేస్తోంది

- తమిళనాడు సర్కార్‌పై సుప్రీం కన్నెర్ర
- మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై కేసులో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై ఉన్న ‘క్యాష్ ఫర్ జాబ్స్’ఆరోపణల కేసు విచారణను రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యమయ్యేలా చేస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అందుకే ఈ కేసులో నిందితులంటూ 2,300 మంది పేర్లను చేర్చిందని ఆరోపించింది. ఈ ప్రయత్నం న్యాయవ్యవస్థను మోసం చేయడమేనని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం అభివర్ణించింది. బాలాజీపై ఉన్న కేసుల పూర్తి వివరాలను తమ ఎదుట ఉంచాలని, బుధవారం విచారణ కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ‘ఈ మొత్తం వ్యవహారంలో మంత్రితోపాటు మధ్యవర్తులుగా వ్యవహరించిందెవరు? మంత్రి సిఫారసులకు అనుకూలంగా పనులు చేసిన అధికారులెవరు? ఉద్యోగాల ఎంపిక కమిటీ సభ్యులెవరు? నియామక ఉత్తర్వులు వెలువరించిన అధికారులెవరు? వంటి వివరాలను తెలపాలని ధర్మాసనం కోరింది. బాలాజీ జీవిత కాలంలో కూడా విచారణ పూర్తి కాకుండా చేయడమే ప్రభుత్వం ఉద్దేశంగా కనిపిస్తోందని పేర్కొంది. మాజీ మంత్రి, ఆయన అనుచరులు ఉద్యోగాల కోసం డబ్బు చెల్లించమని బలవంతం చేసిన పేదలను లంచం ఇచ్చేవారిగా, ఈ కుంభకోణం కేసులో నిందితులుగా చేర్చారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ‘క్యాష్ ఫర్ జాబ్స్’కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ వేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టుకొట్టివేయడంతో వై.బాలాజీ అనే వ్యక్తి వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వం తీరును ఎండగట్టింది. ఏఐఏడీఎంకే హయాంలో 2011–2015 మధ్య కాలంలో మంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీ ఉద్యోగాలను అమ్ముకున్నారంటూ బాధితులు ఫిర్యాదు చేయడంతో తమిళనాడు పోలీసులు 2018లో మూడు కేసులు నమోదు చేశారు. దీనిపై 2021 ఈడీ మనీల్యాండరింగ్ కేసు నమోదు చేసి, 2023 జూన్‌లో విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేసింది. 2024 ఫిబ్రవరిలో మంత్రి పదవికి రాజీనామా చేశారు. 15 నెలలపాటు జైలులో ఉన్న బాలాజీకి సుప్రీంకోర్టు 2024 సెప్టెంబర్‌లో బెయిలిచ్చింది. అదే నెలలో బాలాజీ మళ్లీ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా ప్రమాణం చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం, బెయిల్ కావాలో పదవి కావాలో తేల్చుకోవాలని కోరడా ఝళిపించడంతో గతేడాది ఫిబ్రవరిలో పదవి నుంచి వైదొలిగారు.

‘ప్రళయ్’ ప్రయోగం విజయవంతం

బాలాసోర్: ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే నూతన ‘ప్రళయ్’ క్షిపణి టెస్ట్–ఫైర్ పూర్తిస్థాయిలో విజయవంతమైనట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపంలో సోమవారం, మంగళవారం ఈ ప్రయోగం నిర్వహించినట్లు తెలియజేసింది. ప్రళయ్ అనేది షార్ట్‌రేంజ్ మిస్సైల్. దాదాపు వెయ్యి కిలోల సంప్రదాయ పేలోడ్లను 500 కిలోమీటర్ల దాకా మోసుకెళ్లగలదు. రక్షణ శాఖకు చెందిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) ఈ క్షిపణిని అభివృద్ధి చేసింది. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్రళయ్‌తో మన సైనిక దళాల సామర్థ్యం మరింత పెరుగుతుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. శత్రువుల నుంచి ఎదురయ్యే ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చని స్పష్టంచేశారు. టెస్ట్–ఫైర్‌లో భాగంగా ప్రళయ్ మిస్సైల్ కనిష్ట, గరిష్ట రేంజ్ సామర్థ్యాన్ని పరీక్షించినట్లు రక్షణ శాఖ పేర్కొంది. వరుసగా రెండు ఫ్లైట్ ట్రయల్స్ నిర్వహించామని, అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని మిస్సైల్ ఛేదించిందని డీఆర్‌డీఓ ప్రకటనలో వివరించింది. ప్రళయ్‌ని పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడం విశేషం.

భారీగా ఓట్లను తొలగిస్తే మేం జోక్యం చేసుకుంటాం

బిహార్‌లో ఓటరు జాబితా సవరణ అంశంలో ఈసీకి స్పష్టంచేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితాలో సమూల ప్రక్షాళన ధ్యేయంగా జరుగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీ స్థాయిలో ఓట్లను తొలగిస్తే మాత్రం తాము కచ్చితంగా జోక్యంచేసుకుంటామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ఓటర్ల గుర్తింపును తనిఖీచేసే ప్రక్రియలో ఆధార్ కార్డ్, ఓటర్ కార్డులను చేర్చాలన్న పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం వాదోపవాదనలను ఆలకించింది. చట్టప్రకారం ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు చేసే అసాధారణ అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ‘‘తమకు ఇప్పటికే ఓటు ఉందని తెలియజేస్తూ ఎనుమరేషన్ దరఖాస్తును 65 లక్షల మంది సమర్పించలేదు. అంతమాత్రం చేత వీళ్లందరి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తారా? వీళ్లంతా ఎవరో ఈసీకి తెలియదా?’’ అని పిటిషనర్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ వాదించారు. దీంతో ధర్మాసనం జోక్యంచేసుకుంది. ‘‘చట్టప్రకారం చర్యలు తీసుకునే అధికారం ఈసీకి ఉంది. ఓటరు ముసాయిదా జాబితాలో ఏవైనా తప్పులుంటే మా దృష్టికి తీసుకుని రండి. ముసాయిదాలో పేర్లు లేకపోవడం కారణంగా ఓట్లను కోల్పోతున్న ఒక 15 మందిని తీసుకొచ్చి మా ముందు నిలబెట్టండి. దరఖాస్తు ఇవ్వనంత మాత్రాన చనిపోయారని ఆ జాబితా నుంచి ఎవరి పేర్లయితే తీసేశారో వాళ్ల వివరాలు మాకు ఇవ్వండి. అలాగే దరఖాస్తు ఇవ్వని కారణంగా జాబితాలో పేరు గల్లంతైన వారి వివరాలూ సమర్పించండి’’ అని సిబల్‌కు ధర్మాసనం సూచించింది.



సాక్షి హైదరాబాద్

బుధవారం : 30 : జూలై : 2025



లొసుగులే వరం.. అక్రమార్కుల పరం

నగరంలోని ప్రభుత్వ స్థలాలు కబ్జాల పాలవుతున్నాయి. రెవెన్యూ యంత్రాంగం నిర్లిప్తతతో 'సర్కారు ల్యాండ్‌బ్యాంక్' కుంచించుకుపోతోంది. -10లో



కిచిడీ.. జీ రెడీ..

ముసురులో వేడివేడి ఆహారాల్లో చెప్పకోదగినది. అప్పటికప్పుడు అందుబాటులో ఉన్న వస్తువులతో సిద్ధం చేసుకోగలిగినది ఏదైనా ఉందంటే.. అది కిచిడీ ఒక్కటే. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

మళ్లీ ట్రెక్ పార్కులోకే వచ్చిన చిరుత



సోమవారం అర్ధరాత్రి ట్రాప్ కెమెరాలో..

మణికొండ: మంచిరేవుల ట్రెక్ పార్కు నుంచి రాందేవ్‌గూడ మిలిటరీ ప్రాంతంలోకి వెళ్లిన చిరుత పులి ఒక రోజులోనే తిరిగి ట్రెక్ పార్కుకే చేరుకుంది. సోమవారం తెల్లవారుజామున రాందేవ్‌గూడలోని మిలిటరీ ప్రాంతంలో రహదారి దాటుతూ అక్కడి సీసీ కెమెరాలో కనిపించిన విషయం తెలిసిందే. అక్కడ దానికి అనువుగా ఉండకపోవటంతో అది తిరిగి సోమవారం అర్ధరాత్రి 12.25 గంటలకు ట్రెక్ పార్కుకు చేరుకుని ట్రాప్ కెమెరాకు చిక్కిందని అటవీ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ప్రశాంతమైన అటవీ ప్రాంతాన్నే చిరుత ఇష్టపడుతుందన్నారు. మిలిటరీ ప్రాంతంలో దానికి ఆహారం లభించకపోవటం, వాహనాల శబ్దాలు అధికంగా రావటంతోనే తిరిగి ట్రెక్ పార్కుకు వచ్చి ఉంటుందని చెప్పారు. ట్రెక్ పార్కులో దానికి ఇష్టమైన అడవి పందుల వంటి ఆహారం లభిస్తుండటం, ఎలాంటి అవాంతరాలు లేకపోవటంతో మరికొన్ని రోజులు ఇక్కడే ఉండే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దానికి సరైన ఆహారం లభించనప్పుడే బోన్‌లో ఎరగా పెట్టిన మేకను తినేందుకు వచ్చి చిక్కే అవకాశం ఉంటుందన్నారు. అప్పటి వరకు ట్రెక్ పార్కును మూసి ఉంచుతామని, ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీసు రోడ్డులో ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాలని లక్ష్మణ్ సూచించారు.

స్థానిక నేతకే జూబ్లీహిల్స్ టికెట్: మంత్రి పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక తమ చేతుల్లో లేదని, ఆ విషయాన్ని ఏఐసీసీ చూసుకుంటుందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. యూసుఫ్‌గూడలోని ఓ హోటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థి ఇదే నియోజకవర్గానికి చెందిన వారై ఉంటారని స్పష్టం చేశారు. బయట నుంచి అభ్యర్థి దిగుమతి ఉండదని తేల్చి చెప్పారు. నియోజకవర్గంలో వివిధ హోదాల్లో ఉన్న వారందరూ ఏడు డివిజన్లలో తిరుగుతూ ప్రతి ఒక్కరినీ కలుస్తూ ఐక్యంగా ముందుకు పోతారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ఇక్కడ కష్టపడి పని చేసే వారిలో ఒకరికి టికెట్ లభిస్తుందని, అధిష్టానం ఆ పేరును సూచించడానికి ప్రతి నాయకుడు ప్రజల వద్దకు వెళ్లి వారి అభిమానాన్ని చూరగొనాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో సానుభూతి పని చేయదని పరోక్షంగా బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు వి.నవీన్‌యాదవ్, అజహరుద్దీన్, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, భవానీ శంకర్ తదితరులు ఉన్నారు.

మూసీలో హైడ్రా ఆపరేషన్

- నదీ గర్భంలో వెలసిన ఆక్రమణల తొలగింపు
- ముగ్గురు ఆక్రమించిన 9.62 ఎకరాలకు విముక్తి

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నదీ గర్భంలో వెలసిన అక్రమ నిర్మాణాలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) మంగళవారం తొలగించింది. చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వరకు పలు ప్రాంతాల్లో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో 9.62 ఎకరాల భూమిని పరిరక్షించింది. తికారం సింగ్ 3.1 ఎకరాలు, పూనమ్ చాంద్ యాదవ్ 1.3 ఎకరాలు, జయకృష్ణ 5.22 ఎకరాల చొప్పున కబ్జా చేశారని, వీటిలో షెడ్లు నిర్మించి వాణిజ్య అవసరాలకు అద్దెకు ఇస్తున్నట్లు హైడ్రా పేర్కొంది. ప్రధానంగా బస్సులు, లారీల పార్కింగ్ కోసం ఇస్తూ నగదు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో పలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేసిన కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. వీటన్నింటినీ హైడ్రా బృందాలు కూల్చేశాయి.



కూల్చివేసిన రేకుల షెడ్డు



లాల్ బజార్‌లోని నాగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలగిరిలో..



కూకట్‌పల్లిలో..





కుత్బుల్లాపూర్ హెచ్‌ఎంటీ హిల్స్‌లో

పాలు పోసి.. పూజలు చేసి..

నగరంలోని నాగదేవత ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మంగళవారం నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలతో కళకళలాడాయి. భక్తులు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలతో చల్లగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో అన్నదానం చేశారు. భక్తుల రద్దీతో నాగమ్మ దేవాలయాలు కిక్కిరిసిపోయాయి.


పానీ.. హోనా..

నగరంలో తాగునీటికి 'మహా' డిమాండ్

- కొత్త నల్లాల కోసం దరఖాస్తుల వెల్లువ
- ఇప్పటికే 14.16 లక్షలు దాటిన కనెక్షన్లు
- పెండింగ్‌లో మరో లక్ష అర్జీలకుపైగా..
- సాధ్యాసాధ్యాలపై జలమండలి దృష్టి

సాక్షి, సిటీబ్యూరో

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం వేగవంతంగా విస్తరిస్తుండటంతో తాగునీటికి డిమాండ్ భారీగా పెరుగుతోంది. నివాస సముదాయాల నుంచి కొత్త నల్లాల కనెక్షన్ల దరఖాస్తులు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికే జలమండలి పరిధిలో వివిధ కేటగిరీలకు సంబంధించి సుమారు 14.16 లక్షల కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. పదేళ్లనాటి నీటి కేటాయింపులతోనే సర్దుబాటుతో సరఫరా చేస్తున్నా ఏ మూలకూ సరిపోని పరిస్థితి నెలకొంది. తాజాగా మరో లక్షకు పైగా నివాస సముదాయాల నుంచి దరఖాస్తులు వచ్చి చేరడంతో నీటి సరఫరా సాధ్యాసాధ్యాలపై జలమండలి దృష్టి సారించింది. ఇప్పటికే భవిష్యత్ అవసరాల కోసం గోదావరి రెండో, మూడో దశ తాగునీటి సరఫరా పథకానికి సిద్ధమైంది.



జలమండలి పరిధి విస్తరణ దశలో..

మహా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఏర్పాటు నేపథ్యంలో తాగునీటి నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జలమండలి నెట్‌వర్క్ 1,450 చదరపు కిలోమీటర్ల వరకు ఉండగా.. తాజాగా 2050 చదరపు కి.మీ వరకూ విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇప్పటికే కోర్ సిటీలో 169.3 చ.కి.మీ, చుట్టుపక్కల 518.9 చ. కి.మీ, ఓఆర్ఆర్ పరిధిలో 762 చ.కి.మీ మేర విస్తరించి ఉంది. మరో 550 చ.కి.మీ నెట్‌వర్క్ కోసం జలమండలి చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ఓఆర్ఆర్ ప్రాజెక్టు-1, 2 దశల కింద తాగునీరు అందిస్తోంది. ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీల పరిధిలోని 190 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తోంది. తాజాగా ఓఆర్ఆర్ వెలుపల కూడా నెట్‌వర్క్ ఏర్పాటు కోసం చర్యలకు ఉపక్రమించింది.

భావి అవసరాల కోసం..

నగర భవిష్యత్ అవసరాల కోసం గోదావరి రెండో, మూడో దశ, మంజీరా తాగునీటి సరఫరా పథకంలో భాగంగా మరో కొత్త పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. గోదావరి ఫేజ్- 2, 3 ప్రాజెక్టు, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్ల నుంచి వేర్వేరుగా దాదాపు 20 ఎంజీడీల అదనపు నీటిని తరలించాలని నిర్ణయించి టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసింది. మంజీరా ఫేజ్- 1,2 సరఫరా పైపులైనుల ఆధునికీకరణతోపాటు మరో కొత్త పైపులైన్ల నిర్మాణ పనుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందిస్తోంది.

జల మండలి పరిధిలో కనెక్షన్లు ఇలా..

పైపులైన్ సైజ్	కనెక్షన్లు
15	13,40,061
20	56,651
25	15,562
40	1,962
50	1,491
63	9
75	353
80	33
100	669
125	1
150	315
200	163
250	35
300	60
400	2
450	3
600	7

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కొనుగోళ్లకు తాకిడి

నేడు బండ్లగూడలో ఇళ్ల కేటాయింపునకు లాటరీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బండ్లగూడ, పోచారం ప్రాంతాల్లో ఉన్న రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఫ్లాట్ల కొనుగోలుకు నగరవాసుల నుంచి తాకిడి పెరిగింది. నాగోలు బండ్లగూడ ప్రాజెక్టులోని 159 ఫ్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోడానికి మంగళవారం చివరి రోజు కావడంతో ఆసక్తి ఉన్నవారు డీడీలతో క్యూ కట్టారు. బండ్లగూడ, పోచారంలలో ఫ్లాట్ల కోసం సుమారు 1,900 మందికి పైగా దరఖాస్తు చేశారు. చివరి రోజు మంగళవారం 600కుపైగా దరఖాస్తులు రావడం విశేషం. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్లలో ఉన్నవారి నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గత తరహాలో కాకుండా లబ్ధిదారులు తమకు నచ్చిన ఫ్లాట్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ఆ ఫ్లాట్ కోసం ఒకరి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే లాటరీలో తీసి వచ్చిన వారికి కేటాయిస్తారు. ఈ కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన లాటరీని బుధవారం ఉదయం బండ్లగూడ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహిస్తారు.

బండ్లగూడలో ఫ్లాట్ కోసం దరఖాస్తు చేసుకుని లాటరీలో రానివారు, పోచారం ప్రాజెక్టులోని ఫ్లాట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు. బండ్లగూడలో ప్రాజెక్టులో ఈఎండీ చెల్లించినట్లు ఇచ్చిన రసీదును పోచారం ప్రాజెక్టులో సమర్పించి అక్కడి ఫ్లాట్ల కొనుగోలుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్ గూడ ప్రాంతాల్లో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో జరిగే ఓపెన్ ఫ్లాట్ల విక్రయానికి సంబంధించిన వేలంలో.. బండ్లగూడలో పొందిన రసీదుతోనే పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఘట్‌కేసర్ పోచారం ప్రాంతంలోని 601 ఫ్లాట్ల కొనుగోలు దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 31 కాగా.. లాటరీ ప్రక్రియ ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గౌతం పేర్కొన్నారు.

కుక్క కావాలా..

స్ట్రీట్ డాగ్స్ ఇక పెట్ డాగ్స్

- పార్కుల్లో కుక్క పిల్లల దత్తత కార్యక్రమాలు
- త్వరలో జీహెచ్ఎంసీ కార్యాచరణ
- వీధికుక్కల సమస్య పరిష్కారమే లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: వీధి కుక్కల సమస్య పరిష్కారానికి బల్దియా చర్యలు చేపట్టనుంది. ఎంపిక చేసిన పెద్ద పార్కుల్లో వీధికుక్క పిల్లల ప్రదర్శన.. దత్తత కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. గతంలో 'మా ఇంటి నేస్తం' పేరిట నిర్వహించిన కార్యక్రమానికి మెరుగులు దిద్ది, కొత్త విధానంలో చేపట్టేందుకు రెడీ అవుతోంది. డా.బి.జనార్దన్‌రెడ్డి కమిషనర్‌గా ఉన్న సమయంలో 'మా ఇంటి నేస్తం' కింద కుక్క పిల్లలను పెంచుకోవాలని ముందుకొచ్చేవారికి వాటిని అందజేసేవారు. సదరు కార్యక్రమానికి మెరుగులు దిద్ది, వాటిని స్ట్రీట్ డాగ్స్‌లా చూడకుండా అందమైన పెట్‌డాగ్స్‌గా పెంచుకునేందుకు కుక్క పిల్లలకు వైద్య పరీక్షలు, టీకాలు తదితరాలు పూర్తయ్యాక పెంపకంపై తగిన అవగాహన వంటివి సైతం కల్పించి దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చే వారికి అందజేయనున్నారు. ఎంపిక చేసిన పార్కుల్లో కెన్నెల్స్‌లో కుక్కపిల్లలను ఉంచి ప్రదర్శన ఏర్పాటు చేసి, అధికారులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి, నిబంధనలకనుగుణంగా నడచుకునేలా అవగాహన కల్పించి దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపే వారికి కుక్క పిల్లలను అందజేయనున్నారు.

కుక్కకాట్లు తగ్గేందుకు..

హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా దేశంలోని పలు నగరాల్లో వీధి కుక్కల సమస్యలున్నాయి. వాటి బారిన పడి ఎందరో.. ముఖ్యంగా చిన్నపిల్లలు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. కోర్టులు సైతం ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తూ ఆయా మున్సిపల్ కార్పొరేషన్లను ప్రశ్నిస్తున్నాయి. ఎంతగా శస్త్రచికిత్సలు చేసినప్పటికీ, కుక్కల సంతతిని అరికట్టడం సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో వీధికుక్కలుగా ఉంటే జనాన్ని కరుస్తుండటంతో వాటిని పెంపుడు జంతువులుగా మారిస్తే సమస్య తగ్గుతుందనే తలంపుతో జీహెచ్ఎంసీ ఈ కార్యక్రమానికి సిద్ధమైంది.



పార్కుల్లో ప్రదర్శనలు

- ఇందులో భాగంగా తొలుత బంజారాహిల్స్‌లోని జలగం వెంగళరావు పార్కులో, తర్వాత కేబీఆర్ పార్కులో కెన్నెల్స్‌లో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. తద్వారా డాగ్ లవర్స్ కుటుంబాలతో సహా వచ్చి ప్రదర్శనలోని కుక్కపిల్లల్లో నచ్చిన దానిని ఎంచుకునేందుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రదర్శనకు అవసరమైన కెన్నెల్స్ ప్రైవేట్ ఏజెన్సీ సహకారంతో సమకూర్చుకోనున్నారు.

ఆరోగ్యంపై వాకబు..

దత్తత తీసుకునేవారికి కుక్కల పెంపకంపై తగిన అవగాహనతో పాటు జంతు సంరక్షణకు సంబంధించిన అంశాల వంటివి వివరించనున్నారు. దత్తత ఇచ్చిన కుక్కలకు అవసరమైన వైద్య పరీక్షలకు జీహెచ్ఎంసీ సహకరించనుంది. నిర్ణీత వ్యవధిలో దత్తత తీసుకున్న ఇళ్లకు వెళ్లడం లేదా ఫోన్ ద్వారా సంప్రదించి దత్తత కుక్కల ఆరోగ్యాన్ని వాకబు చేయనున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ప్రజారోగ్యం, జంతు సంరక్షణల దృష్ట్యా యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా దత్తత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం సిబ్బందితో పాటు స్వచ్ఛంద సేవల సిబ్బంది దత్తత ఇచ్చేందుకు కుక్కపిల్లలకు తగిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యకరంగా ఉన్న వాటినే ప్రదర్శనలో ఉంచుతారు.

- తల్లిపాలు మరచిన, నులిపురుగులు వంటివి లేకుండా తగిన మందులతోపాటు అవసరమైన టీకాలు వేసిన రెండునెలల వయసు దాటిన కుక్కపిల్లలను ప్రదర్శనల్లో ఉంచుతారు. ప్రదర్శన సమయంలో కుక్కపిల్లల్ని దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చేవారికి అక్కడే దరఖాస్తులు అందజేస్తారు. ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ప్రజల సందేహాలకు సమాధానాలిస్తారు. ప్రజలు కుక్కకాట్ల బారిన పడకుండా ఉండేందుకు వీధికుక్కల సంఖ్యను తగ్గించే చర్యల్లో భాగంగా, ఎక్కువమంది ప్రజలు కుక్కల్ని దత్తత తీసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

యూత్ ఓపెన్ రెగట్టాలో రిజ్వాన్‌కు గోల్డ్ మెడల్



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ వేదికగా జరుగుతున్న ఐదో టిస్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. మూడో రోజు పోటీల్లో యువ సెయిలర్ మహ్మద్ రిజ్వాన్ సత్తా చాటాడు. ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ బాలుర విభాగంలో రిజ్వాన్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. పోటీల తొలిరోజు నుంచే అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న రిజ్వాన్ ఈ కేటగిరీలో మరో రేస్ మిగిలుండగానే అగ్రస్థానం సాధించాడు. ఇదే కేటగిరీ బాలికల విభాగంలో తెలంగాణ సెయిలింగ్ అకాడమీకి చెందిన షేక్ రమీజ్ భాను, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ కు చెందిన శ్రింగేరి రాయ్‌పై ఒక్క పాయింట్ ఆధిక్యంలో నిలిచి ఫైనల్ పోరుకు సిద్ధమైంది. ఐఎల్ సిఎ 4 కేటగిరీ బాలుర విభాగంలో నేవీ యాచ్ సెయిలింగ్ క్లబ్ కు చెందిన రమాకాంత్ ఆరు పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఇదే కేటగిరీలో బాలికల విభాగంలో ఆస్థా పాండే అగ్రస్థానంలో నిలిచింది. 420 మిక్సిడ్ కేటగిరీలో తెలంగాణ సెయిలింగ్ అకాడమీకి చెందిన తనూజా కామేశ్వర్, శ్రవణ్ కత్రావత్ 10 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

యువకుడి ఆత్మహత్యకు కారణమైన గ్యాంగ్ సభ్యుల అరెస్ట్

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఖైరతాబాద్ పోలీసులు ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు. ఖైరతాబాద్‌లో గజ్జలమ్మ ఆలయం వద్ద బ్యానర్ విషయంలో ముఖేష్, సునీల్ మధ్య గొడవ జరిగింది. దీంతో ఆదివారం రాత్రి వీరబోయిన ముఖేష్ కుమార్‌పై వికేత్, ఫత్తు, సునీల్‌లు దాడికి పాల్పడి బెదిరించారు. దీంతో ముఖేష్ కుమార్ అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికంగా సంచలనం రేపిన ఈ కేసును ఖైరతాబాద్ పోలీసులు ఛాలెంజింగ్‌గా తీసుకొని ప్రధాన నిందితుడు నాగిశెట్టి వికేత్, రాజ్‌ధర్ కటియా ధరమ్ రాజ్ ఫత్తులను సంగారెడ్డి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదుచేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి జుడీషియల్ కస్టడీకి తరలించినట్లు సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌లు తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో ముగ్గురి అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో తమ సలహాల మేరకు పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ ఎర వేసి, నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.44 లక్షలు కాజేసిన కేసులో ముగ్గురు నిందితులను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ స్కామ్ సూత్రధారులు దుబాయ్‌లో ఉన్నట్లు గుర్తించామని డీసీపీ దార కవిత మంగళవారం ప్రకటించారు. దుబాయ్‌లో కేంద్రంగా పని చేస్తున్న ముఠా వివిధ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ అంటూ ప్రచారం చేస్తోంది. దీనికోసం అవిస్టా స్టడీ గ్రూప్–డబ్ల్యూ పేరుతో ఓ సంస్థలు ఏర్పాటు చేసి, అనేక మందిని నకిలీ ట్రేడింగ్ అడ్వైజర్లుగా పెట్టుకుంది. వీళ్లు ఫోన్ కాల్స్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా పలువురికి ఎర వేసి, భారీ లాభాలు ఆశ చూపి, వీరి యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టించి, నిండా ముంచుతారు. నగర వాసి బదిలీ చేసిన మొత్తాలు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన మిలింద్ మనోహర్ నార్కర్, రానక్ జగదీష్ పటేల్, షేక్ ఇంతియాజ్ అహ్మద్ సిద్ధిఖీలకు పేర్లతో తెరిచిన బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయి. ఈ కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం ఈ విషయాన్ని గుర్తించింది. ఈ ముగ్గురినీ పట్టుకుని విచారించగా నేరం అంగీకరించారు. కమీషన్లకు ఆశపడి ఈ పని చేసినట్లు బయటపెట్టారు. మిలింద్ మనోహర్ ఇక్కడ వసూలైన సొమ్మును క్రిప్టో కరెన్సీగా మార్చి దుబాయ్‌కి పంపడంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు.

డీమార్ట్ పేరుతో నకిలీ యాప్...

నిత్యావసర వస్తువులు ఖరీదు చేసే గృహిణులే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు డీమార్ట్ పేరుతో నకిలీ యాప్ రూపొందించారు. రూ.298 వెచ్చించి సరుకులు ఖరీదు చేయాలని భావించిన నల్లకుంట మహిళ రూ.1,17,521 నష్టపోయారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ స్టెప్ కౌంటర్ అనే యాప్‌లో గత నెల 1న డీమార్ట్ పేరుతో ఉన్న యాడ్ చూశారు. ఈ యాప్ ద్వారా ఖరీదు చేస్తే భారీ డిస్కౌంట్లు లభిస్తాయని ఉండటంతో ఆసక్తి చూపారు. ఆ ప్రకటనలో ఉన్న లింక్‌ను క్లిక్ చేయడంతో యాప్ బాధితురాలి ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయింది. దీన్ని ఓపెన్ చేసిన ఆమె అందులో కోరినట్లు ఇతర వివరాలతో పాటు బ్యాంకు ఖాతా అంశాలు జోడించింది. ఆపై రూ.298 వెచ్చించి కొన్ని నిత్యావసరాలు ఖరీదు చేసింది. అయితే ఈ వివరాలు తస్కరించిన సైబర్ నేరగాళ్లు వాటితో అనధికార లావాదేవీలు చేసి రూ.1,17,521 కాజేశారు. దీనిపై ఆమె బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేయగా... కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆ మొత్తాన్ని బిల్లులో పేర్కొనమని అన్నారు. అయినప్పటికీ ఇటీవల వచ్చిన బిల్లులో ఆ మొత్తం చెల్లించాలని ఉండటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోపక్క ట్రేడింగ్ పేరుతో టోలిచౌకికి చెందిన వృద్ధుడి (80) నుంచి సైబర్ నేరగాళ్లు రూ.19 లక్షలు కాజేశారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇండియన్ స్పెర్మ్‌టెక్ సంస్థ సీజ్

ఆరుగురి అరెస్టు



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

రాంగోపాల్‌పేట్: అహ్మదాబాద్ ప్రధాన కార్యాలయంగా రెజిమెంటల్‌బజార్‌లో కొనసాగుతున్న ఇండియన్ స్పెర్మ్‌టెక్ సంస్థను గోపాలపురం పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. గత నెలన్నర కిందట ఇక్కడ ప్రారంభించిన ఈ సంస్థ యువత నుంచి అనధికారికంగా స్పెర్మ్ సేకరిస్తుండటంతో ఈ నెల 25వ తేదీన రాత్రి టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, ఎస్‌ఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మరోమారు పోలీసులు ఈ కేంద్రానికి వెళ్లి ఆరుగురిని అరెస్టు చేశారు. సెంటర్ మేనేజర్ పంకజ్ సోని, మైసూర్‌కు చెందిన క్యాషియర్ సంపత్, విశాఖపట్టణం కంచరపాలెంకు చెందిన ఉద్యోగి శ్రీను, ఇండోర్‌కు చెందిన జితేందర్ కుమావత్, విజయనగరానికి చెందిన బ్రోకర్ ఎల్.శివ, మరో బ్రోకర్ మణికంఠలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గోపాలపురం పోలీసులతో పాటు, రెవెన్యూ, వైద్యాధికారులు, క్లూస్ టీమ్ సిబ్బంది కూడా ఇండియన్ స్పెర్మ్ టెక్ సంస్థపై దాడులు చేశారు. ఈ సంస్థ గత నెలన్నర కిందటే ఇక్కడ తెరిచినప్పటికీ ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. అలాగే ఇక్కడ పనిచేసే టెక్నీషియన్లకు ఎలాంటి అనుభవంతో పాటు సర్టిఫికెట్లు లేకపోవడాన్ని పోలీసులు గుర్తించారు. అలాగే దాతలకు సంబంధించిన ధరఖాస్తులు, దీనికి సంబంధించిన పలు రికార్డులతో పాటు, స్పెర్మ్ సేకరించే బాక్సులు స్వాధీనం చేసుకున్నారు.

టోకెన్లు ఇచ్చి సేకరణ

స్పెర్మ్ సేకరణ కోసం ఈ సంస్థ కొంత మంది బ్రోకర్లను నియమించుకుంది. ప్రతి వ్యక్తి దగ్గర ఆధార్ కార్డులు తీసుకుని..టోకెన్ ఇచ్చి స్పెర్మ్‌ను సేకరిస్తోందని తేలింది. కొద్ది రోజుల్లోనే ఈ విషయం చాలా మందికి తెలియడంతో ఇక్క రద్దీ పెరిగింది. దీంతో వచ్చిన వాళ్లకు టోకెన్లు అందించి, షిఫ్టుల వారిగా పిలిపించి వారి నుంచి స్పెర్మ్ సేకరిస్తున్నారు. దాతలకు రూ.800 నుంచి వెయ్యి ఇచ్చారు. ఒకమారు సేకరించిన వ్యక్తి నుంచి మరోమారు సేకరించడం లేదని తెలిసింది. సేకరించిన స్పెర్మ్‌ను



ఇండియన్ స్పెర్మ్‌టెక్ కార్యాలయం



దాతల నుంచి సేకరించిన స్పెర్మ్ భద్రపరిచే క్యాన్

ప్రత్యేక బాక్సుల్లో మైనస్ 260 డిగ్రీల ఉష్ణోగ్రతలో భద్రపరిచి అహ్మదాబాద్‌కు విమానంలో పంపిస్తున్నారు. అక్కడ ఇండియన్ స్పెర్మ్‌టెక్ ప్రధాన కార్యాలయానికి తరలిస్తే అక్కడి నుంచి అవసరం ఉన్న ఆస్పత్రులకు వారు చేరవేసేవారు.

'సృష్టి'కి సంబంధం లేదు

సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లో సరోగసి పేరుతో పిల్లల అక్రమ రవాణా కేసుకు, ఇండియన్ స్పెర్మ్‌టెక్ సంస్థ కేసుకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు తెలిపారు. యాదృశ్చికంగా రెండు ఘటనలు ఒకే రోజు జరుగడం, రెండు కేసులకు పోలిక ఉండటంతో చాలా మంది ఒకదానికి ఒకటి సంబంధం ఉందనుకున్నారు.





పెళ్లి చేసుకుంటానని మోసగించిన వైద్యుడిపై కేసు

ఫిలింనగర్: పెళ్లి జరిగిన విషయాన్ని దాచిపెట్టి..తనతో సహజీవనం చేయడమే కాకుండా పెళ్లి ఎప్పుడు చేసుకుంటావని అడగడానికి వెళ్లిన తనపై దౌర్జన్యం చేసి ఫోన్ ధ్వంసం చేశారంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ వైద్యుడిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–92లోని ఓ ఆస్పత్రిలో బాచుపల్లికి చెందిన డాక్టర్ రాజేందర్ రెడ్డి ఆర్థోపెడిక్ వైద్యుడిగా పనిచేస్తున్నారు. 2024 సెప్టెంబర్‌లో మణికొండ పంచవటి కాలనీకి చెందిన డిజైనర్ (28)తో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. ఇద్దరూ కలిసి మణికొండలోని డిజైనర్ ఇంట్లోనే సహజీవనం చేస్తున్నారు. డాక్టర్ రాజేందర్‌రెడ్డికి అంతకు రెండేళ్ల క్రితమే వివాహం కాగా, ఆ విషయాన్ని దాచిపెట్టి డిజైనర్‌తో సహజీవనం చేస్తున్నాడు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటామని సదరు యువతి ఆస్పత్రికి వెళ్లి రాజేందర్‌రెడ్డిని నిలదీసింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య తీవ్ర గొడవ జరగగా ఆమెను కొట్టడమే కాకుండా ఫోన్‌ను నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. ఎటూ వెళ్లకుండా కొద్దిసేపు ఆమెను అడ్డగించి వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు డాక్టర్ రాజేందర్‌రెడ్డిపై బీఎన్ఎస్ సెక్షన్ 79, 127 (2), 115 (2), 324 (4) కింద కేసు నమోదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన్య ప్రాణులను కాపాడుకోవాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అటవీ శాఖ అధికారులు

దూలపల్లి: జాతి సంపదైన వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అటవీ శాఖ అధికారిణి సి.సువర్ణ అన్నారు. మంగళవారం దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింట్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలను అందించారు. అనంతరం విశ్రాంత ఉప అటవీ సంరక్షణాధికారి శంకరన్‌కు సువర్ణ, ఐఎఫ్ఎస్ అధికారి ఎలుసింగ్ మేరు జీవిత కాల సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ సంపదైన వృక్షాలు, వన్యప్రాణులను కాపాడటంలో అటవీ సిబ్బంది సేవలు ఎనలేనివన్నారు. కవ్వాల్ వైల్డ్ లైఫ్ తరపున ప్రచురించిన పక్షులు, సీతాకోక చిలుకల వైవిధ్యంపై పుస్తకాలను ఆవిష్కరించారు. అదే విధంగా కవ్వాల్ వన్యప్రాణి విభాగం తరపున అటవీ సిబ్బందికి నగదు పురస్కారాలను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత అధికారి, ఎన్‌టీసీఏ మెంబర్ అనుప్‌కుమార్ నాయక్, అదనపు అటవీ ముఖ్య సంరక్షణ అధికారులు రత్నాకర్, సునీత భగవత్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శాంతారామ్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ సునీత హిరేమత్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ డాక్టర్ ఎస్‌జే ఆషా, ఐఎఫ్ఎస్ అధికారులు రమేష్, ప్రవీణ్, వినయ్‌కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడికి రిమాండ్



దినేశ్

రాజేంద్రనగర్: రాజస్థాన్ నుంచి ఓపియం మాదకద్రవ్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ యువకుడిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 755 గ్రాముల నల్ల మందు, ఒక ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన దినేశ్ (28) నగరానికి వలస వచ్చి అత్తాపూర్ పాండురంగానగర్ ప్రాంతంలో నివాసముంటూ చిన్నపాటి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రాజస్థానీలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో తరుచూ ఓపియం సేవిస్తుంటారు. నగరంలో ఈ డ్రగ్ దొరకకపోవడంతో మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రహించిన దినేశ్ రాజస్థాన్ నుంచి డ్రగ్ తీసుకొచ్చి ఇక్కడ రాజస్థానీలకు విక్రయించేవాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దినేశ్‌పై నిఘా పెట్టింది. సోమవారం రాత్రి పాండురంగానగర్‌లో ఓపియం విక్రయించేందుకు వెళ్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుని వద్ద నుంచి 755 గ్రాముల ఓపియం, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3.50 లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితున్ని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం

కుమార్తెలను స్కూల్ బస్సు ఎక్కించి వస్తుండగా ఘటన



శాలిని(ఫైల్)

గచ్చిబౌలి/మణికొండ: కుమార్తెలను స్కూల్ బస్సు ఎక్కించి తిరిగి వస్తుండగా వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఓ ట్యాంకర్ స్కూటీని ఢీ కొట్టడంతో ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కందుకూరు మండలం, కొండముదుసుపాలెంకు చెందిన దంపతులు వెంకటేశ్వర్లు, ఇరువురి శాలిని(38) మణికొండలోని బీఆర్‌సీ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలిద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. మూడు రోజుల క్రితం పిల్లలతో కలిసి వైజాగ్ వెళ్లగా వెంకటేశ్వర్లు విజయవాడలో ఆగిపోయారు. కుమార్తెలను తీసుకొని శాలిని సోమవారం రాత్రి మణికొండకు వచ్చింది. భారతీయ విద్యాభవన్‌లో పెద్ద కుమార్తె సుదీక్ష 9వ తరగతి, చిన్న కుమార్తె సహస్ర 4వ తరగతి చదువుతున్నారు. మంగళవారం ఉదయం స్కూల్ బస్సు వెళ్లిపోవడంతో ఇద్దరు కూతుళ్లను స్కూటీపై తీసుకెళ్లి ముందు స్టాప్‌లో బస్సు ఎక్కించింది. ఉదయం 8.45 గంటలకు స్కూటీపై తిరిగి వస్తుండగా మణికొండలోని సుందర్ గార్డెన్ ఎదురుగా వెనక నుంచి అతి వేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ స్కూటీని ఢీ కొట్టింది. కింద పడిపోయిన శాలిని తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతి వేగంగా ట్యాంకర్ నడపడం వల్ల ప్రమాదం జరిగిందని మృతురాలి సోదరుడు లోకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన జరిగిన రోడ్డులో సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు సేకరిస్తున్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కారు

విశ్రాంత సైంటిస్ట్ మృతి



మృతుడు వెంకటేశ్వరరావు

ముదినేపల్లి రూరల్: పోల్‌రాజ్ డ్రెయిన్‌లో కారు దూసుకుపోయిన ఘటనలో విశ్రాంత సైంటిస్టు మృతిచెందిన ఘటన ఏపీలోని ఏలూరు జిల్లా ముదినేపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. మండవల్లి మండలం లింగాలకు చెందిన చందు వెంకటేశ్వరరావు(63) నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్ఆర్ఎస్ఏ)లో శాస్త్రవేత్తగా పనిచేస్తూ ఇటీవలే ఉద్యోగ విరమణ చేసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. లింగాల గ్రామంలోని బంధువుల ఇంట జరిగే వివాహం నిమిత్తం హైదరాబాద్ నుంచి భార్య రాణితో కలసి వస్తున్నారు. పోల్‌రాజ్ వంతెన వద్ద డైవర్షన్ రోడ్డులో ప్రయాణించాల్సి ఉండగా, డైవర్షన్ గమనించకపోవడంతో పోల్‌రాజ్ డ్రెయిన్‌లోకి కారు దూసుకుపోయింది. ప్రమాద సమయంలో పక్కనే చెరువులపై పనిచేసే కూలీలు ప్రమాదాన్ని గమనించి కాల్వలోకి దూకి రాణిని కాపాడారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే కైకలూరు సీఐ వి.రవికుమార్, స్థానిక ఎస్ఐ వీరభద్రరావు సంఘటన స్థలానికి చేరుకుని వెంకటేశ్వరరావు మృతదేహాన్ని బయటకు తీసి, గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాంట్రాక్టర్ డైవర్షన్ బోర్డులు పెట్టకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మృతుడు వెంకటేశ్వరరావుకు ముగ్గురు కుమార్తెలు కాగా.. వారంతా అమెరికాలో స్థిరపడ్డారు.

పోలీసుల విధులు అడ్డుకున్న యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో రావడమే కాకుండా వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులను అసభ్యపదజాలంతో దూషించి..విధులకు ఆటంకం కలిగించిన ర్యాపిడో డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బైరామల్‌గూడకు చెందిన ర్యాపిడో డ్రైవర్ పి.పృథ్వీసాయితేజ (26) బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 1/10లోని శ్రీకృష్ణా జ్యువెలర్స్ ముందు రాంగ్‌రూట్‌లో వస్తుండగా అప్పటికే అక్కడ బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రాంగ్‌రూట్, సైలెన్సర్ సౌండ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో సాయితేజ రాంగ్‌సైడ్ డ్రైవ్ చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులను దూషిస్తూ వారి విధులను అడ్డుకుంటూ బ్రేస్ అద్దాలు పగులగొట్టి తీవ్ర న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకోగా వారి పట్ల కూడా అభ్యంతరకరమైన రీతిలో ప్రవర్తించాడు. పోలీసులను ఫోటోలు, వీడియోలు తీస్తూ ఘర్షణకు దిగాడు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు పృథ్వీసాయితేజపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిసార్ట్స్‌లో నటి కల్పిక హంగామా!

మొయినాబాద్: నగర శివారు మొయినాబాద్ పరిధిలోని బ్రౌన్‌టౌన్ రిసార్ట్స్‌లో సినీ నటి కల్పిక హల్‌చల్ చేసినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం ఇక్కడికి వచ్చిన కల్పిక రూంలోకి దిగిన వెంటనే సిగరెట్లు కావాలంటూ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. కాగా ఇటీవల నగరంలోని ఓ పబ్‌లో గొడవ చేసిన ఆమెపై కేసు నమోదైంది. పోలీసులు ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి తప్పించుకోవడానికి రిసార్టుకు వెళ్లినట్లు సమాచారం. కాగా బ్రౌన్‌టౌన్ రిసార్ట్స్‌లో జరిగిన హంగామాపై సినీనటి కల్పిక వివరణ ఇచ్చింది. రిసార్ట్స్‌లో జరిగిన విషయాలను వీడియో ద్వారా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. వివిధ కేసుల్లో పోలీసులు తన వెంట పడుతున్నారని రిసార్ట్స్‌కు వెళ్లానని.. అక్కడ సిగరెట్ తేవాలని సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదని వీడియోలో పేర్కొంది. రిసార్ట్స్ సిబ్బంది తన పట్ల దురుసుగా ప్రవర్తించారని తెలిపింది. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి మీడియాకు తెలిపారు.

ఐదో అంతస్తు నుంచి జారిపడి..

- వ్యక్తి దుర్మరణం
- మెటీరియల్ యంత్రాన్ని గమనిస్తుండగా ప్రమాదం



సంతోష్ మృతదేహం

శంకర్‌పల్లి: మనం ఒకటి తలిస్తే.. విధి మరొకటి తలచిందంటారు. అచ్చం అలాంటి సంఘటనే మంగళవారం శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. తన ఒక్కగానొక్క అల్లుడిని మంచి స్థాయిలో చూద్దామని కలలుగన్న మామకు దుఃఖమే మిగిలింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తిరుమలపూర్‌కి చెందిన రాజు భవన నిర్మాణ కాంట్రాక్టర్. ఆయనకి ఒక్కగానొక్క కుమార్తె సంగీత ఉంది. ఆమెని 2021లో చౌడపూర్ మండలం లింగంపల్లి తండాకి చెందిన నేనావత్ సంతోష్(33)కి ఇచ్చి వివాహం చేయగా.. వారికి రెండేళ్ల పాప ఉంది. మొదటి నుంచి సంతోష్ ఫార్మసీ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తక్కువ జీతానికి పని చేస్తున్నాడని, తనని మంచి స్థాయిలో నిలపెడుదామని సంతోష్ మామ నిర్ణయించుకున్నాడు. తన కన్‌స్ట్రక్షన్ విభాగంలోకి రెండు నెలల క్రితమే తీసుకొచ్చి సూపర్‌వైజర్‌గా చేశాడు. మంగళవారం సంతోష్ భవనం 5వ అంతస్తులో విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడి నుంచి మెటీరియల్ తీసుకొచ్చే యంత్రాన్ని గమనిస్తూ కిందికి చూశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే పక్కనే ఉన్న ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అల్లుడిని ఉన్నత స్థాయిలో చూద్దామని ఆశపడిన మామకు చివరికి కన్నీళ్లే మిగిలాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు తదితర అంశాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు సీఐ స్పష్టం చేశారు.

జెనరేటివ్ ఏఐ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌పై అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని భోజిరెడ్డి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జెనరేటివ్ ఏఐ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ ఏటీఏఎల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.శ్యామచంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది విద్య, పరిశ్రమలు, సమాజంపై చూపుతున్న ప్రభావాన్ని వివరించారు. అధ్యాపకులు ఏఐ ఆధారిత పఠన, పరిశోధన విధానాలను ఆచరణలోకి తేవాలని పిలుపునిచ్చారు ముఖ్య అతిథిగా హాజరైన సన అఫ్రీన్ మాట్లాడుతూ ఏఐ సాంకేతికత విద్య, పరిశోధన, ఆవిష్కరణలపై చూపిస్తున్న ప్రభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డా.వి.సుధ, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా.సుజాతా గంగాధర్, హెచ్ఆర్ అకడమిక్ డైరెక్టర్ డా.గ్రేసీ సైలశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ దయాకర్‌రెడ్డి, హెచ్ఓడీ ఎం.వినోద్, కోఆర్డినేటర్లు డా.పి.సుమలత, డా.పి.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖైరతాబాద్ బంద్

ముకేష్ బాబు మృతికి సంతాపంగా ఖైరతాబాద్‌లో క్యాండిల్ ర్యాలీ



ఖైరతాబాద్: గ్యాంగ్ సభ్యుల దాడి, బెదిరింపుల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో మృతుడు ముకేష్ బాబు సంతాపంగా మంగళవారం రాత్రి ఖైరతాబాద్‌లో స్థానికులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఖైరతాబాద్ బడా గణేష్, మార్కెట్ రోడ్డు, లక్ష్మీనగర్, శాఖ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున స్థానికులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం వరకు బంద్

యువకుడి ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఖైరతాబాద్ వ్యాప్తంగా మధ్యాహ్నం వరకు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పదోన్నతి కౌన్సెలింగ్ లిస్టులో ముందుంచాలి



మాట్లాడుతున్న బేతి శ్రీనివాస్‌రెడ్డి

హిమాయత్‌నగర్: 2002 డీఎస్సీ ఉద్యోగుల కంటే 2002 స్కూల్ అసిస్టెంట్ ప్రమోటీస్‌ను పదోన్నతి కౌన్సెలింగ్ లిస్టులో నోషనల్ సీనియార్టీ ఇస్తూ ముందుంచి న్యాయం చేయాలని 2002 స్కూల్ అసిస్టెంట్ ప్రమోటీస్ ఫోరం కన్వీనర్ బేతి శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి పి.రాములుతో కలిసి ఆయన మాట్లాడారు. 2002 డీఎస్సీ వారిని సీనియార్టీ లిస్టులో ముందు పెట్టడం వల్ల తమకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించలేదని వాపోయారు. ఫోరం కో-కన్వీనర్లు పి.శ్రీనివాసులు, నారప్ప రెడ్డి, నరేందర్ రెడ్డి, పి.తిరుపతయ్య, పి.రాంమోహన్ రెడ్డి, ఎన్.నారాయణ రావు పాల్గొన్నారు.

మహాలయ పక్ష ప్రత్యేక 'సప్త మోక్ష క్షేత్ర' యాత్ర

హిమాయత్‌నగర్: పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టినట్లు ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్‌జీ తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్, మేనేజర్ యాకేశ్‌తో కలిసి యాత్రకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించి మాట్లాడారు. 15 రోజుల పాటు జరిగే మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర సెప్టెంబర్ 9న ప్రారంభం అవుతుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు. గతంలో ఇండియన్ రైల్వేస్ టూర్ టైమ్స్ ప్యాకేజీకి విశేష స్పందన లభించిన నేపథ్యంలో ఈ యాత్రకు నడుం బిగించిందన్నారు. ఈ యాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధపూర్, మథుర, అయోధ్య, ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ వంటి పవిత్ర పుణ్య క్షేత్రాలను కవర్ చేయనున్నామని చెప్పారు. గతంలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి 650 మంది యాత్రికులతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఫోన్: 93550 21516.

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు

అమీర్‌పేట: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నివాసానికి వెళ్లే రోడ్డు మార్గంలోని 250 గజాల స్థల వివాదం ప్రైవేటు, ప్రభుత్వం మధ్య చాలా కాలం నుంచి కొనసాగుతోంది. అయితే స్థలం ప్రభుత్వానికి చెందిందని సూచిస్తూ రెవెన్యూ అధికారులు రెండు చోట్ల బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే స్థలంపై కన్నేసిన కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే బోర్డు తొలగించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు మంగళవారం తిరిగి బోర్డులను ఏర్పాటు చేయించారు. స్థలం పక్కన ఉన్న చెరుకు జ్యూస్ బండిని సైతం తొలగించినట్లు అమీర్‌పేట తహసీల్దార్ పద్మసుందరి తెలిపారు. స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

అమీర్‌పేట: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. యూసుఫ్‌గూడలోని ఓ బట్టల షాపులో షిండే అఖిల్(20) యువకుడు సేల్స్ బాయ్‌గా, హెచ్.రవి (19) బంగారు దుకాణంలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు కలిసి మహారాష్ట్రలోని బార్లీ జిల్లా కేంద్రం నుంచి గంజాయి తీసుకువస్తున్నారనే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులు సోమవారం బేగంపేట రైల్వే స్టేషన్‌లో రైలు దిగి అక్కడ ఎంఎంటీఎస్ రైలు ఎక్కి నేచర్‌క్యూర్ ఆసుపత్రి స్టేషన్‌లో దిగి బీజేఆర్‌నగర్‌కు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని విచారణ కోసం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని నాగదేవత గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో భక్తులు



జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలోని నాగదేవత ఆలయంలో భక్తుల పూజలు



జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో హోమం చేస్తున్న అర్చకులు



ఘనంగా నాగుల పంచమి వేడుకలు

బంజారాహిల్స్: నాగుల పంచమి సందర్భంగా ఆలయాల వద్ద మంగళవారం భక్తుల సందడి కనిపించింది. శ్రావణ మాసంలో వచ్చే పంచమిని నాగుల పంచమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నాగుల పంచమి రోజు నాగదేవత ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తే ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసమని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని నాగదేవతా సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అర్చకులు గంగాధర శర్మ తెలిపారు. నాగుల పంచమి సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు రమేష్, ఎల్లయ్య, చుక్కయ్య, వెంకట్ తదితరులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నాగార్జున నగర్‌లోని అమ్మవారి ఆలయంలో ఉన్న పుట్ట వద్ద భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. నందినగర్ మైదానంలో ఉన్న పుట్ట వద్ద బస్తీవాసులు పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయం ఆవరణలో కొలువుదీరిన నాగదేవత అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు.



నాగార్జున నగర్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

జూబ్లీహిల్స్ కార్పొరేటర్ హౌస్ అరెస్టు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌ను మంగళవారం ఫిలింనగర్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ గుడికి భక్తులు బోనం సమర్పించేందుకు సిద్ధం కాగా అక్కడికి నేతలు చేరుకోకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇందులో భాగంగానే కార్పొరేటర్ వెంకటేష్‌ను ఫిలింనగర్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వెంకటేష్‌కు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనకు సీఎం రేవంత్‌రెడ్డి కొత్త అర్థం చెబుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని దుయ్యబట్టారు. పెద్దమ్మ గుడి నిర్మించే వరకు బీఆర్ఎస్ తరఫున పోరాటం చేస్తామని, అక్రమ నిర్బంధాలతో ఎక్కువ రోజులు పరిపాలన చేయలేరని హెచ్చరించారు.



కార్పొరేటర్ వెంకటేష్‌కు సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్సీ దాసోజు

ఘనంగా వన మహోత్సవం

వెంగళరావునగర్: పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటాలని టీజీఎస్‌పీ యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బెటాలియన్ కమాండెంట్‌తో పాటు పలువురు అధికారులు ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో తీవ్రమైన మార్పులు వస్తున్నట్లు చెప్పారు. ఈ మార్పులను తట్టుకుని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే తప్పనిసరిగా మొక్కలు పెంచాలన్నారు. నాటిన మొక్కలను కాపాడాల్సిన బాధ్యత మనదేనన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ కేవీవీ ప్రసాద్, అప్పారే, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మురళీకృష్ణ

నాట్కో పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

రహమత్‌నగర్: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బోరబండ నాట్కో ప్రభుత్వ పాఠశాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సూచించారు. బోరబండ నాట్కో పాఠశాల పీఎం స్కూల్స్ రైజింగ్ ఆఫ్ ఇండియా(పీఎంసీ) ద్వారా ఉత్తమ పాఠశాల గుర్తింపు పొందిన సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ఏటీఎల్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు పెద్ద సంఖ్యలో చదువుకునే నాట్కో పాఠశాలకు ఉపాధ్యాయుల కృషితోనే జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయం అన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం అన్నారు. కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్, డిప్యూటీ డీఈఓ శ్యామూల్‌రాజ్, నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఎస్‌యూబి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, హెచ్ఎం గీత, ఇన్‌చార్జి ప్రేమవతి, అద్దంకి దయాకర్ సతీమణి నాగమణి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

రాత్రివేళ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తాం

సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో ఓ గ్యాంగ్ సభ్యుల ఆగడాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనతో ఖైరతాబాద్‌లో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మంగళవారం సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి నేతృత్వంలో స్థానికుల సమన్వయ సమావేశం నిర్వహించారు. కొంత కాలంగా ఖైరతాబాద్‌లో కొంతమంది అనేక అరాచకాలు, సెటిల్‌మెంట్లు, దాడులకు పాల్పడుతున్న ఘనలు చోటుచేసుకుంటున్నాయని, దర్జాగా దాడులకు పాల్పడుతున్నా పోలీసులు స్పందించడం లేదని, ఇటీవల ఆత్మహత్యకు దారితీసిన ఘటన నేపథ్యంలో ఖైరతాబాద్ ప్రాంతవాసులంతా ఏకతాటిపైకి వచ్చి స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితులకు కారణమైన వారిని కఠినంగా శిక్షించకపోతే తామంతా కలిసి ఎదుర్కొంటామని తెలిపారు. స్థానికంగా పలు ప్రాంతాల్లో రాత్రిళ్లు వీధుల్లో తిష్ట వేసి మద్యం తాగి, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాత్రివేళ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు రోడ్లపై రాత్రి వేళలో ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన వారిని అదుపులోకి తీసుకుంటామని అన్నారు. ఖైరతాబాద్‌లో బ్యానర్లు కట్టకుండా సహకరిస్తామని అంగీకారం తెలిపారు. ఖైరతాబాద్ బడా గణేష్ చౌరస్తాలో పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని సూచించారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.45, నల్లవంకాయ రూ.23, పొడుగువంకాయ రూ.23, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.55, బజ్జీ మిర్చి రూ.65, క్యాప్సికం రూ.55, పచ్చికాకరకాయ రూ.26, పందిరి బీర రూ.40, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండకాయ రూ.23, గుండు బీన్నీస్ రూ.60, గింజచిక్కుడు రూ.55, గోకరకాయ రూ.47, కీర రూ.23, దోసకాయ రూ.13, బీట్‌రూట్ రూ.28, ఉల్లిగడ్డ రూ.22, ఆలుగడ్డ రూ.23, చామగడ్డ రూ.26, మొరంగడ్డ రూ.28, కందగడ్డ రూ.45, క్యాలిఫ్లవర్ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, మునగకాయ రూ.4, మామిడికాయ రూ.35, ముల్లంగి రూ.4-5, ఉల్లిపొరక రూ.35 ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

డిసెంబర్ 13న సెయింట్ థెరీసా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పంజగుట్ట: సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిసా పాఠశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో 1968 నుంచి 2025లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని సెయింట్ థెరీసా పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు వై.చక్రధర్ యాదవ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం కార్యదర్శి కె.ధనశేఖర్ రెడ్డి, కోశాధికారి సి.శ్రీనివాస్ కుమార్‌తో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 13వ తేదీన పాఠశాల ప్రాంగణంలో సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థులు stthere saalumni.org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యక్షులు సదాశివ యాదవ్, కె.చక్రపాణి, ఎం.విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీలు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, రఫత్ సుల్తానా, లీజీ, ఎన్.స్వప్నశ్రీ, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుపు ఖాయం

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ గుర్రం మురళీగౌడ్ జోస్యం చెప్పారు. పార్టీలో కష్టపడ్డ వారికే టికెట్ దక్కుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం జరిగిన సమావేశంలో తెలియజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. స్థానికనేతగా ప్రజల మధ్య ఉండే వారికే అధిష్టానం మొగ్గు చూపుతుందని చెప్పడంతో పార్టీలో మరింత నూతనోత్తేజం వచ్చిందన్నారు. బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల అభ్యున్నతికి పాటుపడే పార్టీ కాంగ్రెస్ అని, జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీతోనే ఉన్నారని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంతో అనుబంధం ఉందని, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా అన్ని వర్గాలను సంఘటితం చేసి పార్టీ విజయానికి కృషి చేస్తానని మురళీగౌడ్ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షలే..

హిమాయత్‌నగర్: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుంటే వచ్చేనెల 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రాలలో నిరాహార దీక్షలు, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేం పావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు చక్రపాణి, రామక్రిష్ణ, ఎం.లక్ష్మణ్, బి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

యథేచ్ఛగా నాలా స్థలం ఆక్రమణ

ఫిలింనగర్: ఒక వైపు నాలాలు, చెరువులు కబ్జా చేస్తున్న ఘటనల్లో హైడ్రా ద్వారా చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొంత మంది ఇవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా నాలాలను కబ్జా చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో ఓ వ్యక్తి నాలాను ఆక్రమించి సుమారు 20 గజాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడ బస్తీకి బాట కావాలంటూ బస్తీ మీదుగా పారుతున్న నాలాపై శ్లాబ్ వేశారు. ఇదే అదనుగా భావించిన నాలాకు చుట్టుపక్కల ఉన్న వారు నాలా పక్కన ఉన్న స్థలాలను తమ నివాసాలకు కలుపుకుంటున్నారు. ఇప్పటికే ఇక్కడ నాలాపై ఆక్రమణలు పెరిగిపోవడంతో నాలాలో నుంచి వ్యర్థాలు కూడా తొలగించలేని విధంగా శ్లాబ్‌లు కూడా వేశారు. అందుకే వర్షం వచ్చిన ప్రతీసారి ఇక్కడ నాలా నిండిపోయి నీరు పోక స్థానికంగా ఉన్న నివాసాలు నీట మునుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న నిర్మాణాలను అడ్డుకోవడంతో పాటు నాలాపై నిర్మించిన శ్లాబ్‌లను కూల్చివేయాల్సిన అవసరం ఉంది.



బీజేఆర్‌నగర్ బస్తీలో వైన్స్ పక్కన నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీ

ఘనంగా వారం వారం పూలహారం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో వారం వారం పూల హారం కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతి వారం అంబేడ్కర్ విగ్రహంతో పాటు బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి స్మరించుకోవడం జరుగుతోందని నిర్వాహకులు దూరపల్లి సురేష్ మాదిగ తెలిపారు. కార్యక్రమంలో నేతలు తెలంగాణ ఉద్యమకారుడు సారంగపాణి, ఎమ్మార్పీఎస్ నేత రాజు, పాలడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు

15,116 వడలతో ఆంజనేయస్వామికి అలంకరణ




స్వామివారికి హారతులిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని నందినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమితో పాటు ఉత్తరా నక్షత్రం పంచమి తిథి సందర్భంగా స్వామివారికి 15,116 వడలతో వడమాలలను వేశారు. ఆలయ అర్చకులు శశి కుమారాచార్యులు మాట్లాడుతూ శ్రావణ మాసం అంటే స్వామివారికి ఎంతో ప్రీతికరమైనదని ఆయనను శ్రావణ మాసంలో ఆరాధిస్తే ఎంతో మంచి జరుగుతుందనేది భక్తుల విశ్వాసమని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, ఆలయ చైర్మన్ దశరథ చౌహాన్, రత్నాకర్, ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి రోడ్లను ఆక్రమిస్తే కేసులు తప్పవు

నిర్మాణ సామాగ్రి విక్రేతలకు విజిలెన్స్ అధికారుల హెచ్చరిక

ఫిలింనగర్: ఫిలింనగర్ ప్రధాన రోడ్డులో సినార్ వ్యాలీ వైపు ఫిలింనగర్‌కు వచ్చే దారిలో రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు తొలగించాలని పది రోజుల క్రితం జీహెచ్ఎంసీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వచ్చి తొలగించడంతో పాటు హెచ్చరించి వెళ్లిపోయారు. మళ్లీ అదే ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో మరోసారి మంగళవారం జీహెచ్ఎంసీ విజిలెన్స్ ఎస్ఐ మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకొని రోడ్లపై క్రయ విక్రయాలు చేయకూడదని అక్కడ ఉన్న ఇసుక, కంకర మొత్తాన్ని తరలించారు. మరోసారి ఇక్కడ ఏర్పాటు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.



ఫిలింనగర్ కోర్ట్ యార్డ్ కాఫీ షాపు పక్కన నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పులిలా గాండ్రిస్తాం..
పులులను కాపాడతాం..

కేబీఆర్ పార్కులో ఘనంగా ప్రపంచ పులుల దినోత్సవం







బంజారాహిల్స్: ప్రపంచ పులుల దినోత్సవాన్ని బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు విద్యార్థులకు పులుల గురించి వాటి జీవన శైలి గురించి వివరించడంతో పాటు పర్యావరణ వ్యవస్థలో పులుల ఆవశ్యకతను వివరించారు. అడవుల్లో పులులను లెక్కించే విధానంతో పాటు వాటిని ఎలా ట్రాక్ చేస్తారో వంటి పలు ఆసక్తికరమైన విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పులులపై ఏర్పాటు చేసిన చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పులి బొమ్మలతో విద్యార్థులు ఫొటోలు దిగుతూ సరదా పడ్డారు.

టీఎక్స్ హాస్పిటల్‌లో రోగి ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్: వైద్యం కోసం వచ్చిన రోగి ఆభరణాలు చోరీకి గురైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కర్మాన్‌ఘాట్ నందనవనం కాలనీకి చెందిన జంపాల పావని గర్భిణి కాగా, అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని టీఎక్స్ ఆస్పత్రికి సోదరుడు ప్రశాంత్‌తో కలిసి వెళ్లింది. ఆమెను ఐసీయూలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఆమెకు హెల్పర్‌గా ఆస్పత్రికి చెందిన మేరీ అనే మహిళను ఉంచారు. పరీక్షల అనంతరం ఆమె మెడలో చూసుకోగా మంగళసూత్రం కనిపించలేదు. అన్ని ప్రాంతాలూ గాలించినా ఫలితం లేకపోవడంతో తన మెడలో ఉన్న మంగళసూత్రం ఆస్పత్రి ఉద్యోగి మేరీ చోరీ చేసిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ ఫీజుల పెంపు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ కోర్సుల ఫీజుల పెంపు సరికాదని తక్షణం వెనకకి తీసుకోవాలని ఆర్ఎస్‌పీ అధ్యక్షుడు ఆజాద్ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత ఫీజులతో ప్రవేశం పొందిన విద్యార్థులకు పెంచిన ఫీజులతో ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. బీ కేటగిరి సీట్ల విక్రయాల దందాను అరికట్టి విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

బాలభవన్ పనివేళల్లో మార్పు

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్ ఇక నుంచి ఆదివారం కూడా తెరిచే ఉంటుందని బాలభవన్ డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మినహా ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. కరోనా సమయం నుంచి బాలభవన్‌కు ప్రతి ఆదివారం సెలవు దినంగా ఉండేదని, ఇప్పుడు ఆదివారానికి బదులుగా ప్రతి శుక్రవారం సెలవు దినంగా ప్రకటించినట్లు వివరించారు. ఇక్కడ సృజనాత్మక ఆర్ట్, వోకల్ సంగీతం, శాస్త్రీయ నృత్యం-భరతనాట్యం, హ్యాండీక్రాఫ్ట్, చిల్డ్రన్స్ లైబ్రరీ, ఇన్నోవేటివ్ సైన్స్, సైన్స్ క్లబ్, ఎగ్జిబిషన్, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్, ఫ్యాబ్రిక్ ఆర్ట్, పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, ఇంటరాక్టివ్ గేమ్స్ వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు.

శంషాబాద్ విమానాశ్రయానికి అక్రిడిటేషన్ లెవెల్-1

శంషాబాద్: ప్రయాణికులకు విశిష్ట సేవలందిస్తున్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరో గుర్తింపు లభించింది. దివ్యాంగులు, యాక్సెసిబిలిటీని మెరుగుపర్చే విషయంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కౌన్సిల్ అక్రిడిటేషన్ లెవెల్-1 గుర్తింపును అందజేసినట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా దివ్యాగులు, వృద్ధుల ప్రయాణంలో ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఈ గుర్తింపునకు దోహదం చేసినట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టులోని ర్యాంపులు, సూచిక బోర్డులు, మరుగుదొడ్లు తదితర అంశాలను సైతం పరిగణలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రిడేషన్ లెవెల్ గుర్తింపు లభ్యం కావడంతో ప్రయాణికులకు మరింత మెరుగైన సదుపాయాలను అందజేయడానికి లభించిన ప్రొత్సాహంగా ఉందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ తెలిపారు.

19 నుంచి అంబేడ్కర్ వర్సిటీ బీఎల్ఐఎస్సీ పరీక్షలు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గత నెలలో వాయిదా వేసిన బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) మొదటి సెమిస్టర్ పరీక్షలను తిరిగి ఆగస్టు 19 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు రెండు రోజుల ముందు విశ్వవిద్యాలయ వెబ్‌పోర్టల్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు సంబంధిత అధ్యయన కేంద్రంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బీసీ బిల్లుపై మాట మార్చిన బీజేపీ

– మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపాటు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై బీజేపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, మాట మార్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం ఓయూ విద్యార్థి నేతలు రూపొందించిన 'హలో బీసీ విద్యార్థి-చలో ఢిల్లీ'కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మంత్రి ఇక్కడ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపట్ల బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. రాష్ట్ర అసెంబ్లీ ఉభయ సభల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీతోపాటు ఇతర పార్టీలు ఆమోదం తెలిపాయని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు బీజేపీ నేతలు మాట మార్చడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మబోయిన సైదులుయాదవ్, టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బారీ అశోక్ కుమార్, లింగంయాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూ పార్క్‌లో ఘనంగా పులుల దినోత్సవం



దత్తత తీసుకున్న రాయల్ బెంగాల్ వైట్ టైగర్

చార్మినార్/బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా ఆధ్వర్యంలో జూపార్క్ సిబ్బంది, వందలాది మంది విద్యార్థులు జువ్వి, మర్రి, రావి మొక్కలను నాటి, వన్యప్రాణులను సంరక్షిద్దామంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూ అధికారులు విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. వి.ఐ.పి.ఎస్. ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులతో కలిసి రాయల్ బెంగాల్ వైట్ టైగర్ (ధ్రువ)ను ఏడాదిపాటు దత్తత తీసుకున్నారు. వీఐపీఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ముజ్తబా ఖాన్, ఎడ్యుకేషన్ సొసైటీ వివిధ శాఖల ఇంచార్జ్‌లతో కలిసి మూడు లక్షల రూపాయల చెక్కును జూపార్క్ డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబాకు అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ హకీమ్, అసిస్టెంట్ క్యూరేటర్ లక్ష్మణ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు మాధవీలత, దేవేందర్, ఎఫ్ఎస్ఓ వెంకట్రావు జూపార్కు పీఆర్ఓ హనీఫుల్లా, జూ ఎడ్యుకేషన్ అధికారి దీపక్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లొసుగులే వరం..

అక్రమార్కుల పరం

- కబ్జాలపాలవుతున్న సర్కారు భూములు
- ప్రభుత్వ స్థలం అంటూ బోర్డులు పెట్టినా లెక్కచేయని వైనం
- అండదండలు అందిస్తున్న కొందరు రెవెన్యూ అధికారులు
- హైదరాబాద్ రెవెన్యూలో కంచే చేను మేస్తోంది!



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ప్రభుత్వ స్థలాలు కబ్జాల పాలవుతున్నాయి. రెవెన్యూ యంత్రాంగం నిర్లిప్తతతో 'సర్కారు ల్యాండ్ బ్యాంక్' కుంచించుకుపోతోంది. రాజకీయ ఒత్తిళ్లు, కాసుల కక్కుర్తి వెరసి అక్రమార్కులకు వరంగా మారుతోంది. చట్టంలోని లొసుగులతో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకుంటున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. స్థలంపై ఎలాంటి చిన్న వివాదం ఉన్నా వారికి మరింతగా కలిసి వస్తోంది. అందుకు అధికార గణం అండదండలు అందిస్తుండటంతో స్థలానికి సంబంధించి కాగితాలను తిమ్మిని బమ్మిని చేసి వారసత్వ రికార్డులు సృష్టిస్తున్నారు. ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఉన్నా వాటిని తొలగించి ఆ స్థలాల్లో భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులను దారికి తెచ్చుకొని ల్యాండ్ బ్యాంక్‌లో పార్శిల్ లేకుండా చేసుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

సర్కారీ స్థలాల రీ సర్వే ఏది..?

గత రెండు దశాబ్దాలుగా సర్కారు స్థలాలపై రీ సర్వే లేకుండా పోయింది. గతేడాది చివరిలో హైదరాబాద్ రెవెన్యూ యంత్రాంగం సర్కారీ భూములపై రీసర్వేకు సిద్ధమై హడావుడి చేసినా ఆచరణలో మాత్రం ముందుకు సాగలేదు. ల్యాండ్ బ్యాంకులోని పార్శిల్స్ సైతం ఆక్రమణకు గురవుతుండటాన్ని తీవ్రంగా పరిగణించి సర్వేయర్లను రంగంలోకి దింపి రీ సర్వే చేయించాలని భావించింది. క్షేత్రస్థాయిలో పార్శిల్స్ వారీగా భూములను పరిశీలించి సమగ్ర నివేదికలు రూపొందించాలని నిర్ణయించింది. అప్పట్లో జిల్లా రెవెన్యూ అధికారి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో మండలాల సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమీక్షించారు. ప్రభుత్వ భూములన్నింటినీ పరిశీలించి సంబంధిత స్థలంలో కొలతలు చేసి వివరంగా మ్యాపులను రూపొందించి నివేదిక సమర్పించేలా ఆదేశించారు. 16 రెవెన్యూ మండలాలకు గాను సుమారు 17 మంది సర్వేయర్లు ఉన్నప్పటికీ.. ఎందుకోగానీ ఆ సర్వే మాత్రం ముందుకు సాగలేదు.

ఇదీ పరిస్థితి..

హైదరాబాద్ జిల్లా రెవెన్యూ పరిధిలో సుమారు 16 మండలాలు ఉన్నాయి. పదేళ్ల క్రితం వరకు ల్యాండ్ బంక్‌లో 1,138 పార్శిల్స్ ఉండగా ప్రస్తుతం అవి 1,075 పార్శిల్స్‌కు చేరినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే పార్శిల్స్ మరింత తగ్గినట్లు తెలుస్తోంది. అందులో 890 ల్యాండ్ పార్శిల్స్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా 40,66,914.08 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఉంది. మిగతా పార్శిల్స్‌లో సుమారు 11,45,334.95 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. సుమారు 169 పార్శిల్స్‌లోని దాదాపు 11,93,595.12 చదరపు గజాల విస్తీర్ణ గల ఖాళీ స్థలంతోపాటు 445098.64 చదరపు గజాల ఆక్రమిత భూమి కోర్టు కేసుల్లో ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

ల్యాండ్ బ్యాంక్‌పై పర్యవేక్షణ కరువు?

హైదరాబాద్ జిల్లాలో ల్యాండ్ బ్యాంక్‌పై పర్యవేక్షణ కొరవడింది. స్థానిక తహసీల్దార్లకు సైతం ఏ పార్శిల్ ఎక్కడ ఉందో? తెలియని పరిస్థితి నెలకొంది. ఆరేడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ యోగితా రాణా ప్రభుత్వ స్థలాల కోసం ప్రత్యేకంగా ల్యాండ్ బ్యాంక్ యాప్ రూపకల్పన చేసి స్థలాలకు కంచె, సైన్ బోర్డుల ఏర్పాటు, ఆన్‌లైన్ మానిటరింగ్, ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో భద్రపర్చడం లాంటి చర్యలు చేపట్టారు. వీఆర్వోలకు బాధ్యతలు అప్పగించి ప్రతిరోజు భూములపై పర్యవేక్షణతోపాటు పక్షం రోజులకు ఒకసారి తనిఖీ చేసి సమాచారాన్ని సంబంధిత తహసీల్దారు, భూ పరిరక్షణ అధికారులకు అందించేవిధంగా కసరత్తు చేశారు. యోగితా రాణా బదిలీ తర్వాత దానికి బ్రేక్ పడింది. ఆ తర్వాతా ల్యాండ్ బ్యాంక్ యాప్ మూలనపడింది.

రాజాసింగ్ రీ ఎంట్రీకి ప్రయత్నిస్తున్నారా..?

- గోషామహల్‌లో ఉప ఎన్నిక రాదన్న ఎమ్మెల్యే
- బీజేపీ నాయకత్వం పిలిస్తే కలవడానికి సిద్ధమని వ్యాఖ్య



సాక్షి, సిటీబ్యూరో: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తిరిగి కమలం గూటికి చేరడానికి ప్రయత్నిస్తున్నారా? బీజేపీ జాతీయ నాయకత్వం ఆహ్వానిస్తే కలవడానికి సిద్ధమవుతున్నారా.. అంటే ఆయన వ్యాఖ్యలను బట్టి చూస్తే అవుననే అనిపిస్తోంది. పార్టీ అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపించి బహిష్కరణ వేటుకు గురైన రాజాసింగ్ మళ్లీ కాషాయతీర్థం పుచ్చుకునే దిశగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. హైకమాండ్ పిలిస్తే రాజీనామా చేయడానికి గల కారణాలు, రాష్ట్ర పార్టీ నాయకుల తీరు గురించి వివరించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ రాజాసింగ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'నా వైపు నుంచి కూడా కొన్ని తప్పులు దొర్లాయి. అధిష్టానానికి కొందరు నాపై తప్పుడు సమాచారం చేరవేశారు'అని తాజాగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నారు. ఈ వ్యాఖ్యలను పరిశీలిస్తే ఆయన మనసు మార్చుకునేందుకు, తిరిగి బీజేపీ గూటికి చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

పార్టీకి మాత్రమే రాజీనామా చేశా..

'ఉప ఎన్నిక వస్తుందని కొంత మంది పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. నేను పార్టీకి మాత్రమే రాజీనామా చేశాను. ఎమ్మెల్యే పదవికి కాదు. స్పీకర్‌కు లేఖ ఇవ్వలేదు. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే అక్కడెక్కడా ఉప ఎన్నిక రాలేదు. గోషామహల్‌లో ఎలా వస్తుందో నాకు తెలియడంలేదు. మరో మూడేళ్లు నేనే ఎమ్మెల్యేగా ఉంటాను. ఉప ఎన్నిక ప్రసక్తే రాదు'అని రాజాసింగ్ స్పష్టం చేశారు. పార్టీలో మిత్రులతోపాటు శత్రువులు ఉన్నారని, వాళ్లే మీడియాకు లీకులిస్తూ, వాటిని ఢిల్లీలో ఫిర్యాదు చేస్తారని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనకు ఫోన్ చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో జరిగిన తప్పుడు ప్రచారంతో నా రాజీనామాను అధిష్టానం ఆమోదించిందని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో రాజీనామా ఇచ్చాననేది వివరణ ఇచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నానని చెబుతున్నారు. తెలంగాణలో బీజేపీకి ఎవరి వల్ల నష్టం జరుగుతుంది, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఎలాంటి అవమానాలు జరుగుతున్నాయనే అంశాలను వివరిస్తానని రాజాసింగ్ పేర్కొన్నారు.

ప్రభుత్వభూమిని 'ప్రైవేట్'కు అప్పగించే కుట్ర

– బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

సాక్షి,సిటీబ్యూరో: బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎమ్మెల్యే కాలనీలోని వేల కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ సంస్థలకు, ప్రైవేట్‌వారికి అప్పనంగా అప్పగించే కుట్ర జరుగుతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దాదాపు 60, 70 ఏళ్ల నుంచి అక్కడ ఉన్న పెద్దమ్మతల్లి ఆలయాన్ని కూల్చి, ధార్మిక నియమ నిబంధనలకు వ్యతిరేకంగా దేవతా విగ్రహాన్ని తరలించారని పేర్కొన్నారు. దుశ్చర్యలను అడ్డుకునేందుకు స్థానిక ప్రజలతో కలిసి పోరాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని, అప్పనంగా ప్రైవేట్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టొద్దని డిమాండ్ చేశారు. ఆ స్థలంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వాసుపత్రి, ప్రభుత్వ పాఠశాల నిర్మించాలని కోరారు.

అంకితభావమున్న ఉద్యోగుల్లోనే సంతృప్తి

-'ఎస్కీ'డైరెక్టర్ డా.రామేశ్వరరావు



మొక్క నాటుతున్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు, ఇతర రవాణా శాఖ అధికారులు

రాయదుర్గం: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే సంతృప్తి ఉంటుందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావు పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా శాఖలో నూతనంగా ఎంపికైన 102 మంది అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల(ఏఎంవీఐ)కు గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లో 16 రోజుల శిక్షణ ముగింపు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిఫామ్ సర్వీసులో ఉన్నవారు ప్రజలకు సన్నిహితంగా ఉండి సేవలు అందిస్తారన్నారు. వారిలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, డాక్టర్లు, లాయర్లు, సైనికులతోపాటు మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఉంటారని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకుపైగా సర్వీసులో ఉండే ఎంవీఐలు ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని, ఉద్యోగ విరమణ వరకు ఇదే విధమైన సేవాతత్పరతను కలిగి ఉండాలని సూచించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లా రవాణా అధికారి రఘునందన్‌గౌడ్ మాట్లాడుతూ నిబద్ధత, నిజాయితీతో విధులను నిర్వర్తించి ప్రభుత్వానికి, రవాణా శాఖకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగం హెడ్ ఆర్ వెంకట్ రెడ్డి, కళాశాల చీఫ్ ఎస్ లక్ష్మీకాంతరావు, డిప్యూటీ చీఫ్ డాక్టర్ పి.రాజారావు, రవాణా అధికారి చంద్రశేఖర్, మేనేజ్‌మెంట్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ జ్యోతి, ఫ్యాకల్టీ తిలక్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సునీత పాల్గొన్నారు.

మూసీ పరీవాహకంలో మొసలి కలకలం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీ శివాలయం సమీపంలోని మూసీ పరీవాహకంలో మొసలి కలకలం రేపుతోంది. మొసలి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం నీటిలోంచి ఒడ్డుకు వచ్చిన మొసలి పలు కుక్కలను నోట కరచుకొని నీళ్లలోకి తీసుకెళుతున్న దృశ్యాన్ని స్థానికులు గమనించి చైతన్యపురి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఫారెస్ట్ అధికారులకు విషయం చేరవేశారు. మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఫణిగిరి కాలనీకి వెళ్లి కాలనీవాసులతో మాట్లాడారు. గత మూడు రోజులుగా మొసలి ఈ పరీవాహక ప్రాంతంలో తిరుగుతోందని, ఇళ్లలోకి వస్తుందేమోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని, వెంటనే ఫారెస్ట్ అధికారులు స్పందించి మొసలిని కట్టడి చేయాలని ఆయన కోరారు.



చైతన్యపురి ఫణిగిరి కాలనీ ప్రాంతంలోని మూసీలో కనిపించిన మొసలి

'లగచర్ల' నిందితులకు మినహాయింపు

నోటీసులు వచ్చాకే రావాలన్న నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి కేసులో నిందితులుగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, పలువురు రైతులకు కోర్టు హాజరు నుంచి మినహాయింపు లభించింది. లగచర్ల ఫార్మా భూసేకరణ విషయంలో అధికారులపై దాడికి పాల్పడ్డారంటూ నరేందర్ రెడ్డితోపాటు పలువురిపై గతంలో కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ మంగళవారం నాంపల్లి క్రిమినల్ కోర్టులో జరిగింది. ఈ విచారణకు ఏ-1 పట్నం నరేందర్‌రెడ్డితోపాటు మిగిలిన రైతులందరూ హాజరయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారందరికీ కోర్టు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని వారి తరపు న్యాయవాది జక్కుల లక్ష్మణ్ కోర్టును కోరారు. ప్రస్తుతం వ్యవసాయ పొలాల్లో పంటలు పండించే సమయమని, ఇలా ప్రతి వాయిదాకు రైతులు కోర్టుకు హాజరవుతుంటే వారి పనులన్నీ ఆగిపోతున్నాయని, ఇందులో దినసరి కూలీలు కూడా ఉన్నారని, వారంతా చాలా ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై విచారించిన కోర్టు ఈ కేసులో చార్జిషీటు దాఖలు చేసేవరకు, మళ్లీ కోర్టు నుంచి నోటీసులు వచ్చే వరకు నిందితులందరికీ కోర్టు హాజరు నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రైతులందరూ సంతోషం వ్యక్తం చేశారు.



కోర్టుకు హాజరైన పట్నం నరేందర్‌రెడ్డి, ఇతర రైతులు

ప్రజారోగ్య పరిరక్షణకు మాన్సూన్ డ్రైవ్

– జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



ప్రజాప్రతినిధులతో కలిసి చార్మినార్‌లో పర్యటిస్తున్న గ్రేటర్ కమిషనర్ కర్ణన్

చార్మినార్: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 150 వార్డుల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని సంబంధిత జోనల్ అధికారులను కోరారు. నగరంలో పారిశుధ్యాన్ని మెరుగు పరిచే లక్ష్యంతో జీహెచ్ఎంసీ మంగళవారం నుంచి ప్రారంభించిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను కమిషనర్ చార్మినార్ సమీపంలోని సర్దార్ మహల్ , పాత బస్టాండ్ ప్రాంతాల్లో పరిశీలించారు. డ్రైవ్‌లో భాగంగా రోడ్లు, కాలనీలు, బహిరంగ ప్రదేశాల్లోని చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులు తొలగించారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి, నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. దోమల బెడదను నివారించడానికి ఎంటమాలజీ అధికారులు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా, చెత్తబుట్టల్లోనే వేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున, ఈ శానిటేషన్ డ్రైవ్‌ను మరింత మెరుగ్గా చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఈ డ్రైవ్‌ను నగరంలోని అన్ని వార్డులలో చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు.10 రోజులపాటు నిర్వహించే ప్రత్యేక డ్రైవ్ రెండు, మూడు రోజుల్లో 30 వార్డుల చొప్పున పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ శాసన సభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ, శాసన మండలి సభ్యుడు రహమత్ బేగ్, శాలిబండ కార్పొరేటర్ మహమ్మద్ ముజఫర్ అలీ, పత్తర్ గట్టి కార్పొరేటర్ సయ్యద్ సోహైల్ ఖాద్రి, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సినారె సాహితీ సృజన చిరస్మరణీయం



నీలిమ్ కుమార్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

– గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గన్‌ఫౌండ్రీ: పద్మవిభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్య రంగానికి చేసిన సేవలు, సాహితీ సృజన చిరస్మరణీయమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ అస్సామీ కవి నీలిమ్ కుమార్‌కు విశ్వంభర డాక్టర్ సి.నారాయణ రెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం, రూ.5 లక్షల నగదు అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ సినారె తెలుగు సాహిత్యరంగంలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఎన్ని ప్రక్రియల్లో రచనలు చేసినా మానవతావాదం అంతర్లీనంగా ఉంటుందని గుర్తుచేశారు. అంతకు ముందు సినారె రచించిన 'భలే శిష్యులు'పుస్తకాన్ని ఆవిష్కరించగా, నాగార్జున సాగరం అనే నృత్య రూపకం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆంజనేయరెడ్డి, సాహితీవేత్త పత్తిపాక మోహన్, ట్రస్ట్ అధ్యక్షుడు సి.గంగ, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిలిం చాంబర్‌లో సినారె ఫొటో ఏదీ?

నిర్మాతల మండలిని ప్రశ్నించిన తెలంగాణవాదులు

ఫిలింనగర్/బంజారాహిల్స్: తెలుగు ఫిలిం చాంబర్‌లో ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్రపటం ఎందుకు లేదని తెలంగాణవాదులు చాంబర్ ప్రతినిధులను నిలదీశారు. మంగళవారం ఫిలింనగర్‌లోని ఫిలిం ఛాంబర్ వద్ద నిర్మాతల మండలి కార్యాలయంలోకి చొచ్చుకు పోయేందుకు తెలంగాణవాదులు ప్రయత్నించారు. ఫిలిం చాంబర్ సెక్రటరీ ప్రసన్నకుమార్‌తో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా 'ఆంధ్రా గో బ్యాక్'అంటూ తెలంగాణవాదులు నినాదాలు చేశారు. సినీదిగ్గజం పైడి జయరాజ్‌కు సంబంధించిన చిన్న ఫొటోను పెట్టారని గొడవకు దిగారు. ఒక హీరోయిన్ ఫొటో కింద జయరాజ్ చిత్రపటం పెట్టడంపట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న పోలీసులకు, తెలంగాణవాదులకు మధ్య కూడా తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరికి పోలీసులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఫిలిం ఫెడరేషన్- ఫిలిం చాంబర్ మధ్య చర్చలు విఫలం

సినీ కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాల్సిందేనని తెలుగు ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. లేదంటే ఆగస్టు ఒకటవ తేదీ నుంచి సినీ కార్మికులు షూటింగ్‌లకు హాజరుకారని వెల్లడించారు. చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్న సినీ కార్మికుల వేతనాలు ప్రతి మూడేళ్లకోసారి 30 శాతం పెంచాలనే నిబంధన ఉందని, ఈ గడువు జూన్ 30వ తేదీతో ముగిసిందని ఆయన పేర్కొన్నారు. అయితే వేతనాల పెంపుపై ఆగస్టు 1వ తేదీ వరకు వేచి ఉండాలన్న ఫిలిం చాంబర్ ప్రతినిధులు మంగళవారం తమను చాంబర్‌కు పిలిచి 5 శాతం మాత్రమే పెంచుతామని చెప్పిందని, ఇది తమకు సమ్మతంకాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఫిలిం చాంబర్, తెలుగు ఫిలిం ఫెడరేషన్ నాయకుల మధ్య చర్చలు విఫలమయ్యాయని చెప్పారు. ఇప్పుడీ పంచాయతీ కార్మిక శాఖ అధికారుల చెంతకు చేరిందని, సుమారుగా 24 వేల మంది సినీ కార్మికుల జీతాలు పెంచే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని తేల్చి చెప్పారు.

ఆదివాసీలను హిందూ మతంలో కలిపే కుట్ర

– మాజీ ఎంపీ మిడియం బాబురావు



గిరిజన సంఘం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబురావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదివాసీలను హిందూమతంలో విలీనం చేయాలనే కుట్ర జరుగుతోందని మాజీ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. ఇది రాజకీయకక్షతో జరుగుతున్న విషయమని ఆదివాసీలు గ్రహించాలని కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 2027 జనగణనలో మతం కాలమ్‌లో షెడ్యూల్డ్ ట్రైబ్ అనిగానీ, ప్రకృతి ఆరాధకులు అనిగానీ ప్రత్యేక కేటగిరీగా గిరిజన తెగలను గుర్తించాలని డిమాండ్ చేశారు. తమ మతాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో ఆదివాసీలు బలంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. ఆదివాసీలు చారిత్రకంగా గ్రామ, కుల వ్యవస్థకు బయట అడవుల్లో జీవిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనుల ప్రత్యేక మత, భాష, సంస్కృతి, ఉనికిని ధ్వంసం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో 33 తెగలు, 33 లక్షల మంది ఉన్నారని, వీరు ప్రధానంగా 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో 1,180 షెడ్యూల్డ్ గ్రామాలు, మైదాన ప్రాంతంలోని అన్ని జిల్లాల్లో నివసిస్తున్నారని చెప్పారు. కోయ, గోండి, కోలాని, లంబాడా, ఎరుకుల తెగలవారు సొంత భాషల్లో మాట్లాడతారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కుసం సచిన్, బండారు రవికుమార్, ఆత్రం తనుష్, తొడసం సంబూ, చిరం జీవి, అశోక్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి కూల్చివేత వ్యవహారం గరంగరం

- బోనాలు సమర్పించేందుకు వచ్చిన 50 మంది మహిళలు
- ఘటనాస్థలానికి చేరుకున్న వందలాది మంది భక్తులు
- భక్తులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ గుడి కూల్చివేత వ్యవహారం రోజురోజుకూ గరంగరం అవుతోంది. మంగళవారం ఆలయం వద్ద బోనం సమర్పించేందుకు భక్తులు భారీ ఊరేగింపుతో వస్తుండగా అప్పటికే భారీ సంఖ్యలో అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, భక్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తమను లోపలికి అనుమతించాలంటూ భక్తులు పోలీసులతో వాగ్వాదం చేయడమే కాకుండా పోతరాజుల విన్యాసాల మధ్య బోనమెత్తుకున్న మహిళలు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. 50 మంది మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవారి సన్నిధిలో నైవేద్యం సమర్పించారు. అప్పటికే పోలీసులు అక్కడ భారీగా మోహరించగా బీజేపీ నేతలను పోలీసులు ఎక్కడికక్కడే గృహ నిర్బంధం చేశారు. భక్తులు మాత్రం వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా అక్కడికి చేరుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని వెంటనే ప్రతిష్ఠించాలని, ఆలయాన్ని నిర్మించాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ విధంగా కొద్ది రోజుల నుంచి ఆలయ కూల్చివేతను భక్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడే ఆలయం నిర్మించాలనే డిమాండ్లు పెరుగుతుండగా, వివిధ పార్టీల నేతలు సంఘీభావంగా ఇక్కడికి తరలి వస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 30, జూలై, 2025

శుభ్రత, ఆరోగ్యం, రుచిని కలగలిపే భారతీయ వంటకం కిచిడీ. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరికీ నప్పే, నచ్చే వంటకంగా చాలా మందికి తెలుసు. అయితే ఇప్పుడు అంతర్జాతీయంగా మన దేశపు 'సూపర్ ఫుడ్'గా కూడా ఇది గుర్తింపు పొందుతోంది. భారత్ నుంచి ప్రపంచ గ్యాస్ట్రోనామిక్ మెనూలో బిర్యానీ, పంజాబీ కడీ, దోస, రాజ్మా చావల్ తరహాలో కిచిడీ కూడా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా తన రోజువారీ ఆహారంలో కిచిడీని భాగం చేశారంటే అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు సినీ సెలబ్రిటీలు కరణ్ జోహార్, తమన్నా భాటియా, మంధిరా బేడీ, క్రికెటర్ హార్దిక్ పాండ్యా, సంజు శాంసన్ వంటి ప్రముఖులు కూడా కిచిడీ లవర్స్‌గా తమను తాము చెప్పుకుంటున్నారు.





ముసురులో వేడివేడిగా.. ముచ్చటైన ఆహారం తినాలని ఎవరికి ఉండదు.. అలాంటి ఆహారాల్లో చెప్పకోదగినది.. అప్పటికప్పుడు అందుబాటులో ఉన్న వస్తువులతో సిద్ధం చేసుకోగలిగినది ఏదైనా ఉందంటే.. అది కిచిడీ ఒక్కటే.. అంతేకాదు.. నగరంలో అనేక మందికి ఇది అభిమాన బ్రేక్‌ఫాస్ట్ డిష్ కూడా. రుచికి రుచీ.. ఆరోగ్యానికి ఆరోగ్యాన్ని అందించే ఈ దేశీ వంటకం ప్రపంచ గ్యాస్ట్రోనామిక్ మెనూలోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. విభిన్న రకాల కూరగాయలు, దినుసుల మేళవింపుతో అనేక పోషక విలువలు దీని సొంతమని ఆహార నిపుణులు చెబుతోన్న మాట..

- సాక్షి, సిటీబ్యూరో

ముసురులో ముచ్చటైన ఆహారం..

కిచిడీ.. బీ రెడీ..

- ప్రపంచ గ్యాస్ట్రోనామిక్ మెనూలోనూ ప్రత్యేక గుర్తింపు
- నగరంలో అనేక మందికి అభిమాన బ్రేక్‌ఫాస్ట్ డిష్
- రుచికీ, ఆరోగ్యానికీ పేరుగాంచిన దేశీయ వంటకం
- విభిన్న రకాల మేళవింపుతో నగరవాసుల నోరూరిస్తూ..
- పోషక విలువలూ అధికమంటున్న నిపుణులు

ఆరోగ్యానికీ మేలు..

మనలో చాలా మందికి చిన్నప్పటి జ్ఞాపకాలలో కిచిడీ రుచులు తప్పకుండా ఉంటాయి. అరుగుదల సులభం అనే ఆలోచనతోనే కిచిడీకి అంత క్రేజ్ వచ్చిందనేది నిస్సందేహం. రుచిగా ఉండటమే కాదు, దీనిని ప్రత్యేకంగా వండే శైలి కారణంగా తేలికగా జీర్ణం కాగలదు. ఇది కొన్ని వెరైటీల్లో ఎక్కువగా ముద్దలాగా తయారవుతుంది. కొన్ని రకాల్లో ఘన పదార్థంలా ఉంటుంది. అయినా ఇది శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడానికి దోహదపడుతుంది. వర్షం, ముసురు పట్టిన రోజుల్లో లేదా అనారోగ్య సమయంలో తినడానికి శ్రేష్ఠమైన ఆహారం. కిచిడీ సులభంగా జీర్ణమవుతుంది. అనేక విధాలుగా తయారు చేయొచ్చు. ప్రతి ఒక్కరికీ సరిపోయే ఆహారం ఇది అంటున్నారు సెలబ్రిటీ చెఫ్ సంజీవ్ కపూర్.





ప్రొటీన్లు, విటమిన్లు అధికం..

దీనిలో ఉండే మసాలాలు, మినపప్పు, బియ్యం వంటి పదార్థాల వల్ల ఇది శరీరానికి అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లు అందిస్తుంది. తేలికగా జీర్ణం కావడం మాత్రమే కాదు.. ఇది జీర్ణశక్తిని మెరుగుపరిచే ఆహారం కూడా. బియ్యంలో కలిపే ' హింగు (ఇంగువ), మిరియాలు, అల్లం, జీలకర్ర, వెల్లుల్లి వంటి మసాలాల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఆరోగ్యానికి ఉపకరిస్తాయి. ఇటీవలే ఓ ప్రదర్శనలో చెఫ్ శివ జిత్ సూరి మూంగ్ దాల్, మష్రూమ్స్, ట్రఫుల్ నూనె, గ్రీన్ బీన్స్ వంటి పదార్థాలతో కిచిడీ అంతర్జాతీయ ఫ్లేవర్ తీసుకొచ్చి ఆహార ప్రియుల్ని ఆకట్టుకున్నారు. వీటితోపాటు సాబూదాన్, వెజిటబుల్స్, చిరుధాన్యాలతో చేసే కిచిడీ వెరైటీల రుచికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే..

నగరంలో ఎక్కడెక్కడ?

ఈ కిచిడీ ప్రియుల కోసం నగరంలో పలు రెస్టారెంట్స్ వెరైటీ డిష్‌లను అందిస్తున్నాయి. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్‌లలోని ఈట్ ఫిట్ రెస్టారెంట్‌లోని గ్రేట్ ఇండియన్ కిచిడీ, జూబ్లీహిల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లలో ఉన్న అంతేరా కిచెన్, ఎమ్‌టీఏబి, కృష్ణపట్నం, మోడ్రన్/కాంటినెంటల్ వంటలతో కూడిన రెస్టారెంట్లలోని కిచిడీలు మంచి రేటింగ్స్ పొందాయి. అలాగే అమీర్‌పేట్‌లోని హబీబో అందించే దాల్ కిచిడీ, జూబ్లీ హిల్స్, హైటెక్‌సిటీలలో ఉన్న డైలీ రిచ్యువల్స్, ట్రైయాంగ్ అండ్ నియో తెలంగాణ కిచెన్, రెడ్ రినో, హోటల్ నయాబ్, టోలిచౌకిలోని హోటల్ రుమాన్, షాగౌస్‌లు అందించే కిచిడీ ఖీమా అండ్ కట్టా వంటివి కిచిడీ వంటకాలకు పేరొందాయి.





మిసెస్ ఇండియాగా విజయలక్ష్మి



ఢిల్లీలో గ్రాండ్‌ఫినాలే ప్రకటించిన నిర్వాహకులు

సాక్షి, సిటీబ్యూరో: మిసెస్ ఇండియా సీజన్–5 విజేతగా కవ్వం విజయలక్ష్మి నిలిచారు. ఢిల్లీలో జరిగిన గ్రాండ్‌ఫినాలే ఫలితాలను నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. హైదరాబాద్ ప్రతినిధిగా పోటీల్లో పాల్గొన్న విజయలక్ష్మి అన్ని రౌండ్లలోనూ విజేతగా నిలిచారు. వీఆర్‌పీ ప్రొడక్షన్ డైరెక్టర్ డాక్టర్ రీతు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఫలితాలు ప్రకటించిన సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడారు. గ్రామీణ వాతావరణంలో పుట్టి, వ్యవసాయ రంగం నుంచి పలు సంస్థలను నిర్వహించి, జాతీయ స్థాయిలో విజేతగా నిలవడం సంతోషాన్నిచ్చిందన్నారు. దీని వెనుక కుటుంబ సభ్యుల సంపూర్ణ మద్దతు ఉందని పేర్కొన్నారు.



నగరంలో హనుత్ సింగ్ ప్రదర్శన

6న 'ఇనక్యాండిసెంట్' పేరుతో ఆభరణాల కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీకి చెందిన హాలీవుడ్ తారలతో పనిచేసిన అనుభవం కలిగిన ప్రముఖ ఆభరణాల డిజైనర్ హనుత్ సింగ్ నగరంలో తన ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్‌లోని ప్రముఖ డిజైన్ హౌస్ రా మ్యాంగోలో ఆగస్టు 6వ తేదీన 'ఇనక్యాండిసెంట్' పేరుతో ఈ ప్రదర్శన ఉంటుందని, ఇండియా ఆర్ట్ ఫెయిర్ సహకారంతో రా మ్యాంగో దీనిని నిర్వహిస్తోందని నిర్వాహక సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రా మ్యాంగో వ్యవస్థాపకులు సంజయ్ గార్గ్ తన వ్యక్తిగత కలెక్షన్ కూడా ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఇందులో ఇండియా ఆర్ట్ ఫెయిర్ డైరెక్టర్ జయ అశోకన్ పాల్గొంటారని వివరించారు.

జంక్‌ఫుడ్‌తో జర జాగ్రత్త..

వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం

ఆహారంపై పలు సూచనలు చేస్తున్న వైద్యులు



ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో సమోసా, జిలేబీ వంటి స్ట్రీట్ ఫుడ్స్ హాట్ టాపిక్‌గా మారాయి. వీటిపై కూడా ప్రమాద హెచ్చరికలు జారీచేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఆ తర్వాత అలాంటిదేమీ లేదని, కేవలం స్ట్రీట్ ఫుడ్ విషయంలో అపరిశుభ్రత విధానాలపై హెచ్చరించడమే తమ ఆలోచనని ప్రభుత్వం స్పష్టం చేసి ఆ వార్తలకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది. అయితే సోషల్ మీడియాలో మాత్రం దీనిపై చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. వర్షాల సీజన్ కావడంతో వేడి వేడి స్ట్రీట్ ఫుడ్‌కు ఆకర్షితులవ్వడం సహజమే. ఈ క్రమంలో ఇలాంటి ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని నగరానికి చెందిన ప్రముఖ కన్సల్టెంట్, ఎండోక్రైనాలజిస్ట్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్ సనమండ్ర సూచిస్తున్నారు.. - సాక్షి, సిటీబ్యూరో



జిలేబీలు, సమోసాలు, బజ్జీలు, పునుగులు వగైరా స్ట్రీట్ ఫుడ్ నోటికి రుచిగా ఉంటాయి. కానీ ఇవి ఆరోగ్యానికి చేటు చేస్తాయి. మరీ ముఖ్యంగా చిరుతిళ్లలో మైదా శాతం అధికంగా ఉంటుందని, పైగా ఇవన్నీ పలుమార్లు వాడిన నూనెతో చేసిన వంటకాలు కావడంతో మరింత ప్రమాదకరం. తరచూ ఈ తరహా ఆహారం తినడం వల్ల జీవక్రియతో పాటు జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తుంది.

అనారోగ్య కారకం..

ఈ తరహా చిరుతిండి ఎక్కువగా తినేవాళ్లలో ఒబెసిటీ, తర్వాత రక్తపోటు, ఫ్యాటీ లివర్, చెడు కొలెస్ట్రాల్, గుండె సంబంధిత అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. క్రమంగా ఈ అలవాట్లతో పాటు పెద్ద పెద్ద వ్యాధులుగా రూపాంతరం చెంది ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి తప్పదు.



ప్యాంక్రియాస్‌పై ప్రభావం..

మన శరీరంలో రెండు రకాల కొవ్వులు ఉంటాయి. వీటిలో చర్మం కింద ఉండే సబ్‌క్యూటేనియస్ ఫ్యాట్ అంత ప్రమాదకరం కాదు. కానీ లివర్, ప్యాంక్రియాస్, కిడ్నీలు వంటి అంతర్గత అవయవాల చుట్టూ ఉండే విసెరల్ ఫ్యాట్ పెంచుతాయి. దీంతో ఆరోగ్యానికి ప్రమాదం అధికం. ఇది శరీరంలోని వాపును పెంచి ఇన్సులిన్ పనితీరును దెబ్బతీస్తుంది. తద్వారా ప్యాంక్రియాస్ అధిక శాతంలో ఇన్సులిన్ ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. దీనినే ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటారు. ఇది క్రమంగా డయాబెటిస్, ఇతర మెటబాలిక్ వ్యాధులకు దారితీస్తుంది.

చిన్నపిల్లల్లో సమస్యలు..

చిన్నారులు స్కూలు వయసులో తీపి, ఉప్పు ఎక్కువగా ఉన్న ఫుడ్ తింటే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యల వచ్చే అవకాశాలు పెరిగిపోతాయి. అలాగే 5–10 ఏళ్ల పిల్లల్లో కనిపించే సమస్యలు – మెడ దగ్గర నలుపు మచ్చలు (అకాంథోసిస్ నైగ్రికన్స్), అమ్మాయిల్లో హార్మోన్ డిజార్డర్, అబ్బాయిల్లో టెస్టోస్టిరాన్ తగ్గడం (హైపోగోనాడిజం), ప్రీడయాబెటిస్, హైబీపీ, ఫ్యాటి లివర్ వంటి సమస్యలు తప్పవు. రోడ్డు మీది ఫుడ్‌తో పాటు చిప్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్, జంక్ ఫుడ్ ఏదీ మంచిది కాదు. దీనికి బదులుగా ఇంటి దగ్గర వండినవి మాత్రమే పిల్లలకు ఇవ్వడం ఉత్తమం.

సాధించాలనే తపన ఉండాలేగానీ.. అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేయవచ్చు.. వేయి మైళ్ల ప్రయాణాన్నైనా ఒక్క అడుగుతో మొదలు పెట్టొచ్చు అనే నానుడిని ఒంటబట్టించుకున్నాడో.. ఏమోగానీ.. అత్యంత ఎత్తయిన పర్వతాలను అధిరోహించడమే లక్ష్యంగా ఎంచుకున్నాడు. నిజానికి ఎత్తయిన శిఖరాలను అధిరోహించడమంటే పెద్ద సాహసమే. ఇలాంటి కష్టతరమైన లక్ష్యసాధనలో అనేక ఇబ్బందులు, ఒడిదుడుకులను ఎదుర్కోవాలి. ఒక్కోసారి ప్రాణాలు సైతం పోయే పరిస్థితి.. వీటన్నింటినీ అధిగమించి విజయాన్ని సొంతం చేసుకున్నాడు హైదరాబాద్ నాచారం డివిజన్‌కు చెందిన అలుగడ్డ మనీష్‌యాదవ్.. ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించి ఔరా అనిపిస్తున్నాడు. - మల్లాపూర్



ఎవరెస్ట్ అధిరోహణే లక్ష్యం..

పర్వతాల అధిరోహణ అంటే అంత సులువైనదేంకాదు.. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోడానికి అనేక అటుపోట్లను అధిగమించాడు.. ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించాడు తెలంగాణ యువకుడు.. లక్ష్య సాధన దిశగా అడుగులేస్తూ.. కిలిమంజారోపై జాతీయ జెండాను ఎగురవేయాలనే సంకల్పాన్ని నెరవేర్చుకుని శభాష్ అనిపించుకున్నాడు హైదరాబాద్ నాచారం డివిజన్‌కు చెందిన అలుగడ్డ మనీష్‌యాదవ్. సముద్రమట్టానికి 5,895 మీటర్ల (19,341 అడుగులు) ఎత్తులో ఉన్న ఉహురు అధిరోహించాడు. భారత త్రివర్ణ పతాకాన్ని శిఖరంపై నిలబెట్టాడు.

- సాహస యాత్రికుడు మనీష్ యాదవ్
- కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన నగరవాసి
- భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్లో శిక్షణ
- స్నేహితుల స్ఫూర్తితోనే సాహస యాత్రలవైపు అడుగులు

అదే భవిష్యత్తు లక్ష్యం..

"ప్రపంచంలోని అతిపెద్ద పర్వతాలను అధిరోహించాలనేది నా భవిష్యత్తు లక్ష్యం. ప్రస్తుతం కిలిమంజారో అధిరోహణ పూర్తయ్యింది. అనుకున్న మొదటి లక్ష్యాన్ని పూర్తిచేశాను. అనంతరం మౌంట్ ఎల్బ్రస్, అకాన్‌కాగువా, ఎవరెస్ట్‌కు సిద్ధమవుతున్నా.

– మనీష్ యాదవ్, పర్వతారోహకుడు

అటుపోట్లను అధిగమించి..

పర్వతారోహణ సమయంలో ఉధృతమైన గాలులు, అతి తక్కువ ఉష్ణోగ్రతతో నిటారుగా ఉండే కిలిమంజారో పర్వతం అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఎంతో కఠోర శిక్షణ పొందిన పర్వతారోహకులు మాత్రమే ఈ పర్వతాన్ని అధిరోహించగలరు. అటువంటి ప్రమాదకరమైన కిలిమంజారో పర్వతాన్ని సునాయాసంగా అధిరోహించాడు మనీష్‌యాదవ్. భరత జాతి కీర్తి ప్రతిష్ఠలను మరింత ఇనుమడింపజేశాడు. భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్లో తన స్నేహితులను కలిసేందుకు వెళ్లిన మనీష్ యాదవ్. వారిని చూసిన తర్వాతే కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాలనే ఆలోచనవచ్చింది. దీంతో ట్రైనర్ ఆనంద్ సదనపల్లిని కలిసి సలహాలు, సూచనలు తీసుకున్నాడు. అనంతరం 2023 అక్టోబర్ నుంచి భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్లో ఏడాది పాటు శిక్షణ తీసుకున్నాడు. 2025 జులై 16న కిలిమంజారో పర్వాతన్ని అధిరోహించేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరాడు. జులై 17న బరాఫు బేస్ క్యాంపుకు చేరుకున్నారు. అక్కడి నుంచి జులై 18న జిగ్‌జాగ్ మార్గంలో ప్రయాణం ప్రారంభించి 22 ఉదయం శిఖరంపైకి చేరుకుని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు.

ఫొటోగ్రఫీ పోటీ ఎంట్రీలకు ఆహ్వానం

- ఆగస్టు 10వ తేదీ చివరి గడువు

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నేపథ్యంలో

రాయదుర్గం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం –2025ను పురస్కరించుకుని జీవవైవిధ్యానికి నిలయమైన హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. హెచ్‌సీయూ కమ్యూనికేషన్ విభాగం ఫొటోగ్రఫీ ఔత్సాహికులందరికీ ఒక ఉత్సాహభరితమైన పోటీ నిర్వహించాలని తలపెట్టారు. సృజనాత్మక దృశ్య కథలను ప్రోత్సహించేందుకు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఒక వేదికను అందించడమే దీని లక్ష్యం. పోటీలను ఉచితంగా నిర్వహిస్తారు. ఆగస్టు 19 నుంచి 23వ తేదీ వరకూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ప్రదర్శనతోపాటు ఆగష్టు 19, 20 తేదీల్లో ఫొటోగ్రఫీ, విజువల్ మీడియా రంగానికి చెందిన ప్రముఖులతో ప్రసంగాలు ఉంటాయి. ఆసక్తిగలవారు తమ ఉత్తమ ఫొటోగ్రాఫ్‌ని ఆగస్టు 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని సూచించారు. ఈ పోటీలో అర్హత కలిగిన వారందరికీ మూడు విభాగాల్లో అవార్డులు, మూడు మెరిట్ సర్టిఫికెట్లు, ఇతరులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందిస్తారు. మరిన్ని వివరాలకు అధికారిక పోర్టల్లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా wpd2025@uohyd.ac.in కు ఈమేయిల్‌లోగానీ పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 82475 59845, 78158 59656లో సంప్రదించాలని కోరారు.



క్లుప్తంగా...

నేడు పోలవరంపై ప్రధాని మోదీ సమావేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతితోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు లేవనెత్తుతున్న ముంపు సమస్యపై ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 'పీఎం ప్రగతి'కార్యక్రమంలో భాగంగా వర్చువల్ విధానంలో దీనిని నిర్వహిస్తారు. సమావేశంలో ఏపీతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారు.

ఏపీ, తెలంగాణ ఐటీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా అనిల్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా మోరంపూడి అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఇన్‌కమ్ టాక్స్ టవర్స్‌లో బాధ్యతలు స్వీకరించారు. 1990 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి మోరంపూడి అనిల్ కుమార్ ఐటీ శాఖలో విజయవాడ, గుంటూరు, ముంబై, బెంగళూరు, కొచ్చిలోని కార్యాలయాల్లో పలు హోదాల్లో పనిచేశారు. కేరళ, లక్షదీప్‌లో ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఏపీ, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా వచ్చారు.

నేడు ఈడీ విచారణకు నటుడు ప్రకాశ్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోటింగ్ కేసులో నటుడు ప్రకాశ్‌రాజ్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరుకానున్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సినీతారల విచారణకు ఈనెల 21 ఈడీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈడీ ఇచ్చిన సమన్ల ప్రకారం నటుడు ప్రకాశ్‌రాజ్ బుధవారం విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే అదనపు సమయం కావాలని కోరుతూ మంగళవారం రాత్రి వరకు ప్రకాశ్‌రాజ్ నుంచి ఈడీ అధికారులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిసింది. దీంతో విచారణకు హాజరయ్యే అవకాశాలున్నాయని సమాచారం. ఇదే కేసులో లోన్ యాప్స్ ప్రచారకర్తలుగా వ్యవహరించిన నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సినీ హీరోలు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి సహా మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఈనెల 23న రానా దగ్గుబాటి ఈడీ విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. ముందస్తు సినిమా షెడ్యూల్ ఉన్న కారణంగా హాజరుకాలేనని, మరికొంత సమయం కావాలని కోరాడు. అలాగే ఆగస్టు 6న విచారణకు హాజరుకావాల్సిన విజయ్ దేవరకొండ కూడా సమయం ఇవ్వాలని ఇప్పటికే కోరారు.

హజ్ దరఖాస్తులకు రేపే ఆఖరు

హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబానీ ఖుస్రోపాషా

సాక్షి, హైదరాబాద్: 2026 హజ్ యాత్ర దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనుందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియాబానీ ఖుస్రోపాషా తెలిపారు. ఇప్పటి వరకు యాత్ర కోసం దరఖాస్తు చేసుకోనివారు.. వెంటనే నాంపల్లి హజ్ హౌస్‌లో దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 8 వేల దరఖాస్తులు మాత్రమే అందినట్లు తెలిపారు. ఈ ఏడాది హజ్ యాత్ర దరఖాస్తుల స్వీకరణకు కేంద్ర హజ్ కమిటీ తక్కువ వ్యవధి ఇచ్చిందని తెలిపారు. దీంతో దరఖాస్తులు తక్కువగా వచ్చాయని.. గడువును మరో 15 రోజులు పెంచాలని కేంద్ర హజ్ కమిటీని కోరినట్లు తెలిపారు.

ఐఐఎం డైరెక్టర్‌గా బీఎస్ మూర్తి



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బీఎస్ మూర్తి నియమితులయ్యారు. హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న మూర్తికి ఐఐఎం డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఐఐఎం 79వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ నియామకాన్ని ప్రకటించారు. మెటీరియల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ విభాగాల్లో పారిశ్రామిక, పరిశోధనలు చేసే ఐఐఎం దేశంలోనే అత్యున్నత సంస్థ. ఖనిజాలు, మెటీరియల్ సైన్స్, మెటలర్జికల్ ఇంజనీరింగ్‌లో నూతన ఆవిష్కరణలకు ఈ సంస్థ నిలయంగా ఉంది. బీఎస్ మూర్తి నాన్ ఈక్విలిబ్రియమ్ మెటీరియల్స్ ప్రాసెసింగ్‌లో కీలక పరిశోధనలు చేశారు. ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ మద్రాస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2019, ఆగస్టు నుంచి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం, టొరంటో మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయం, ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ విశ్వవిద్యాలయంలో అనుబంధ ప్రొఫెసర్‌గా కూడా ఉన్నారు.

ప్రజల తరఫున ప్రశ్నిస్తే అక్రమ కేసులు.. వేధింపులు

పీఏసీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజం

అన్నింటా విఫలమైన కూటమి ప్రభుత్వం ■ ఏ ఒక్క హామీ నిలబెట్టుకోకుండా పచ్చి మోసం



- అందుకే ప్రశ్నించే విపక్షం గొంతు నొక్కే ప్రయత్నం
- వేధింపులకు గురైన వారి కోసం త్వరలో ప్రత్యేక యాప్
- మన ప్రభుత్వం రాగానే బాధ్యులందరిపైనా చర్యలు
- తప్పు చేసిన వారందరినీ చట్టం ముందు నిలబెడతాం

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఎన్నికల్లో ఇచ్చిన 143 హామీల అమలులో, పరిపాలనలో అన్నింటా విఫలమైన టీడీపీ కూటమి ప్రభుత్వం.. ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, ప్రజలపై అక్రమ కేసులు పెడుతుండటాన్ని ప్రత్యేక యాప్‌లో నోట్ చేసి.. రేపు మన ప్రభుత్వం రాగానే బాధ్యులందరినీ చట్టం ముందు దోషులుగా నిలబెడదామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'వచ్చే ఒక యాప్ విడుదల చేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా, ఏ కార్యకర్త అయినా అధికారులతో వేధింపులకు గురైతే, లేదా ఏదైనా అన్యాయానికి గురైతే ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫిర్యాదు చేయొచ్చు. ఎవరితో, ఏ అధికారితో తాను ఇబ్బంది పడింది చెప్పొచ్చు. దానికి సంబంధించి ఆధారాలు ఉంటే, వాటినీ అప్‌లోడ్ చేయొచ్చు. అవన్నీ మన డిజిటల్ లైబ్రరీలోని సర్వర్‌కు చేరుతాయి. రేపు మన ప్రభుత్వం రాగానే, డిజిటల్ లైబ్రరీలో (సర్వర్) దాన్ని ఓపెన్ చేసి, అందుకు బాధ్యులైన వారెవ్వరినీ వదలకుండా చట్టం ముందు నిలబెడతాం. సినిమా చూపిస్తాం. వారు చేసినవన్నీ వడ్డీతో సహా చెల్లిస్తాం. ఈ రోజు వారు నాటే విత్తనం రేపు అదే పండుతుంది. అందుకే చక్రవడ్డీతో సహా చెల్లిస్తాం'అని తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సమావేశం జరిగింది. టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలు.. అక్రమ కేసులు, అరెస్టులు.. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులు నొక్కే ప్రయత్నం.. వైఎస్సార్‌సీపీలో చురుకుగా వ్యవహరిస్తున్న నాయకులే లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న వేధింపులు.. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం.. చంద్రబాబు చేసిన, చేస్తున్న మోసాలను ప్రజల్లో ఇంకా బలంగా ఎండగట్టడం.. బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తీసుకెళ్లడంపై సమావేశంలో వైఎస్ జగన్ చర్చించారు. కూటమి ప్రభుత్వ మోసాలు, అక్రమాలు, అవినీతిపై ప్రజల తరఫున ప్రశ్నిస్తూ.. పోరాటం చేస్తూ పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. సూచనలు, సలహాల కోసం పార్టీలో సీనియర్లను పీఏసీలోకి తీసుకొచ్చామని, నెలకోసారి పీఏసీ సమావేశం జరిగేలా చూస్తామని చెప్పారు. 'ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితులు అందరికీ తెలుసు. మనం ఇంకా కష్టపడాల్సి ఉంటుంది. చూస్తుండగానే దాదాపు ఏడాదిన్నర గడిచింది. ఇంకా మనకు మిగిలింది మూడేళ్లు మాత్రమే. ఈ సమయంలో ఈ రాక్షస పాలనను గట్టిగా ఎదుర్కొందాం'అని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

రాష్ట్రంలో ఎక్కడా పాలన అన్నదే లేదు

రాష్ట్రంలో ఎక్కడా పరిపాలన అనేది లేదు. ప్రజలకు ఏ మేలూ జరగడం లేదు. రాష్ట్రంలో విశృంఖలంగా అవినీతి.. యథేచ్ఛగా దోపిడీ సాగుతోంది. ప్రజల తరఫున ప్రశ్నిస్తే విపక్షం గొంతు నొక్కేందుకు అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారు. మన పార్టీ సీనియర్ నాయకులను జైళ్లలో పెడుతున్నారు. భవిష్యత్తులో మనం ఇదే సంప్రదాయం కొనసాగిస్తే టీడీపీ సీనియర్ నాయకులంతా జైళ్లలోనే ఉంటారు. ఎందుకంటే ఇక్కడ మన లీడర్లను అన్యాయంగా జైళ్లలో పెట్టారు. ప్రజల తరఫున మాట్లాడే వారిని, ప్రజా సమస్యలు ప్రస్తావించే వారిని ఇలా వేధించడం ఇదే మొదటిసారి. నిజానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి, సుపరిపాలన అందిస్తే, ఇలాంటి చర్యలు చేయాల్సిన అవసరం లేదు. కానీ ఏ హామీ అమలు చేయకపోవడంతో, ప్రజల వద్ద ముఖం చెల్లక ఇలా ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలప్పుడు ఎన్నెన్నో హామీలు ఇచ్చారు. 18 ఏళ్లకు మించిన మహిళలు రాష్ట్రంలో 2.10 కోట్లు ఉన్నారు. వారికి నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామన్న హామీ నెరవేర్చలేదు. ఈ పథకాన్ని అమలు చేయాలంటే, రాష్ట్రాన్ని అమ్మాలంటున్నారు. మరి ఎందుకు హామీ ఇచ్చినట్లు?

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సక్సెస్

'రీకాలింగ్ ఆఫ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో'.. బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం బాగా కొనసాగుతోంది. ఇప్పటికే 175 నియోజకవర్గాలకు గాను 169 చోట్ల జరిగింది. ఆరు నియోజకవర్గాల్లో వేర్వేరు కారణాల వల్ల ఆలస్యమైంది. 640 మండలాల్లో దాదాపు 538 మండలాల్లో పూర్తి కాగా, మిగిలిన 102 మండలాల్లో వేగంగా పూర్తి చేస్తాం. దాదాపు 90 నియోజకవర్గాల్లో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమం సాగుతోంది. మన క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రతి ఇంటికీ ఈ కార్యక్రమం చేరుతోంది. ఆ ఇంటికి చంద్రబాబు ఎంత బాకీ ఉన్నాడు.. గత ఏడాది ఎంత ఎగ్గొట్టాడు.. ఈ ఏడాది ఎంత బాకీ పడుతున్నాడు.. అనేది చెబుతున్నాం.

జగన్ భద్రతపై ఆందోళన

ఇటీవలి పర్యటనల్లో వైఎస్ జగన్‌కు ప్రభుత్వం తగిన భద్రత కల్పించక పోవడంపై సమావేశంలో పీఏసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇటీవల చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో పర్యటన సందర్భంగా పోలీసులు చూపిన నిర్లక్ష్యాన్ని సమావేశంలో సభ్యులు ప్రస్తావించారు. ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వం ఆయనకు తగిన భద్రత కల్పించడం లేదని తేల్చి చెప్పారు. జగన్ భద్రతపై వినిపిస్తున్న కథనాలు తమను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. వీటన్నింటి నేపథ్యంలో జగన్ మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని పార్టీ పీఏసీ సభ్యులు స్పష్టం చేశారు.

ప్రత్యేక యాప్.. డిజిటల్ లైబ్రరీ

వచ్చే వారంలో మనం ఒక యాప్ విడుదల చేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా, ఏ కార్యకర్త అయినా అధికారులతో వేధింపులకు గురైతే, లేదా ఏదైనా అన్యాయానికి గురైతే ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫిర్యాదు చేయొచ్చు. మీకు ఏ రకంగా అన్యాయం జరిగింది..? అని ఆ యాప్‌లో స్పష్టంగా ఉంటుంది. ఫలానా అధికారి.. ఫలానా నాయకుడి ఆదేశాలతో నాపై అన్యాయంగా, అక్రమంగా కేసు పెట్టి.. చిత్రహింసలకు గురి చేశారని బాధితులంతా ఫిర్యాదు చేయొచ్చు. ఏ అధికారి ఎలా ఇబ్బంది పెట్టారో.. ఏ విధంగా బాధ పెట్టారో.. తద్వారా ఎలా ఇక్కట్లకు గురయ్యారో.. ఇబ్బంది పెట్టిన వారి పేర్లతో సహా వివరించవచ్చు. ఎవరి ప్రోద్బలంతో ఇబ్బందులకు గురి చేశారో స్పష్టంగా చెప్పొచ్చు. దానికి సంబంధించిన ఆధారాలు ఉంటే, వాటినీ అప్‌లోడ్ చేయొచ్చు. అవన్నీ మన డిజిటల్ లైబ్రరీలోని సర్వర్‌కు చేరుతాయి. రేపు మన ప్రభుత్వం రాగానే, డిజిటల్ లైబ్రరీలో (సర్వర్) దాన్ని ఓపెన్ చేస్తాం. ఎవరెవరైతే మన కార్యకర్తలకు అన్యాయం చేశారో వారెవ్వరినీ వదలకుండా చట్టం ముందు నిలబెడతాం. వారందరికీ సినిమా చూపిస్తాం. వారు చేసినవన్నీ వడ్డీతో సహా చెల్లిస్తాం. ఇక్కడ మనం ఎలాంటి అన్యాయం చేస్తామనడం లేదు. ఈ రోజు వారు ఏ విత్తనం విత్తుతున్నారో రేపు అదే పండుతుంది. అందుకే చక్రవడ్డీతో సహా చెల్లించే పరిస్థితి వస్తుంది.

'సరస్వతి' షేర్ల బదిలీ చెల్లదు

- తేల్చిచెప్పిన జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్
- వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాదనలతో ఏకీభవించిన బెంచ్
- షర్మిల చేసుకున్న షేర్ల అక్రమ బదిలీని నిలిపేయాలన్న పిటిషన్‌కు అనుమతి
- షేర్ల బదిలీ అక్రమమేనంటూ ఎన్‌సీఎల్‌టీ తుది ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన షేర్ల బదిలీ వ్యవహారంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వాదనలతో జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఏకీభవించింది. తన పేరిట, వైఎస్ భారతి పేరిట సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో ఉన్న షేర్లను తల్లి విజయమ్మ ద్వారా చెల్లెలు షర్మిల అక్రమంగా బదిలీ చేసుకున్నారని, తమ అనుమతి లేకుండా, షేర్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లపై తమ సంతకాలు లేకుండా చేసుకున్న ఆ బదిలీ చెల్లదని, దాన్ని నిలిపివేయాలని అభ్యర్థిస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేసిన పిటిషన్‌ను బెంచ్ అనుమతించింది. ఆ షేర్ల ట్రాన్స్‌ఫర్ చెల్లదంటూ... షర్మిలకు బదిలీ అయిన వాటాలను నిలుపుదల చేస్తూ మంగళవారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. సరస్వతి కంపెనీలోని తమ షేర్లను తల్లి విజయమ్మ ద్వారా చెల్లెలు షర్మిల అక్రమంగా షేర్లు బదిలీ చేసుకున్నారని ఎన్‌సీఎల్‌టీలో 2024, సెప్టెంబర్ 3న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తమ సంతకాలు లేకుండా, ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు లేకుండా బదిలీ జరిగిందని చెప్పారు. దీన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలివ్వాలని ట్రిబ్యునల్‌ను కోరారు. ఈ పిటిషన్‌పై ఇరుపక్షాల తరఫునా సుదీర్ఘ వాదనలు విన్న రాజీవ్ భరద్వాజ్ (జ్యుడీషియల్), సంజయ్ పూరి (టెక్నికల్) సభ్యుల ధర్మాసనం ఈ నెల 15న తీర్పు రిజర్వు చేసి... మంగళవారం తుది ఉత్తర్వులు వెలువరించింది.

జగన్‌కు గిఫ్ట్‌ను వెనక్కుతీసుకునే హక్కుంది...

ఎలాంటి షరతులు లేకుండా, ప్రేమాభిమానాలతో బహుమతిగా ఇచ్చిన ఆస్తిని ఎప్పుడైనా వెనక్కు తీసుకునే అధికారం దాతకు ఉంటుందని ఎన్‌సీఎల్‌టీలో జగన్‌మోహన్ రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి వాదనల సందర్భంగా నివేదించారు. వైఎస్ షర్మిలపై ప్రేమ, అనురాగంతో తొలుత చేసుకున్న ఒప్పందమే రద్దైనప్పుడు, ఆ ఒప్పందం పరిధిలో తరువాత చేసుకున్న గిఫ్ట్ డీడ్‌కు చెల్లుబాటు ఉండదని స్పష్టం చేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన బెంచ్... షేర్ల బదిలీ చెల్లదని తుది తీర్పులో స్పష్టం చేసింది.

జీఎస్ఎల్‌వీ ఎఫ్16 ప్రయోగం నేడే

తిరుమల/శ్రీకాళహస్తి/సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) తొలిసారిగా సంయుక్తంగా రూపొందించిన నాసా–ఇస్రో సింథటిక్ ఆపార్చర్ రాడార్ (నిసార్) అనే ఉపగ్రహాన్ని బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగించనున్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.నారాయణన్ ఆధ్వర్యంలో కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జియో సింక్రనస్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ ఎఫ్16) రాకెట్ ద్వారా 2,392 కేజీల బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్లు ఎత్తులోని సూర్య–సమకాలిక కక్ష్యలోకి నిసార్‌ను ప్రవేశపెట్టనున్నారు. భూగోళాన్ని పరిశోధించేందుకు ఎంతో దోహదపడే ఈ ఉపగ్రహం సుమారు 10 ఏళ్ల పాటు సేవలు అందిస్తుంది.

భవిష్యత్తులో ఇస్రో–నాసా కలిసి మరిన్ని ప్రయోగాలు ..

ఇస్రో, నాసా బంధం బలపడి రాబోయే కాలంలో మరో మూడు ప్రయోగాలను సంయుక్తంగా నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నామని ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.నారాయణన్ పేర్కొన్నారు. అలాగే, చంద్రయాన్–4 ప్రయోగ పనులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి గగన్‌యాన్–1 పేరుతో ప్రయోగం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో కూడా మరో నాలుగు ప్రయోగాలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మంగళవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాకెట్ నమూనాలను స్వామివారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తిలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని, సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. జీఎస్ఎల్‌వీ ఎఫ్16 ప్రయోగం విజయవంతం కావాలని పూజలు చేశారు.



షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై జీఎస్ఎల్‌వీ ఎఫ్16 ఉపగ్రహ వాహకనౌక

తప్పుడు కేసులతో ఎలా వేధిస్తారో

మాకు బాగా తెలుసు

రాజీ చేసుకోవాలని పోలీసులు ఎలా ఒత్తిడి చేస్తారో.. ఎలా బెదిరిస్తారో కూడా తెలుసు

ఏపీ హైకోర్టు ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు ● పిడుగురాళ్ల ఎస్‌హెచ్‌వోపై మండిపాటు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'ముద్రా' సొసైటీ చైర్మన్ అరెస్టు

రూ.140 కోట్ల వరకు మోసం చేసిన రామదాసప్పనాయుడు

సాక్షి, హైదరాబాద్: అధిక వడ్డీలతోపాటు రెండేళ్లలో ప్రభుత్వ ఉద్యోగులుగా మారొచ్చని తప్పుడు ప్రకటనలు ఇచ్చి రెండు వేల మందికిపైగా బాధితుల నుంచి రూ.140 కోట్లు కొల్లగొట్టిన కేసులో ముద్రా అగ్రికల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీ–స్టేట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ తిప్పనేని రామదాసప్పనాయుడును తెలంగాణ సీఐడీ అధికారులు మంగళవారం ఏపీలోని అమరావతిలో అరెస్ట్ చేశారు. ఆయనతోపాటు సొసైటీ సభ్యుడు, ఆయన కుమారుడు తిప్పనేని సాయి కిరణ్‌ని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఇద్దరినీ హైదరాబాద్‌లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్టు సీఐడీ అడిషనల్ డీజీ చారుసిన్హా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. తిప్పనేని రామదాసప్పనాయుడు, ఇతరులు కేంద్ర ప్రభుత్వం యొక్క ప్రధానమంత్రి ముద్రా యోజన పేరును అనుకరిస్తూ, ముద్రా అగ్రికల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీ–స్టేట్ కోఆపరేటివ్ సొసైటీని స్థాపించారు. దానిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థగా ప్రచారం చేశారు. రైతులు, నిరుద్యోగ యువతను ఉద్యోగాలు, అధిక వడ్డీ రాబడుల పేరిట వాగ్దానాలతో ఆకర్షించారు. రెండేళ్లలో సొసైటీ పూర్తిస్థాయి బ్యాంకుగా మారుతుందని, సభ్యులందరూ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులవుతారని తప్పుడు హామీలు ఇచ్చారు. ఆ తర్వాత 2000 గవర్నమెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ ఉద్యోగాలను ఆఫర్ చేస్తూ తెలుగు వార్తాపత్రికల్లో ప్రకటనలు ప్రచురించారు. ఈ ప్రకటనలను నమ్మిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అనేకమంది దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగాల్లో చేరేందుకు వచ్చేవారి నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకొని, షేర్ క్యాపిటల్, ఇన్వెస్ట్‌మెంట్ బాండ్ల పేరుతో డబ్బులు సేకరించారు. ఉద్యోగులకు రైతుల నుంచి డిపాజిట్లు సేకరించే లక్ష్యాలు నిర్దేశించారు. విఫలమైతే వారి జీతాల నుంచి కోత పెట్టారు. రాజీనామా చేసిన ఉద్యోగులకు వారి ధ్రువపత్రాలు, పెట్టుబడులు తిరిగి ఇవ్వకుండా, 'మార్గదర్శి' పత్రికలో వ్యతిరేక ప్రచారం చేస్తామని బెదిరించారు. ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకొని, జీతాలను కూడా నిలిపివేశారు. ఇలా ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి రోజువారీ కూలీలు, రైతులు, చిన్న వ్యాపారుల నుంచి సుమారు రూ.140 కోట్లు సేకరించారు. ఆ తర్వాత మోసానికి తెరతీశారు. దీనిపై తెలంగాణవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులన్నీ కలిపి సీఐడీ దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో భాగంగా ఇద్దరు కీలక నిందితులను అరెస్టు చేసినట్టు చారుసిన్హా తెలిపారు.



శ్రీవారికి బంగారు శంఖు, చక్రాలు విరాళం

తిరుమల: శ్రీ వేంకటేశ్వరస్వామికి చెన్నైకు చెందిన సుదర్శన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ రూ.2.4 కోట్ల విలువైన రెండున్నర కిలోల బంగారు శంఖు, చక్రాలను విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం వాటిని టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు.

శ్రీవారికి విరాళంగా రూ.18.75లక్షల ఆస్తి

తిరుమల: హైదరాబాద్ మల్కాజ్‌గిరి వసంతపురి కాలనీకి చెందిన టి.సునీతాదేవి, టి.కనకదుర్గప్రసాద్ దంపతులు రూ.18.75 లక్షల విలువైన 250 చదరపు గజాల తమ ఇంటిని శ్రీవారికి విరాళంగా ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన మాజీ ఐఆర్ఎస్ అధికారి స్వర్గీయ భాస్కర్‌రావు ఇటీవల తన మరణానంతరం వీలునామా ద్వారా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి రూ.3 కోట్ల విలువైన ఇల్లు, రూ.66 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను విరాళంగా ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన స్ఫూర్తితో టి.సునీతాదేవి, టి.కనకదుర్గప్రసాద్ దంపతులు తమకు సంతానం లేకపోవడంతో తమ ఆస్తి శ్రీవారికి చెందేలా వీలునామా రాశారు. ఆస్తి పత్రాలను మంగళవారం తిరుమలలోని అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు.

గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తులు

నేటి నుంచి ఆగస్టు 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం బుధవారం నుంచి ఆన్‌లైన్ లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీసెట్–2025 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో https://mjptbcwreis.telangana.gov.in,https://ug.mjptbcwreis.net/ వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వనపర్తి, కరీంనగర్‌లో ఉన్న మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఆగస్టు 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈఏపీసెట్–2025 ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని, ఉచిత విద్యతో పాటు హాస్టల్ వసతి, భోజన సదుపాయాలు అందిస్తామని తెలిపారు. సీటు సాధించిన విద్యార్థినులు కాలేజీ హాస్టల్‌లోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి వార్షిక ఆదాయం రూ.2,00,000లకు మించని విద్యార్థినులు మాత్రమే అర్హులని తెలిపారు. సీట్ల కేటాయింపులో ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్లు పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. దరఖాస్తు చేయడంలో ఏమైనా సందేహాలుంటే కార్యాలయ పనివేళల్లో 040–2332 8266 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

91.2 శాతం ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

షెడ్యూల్ కన్నా ముందే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ రెండో విడత సీట్లను మంగళవారం కేటాయించారు. ఇప్పటివరకు 83,521 (91.2 శాతం) సీట్లు కేటాయించినట్టు సాంకేతిక విద్యావిభాగం వెల్లడించింది. ఇంకా 7,974 సీట్లు మిగిలిపోయినట్టు తెలిపింది. ఈనెల 30వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపిన అధికారులు, ముందే వెల్లడించడం విశేషం. కౌన్సెలింగ్‌లో 178 కాలేజీలు పాల్గొన్నాయి. తాజాగా పెరిగిన సీట్లతో కలుపుకొని 91,495 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి, రెండో విడతకు కలిపి 96,974 మంది 36,74,976 ఆప్షన్లు ఇచ్చారు. 21,402 మందికి వివిధ కాలేజీల్లో సీట్లు మారాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో కొత్తగా 23,509 సీట్లు కేటాయించారు. 6,377 మందికి ఆప్షన్లు ఇచ్చినా, అవి సరిగా లేని కారణంగా సీట్లు కేటాయించలేదు. 6,445 సీట్లను ఈడబ్ల్యూఎస్ కోటా కింద కేటాయించారు. ఐదు యూనివర్సిటీలు, 72 ప్రైవేటు కాలేజీల్లో వంద శాతం సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు వచ్చే నెల 2వ తేదీలోగా రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

కంప్యూటర్ సీట్లల్లో 95 శాతం భర్తీ

కంప్యూటర్ సైన్స్, ఇతర అనుబంధ ఎమర్జింగ్ కోర్సుల్లో 64,813 సీట్లు అందుబాటులో ఉంటే, రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత 61,845 (95.42 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 2,968 సీట్లు మిగిలిపోయాయి. సీఎస్ఈలో 30,655 సీట్లకు 29,488 సీట్లు, ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో 12,215 సీట్లకు 10,905 భర్తీ అయ్యాయి. ఇంకా 1,310 సీట్లు మిగిలిపోయాయి ఈఈఈ బ్రాంచ్‌లో 73.10 శాతం భర్తీ అయితే, సివిల్ ఇంజనీరింగ్‌లో 76.08, మెకానికల్‌లో 68.49 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

ప్రధాన బ్రాంచ్‌ల్లో సీట్ల భర్తీ ఇలా...

వెళ్తే.. అభ్యంతరం చెప్పొద్దు!

వరుసగా లొంగిపోతున్న సీనియర్ మావోయిస్టులు

వివరాలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

చాలా ఖర్చు పెట్టాం... కొంచెమైనా పెంచండి

- ఫీజులు పెంచకుంటే కాలేజీల్లో నాణ్యత డొల్ల
- ప్రతీ ఏటా ద్రవ్యోల్బణం పెరుగుతోంది
- ఇంజనీరింగ్ ఫీజుల కమిటీ వద్ద ప్రైవేటు కాలేజీలు
- ఫీజులు ఎందుకు పెంచాలని ప్రశ్నించిన కమిటీ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: కాలేజీలు బతికి బట్టకట్టాలంటే కనీస మాత్రమైనా ఫీజులు పెంచాలని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు కోరాయి. చాలా ఖర్చు పెట్టామని, పెంచకపోతే కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలు పడిపోతాయని చెప్పాయి. 2025–26 విద్యా సంవత్సరానికి ఫీజుల పెంపుపై పరిశీలనకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ మంగళవారం భేటీ అయింది. జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశానికి కమిటీ సభ్యులు దేవసేన, ఎం.వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య, తమిళనాడు ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ విజయకుమార్ హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. ఫీజుల పెంపుపై ఆరు వారాల్లో స్పష్టత ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఫీజులు, కాలేజీల్లో నాణ్యతపై కమిటీ సభ్యులు చర్చించారు. అనంతరం కాలేజీ యాజమాన్యాల వాదనలు విన్నారు.

ఫీజులెందుకు పెంచాలి?

అసలు ఫీజులు ఎందుకు పెంచాలో చెప్పండంటూ కమిటీ సభ్యులు ప్రైవేటు కాలేజీలను ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో ఫీజులు తక్కువగా ఉన్నాయన్నారు. తమిళనాడులో అన్ని కాలేజీలకూ ఒకే ఫీజు వర్తిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మన రాష్ట్రంలో ప్రతీ మూడేళ్లకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. కొన్ని కాలేజీలు నిబంధనల ప్రకారం అర్హులను రికార్డుల్లో చూపిస్తున్నాయని, అర్హత లేని వారితో బోధన చేయిస్తున్నాయని, వేతనాలు కూడా వారి ఖాతాల్లో వేసి తిరిగి యాజమాన్యాలు తీసుకుంటున్నాయనే ఫిర్యాదులను ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ప్రస్తావించినట్టు తెలిసింది. కంప్యూటర్ కోర్సులకు తగ్గ మౌలిక వసతులు లేవన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయని కమిటీ సభ్యులు చెప్పారు.

పెంచకుంటే ఫ్యాకల్టీ ఉండదు..

సీబీఐటీ, వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి, స్టాన్లీ, వీబీఐటీ, వాసవీ, నారాయణమ్మ, ఎస్, వాగ్దేవి సహా పది ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. మౌలిక వసతుల కల్పనలో ప్రతీ ఏటా ఖర్చు చేస్తున్నామని వారు తెలిపారు. ఉద్యోగులకు వేతనాలు ప్రతీ ఏటా పెంచుతున్నామని, ఫీజుల పెంపు లేకుంటే, పీహెచ్‌డీ ఉన్న ఫ్యాకల్టీ వేరే రాష్ట్రాలకు వెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. అన్ని కాలేజీలను ఒకే గాటన కట్టొద్దని కోరారు. ఏటా పెరిగే ద్రవ్యోల్బణాన్ని ఫీజుల పెంపునకు ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. తమిళనాడులో కొన్ని దశాబ్దాల క్రితం కాలేజీలు పెట్టారని, వాళ్లంతా బడా పారిశ్రామిక వేత్తలని తెలిపారు.

పేరుకే చైర్మన్... పెత్తనం వాళ్లదేనా?

ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఉన్నప్పటికీ విద్యాశాఖ, సాంకేతిక విద్య అధికారులే సమావేశంలో కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఫీజులపై విధివిధానాలు, ఏ కోణంలో వెళ్లాలో ముందే సన్నద్ధమై వెళ్లిన బాలకిష్టారెడ్డికి ఆ అవకాశం కూడా చిక్కలేదని తెలిసింది. కమిటీ చైర్మన్‌గా తానెందుకు అన్న భావన సన్నిహితుల వద్ద వ్యక్తం చేసి, వాపోయినట్టు తెలిసింది. ఇదే విధమైన పెత్తనం చెలాయిస్తే తాము కూడా సభ్యులుగా ఉండలేమని కమిటీలోని ఇతర సభ్యులుగా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

సాహసపథం

బ్రహ్మపుత్ర మెచ్చిన సాహస పుత్రిక



వాసుపల్లి కవిత

**సాహసం సైలెంట్‌గా ఉండదు.
కంచుకంఠంతో మనలోని ఆత్మవిశ్వాసాన్ని తట్టి లేపుతుంది.
ఆ పిలుపును కాలేజీ రోజుల్లోనే అందుకుంది శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతానికి చెందిన వాసుపల్లి కవిత.
సాహసంతో చెలిమి చేసిన కవిత బ్రహ్మపుత్రలో రివర్ రాఫ్టింగ్ విజయవంతంగా పూర్తి చేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించింది.
ఆర్మీ వైద్యాధికారి అయిన కవిత అరుణాచల్‌ప్రదేశ్‌లో అత్యంత ఎత్తయిన గోరీచెన్ పర్వతాన్ని ఐదుసార్లు అధిరోహించింది.
మరెన్నో సాహసయాత్రలకు సిద్ధం అవుతోంది.**





ఉద్దానం ప్రాంతమైన వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలోని సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన వాసుపల్లి కవితకు చిన్నప్పటి నుంచి క్రీడలు, స్విమ్మింగ్ అంటే ఇష్టం. చదువులోనూ ముందుండేది. కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించింది. శ్రీకాకుళంలోని రిమ్స్ వైద్య కళాశాలలో సమయంలో ట్రెక్కింగ్ చేసేది.

ప్రాణదాత

పర్వతారోహణలో శిక్షణ తీసుకున్న కవిత అరుణాచల్‌ప్రదేశ్‌లో అత్యంత ఎత్తయిన గోరీ చెన్ పర్వతాన్ని ఐదుసార్లు అధిరోహించింది. కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల ఆధ్వర్యంలో గోరీ చెన్ అధిరోహించి కిందికి వస్తున్న సమయంలో బృందంలోని ఒక యువ సభ్యురాలు ఊపిరి అందక ప్రమాదంలో పడింది. కవిత ఆమెకు తక్షణ వైద్యం అందించి ప్రాణపాయం నుంచి తప్పించింది.

బ్రహ్మపుత్రలో రాఫ్టింగ్ సజావుగా ఏమీ సాగలేదు. ప్రాణం మీదికి తెచ్చిన ప్రమాదాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. నది పొడవునా ప్రవాహ తీవ్రత, 11 అడుగుల ఎత్తులో ఎగిసిపడే అలల ఉధృతి కారణంగా ఏర్పడిన సుడిగుండంలో చిక్కుకుని బృందం ప్రమాదంలో పడింది. కాస్త ఓపిక పడితే ప్రమాదం నుంచి బయటపడొచ్చు అనుకున్నారు. ధైర్యం కోల్పోలేదు. పెద్ద అల నుంచి తప్పించుకుని, ఈదుకుంటూ రాఫ్ట్‌ను చేరుకున్నారు. ఇలా నాలుగుసార్లు రాఫ్ట్ నుంచి పడిపోయినా ముందుకే సాగారు. యాత్రలో రోజుకు 12 గంటలపాటు 70 కిలోమీటర్ల మేరకు ప్రయాణించి రాత్రివేళల్లో విశ్రాంతి తీసుకునేవారు.

సైన్యంలోకి....

సైన్యంలో పనిచేయాలనే ఆసక్తి కవితలో ఉండేది. 2021లో ఆర్మీ వైద్యాధికారిగా కెప్టెన్ హోదాలో పోస్టింగ్ పొందిన కవిత మేజర్ స్థాయికి చేరింది. అరుణాచల్ ప్రదేశ్‌లో పనిచేస్తున్నప్పుడు సాహస క్రీడలపై ఇష్టంతో 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్'లో చేరి పర్వతారోహణకు సంబంధించి రెండు కోర్సులు, రివర్ రాఫ్టింగ్‌లో ఒక ప్రత్యేక కోర్సు చేసింది.

బ్రహ్మపుత్రలో సాహస యాత్ర

అత్యంత క్లిష్టమైన బ్రహ్మపుత్ర నదిలో 1040 కిలోమీటర్ల మేరకు విజయవంతంగా రివర్ రాఫ్టింగ్ పూర్తి చేసింది కవిత. కల్నల్ రణవీర్ సింగ్ నేతృత్వంలోని పన్నెండు మంది సభ్యుల బృందంలో ఆమె ఏకైక మహిళ.

బ్రహ్మపుత్రలో రివర్ రాఫ్టింగ్ విజయవంతంగా పూర్తి చేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించింది. భారత-టిబెట్ సరిహద్దులోని గెల్లింగ్ గ్రామం నుంచి బ్రహ్మపుత్రలో ప్రయాణం ప్రారంభించి, ఏకధాటిగా 28 రోజులపాటు రివర్ రాఫ్టింగ్ చేశారు. ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్న హాట్సింగిమారి దగ్గర తమ సాహసయాత్ర ముగించారు.

ప్రాణం మీదికి వచ్చినా సరే...

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో...

సైన్యంలో చేసిన సేవలకు గుర్తింపుగా 'చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్' అవార్డు అందుకుంది కవిత. గోరీచెన్ పర్వతారోహణ సందర్భంగా తోటి పర్వతారోహకురాలికి చికిత్స చేసినందుకు రాష్ట్రపతి విశిష్ట సేవా మెడల్‌కు ఎంపికైంది. బ్రహ్మపుత్రలో రివర్ రాఫ్టింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సాధించింది.

– కందుల శివశంకర్, సాక్షి, శ్రీకాకుళం



ఏక్తా కపూర్

● సక్సెస్ స్టోరీ

ముచ్చటగా మూడు దశాబ్దాలు

వినోద పరిశ్రమలో మూడు దశాబ్దాల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసింది ఏక్తా కపూర్. ఈ ప్రయాణంలో ఎన్నో పాఠాలు నేర్చుకుంది. తనను తాను తీర్చిదిద్దుకుంది.

పదిహేడు సంవత్సరాల వయసులో కెరీర్ ప్రారంభించిన ఏక్తా కపూర్ హిందీలో ఎన్నో టీవీ సోప్ ఒపెరాలను నిర్మించింది. 'క్యోంకీ సాస్ భీ కభీ బహూ థీ' 'కహానీ ఘర్ ఘర్ కీ'... వంటివి వాటిలో బాగా పాపులర్ అయ్యాయి.

'బాలాజీ మోషన్ పిక్చర్స్' బ్యానర్‌పై నిర్మాతగా 'ది డర్టీ పిక్చర్' 'డ్రీమ్ గర్ల్' 'క్రూ'లాంటి సినిమాలు నిర్మించింది. 2017లో వీడియో ఆన్ డిమాండ్ ప్లాట్‌ఫామ్ 'ఆల్ట్ బాలాజీ' ప్రారంభించింది.

ఏక్తా కపూర్‌ది నల్లేరు మీద నడకేమీ కాదు. మొదట్లో కొన్ని ప్రాజెక్ట్‌లు ఫెయిల్ అయ్యాయి. ఆరు పైలట్ ఎపిసోడ్‌లు రిజెక్ట్ అయ్యాయి.

'హమ్ పాంచ్' టీవీ సిరీస్ రూపంలో తొలి సక్సెస్ వచ్చింది. ఇక ఆ తరవాత వెనక్కి తిరిగి చూసుకోలేదు.

ఆంగ్ల అక్షరం 'కె'ను లక్కీ ఆల్ఫాబెట్‌గా భావించే ఏక్తా 'కె'తో ప్రారంభమయ్యే టైటిల్‌తో ఎన్నో షోలు నిర్మించింది. ఏక్తాకపూర్ అదృష్టాన్ని నమ్ముకుందా, తన కష్టాన్ని నమ్ముకుందా అనే విషయానికి వస్తే... ఒక ప్రసిద్ధ మాటను గుర్తు తెచ్చుకోవడం అవసరం.

'కష్టపడేవారినే అదృష్టం ఇష్టపడుతుంది'

'కింగ్‌డమ్ ఆఫ్ ది సోప్ క్వీన్: దీ స్టోరీ ఆఫ్ బాలజీ టెలిఫిల్మ్' పేరుతో ఏక్తా కపూర్ బయోగ్రఫీ వచ్చింది.

టీనేజ్ అలెర్ట్

మనింట్లో ఇలాంటి అభిమానులున్నారా?

**సినీ అభిమానం వెర్రితలలు వేసి భవిష్యత్తు నాశనం చేసుకునే విధంగా టీనేజ్ పిల్లలు తయారవుతున్నారా? కర్నాటకలో ఇలాగే జరుగుతోంది.
అక్కడ హీరో దర్శన్ అభిమానులు తనపై అత్యాచారం చేస్తామని, చంపుతామని బెదిరిస్తున్నారని నటి రమ్య కేసు పెట్టారు.
గతంలో దర్శన్ అభిమాని రేణుకా స్వామి ఇలాంటి మెసేజ్‌లే పెట్టి హత్యకు గురయ్యాడు.
ఆ కేసులో దర్శన్ నిందితుడు.
ఈ నేపథ్యంలో అతడికి బెయిలు మంజూరు అవడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది.
రమ్య సుప్రీంకోర్టును మెచ్చుకుంటూ ట్వీట్ చేసింది.
దాంతో ఆమెను చంపుతామని అభిమానులు బయలుదేరారు.
చదువు, ఉద్యోగాల్లో ఉండాల్సిన యువత ఇలాంటి పనుల్లో ఉంటే సరిదిద్దుతున్నామా?**



కన్నడ హీరో దర్శన్ అభిమానులపై కేసు పెట్టిన నటి రమ్య

ఇంట్లో ఉన్న పిల్లలు బయట ఏ అస్తిత్వంతో ఉన్నారో తల్లిదండ్రులు చెక్ చేసుకుంటున్నారా? వారు ఫలానా తల్లిదండ్రుల పిల్లలు అనో, కాలేజీ పిల్లలు అనో, ఏరియా పిల్లలు అనో గుర్తింపు పొందుతున్నారా? లేదా ఫలానా హీరో ఫ్యాన్స్ అనో, రాజకీయ పార్టీ అభిమానులనో, వాట్సాప్ గ్రూప్‌కు సంబంధించిన యాక్టివ్ మెంబర్లనో అందరికీ తెలుస్తున్నారా?

హైస్కూల్, కాలేజీ వయసు దాటాక ఇటీవల ఉద్యోగాల్లో చేరాక కూడా మెచ్యూరిటీ లేని విధంగా కేవలం 'ఫ్యాన్స్'గా ఉంటూ సొంత/దొంగ ఐడీలతో దాడి చేసే కుసంస్కారంతో ఉంటే గనక వీరి భవిష్యత్తు ఏమవుతుందో... అనే బాధ తల్లిదండ్రులకు ఉండటం చాలా సహజం. పత్రికల్లో కనిపిస్తున్న రోజువారీ ఘటనలు 'వెర్రి అభిమానం' వల్ల ప్రమాదం తెచ్చుకుంటున్న యువతను చూపెడుతున్నాయి. ఇంకానా ఇకపైనైనా మారండి అని హెచ్చరిస్తున్నాయి.

దర్శన్ అభిమానులు ఏం చేశారు?

గత రెండు రోజులుగా కన్నడ హీరో దర్శన్ అభిమానులు అక్కడి నటి, మాజీ ఎం.పి. అయిన రమ్యను సోషల్ మీడియాలో తీవ్ర పదజాలంతో హింసిస్తున్నారు. ఆమెను చంపుతామని, రేప్ చేస్తామని ఇంకా రాయడానికి వీలుకాని భాషలో ఆమెకు క్షోభ కలిగిస్తున్నారు. దానికి కారణం ఇటీవల ఆమె సోషల్ మీడియాలో చేసిన కామెంట్. దర్శన్‌కు గతంలో కర్నాటక హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. దానిని కర్నాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేస్తే సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేస్తూనే కర్నాటక హైకోర్టు బెయిల్ ఎలా మంజూరు చేసిందనే విషయమై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇది చాలా అసమంజసం అని చెప్పింది. ఈ విషయాన్నే ఉటంకిస్తూ రమ్య సోషల్ మీడియాలో 'సుప్రీంకోర్టు ఒక ఆశాకిరణంలా కనిపిస్తోంది' అని రాసింది. అంటే దర్శన్ బెయిల్ మీద బయట తిరగడం సరి కాదు అని ఆమె ఉద్దేశం. దీంతో ఫ్యాన్స్ రెచ్చిపోయారు.



దర్శన్

దర్శన్ కేసు

దర్శన్ 2024 జూన్‌లో అరెస్ట్ అయ్యాడు. దీనికి కారణం చిత్రదుర్గకు చెందిన తన అభిమాని రేణుకా స్వామి హత్యలో అతని ప్రమేయం ఉందనే అభియోగం. రేణుకా స్వామి కూడా 'వెర్రి అభిమాని'గా ఉండి ప్రాణం మీద తెచ్చుకున్నాడు. జరిగింది ఏమంటే దర్శన్‌కు, అతని భార్య విజయలక్ష్మికి కొంత కాలంగా సయోధ్య లేదు. అందుకు కారణం దర్శన్ గర్ల్‌ఫ్రెండ్ పవిత్ర గౌడ అని కొందరు అభిమానులు భావించారు. దర్శన్ అభిమాని అయిన రేణుకా స్వామి దర్శన్ జీవితంలో కలత రేపిన పవిత్ర గౌడను సోషల్ మీడియాలో అబ్యూజ్ చేయసాగాడు. అతని కామెంట్లు భరించలేని పవిత్ర ఈ సంగతిని దర్శన్ దృష్టికి తీసుకు రాగా అతను తన అభిమానులతో కలిసి రేణుకా స్వామిని హత్య చేయించాడని అభియోగం. ఈ కేసు విచారణలో ఉండగానే డిసెంబర్, 2024లో కర్నాటక హైకోర్టు దర్శన్‌కు బెయిల్ ఇచ్చింది. దానిని తాజాగా సుప్రీంకోర్టు తప్పు పట్టింది. అలా తప్పు పట్టడం సరైన విషయంగా రమ్య భావిస్తూ కామెంట్ చేసింది.

కేసుల్లో అభిమానులు

రమ్యను అశ్లీల మాటలు అంటూ నానా హంగామా చేసిన దర్శన్ అభిమానులపై రమ్య పోలీస్ కంప్లయింట్ ఇచ్చింది. 47 ఇన్‌స్టా హ్యాండిల్స్‌ను పోలీసుల దృష్టికి తెచ్చింది. ఇప్పుడా ఇన్‌స్టా హ్యాండిల్స్ ఏ అభిమానులైతే నడుపుతున్నారో వారంతా ప్రమాదంలో పడినట్టు. నేరం రుజువైతే 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష పడుతుంది.

అభిమానం సినిమా చూసేంత వరకూ ఉండాలి కాని ఇలా నటుల వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి వారికి వత్తాసు పలుకుతూ తీవ్ర చర్యలు చేపట్టేంతగా మాత్రం ఉండకూడదు. ఈ బూతులు తిట్టిన అభిమాని ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఉండొచ్చు. తల్లిదండ్రులకు ఈ సంగతే తెలియకపోవచ్చు. రేపు అరెస్ట్ అయితే వారి పరిస్థితి ఏమిటి? రమ్యకు మద్దతుగా కన్నడ ఇండస్ట్రీ నిలబడింది. అంతే కాదు కర్నాటక మహిళా కమిషన్ సూమోటోగా కేసును తీసుకుని నిందితులను పట్టుకోమని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

ఒక నటుడి వ్యక్తిగత జీవితంలో అనవసరంగా తల దూర్చడం వల్ల ఇప్పటికే ఒక అభిమాని హత్యకు గురయ్యాడు. ఇప్పుడీ కేసు వల్ల ఎందరు అభిమానులు నష్టపోతారో?!

తల్లిదండ్రులూ బహుపరాక్. తెలుగు నాట కూడా ఇలాగే అభిమానాలు వెర్రి తలలు వేస్తున్నాయి. ఫోన్ చేతిలో ఉంది కదా అని హద్దు మీరిన వ్యాఖ్యలు చేస్తే అవి నేరాభియోగానికి ఆధారాలవుతాయి. శిక్షకు సాక్ష్యాలవుతాయి. పిల్లల్ని హెచ్చరించండి. వారు ఏ వయసు వారైనా సరే.

లీగల్

పాస్‌పోర్ట్ సమస్య జటిలమే కానీ.. పరిష్కారం ఉంది

మా కూతురు అమెరికాలో వుంటుంది. అక్కడ గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటోంది. సమస్య ఏమిటంటే, తన బర్త్ సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీ 22-10-1999 అని ఉంది. కానీ పాస్‌పోర్టు - విద్య సర్టిఫికెట్లు అన్నిట్లో 22-10-1998 అని ఉంది. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే బర్త్ సర్టిఫికెట్‌లో ఉన్న పుట్టిన తేదీ - పాస్‌పోర్ట్ లో ఉన్న తేదీ ఒకటే అయి ఉండాలి, లేకపోతే కుదరదు అంటున్నారు. మా అమ్మాయి ఇవి మార్పించమని అడుగుతోంది. పాస్‌పోర్టులో పుట్టిన తేదీ మార్చుకోవటం కుదురుతుందా?

– పూర్ణిమ, చిత్తూరు

మీరు అడిగిన ప్రశ్న చిన్నదిగా అనిపించినప్పటికీ పరిష్కారం అంత సులభమైనదేమీ కాదు. ఐతే కొంచెం కష్టం అయినప్పటికీ పరిష్కారం ఉంది. పాస్‌పోర్టులో పుట్టిన తేదీ మార్చుకోవడం సాధారణ పరిస్థితులలో వీలుపడదు. పుట్టిన తేదీని మార్చడానికి గల కారణాలు చాలా బలమైనవిగా, నిర్దిష్టంగా ఉండాలి. అలా మార్చుకోవడానికి గల కారణాలను వివరిస్తూ తగిన రుసుము చెల్లించి పాస్‌పోర్ట్ అధికారులకు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. మేజర్ అయిన తర్వాత పాస్‌పోర్ట్ తీసుకుని ఉన్నట్లయితే, పాస్‌పోర్ట్ పొందిన ఐదు సంవత్సరాల లోపు ఈ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మైనర్ గా ఉన్నప్పుడు తీసుకున్న పాస్‌పోర్ట్ అయితే, తిరిగి రెన్యువల్ చేసుకునేటప్పుడు కూడా మార్చుకోవచ్చు. ఈ రెండు సందర్భాలలోని గడువు దాటిపోతే, ఇక పాస్‌పోర్ట్‌లోని పుట్టిన తేదీ మార్చడం కోర్టు జోక్యం చేసుకుంటే తప్ప కుదరదు. కానీ కేవలం పాస్‌పోర్ట్ మార్చుకున్నంత మాత్రాన మీ అమ్మాయి సమస్య తీరదు. ఎందుకంటే, పాస్‌పోర్ట్ లోని వివరాలను అమెరికా వెళ్లేటప్పుడు వీసా కోసం, పై చదువుల కోసం, లేదా ఉద్యోగం కోసం కూడా ఇచ్చి ఉంటారు కాబట్టి, ఆ రికార్డులు అన్నీ కూడా మార్చవలసి వస్తుంది. అలా కాకుండా కేవలం పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్ మాత్రమే చూస్తార్లే అని తేలిగ్గా తీసుకుంటే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంది జాగ్రత్త!

మీ అమ్మాయి రికార్డులలో వ్యత్యాసం ఉంటే ప్రస్తుతం ఉన్న వీసా సమస్య ఇంకా జటిలం అవ్వచ్చు. గ్రీన్ కార్డు కోసం చేసుకునే I-495 దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుల ద్వారా వారి పూర్వ వీసాలు, డాక్యుమెంట్లు, ధ్రువీకరణలు అన్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అన్నిట్లో ఒకే సమాచారం లేకపోతే లేదా ముందస్తు సంజాయిషీ ఇచ్చి ఉండకపోతే కొత్త సమస్య మొదలై, ఉన్న వీసా కూడా పోవచ్చు. అంతే కాక, అన్ని సర్టిఫికెట్‌లలో 1998 ఉంది అని చెప్పారు కాబట్టి, అవన్నీ కూడా మార్చాల్సి వస్తుంది కదా...

అందుకే, పాస్‌పోర్ట్ లో మార్పు చేసుకున్న తర్వాత CI (అమెరికా పౌరసత్వ - ఇమ్మిగ్రేషన్ సేవ) & USDHS (అమెరికా అంతర్గత భద్రతా విభాగం) వంటి సంస్థలకు స్వతహాగా, స్వచ్ఛందంగా అన్ని అంశాలను తెలియజేయటం మంచిది. అవసరమయితే మీ జిల్లాలో సివిల్ కోర్టును ఆశ్రయించి కూడా డిక్లరేషన్ కోరే అవకాశం లేకపోలేదు. అలా డిక్లరేషన్ పొందిన తర్వాత రికార్డులలో సవరణలు చేసే వీలుంటుంది. ముందుగా అమెరికాలోని ఒక మంచి ఇమ్మిగ్రేషన్ లాయర్‌ను కలిసి ఏ రికార్డు మారిస్తే మంచిది, లేక బర్త్ సర్టిఫికెట్ లేకుండా మరేదైనా ఉపాయం ఉందేమో తెలుసుకోండి.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

వైరల్ డ్యాన్స్ ట్రెండ్

చిన్నోడి డ్యాన్స్‌కు ఫిదా అవుతున్నారు!

పడవ స్పీడుగా దూసుకెళుతోంది.

ఆ స్పీడ్‌కు తగినట్లుగా దిఖా చేసిన మ్యాజిక్ డ్యాన్స్ సంచలనం సృష్టించింది. ఈ ఆన్‌లైన్ సంచలనం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

పదకొండు సంవత్సరాల ఇండోనేషియా అబ్బాయి రెయాన్ అర్కన్ దిఖా చేసిన ఐకానిక్ బోట్ డ్యాన్స్ 'ఆరా ఫార్మింగ్' అంతర్జాతీయ స్థాయిలో వైరల్ అయింది. తాజాగా



ఈ ట్రెండ్‌లో సింగపూర్ నేవీ సిబ్బందితో పాటు మన ముంబై పోలీసులు కూడా భాగం అయ్యారు.

ముంబై పోలీసుల ఐకానిక్ బోట్ డ్యాన్స్ హిట్ కావడంతో, ఒరిజినల్ డ్యాన్స్ చూడని వాళ్లు ఇది చూసి 'ఆహా' 'ఓహో' అంటున్నారు.

ఉన్నతాధికారులతో పాటు వివిధ రంగాల సెలబ్రిటీలు ఈ ఐకానిక్ బోట్ డ్యాన్స్ ట్రెండ్‌లో భాగం కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఈ ట్రెండ్‌లో భాగం అవుతున్నవారు స్థానిక మ్యూజిక్‌ను వీడియోకు జత చేస్తున్నారు.

'ఆరా ఫార్మింగ్' అనేది ఇప్పుడు ఆన్‌లైన్‌లో పాపులర్ అయింది.

పేరెంటింగ్

బడి పాఠాలే కాదు 'బతుకు బడి' పాఠాలు కూడా..



పేరెంటింగ్‌కు సంబంధించి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ 'జోహో' వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు 'ఎక్స్'లో చేసిన అర్థవంతమైన, అద్భుతమైన పోస్ట్ నెట్‌లోకంలో చర్చనీయాంశంగా మారింది.

పిల్లలు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణించడానికి అవసరమైన పలు నైపుణ్యాలను గురించి ఈ పోస్ట్‌లో ప్రస్తావించారు వెంబు. పిల్లలు మానవత్వం మూర్తీభవించిన వ్యక్తులుగా ఎదగడానికి సృజనాత్మకత, సాంస్కృతిక అంశాలు ఎలా సహాయపడతాయో వివరించారు.

'గణితం, శాస్త్రీయ సంగీతం, వంటలు, ఆటలు... ఇష్టమైన ఏ విద్య అయినా కావచ్చు. పతకాల కోసం నేర్చుకోవద్దు. పోటీలకు సంబంధించిన ఒత్తిడికి దూరంగా ఉండాలి. గణితంపై నా ఆసక్తి సాఫ్ట్‌వేర్‌డెవలప్‌మెంట్‌ను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది.

పిల్లల భవిష్యత్‌ను నిజంగా మార్చేది ఏమిటనే విషయంపై తల్లిదండ్రులు, విద్యావేత్తలు దృష్టి పెట్టాలి' అని రాశారు శ్రీధర్.

'బడి పాఠాలే కాదు బతుకు బడి పాఠాలు కూడా నేర్చుకోవాలి' అనేది శ్రీధర్ పోస్ట్ సారాంశం.

'కుకింగ్‌కు పెద్దగా ఎవరూ ప్రాధాన్యత ఇవ్వరుగానీ నిజానికి అది అత్యంత నైపుణ్యం ఉన్న పని, లైఫ్ స్కిల్. కుకింగ్ రావడం అనేది జీరో డిపెండెన్సీని సూచిస్తుంది. అందుకే వంటచేయడాన్ని పిల్లలు తప్పనిసరిగా నేర్చుకోవాలి. అది ఒక కళగా గుర్తించుకోవాలి' అని స్పందించారు ఒక యూజర్.


శ్రావణ మాసం



● గ్రీన్ గ్రేస్


శ్రావణ మాసంలో భారతీయ వివాహితలు ఆకుపచ్చ గాజులు ధరిస్తుంటారు. ఇది వారి సంతోషకరమైన, సుసంపన్నమైన వైవాహిక స్థితిని సూచిస్తుంది. ఆకుపచ్చ రంగు శుభప్రదమని, సంతానోత్పత్తికి సంబంధించినదని వారి నమ్మకం. అంతేకాదు, తమ శ్రేయస్సుకు, అదృష్టానికి, ప్రకృతి పునరుద్ధరణకు ప్రతీకగా ఆకుపచ్చ గాజులు ధరిస్తుంటారు. వర్షాకాలంలో వాతావరణం ప్రశాంత శక్తితో ముడిపడి ఉంటుంది. ఆకుపచ్చ రంగు కళ్లకు ఉపశమనం కలిగిస్తుంది. శరీర ఉష్ణోగ్రత, భావోద్వేగ సమతౌల్యతను కలిగిస్తుంది. అన్యోన్యతకు సూచికగా, సంప్రదాయం, ఆరోగ్యం, భక్తిని ఒకే వరసక్రమంలో పరిచయం చేసే శక్తి ఆకుపచ్చ రంగుకు ఉంటుంది. గాజుల శబ్దం ప్రతికూలతను దూరం చేస్తుందని నమ్మకం. శివ-శక్తి దైవిక ఐక్యతను ప్రతిబింబించే సామరస్యాన్ని కూడా సూచిస్తుందనే భావన దీనిలో ఇమిడి ఉంది.

● ఫలవంతమైన ఎంపిక



శ్రావణ మాసం వర్షాకాలం కనుక అలెర్జీలను తట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు సి-విటమిన్ సమృద్ధిగా లభించే పండ్లు తీసుకోవాలి. అలాగే, జీర్ణక్రియకు మేలు చేసేవీ జాబితాలో ఉండేలా చూసుకోవాలి. నారింజలో అధికంగా ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ద్రాక్షలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అయితే, రసాయనాల గాఢత లేని వాటిని ఎంచుకోవడం మేలు. అరటిపండు శక్తినిస్తుంది. జీర్ణక్రియ పనితీరుకు సహాయపడుతుంది. ఈ మాసంలో అరటిపండు వాడకం విరివిగా కనిపిస్తుంది. జీర్ణక్రియకు సహాయపడే బొప్పాయి మలబద్ధక నివారిణిగా కూడా పనిచేస్తుంది.

● బ్యూటిప్స్ గులాబీ రేకుల్లాంటి పెదాల కోసం...



● రోజూ ఉదయాన్నే బ్రష్ చేసిన తరువాత.. బ్రష్ మీద కొద్దిగా తేనె వేసి రెండు పెదవులపైన గుండ్రంగా ఐదు నిమిషాలపాటు రుద్దాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదాలపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. పెదాలకు మర్దన జరిగి రక్తప్రసరణ సక్రమంగా అందుతుంది. పెదవులు మృదువుగా మారతాయి. ● ఉదయం బ్రష్‌తో మర్దన చేసాక, రాత్రి పడుకునేముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా రాయాలి. ఇందుకోసం.. కొద్దిగా బీట్‌రూట్ రసాన్ని వేడి చేయాలి. వేడిచేసిన రసంలో అరటీస్పూను కార్న్ ఫ్లోర్ వేసి ఐదు నిమిషాలు తిప్పి దించేయాలి. తరువాత ఈ మిశ్రమంలో అర టీస్పూను గ్లిజరిన్, పావు టీస్పూను కొబ్బరి నూనె కలిపి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేయాలి. ఈ మిశ్రమం గట్టిపడిన తరువాత పెదవులకు రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయం నీటితో కడిగేయాలి ● ఈ రెండింటిని ఒకదాని తరువాత ఒకటి క్రమం తప్పకుండా పాటిస్తే పెదవులు గులాబీరేకుల్లా కోమలంగా పింక్ కలర్‌లో ఆకర్షనీయంగా కనిపిస్తాయి.

బులియన్
బంగారం 10 గ్రా.: వెండి కిలో
జూలై 29న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	99,800	1,01,080	99,820	1,01,080	99,200	99,810
బంగారం (22 క్యారెట్లు)	93,350	91,500	91,500	94,550	91,260	91,500
వెండి	1,17,150	1,16,700	1,26,000	1,16,700	1,16,500	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



మళ్లీ టాప్-10లోకి సాత్విక్-చిరాగ్ జోడీ

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మళ్లీ టాప్-10లోకి దూసుకొచ్చింది. గతవారం చైనా ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరడం ద్వారా సాత్విక్ జంట మూడు స్థానాలు మెరుగుపరుచుకొని 10వ ర్యాంక్‌కు చేరింది. గతేడాది థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన అనంతరం ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ దక్కించుకున్న భారత ద్వయం... ఈ సీజన్‌లో మూడు టోర్నీల్లో సెమీఫైనల్‌కు చేరింది. చైనా ఓపెన్ కంటే ముందు సింగపూర్ ఓపెన్, ఇండియా ఓపెన్‌లలో సైతం ఈ జోడీ సెమీస్ ఆడింది. పురుషుల సింగిల్స్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ లక్ష్యసేన్ రెండు స్థానాలు మెరుగు పరుచుకొని 17వ ర్యాంక్‌కు చేరాడు. ఇక మహిళల సింగిల్స్‌లో ఇటీవల పీవీ సింధుపై నెగ్గిన 17 ఏళ్ల ఉన్నతి హుడా కెరీర్ బెస్ట్ 31వ ర్యాంక్ దక్కించుకుంది. ఈ విభాగంలో భారత్ నుంచి అత్యుత్తమంగా సింధు 15వ స్థానంలో ఉంది. టాప్-100లో భారత్ నుంచి 16 మంది ఉండటం విశేషం. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జంట 11వ ర్యాంక్‌లో కొనసాగుతోంది.


ఆసియా కప్ ట్రోఫీతో ఆయా జట్ల ప్లేయర్లు


సంగీత

భారత్‌కు క్లిష్టమైన 'డ్రా'

- లీగ్ దశలో జపాన్, వియత్నాం, చైనీస్ తైపీలతో టీమిండియా పోరు
- వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీ

సిడ్నీ: ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు క్లిష్టమైన 'డ్రా' పడింది. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో మార్చి 1 నుంచి 21 వరకు జరిగే ఈ టోర్నీలో ఆసియా ఘనాపాటి జపాన్ సహా మాజీ చాంపియన్లు చైనీస్ తైపీ, వియత్నాం జట్లున్న గ్రూప్ 'సి'లో భారత అమ్మాయిల జట్టుకు చోటు దక్కింది. దీనికి సంబంధించిన 'డ్రా' వేడుక సిడ్నీ టౌన్ హాల్‌లో మంగళవారం అట్టహాసంగా జరిగింది. భారత స్టార్ మిడ్‌ఫీల్డర్ సంగీత బస్ఫోరె ప్రత్యేక ఆహ్వానితులుగా 'డ్రా' ఈవెంట్‌లో పాల్గొంది. మొత్తం 12 ఆసియా జట్లను మూడు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో జట్టులో నాలుగేసి టీమ్‌లు తలపడతాయి. గ్రూప్ 'సి'లో భారత అమ్మాయిల జట్టు తమ తొలి మ్యాచ్‌లో మార్చి 4న వియత్నాంతో... రెండో మ్యాచ్‌లో మార్చి 7న ప్రపంచ మాజీ చాంపియన్ జపాన్‌తో... మూడో మ్యాచ్‌లో మార్చి 10న చైనీస్ తైపీతో ఆడుతుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో జపాన్ 7వ స్థానంలో, వియత్నాం 37వ స్థానంలో, చైనీస్ తైపీ 42వ స్థానంలో, భారత్ 70వ స్థానంలో ఉన్నాయి.

సెమీస్ చేరితే ప్రపంచకప్ టోర్నీకి...

ఆసియా కప్ గ్రూప్ 'ఎ'లో ఆతిథ్య ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, ఇరాన్, ఫిలిప్పీన్స్... గ్రూప్ 'బి'లో డిఫెండింగ్ చాంపియన్ చైనా, ఉత్తర కొరియా, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్ జట్లున్నాయి. ఒక్కో గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. అలాగే ఈ మూడు గ్రూప్‌ల్లో మెరుగైన మూడో స్థానం పొందిన రెండు జట్లు కూడా నాకౌట్‌కు క్వాలిఫై అవుతాయి. ఈ 8 జట్ల మధ్య జరిగే క్వార్టర్ ఫైనల్స్ విజేతలు అంటే సెమీఫైనల్ చేరిన నాలుగు జట్లు 2027లో బ్రెజిల్‌లో జరిగే ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత పొందుతాయి. క్వార్టర్స్‌లో ఓడిన జట్లు ప్లే ఆఫ్స్ ఆడాల్సి ఉంటుంది. ఆసియా నుంచి మరో రెండు జట్లకు ప్రపంచకప్ బెర్త్‌లు లభిస్తాయి.

'నువ్వు గ్రౌండ్స్‌మన్‌వి మాత్రమే'

- ఓవల్ క్యురేటర్‌తో గంభీర్ వాగ్వాదం
- పిచ్‌కు దగ్గరగా రావడంపై వివాదం
- చివరి టెస్టుకు బుమ్రా దూరం



లండన్: ఇంగ్లండ్‌తో ఐదో టెస్టుకు రెండు రోజుల ముందు భారత జట్టును మానసికంగా దెబ్బ తీసే ప్రయత్నం మొదలైంది. అయితే ఇది ఆటగాళ్ల నుంచి రాలేదు. చివరి టెస్టు జరిగే ఓవల్ పిచ్ క్యురేటర్ చేసిన 'అతి' మైదానంలో చర్చకు దారి తీసింది. భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆగ్రహానికి ఇది కారణమైంది. మంగళవారం ఆప్షనల్ ప్రాక్టీస్ కావడంతో కొందరు భారత ఆటగాళ్లతో పాటు కోచింగ్ బృందం ఓవల్ మైదానానికి వెళ్లింది. టెస్టుకు ఒకటి లేదా రెండు రోజుల ముందు ఇరు జట్ల కెప్టెన్ లేదా కోచ్‌లు పిచ్‌ను పరిశీలించడం, దానిపై ఒక అంచనాకు రావడం సాధారణ ఆనవాయితీ. గంభీర్ కూడా తన సహచర కోచింగ్ సిబ్బందితో పిచ్ వద్దకు వెళ్లాడు. అయితే క్యురేటర్ లీ ఫోర్టిస్ బృందంలోని ఒక సభ్యుడు అక్కడికి వచ్చి పిచ్‌కు బాగా దగ్గరగా వెళ్లవద్దని, అక్కడి నుంచి 2.5 మీటర్ల దూరం ఉండాల్సిందిగా కోరాడు. ఇది గంభీర్‌కు కాస్త అసహనం తెప్పించింది. పిచ్ పాడు కాకుండా క్యురేటర్లు జాగ్రత్తలు చెప్పడం సహజమే అయినా ఒక జట్టు కోచ్‌ను నిలువరించడం ఎప్పుడూ జరగదు. మ్యాచ్ జరిగే ప్రధాన పిచ్‌కు బాగా దగ్గరగా భారత ఆటగాళ్లు పదే పదే రావడం క్యురేటర్‌కు ఆగ్రహం తెప్పించినట్లు సమాచారం. అయితే ప్రాక్టీస్‌కు కేటాయించిన మూడు పిచ్‌లకు ఇది బాగా దగ్గరగా ఉందని, పూర్తిగా అటు వెళ్లకుండా ఉండటం సాధ్యం కాదని మన కోచింగ్ బృందం జవాబిచ్చినట్లు తెలిసింది. అయితే వివాదం అక్కడితో ముగిసిపోలేదు. భారత్‌కు చెందిన సహాయకుడు ఒకరు కూలింగ్ బాక్స్‌ను ఆటగాళ్ల ప్రాక్టీస్ నెట్స్ వద్దకు తీసుకెచ్చే ప్రయత్నం చేయగా, దీనిని కూడా క్యురేటర్ వారించాడు. దాంతో కోపం వచ్చిన గంభీర్ ఏదో మాట అనడం ... ఇలా మాట్లాడవద్దని, మళ్లీ ఇలా చేస్తే ఐసీసీకి ఫిర్యాదు చేస్తానని క్యురేటర్ అన్నాడు. అంతే... ఏం చేసుకుంటావో చేసుకోమంటూ తనదైన శైలిలో తీవ్రంగా బదులిచ్చాడు. 'మేం ఏం చేయాలో నువ్వు చెప్పనవసరం లేదు. మా బృందం ఏం చేయాలో కూడా నువ్వు చెప్పవద్దు. నీకు ఎలాంటి అధికారం లేదు. నువ్వు కేవలం గ్రౌండ్స్‌మన్‌వి మాత్రమే. అంతకు మించి ఏమీ కాదు. నీ పరిధిలో ఉండు. నువ్వు గ్రౌండ్స్‌మన్‌వి మాత్రమే' అని గంభీర్ తీవ్రంగా జవాబిచ్చాడు. చివరకు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ కలగజేసుకొని ఫోర్టిస్‌ను దూరంగా తీసుకెళ్లి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది.

'పిచ్ ఏమీ పురాతన వస్తువు కాదు'

గంభీర్, క్యురేటర్ ఫోర్టిస్ మధ్య చోటు చేసుకున్న ఘటనపై సితాన్షు కొటక్ వివరణ ఇచ్చాడు. ఓవల్ గ్రౌండ్ క్యురేటర్ కాస్త దూకుడైన వ్యక్తి అని తమకు ముందే తెలుసని అన్నాడు. ఈ సిరీస్‌లో ఆడిన నాలుగు టెస్టుల్లోనూ పిచ్ క్యురేటర్లు తమకు బాగా సహకరించారని, ఇక్కడే ఇలాంటి అనుభవం ఎదురైందని చెప్పాడు. 'ఒక జట్టు కోచ్‌ను 2.5 మీటర్ల దూరం నిలబడమని చెప్పడం చాలా ఇబ్బందిగా అనిపించింది. మేమేమీ స్పైక్స్‌తో రాలేదు. రబ్బరు చెప్పులతో అక్కడ నిలబడ్డాం కాబట్టి పిచ్ పాడవుతుందనే సమస్యే లేదు. అలా ఎవరైనా ఎందుకు చేస్తారు. పిచ్‌ను జాగ్రత్తగా చూసుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు గానీ ఇది కాస్త అతిగా అనిపించింది. మా జట్టు సభ్యులు అక్కడ ఆడబోతున్నారు. ఎన్ని మాటలు చెప్పినా అది క్రికెట్ పిచ్ మాత్రమే. కాలు పెట్టగానే విరిగిపోయేందుకు అదేమీ 200 ఏళ్లనాటి పురాతన వస్తువు కాదు' అని కొటక్ వివరించాడు.

బుమ్రా స్థానంలో ఆకాశ్‌దీప్

భారత టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఓవల్ టెస్టులో ఆడే విషయంలో స్పష్టత వచ్చింది. అతను ఈ టెస్టు నుంచి తప్పుకోవడం ఖాయమైంది. అతని పని భారం తగ్గించేందుకే టీమిండియా మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. సిరీస్‌ను కాపాడుకునే కీలక టెస్టులో బుమ్రాను ఆడించాలని భావించినా... అతని ఫిట్‌నెస్‌ను దృష్టిలో పెట్టుకొని, మున్ముందు ఇబ్బంది రాకుండా కాపాడుకునేందుకు ఐదో టెస్టులో ఆడించరాదని బీసీసీఐ వైద్య బృందం సిఫారసు చేసింది. ఈ సిరీస్‌తో బుమ్రా మూడు టెస్టుల ఆడతాడని ముందే ప్రకటించారు. ఈ మూడు టెస్టుల్లో కలిపి అతను 14 వికెట్లు తీశాడు. బుమ్రా స్థానంలో ఆకాశ్‌దీప్ బరిలోకి దిగుతాడు. స్వల్ప గాయంతో ఆకాశ్‌దీప్ గత మ్యాచ్‌లో ఆడలేదు.


దివ్య

'మానసిక దృఢత్వమే గెలిపించింది'

దివ్య దేశ్‌ముఖ్‌పై సుసాన్ పోల్గర్ ప్రశంసలు

న్యూఢిల్లీ: మహిళా చెస్ దిగ్గజం సుసాన్ పోల్గర్ భారత గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌పై ప్రశంసలు కురిపించింది. వరల్డ్ కప్‌లో వేర్వేరు సందర్భాల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా దివ్య గెలిచిన తీరు అద్భుతమని ఆమె వ్యాఖ్యానించింది. మానసిక దృఢత్వం, పోరాటతత్వమే ఆమెను చాంపియన్‌గా నిలిపిందని పోల్గర్ అభిప్రాయపడింది. 'చారిత్రక విజయం సాధించిన దివ్యకు నా అభినందనలు. చాలా బాగా ఆడింది. టోర్నీకి ముందు ఫేవరెట్‌లలో ఆమె పేరు లేదు. అయితే గెలవాలనే పట్టుదల, మానసిక దృఢత్వంతో ఆమె ముందంజ వేయగలిగింది. టోర్నీలో దివ్య ఇబ్బంది పడిన గేమ్‌లు ఉన్నాయి. మంచి అవకాశాలు వచ్చినా వాటిని వృథా చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే వాటి ప్రభావం ఆమెపై పడలేదు. ఎలాంటి ఆందోళన లేకుండా ఆమె పోరాడింది. అదే పట్టుదల చివరి వరకు నిలిచి గెలిచేలా చేశాయి' అని పోల్గర్ వ్యాఖ్యానించింది. ప్రపంచ చెస్‌లో ఇటీవలి కాలంలో భారత ఆటగాళ్లు సాధించిన విజయాలు అపూర్వమని ఆమె పేర్కొంది. వీరందరికీ గొప్ప భవిష్యత్తు ముందుందని పోల్గర్ జోస్యం చెప్పింది. 'గుకేశ్ పెద్ద స్థాయికి చేరతాడని అతనికి 12 ఏళ్లు ఉన్నప్పుడే నేను చెబితే ఎవరూ నమ్మలేదు. 50 మంది గ్రాండ్‌మాస్టర్లను తయారు చేసిన నా అనుభవంతో ఆ వ్యాఖ్యలు చేశాను. దివ్య విషయంలో కూడా అదే జరిగింది. పెద్ద ప్లేయర్‌గా గుర్తింపు లేకపోయినా ఆమెలో ప్రత్యేక ప్రతిభ ఉంది కాబట్టే ఈ స్థాయిలో గెలిచింది. ప్రస్తుతం భారత చెస్‌లో స్వర్ణయుగం నడుస్తోంది. వారి ఆట గొప్పగా ఉండటంతో పాటు సరైన రీతిలో మద్దతు, దిశానిర్దేశం లభిస్తున్నాయి. దివ్య ఇక్కడితో ఆగిపోవద్దు. ఆమె ఆటపై అందరి దృష్టి ఉంటుంది కాబట్టి మరింతగా కష్టపడి లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. హంపి అంటే కూడా నాకు గౌరవం ఉంది. సుదీర్ఘ కాలం ఆమె అగ్రస్థాయిలో కొనసాగింది. అయితే వయసు పెరుగుతున్నకొద్దీ పరిస్థితులు కొంత ప్రతికూలంగా మారడం సహజం' అని పోల్గర్ పేర్కొంది.


సుసాన్ పోల్గర్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


ఆమిర్ ఖాన్

జనతా కా థియేటర్

ఆమిర్‌ఖాన్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. తాను హీరోగా నటించిన 'సితారే జమీన్ పర్' సినిమాను ఓటీటీ సంస్థలకు అమ్మకుండా, పే పర్ వ్యూ(డబ్బు చెల్లించి చూడటం) విధానంలో యూ ట్యూబ్ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ముంబైలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ– ''మన దేశంలో 2–3 శాతం మంది మాత్రమే మూవీస్ చూసేందుకు థియేటర్స్‌కి వెళుతున్నారు. కానీ, ఒక్కరోజులోనే దాదాపు 50 కోట్లమంది భారతీయులు యూట్యూబ్‌ని వినియోగిస్తున్నారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ యూపీఐ చెల్లింపుల్లో భారతదేశం ముందు వరుసలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో నా సినిమాలు, నా ప్రతిభ ఆడియన్స్‌కు చేరువయ్యేలా యూట్యూబ్‌ని వినియోగించుకోవాలనుకుంటున్నాను. మనం థియేటర్‌కి వెళితే ఒకసారి డబ్బులు చెల్లించి, ఒకసారి మాత్రమే సినిమా చూస్తాం. ఈ విధానాన్నే నేను ఫాలో అవుతున్నాను. 'ఆమిర్‌ఖాన్ టాకీస్-జనతా కా థియేటర్' చానెల్‌లో ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్‌పై నిర్మించిన మరికొన్ని సినిమాలు కూడా పే పర్ వ్యూ విధానంలో స్ట్రీమింగ్ అవుతాయి. నేను నటించిన 'సితారే జమీన్ పర్' సినిమాను ఒకసారి వీక్షించేందుకు ధర రూ.100 నిర్ణయించాం. ఆగస్టు 1 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ అయ్యేలా ఏర్పాట్లు చేశాం. కొన్ని విదేశాల్లోనూ ఈ చిత్రం స్ట్రీమింగ్ అవుతుంది. కాకపోతే ధరల్లో మార్పులు ఉంటాయి. పెద్ద కంపెనీలు (పరోక్షంగా ఓటీటీలను ఉద్దేశిస్తూ...) ఇచ్చే రూ.125 కోట్లు నాకు వద్దు. ప్రేక్షకుడు ఇచ్చే వంద రూపాయలు చాలు. పే పర్ వ్యూ విధానంలో నేను ఎంత లాభపడతానో తెలియదు. కానీ, ఓటీటీ వల్ల మాత్రం సినిమా రంగం ఇబ్బంది పడుతోంది'' అన్నారు.

రాజా సాబ్‌తో పూరి సాబ్


పూరి జగన్నాథ్, ప్రభాస్


సంజయ్ దత్

హీరో ప్రభాస్, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'బుజ్జిగాడు'(2008), 'ఏక్ నిరంజన్'(2009) సినిమాలు మంచి విజయం అందుకున్నాయి. వీరి కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా రానుందంటూ గత కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఈ వార్తలపై ఇటు ప్రభాస్ కానీ, అటు పూరి జగన్నాథ్ కానీ ఎక్కడా స్పందించలేదు. 'బాహుబలి' సినిమా తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలతో దూసుకెళుతున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఆయన 'ది రాజా సాబ్', 'ఫౌజి'(వర్కింగ్ టైటిల్) అనే సినిమాల్లో నటిస్తున్నారు. ఇక విజయ్ సేతుపతి హీరోగా ఓ చిత్రం తెరకెక్కిస్తున్నారు పూరి జగన్నాథ్. కాగా ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజా సాబ్'. నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 5న విడుదలకానుంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని అజీజ్‌నగర్‌లో జరుగుతోంది. ఈ సినిమా సెట్స్‌లోకి పూరి జగన్నాథ్, నిర్మాత చార్మీ కౌర్ ఎంట్రీ ఇచ్చారు. ప్రభాస్, పూరి, చార్మీ కలిసి మాట్లాడుకుంటున్న ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రాజా సాబ్‌తో పూరి సాబ్ అంటూ నెటిజన్స్ సరదాగా కామెంట్లు పెడుతున్నారు.

పుట్టినరోజు ప్రత్యేకం... 'ది రాజా సాబ్' సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. మంగళవారం(జూలై 29) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆ చిత్రం నుంచి సంజయ్ దత్ ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

చలో టాంజానియా


మహేశ్ బాబు

మహేశ్‌బాబు టాంజానియా వెళ్లనున్నారు. ఆయన హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో 'ఎస్ఎస్ఎమ్‌బీ 29'(వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్ పడింది. కాగా ఈ సినిమా ఫారిన్ షెడ్యూల్ చిత్రీకరణను తొలుత కెన్యాలో ప్లాన్ చేశారు మేకర్స్. కానీ, ప్రస్తుతం అక్కడ నెలకొన్న రాజకీయ అనిశ్చితి కారణంగా, సౌతాఫ్రికాలో చిత్రీకరణను ప్లాన్ చేశారు. అయితే ఇప్పుడు ఈస్ట్ ఆఫ్రికాలోని టాంజానియాలో చిత్రీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారట రాజమౌళి. ఆగస్టు రెండో వారంలో చిత్రయూనిట్ టాంజానియా వెళ్లనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఇదిలా ఉంటే... ఈ చిత్ర సంగీత దర్శకుడు కీరవాణితో కలిసి మ్యూజిక్ సిట్టింగ్స్‌పై వర్క్ చేస్తున్నారు రాజమౌళి. ఇందుకోసం రాజమౌళి ఓ ప్రత్యేకమైన స్టూడియోను ఏర్పాటు చేసుకున్నారట. అలాగే టాంజానియాలో చిత్రీకరించబోయే యాక్షన్ సీక్వెన్స్ కోసం రిహార్సల్స్ కూడా జరుగుతున్నాయని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ చిత్రం 2027లో విడుదలయ్యే అవకాశం ఉంది.

ఆవన్ జావన్..


కియారా, హృతిక్ రోషన్

హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ప్రధాన పాత్రల్లో నటించిన స్పై యాక్షన్ మూవీ 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఆగస్టు 14న రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమా కోసం హృతిక్-కియారాలపై చిత్రీకరించిన 'ఆవన్ జావన్...' అనే పాటను అతి త్వరలో విడుదల చేయనున్నట్లు వెల్లడించి, ఈ పాట ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''హృతిక్ రోషన్- కియారా అద్వానీ కెమిస్ట్రీ 'ఆవన్ జావన్..' ఈ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ పాట కోసం సంగీత దర్శకుడు ప్రీతమ్, లిరిక్ రైటర్ అమితాబ్ భట్టాచార్య, గాయకుడు అరిజీత్ సింగ్ కలిసి పని చేశారు. గతంలో వీరి ముగ్గురి కాంబినేషన్‌లో వచ్చిన 'బ్రహ్మాస్త్ర' సినిమాలోని 'కేసరియా...' పాట ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సాంగ్ తరహాలోనే 'ఆవన్ జావన్..' కూడా ప్రేక్షకులను తప్పకుండా మెప్పిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కాగా... ఈ నెల 31న కియారా అద్వానీ బర్త్ డే. ఈ సందర్భంగా 'ఆవన్ జావన్...' పాటని రిలీజ్ చేస్తారని సమాచారం. ఇదిలా ఉంటే... హృతిక్ రోషన్ హీరోగా నటించిన 'వార్' (2019) సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' రూపొందిన సంగతి తెలిసిందే.


రీ యూనియన్‌లో నటీనటులు, దర్శకులు

సందడే సందడి

అలనాటి తారలందరూ ఒకచోట కలిశారు.. సందడే సందడిగా ఎంజాయ్ చేశారు. వీరి సందడికి, సంతోషానికి ఈ సారి గోవా వేదిక అయింది. 80వ దశకానికి, 90వ దశకానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు రీ యూనియన్ పేరుతో సంవత్సరానికి ఒకసారి కలిసి సందడి చేస్తుంటారనే విషయం తెలిసిందే. తాజాగా 90వ దశకానికి చెందిన తారలు గోవాలో రీ యూనియన్ పార్టీ చేసుకున్నారు. ఈ సందర్భంగా గత మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. వారంతా హ్యాపీగా, జాలీగా ఎంజాయ్ చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ రీ యూనియన్ పార్టీలో నటీనటులు ఊహ, మీనా, సిమ్రాన్, సంగీత, సంఘవి, శ్వేతా మీనన్, మహేశ్వరి, రీమా సేన్, శ్రీకాంత్, జగపతి బాబు, ప్రభుదేవా, డైరెక్టర్లు శంకర్, కేఎస్ రవికుమార్, లింగు సామి, మోహన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

కాసేపు వెయిట్ చెయ్!


లావణ్యా త్రిపాఠి, దేవ్ మోహన్

'నాకెందుకో హ్యాపీగా ఉండలేనప్పుడు మనం విడిపోవడమే కరెక్ట్ అనిపిస్తోంది' అంటూ దేవ్ మోహన్ చెప్పే డైలాగ్‌తో 'సతీ లీలావతి' చిత్రం టీజర్ ఆరంభమైంది. లావణ్యా త్రిపాఠి, మలయాళ నటుడు దేవ్ మోహన్ జోడీగా నటించిన చిత్రం 'సతీ లీలావతి'. 'భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి)' సినిమాల ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు మేకర్స్. 'ఐదు రూపాయలే కదా అని పెన్నుని చీప్‌గా చూడకు లీల.. దాంతోనే ఐదుకోట్ల చెక్‌మీద సంతకం పెడతా'(దేవ్ మోహన్), 'ఏదైనా ఆయిలే కదా అని బెంజ్ కారులో కొకొనట్ ఆయిల్ పోసుకోకూడదు.. కౌంటర్స్ నాక్కూడా వచ్చు', 'అట్మాస్పియర్ అదిరిపోయింది.. కాసేపు వెయిట్ చెయ్' (లావణ్యా త్రిపాఠి).. వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''భార్యాభర్తల మధ్య ఉండే అనుబంధాన్ని భావోద్వేగాలతో కాకుండా వినోదాత్మకంగా తెరకెక్కించిన చిత్రం 'సతీ లీలావతి'. ఫీల్ గుడ్ మూవీగా రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఉంటుంది. త్వరలో మా చిత్రాన్ని విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. వీకే నరేష్, వీటీవీ గణేష్, సప్తగిరి, జాఫర్ సాదిక్, మొట్ట రాజేంద్రన్, జోషి ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమాకి సంగీతం: మిక్కీ జె.మేయర్, కెమెరా: బినేంద్ర మీనన్.


మేధా రాణా

వరుణ్‌కి జోడీ

బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ సరసన నటించనున్నారు హీరోయిన్ మేధా రాణా. సన్నీడియోల్ హీరోగా, వరుణ్ ధావన్, దిల్జీత్ సింగ్, అహన్ శెట్టి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వార్ డ్రామా 'బోర్డర్ 2'. 'కేసరి' ఫేమ్ అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ''బోర్డర్ 2' ఫ్యామిలీలోకి మేధా రాణాని ఆహ్వానిస్తున్నాం. వరుణ్ ధావన్ సరసన ఆమె నటిస్తారు'' అని చిత్రయూనిట్ వెల్లడించింది. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 23న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఇక సన్నీడియోల్ హీరోగా జేపీ దత్తా దర్శకత్వంలో 1977లో వచ్చిన 'బోర్డర్' సినిమాకు సీక్వెల్‌గా 'బోర్డర్ 2' రానుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.

స్టాక్ మార్కెట్లు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	447	81,338
నిఫ్టీ ▲	140	24,821

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,123	▽	55
డోజోన్స్	44,596	▽	241
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,138	▲	57
డాక్స్	24,211	▲	241
షాంఘై	3,610	▲	12
నికాయ్	40,674	▽	324

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.40	87.42
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.50	117.45
€	యూరో	ఎస్‌బీఐ	99.29	102.03
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.81	59.29
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.54	57.77
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.01	68.68
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.28	23.76
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.75	23.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.22	13.04

ఎల్‌అండ్‌టీ లాభం జూమ్

క్యూ1లో రూ. 3,617 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక రంగ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్‌అండ్‌టీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 30 శాతం జంప్‌చేసి రూ. 3,617 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,786 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 55,120 కోట్ల నుంచి రూ. 63,679 కోట్లకు ఎగసింది. ఇది 16 శాతం వృద్ధికాగా.. కీలక ప్రాజెక్టులలో పటిష్ట ఎగ్జిక్యూషన్, తయారీ పోర్ట్‌ఫోలియో ఇందుకు తోడ్పాటునిచ్చాయి. ఆర్థికంగా అన్ని విభాగాలలోనూ ఉత్తమ పనితీరు చూపినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ కాలంలో కంపెనీ చరిత్రలో మరోసారి అత్యధిక ఆర్డర్లను గెలుపొందినట్లు వెల్లడించారు. వార్షికంగా 33 శాతం వృద్ధితో రూ. 94,453 కోట్ల విలువైన కాంట్రాక్టులు అందుకున్నట్లు తెలియజేశారు. వెరసి 2025 జూన్30కల్లా కంపెనీ కన్సాలిడేటెడ్ ఆర్డర్ బుక్ విలువ 25 శాతం ఎగసి రూ. 6,12,761 కోట్లకు చేరింది. దీనిలో అంతర్జాతీయ కాంట్రాక్టుల వాటా 46 శాతం కావడం గమనార్హం!

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు 2.2% బలపడి రూ.3,495 వద్ద క్లోజైంది.

జియో నుంచి క్లౌడ్ పీసీ సర్వీస్

నెలవారీ ప్లాన్లు రూ. 599 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: సెట్ టాప్ బాక్స్ సహాయంతో టీవీలను కంప్యూటర్లుగా ఉపయోగించుకునే వెసులుబాటు కల్పిస్తూ రిలయన్స్ జియో సబ్‌స్క్రిప్షన్ ఆధారిత పర్సనల్ కంప్యూటర్ సర్వీస్‌ను ప్రవేశపెట్టింది. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం జియోపీసీ సబ్‌స్క్రిప్షన్ నెలవారీగా రూ. 599 (జీఎస్‌టీ కాకుండా) నుంచి ప్రారంభమవుతుంది. వార్షిక ప్లాన్ రూ. 4,599గా (జీఎస్‌టీ కాకుండా) ఉంటుంది. అంటే నెలకు సుమారు రూ. 383 అవుతుంది. జియోఫైబర్, జియో ఎయిర్‌ఫైబర్ యూజర్లు, పీసీ సర్వీస్‌ను పొందాలంటే యాప్ సెక్షన్‌లోని జియోపీసీ యాప్‌ను క్లిక్ చేయాలి. టీవీని పీసీగా వాడుకునేందుకు కీబోర్డు, మౌస్ ఉండాలి. వర్చువల్ డెస్క్‌టాప్‌తో 8 జీబీ ర్యామ్, 100 జీబీ క్లౌడ్ స్టోరేజీతో పాటు ఎడోబ్ ఎక్స్‌ప్రెస్, జియో వర్క్ స్పేస్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్ (బ్రౌజర్) మొదలైన వాటికి యాక్సెస్ లభిస్తుంది. నెల రోజుల పాటు ఉచిత ట్రయల్ పీరియడ్ ఉంటుంది.

లెన్స్‌కార్ట్.. ఐపీఓ రూట్


- సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌దాఖలు
- రూ. 2,150 కోట్ల తాజా ఈక్విటీ జారీ



న్యూఢిల్లీ: ఓమ్నిచానల్ ఐవేర్ రిటైలర్ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 2,150 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు మరో 13.22 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 273 కోట్లు దేశీయంగా సొంత స్టోర్ల ఏర్పాటు(పెట్టుబడి వ్యయాలు)కు, లీజ్, అద్దె, లైసెన్స్ ఒప్పందాల చెల్లింపులకు రూ. 591.5 కోట్లు, టెక్నాలజీపై రూ. 213.4 కోట్లు, బ్రాండ్ మార్కెటింగ్‌పై మరో రూ. 320 కోట్లు చొప్పున వెచ్చించనుంది.

2008లో షురూ: దేశీయంగా 2008లో ఏర్పాటైన లెన్స్‌కార్ట్.. 2010లో ఆన్‌లైన్ ద్వారా బిజినెస్‌కు తెరతీసింది. 2013లో న్యూఢిల్లీలో తొలి రిటైల్ స్టోర్‌ను తెరిచింది. కంపెనీ ఐవేర్ విభాగంలో డిజైనింగ్, తయారీ, బ్రాండింగ్, రిటైలింగ్‌ను చేపడుతోంది. 2025 మార్చికల్లా దేశీయంగా నెలకొల్పిన 2,067 స్టోర్లతో కలిపి ప్రపంచవ్యాప్తంగా 2,723 స్టోర్లను నిర్వహిస్తోంది. రాజస్తాన్‌లోని భివాడీ, హర్యానాలోని గురుగ్రామ్‌లలో ప్లాంట్లు ఉన్నాయి. జాన్ జాకబ్స్, విన్సెంట్ చేజ్, హూపర్ కిడ్స్ తదితర బ్రాండ్లతో బిజినెస్ నిర్వహిస్తోంది. 2024–25లో నష్టాల నుంచి బయటపడి రూ. 297 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఆదాయం రూ. 6,652 కోట్లను తాకింది.

సింగపూర్ సంస్థతో మిక్ ఎలక్ట్రానిక్స్ ఎంవోయూ



ముంబై: సింగపూర్‌కి చెందిన డీప్–టెక్ ప్లాట్‌ఫాం నియో సెమీతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు మిక్ ఎలక్ట్రానిక్స్ వెల్లడించింది. సెమీకండక్టర్ ఐపీ, ఏఐ ఆధారిత ఎనర్జీ లాజిస్టిక్స్ తదితర సరికొత్త రంగాల్లోకి ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో రక్షిత్ మాథుర్ తెలిపారు. అంతర్జాతీయంగా 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ విభాగాల మార్కెట్ 50 బిలియన్ డాలర్లపైగా ఉంటుందనే అంచనాలు నెలకొన్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లో సుస్థిర, స్మార్ట్ టెక్నాలజీల రూపకల్పనకు సారథ్యం వహించేందుకు ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆర్థికాంశాల మదింపు, సమగ్ర చర్చల కోసం ఎంవోయూ కింద 90 రోజుల వ్యవధి ఉంటుంది.

నాలుగు నెలల కనిష్టానికి రూపాయి

21 పైసలు పతనమై 86.91 వద్ద ముగింపు



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ 21 పైసలు క్షీణించి 4 నెలల కనిష్ఠ స్థాయి 86.91 వద్ద స్థిరపడింది. డాలర్ బలపడటం, క్రూడ్ ధరల అనూహ్య పెరుగుదల, నెలాఖరున ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, దిగుమతిదార్ల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి. 'అమెరికా–భారత్‌ల మధ్య ఆగస్టు 1న వాణిజ్య ఒప్పంద చర్చలు విఫలమైనా, చర్చలు వాయిదా పడినా దేశీయ కరెన్సీపై అదనపు ఒత్తిడి పడుతుంది. ట్రేడ్ డీల్ కుదిరితే రూపాయి బలపడే వీలుంది. అప్పటిదాకా ఫారెక్స్ ట్రేడర్లు వేచిచూసే ధోరణి ప్రదర్శించవచ్చు' అని మీరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ విశ్లేషకుడు అనుజ్ చౌదరీ తెలిపారు.

అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల

ఎగుమతుల్లో భారత్ టాప్

- చైనాను మించి సరఫరా
- కెనాలిస్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: టారిఫ్‌ల వివాదాలతో అమెరికాకు చైనా స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు నెమ్మదించడాన్ని భారత్ అవకాశంగా మల్చుకుంటోంది. 2025 రెండో త్రైమాసికంలో తొలిసారిగా అగ్రరాజ్యానికి చైనా కన్నా అధికంగా స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. కన్సల్టెన్సీ సంస్థ కెనాలిస్ నివేదికలో ఈ అంశం వెల్లడైంది. దీని ప్రకారం అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో చైనాలో అసెంబుల్ చేసిన ఫోన్ల వాటా గతేడాది ఏప్రిల్–జూన్ మధ్య కాలంలో 61 శాతంగా ఉండగా ఈ ఏడాది అదే వ్యవధిలో 25 శాతానికి తగ్గింది. అదే సమయంలో భారత్ వాటా 13 శాతం నుంచి 44 శాతానికి (సుమారు 240 శాతం వృద్ధి) పెరిగింది. క్యూ2లో ఐఫోన్ల ఎగుమతులు వార్షికంగా 11 శాతం తగ్గి 1.33 కోట్ల యూనిట్లకు పరిమితం కాగా, శాంసంగ్ ఫోన్ల ఎగుమతులు 38 శాతం పెరిగి 83 లక్షల యూనిట్లకు పెరిగాయి. టాప్ 5 ఫోన్లకు సంబంధించి అమెరికాకు మోటరోలా ఫోన్ల ఎగుమతులు రెండు శాతం పెరిగి 32 లక్షల యూనిట్లకు, గూగుల్ 13% పెరిగి 8 లక్షల యూనిట్లకు చేరగా, టీసీఎల్ 23% క్షీణించి 7 లక్షల యూనిట్లకు పరిమితమైంది.

క్యూ2లో తొలిసారి...

అమెరికాకు ఎగుమతయ్యే స్మార్ట్‌ఫోన్లకు సంబంధించి క్యూ2లో భారత్ తొలిసారిగా అగ్రగామి తయారీ హబ్‌గా నిల్చిందని కెనాలిస్ ప్రిన్సిపల్ అనలిస్ట్ సన్యమ్ చౌరాసియా తెలిపారు. అమెరికా–చైనా మధ్య వాణిజ్య అనిశ్చితి వల్ల యాపిల్ తమ సరఫరా వ్యవస్థను భారత్‌కు మళ్లిస్తుండటం ఇందుకు దోహదపడిందని వివరించారు. చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగంగా యాపిల్ గత కొన్నేళ్లుగా భారత్‌లో తమ ఉత్పత్తుల తయారీని పెంచుకుంటోందని చౌరాసియా చెప్పారు. అయితే, ఐఫోన్ 16 సిరీస్, ప్రో మోడల్స్ తయారీని భారత్‌లో ప్రారంభించినప్పటికీ, పెద్ద స్థాయిలో సరఫరా కోసం యాపిల్ ఇప్పటికీ చైనా తయారీ ప్లాంట్లపైనే ఎక్కువగా ఆధారపడుతోందని ఆయన వివరించారు. యాపిల్ తరహాలోనే మోటరోలా ఫోన్లకు కూడా ప్రధాన తయారీ హబ్‌గా చైనా నిలుస్తోంది. మరోవైపు, యాపిల్‌తో పోలిస్తే కాస్త తక్కువ పరిమాణమే అయినప్పటికీ అమెరికాకు ఎగుమతి చేసే ఉత్పత్తుల తయారీని శాంసంగ్, మోటరోలా కూడా భారత్‌లోనే ఎక్కువగా చేపడుతున్నాయని చౌరాసియా పేర్కొన్నారు. శాంసంగ్ అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లను వియత్నాంలో ఉత్పత్తి చేస్తోంది.

బ్లూచిప్ షేర్లకు డిమాండ్

- అరశాతం పెరిగిన సూచీలు
- 3 రోజుల నష్టాలకు బ్రేక్



ముంబై: దిగువ స్థాయిల్లో అధిక వెయిటేజీ షేర్లకు డిమాండ్ లభించడంతో స్టాక్ సూచీల మూడు రోజుల నష్టాలకు మంగళవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 447 పాయింట్లు బలపడి 81,338 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్లు పెరిగి 24,821 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. ఇటీవల మార్కెట్ పతనంలో భాగంగా కనిష్ట స్థాయిలకు దిగివచ్చిన నాణ్యమైన లార్జ్ క్యాప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని లాభాలు ఆర్జించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 539 పాయింట్లు పెరిగి 81,430 వద్ద, నిఫ్టీ 166 పాయింట్లు బలపడి 24,847 వద్ద గరిష్టాలు తాకాయి. యూరప్ మార్కెట్లు ఒకశాతం లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(2.2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (0.75%), ఎల్‌అండ్‌టీ (2.1%), ఎయిర్‌టెల్ (1.4%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.
- బీఎస్‌ఈలో రంగాలవారీ ఇండెక్సుల్లో రియల్టీ 1.64%, టెలికమ్యూనికేషన్ 1.50%, ఇంధన 1.22%, ఇండస్ట్రియల్స్ 1.20%, హెల్త్‌కేర్ 1.15%, కమోడిటీస్ 1.05% చొప్పున పెరిగాయి.
- ఉద్యోగాల కోత ప్రకటన నేపథ్యంలో రెండు ట్రేడింగ్ సెషన్లలో టీసీఎస్ షేరు 2.50% నష్టపోయింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.28,149 కోట్లు తుడిపెట్టుకుపోయి రూ.11.05 లక్షల కోట్లకు దిగివచ్చింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బ్యాంక్‌లు.. అర్థదారులు! | డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో ఎన్నారైలకు నిబంధనల సడలింపు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

ఈఎస్‌ఐసీ, న్యూఢిల్లీలో 243 ఫ్యాకల్టీ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సురెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 243.
- » **విభాగాలు:** అనాటమీ, అనెస్తీషియాలజీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ(ఎఫ్ఎంటీ), జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, ఓబీజీవై, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫిజియాలజీ, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్, ఎండీ, డీఎన్‌బీ, ఎండీఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.67,700 నుంచి రూ.2,08,700.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రీజనల్ డైరెక్టర్, ఈఎస్ఐ కార్పొరేషన్, పంచదీప్ భవన్, సెక్టార్–16(లక్ష్మీ నారాయణ మందిర్ దగ్గర), ఫరీదాబాద్–121002 చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.09.2025.
- » **వెబ్‌సైట్:** https://esic.gov.in

బీఎస్‌ఎఫ్‌లో 241 కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) స్పోర్ట్స్ కోటాలో సంబంధిత విభాగాల్లో కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) గ్రూప్–సి నాన్ గెజిటెడ్ అండ్ నాన్ మినిస్టీరియల్ (స్పోర్ట్స్ కోటా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **క్రీడలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, డైవింగ్, వాటర్ పోలో, బాస్కెట్ బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రాస్ కంట్రీ, ఈక్వెస్ట్రియన్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, హాకీ, ఐస్–స్కీయింగ్, జూడో, కరాటే, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, వాటర్ స్పోర్ట్స్, రెజ్లింగ్, షూటింగ్, తైక్వాండో, వుషు, ఫెన్సింగ్, కాయాకింగ్, కానోయింగ్(పడవ పందెం), రోయింగ్, టేబుల్ టెన్నిస్ తదితరాలు.
- » **అర్హత:** మెట్రిక్యులేషన్ లేదా సంబంధిత ఉత్తీర్ణతతో పాటు నేషనల్/ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌లో సంబంధిత క్రీడాంశాల్లో పాల్గొని ఉండాలి లేదా విజయాలు సాధించి ఉండాలి.
- » **వయసు:** 01.08.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.08.2025
- » **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

ఎన్‌సీఎల్‌టీ, న్యూఢిల్లీలో కోర్టు ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఒప్పంద ప్రాతిపదికన కోర్టు ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(లా) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:**24.07.2025 నాటికి 25ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.45,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.08.2025
- » **వెబ్‌సైట్:** https://nclt.gov.in

ఐసీఎంఆర్–ఎన్ఐఎన్, హైదరాబాద్‌లో అసిస్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి.
- » **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.08.2025.
- » **వెబ్‌సైట్:** https://www.icmr.gov.in

జాబ్ పాయింట్

ఎన్ఐడీఎం, న్యూఢిల్లీలో ప్రొఫెసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- » **అర్హత:** సోషల్ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్/ఎర్త్ సైన్సెస్/ఇంజనీరింగ్/డిజాస్టర్ మేనేజ్‌మెంట్ లేదా తత్సమాన విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 01.07.2025 నాటికి 55 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.1,44,200 నుంచి రూ.2,18,200.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఈమెయిల్:** recruitment.nidm@nic.in.
- » **దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
- » **వెబ్‌సైట్:** https://nidm.gov.in

ఎన్ఐడీఎం, న్యూఢిల్లీలో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **అర్హత:** సోషల్ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్/ఎర్త్ సైన్సెస్/ఇంజనీరింగ్/డిజాస్టర్ మేనేజ్‌మెంట్ లేదా తత్సమాన విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 01.07.2025 నాటికి 50 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఈమెయిల్:** recruitment.nidm@nic.in
- » **దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
- » **వెబ్‌సైట్:** https://nidm.gov.in

కేంద్రంలో కానిస్టేబుల్ కొలువు

» 3,588 కానిస్టేబుల్(ట్రేడ్స్‌మెన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

» రాత పరీక్ష, ఫిజికల్, ట్రేడ్ టెస్టుల ఆధారంగా ఎంపిక

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్).. 3,588 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా, ట్రేడ్‌ల వారీగా ఖాళీలను ప్రకటించింది. పదోతరగతి, ఐటీఐ ఉత్తీర్ణులు ఈ పోస్టులకు పోటీపడొచ్చు. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టు (పీఈటీ), రాత పరీక్ష, ట్రేడ్ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో.. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పోస్టులు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



బీఎస్ఎఫ్ జాబ్స్

- ✦ **పోస్టులు:** కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మెన్)
- ✦ **పోస్టుల సంఖ్య:** 3,588(పురుషులకు–3406, మహిళలకు–182).

అర్హత

ఆయా ట్రేడ్‌ను అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడులో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి రెండేళ్లు, లేదా ఒక ఏడాది సర్టిఫికెట్ కోర్సు ఉండాలి. కొన్ని ట్రేడ్‌లకు సంబంధిత ట్రేడ్‌లో నైపుణ్యం ఉండాలి.

వయసు

24.08.2025 నాటికి 18–25 ఏళ్ల మధ్యలో వయసు ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

శారీరక ప్రమాణాలు

పురుషులకు ఎత్తు 165 సెంటీ మీటర్లు, ఛాతి 75–80 సెంటీమీటర్లు ఉండాలి. అలాగే మహిళలకు ఎత్తు 155 సెంటీమీటర్లు ఉండాలి.

వేతనం

ఏడో సీపీసీ ప్రకారం–వేతనం శ్రేణి నెలకు రూ.21,700–రూ.69,100 అందుతుంది. దీంతో పాటు బీఎస్ఎఫ్ నిబంధనల మేరకు రేషన్ అలవెన్సు, మెడికల్ అసిస్టెన్స్, ఉచిత నివాస వసతి తదితర సౌకర్యాలు పొందే అవకాశముంది.

ఎంపిక ఇలా

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ), రాత పరీక్ష(ఓఎంఆర్/సీబీటీ), ట్రేడ్ టెస్టు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

పీఎస్‌టీ, పీఈటీ

ఎంపిక ప్రక్రియ తొలి దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్టు/ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులను నిర్వహిస్తారు. ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది. పీఎస్‌టీ/పీఈటీకి సంబంధించిన అన్ని ఈవెంట్స్/స్టేజెస్‌లోనూ అభ్యర్థులు అర్హత సాధించాలి. ఏ ఒక్క ఈవెంట్‌లో అర్హత సాధించకపోయినా.. తదుపరి దశకు అనుమతించరు. రేస్ ఈవెంట్‌కు సంబంధించి పురుష అభ్యర్థులు 5 కిలో మీటర్ల రేస్‌ను 24 నిమిషాల్లో పూర్తి చేయాలి. అలాగే మహిళా అభ్యర్థులు 1.6 కిలోమీటర్ల దూరాన్ని 8.30 నిమిషాల్లో పూర్తిచేయాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

తొలి దశ పీఎస్‌టీ/పీఈటీలో అర్హత సాధించిన అభ్యర్థులకు రెండో దశలో వంద మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఇందులో జనరల్ అవేర్‌నెస్/జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, నాలెడ్జ్ ఆఫ్ ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, అనలిటికల్ అప్టిట్యూడ్ అండ్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–25 మార్కులకు, ఇంగ్లిష్/హిందీ బేసిక్ నాలెడ్జ్‌పై 25 ప్రశ్నలు–25 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులు కనీసం 33 శాతం మార్కులు సాధించాలి.

మెరిట్ జాబితా ఇలా

రాత పరీక్షలోనూ అర్హత సాధించిన వారికి మూడో దశలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. ఆ తర్వాత దశలో పలు పోస్టులకు సంబంధించి ట్రేడ్ టెస్టు నిర్వహిస్తారు.

ఇలా పీఎస్‌టీ, పీఈటీ, రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, ట్రేడ్ టెస్టుల్లోనూ అర్హత సాధించిన వారికి అంతిమంగా సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి.. రాష్ట్రాలు /యూటీల వారీగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను బీఎస్ఎఫ్ వెబ్‌సైట్‌లో వెల్లడిస్తారు.

ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 25.07.2025
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 23.08.2025
- ✦ **దరఖాస్తుల సవరణ:** 2025 ఆగస్టు 24 నుంచి 26వ తేదీ వరకు.
- ✦ **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in/#bsf-current-openings

ఆర్‌బీఐలో మేనేజర్ ఉద్యోగాలు

కేంద్ర బ్యాంకు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రూప్ ఏ అండ్ బీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతుంది. ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

- ▪ **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
- ▪ **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్–13, మేనేజర్–10, లీగల్ ఆఫీసర్–05 పోస్టులు
- ▪ **విభాగాలు:** సివిల్, టెక్నికల్, ఎలక్ట్రికల్, రాజ్‌భాష, ప్రోటోకాల్ అండ్ సెక్యూరిటీ
- ▪ **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎల్ఎల్‌బీ,బీటెక్(సివిల్,ఎలక్ట్రికల్), పీజీలో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- ▪ **వయసు:** పోస్టులను అనుసరించి 21–40 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ▪ **వేతనం:** నెలకు గ్రేడ్–ఏ పోస్టులకు బేసిక్ పే రూ.35,150, అసిస్టెంట్ మేనేజర్ బేసిక్ పే రూ.28,150 మూల వేతనంగా లభిస్తుంది.

ఎంపిక విధానం

- ▪ **ఆఫీసర్ గ్రేడ్ బీ:** ఆన్‌లైన్ విధానంలో రెండు దశల్లో నిర్వహించే రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ▪ **అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ ఏ:** ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

- ▪ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- ▪ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 31.08.2025
- ▪ **వెబ్‌సైట్:** https://opportunities.rbi.org.in



మాట్లాడండి ప్లీజ్!

ఒంటరితనంతో కుంగిపోతున్న వయోధికులు

- మాట్లాడే మనుషుల కోసం పడిగాపులు
- మాటల కోసం డేకేర్, కమ్యూనిటీ సెంటర్లను ఆశ్రయిస్తున్న వైనం
- మాట్లాడేందుకే హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు

సాక్షి, హైదరాబాద్: ఒక్కమాట...ఒకే ఒక్కమాట కోసం వయోధికులు తపించిపోతున్నారు. 'బాగున్నారా'అనే పిలుపు కోసం అల్లాడిపోతున్నారు. 'ఆరోగ్యం ఎలా ఉంది'అనే కనీస పలకరింపులకు నోచక కుంగిపోతున్నారు. మాట్లాడే మనుషుల కోసమే కొందరు వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తుండగా, మరికొందరు డేకేర్ సెంటర్లు, కమ్యూనిటీ హాళ్లకు వెళుతున్నారు. కొంతమంది ప్రత్యేకంగా కేర్‌గివర్స్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. వృద్ధాప్యమే ఒక భారం కాగా మాట్లాడే మనుషులు కరువై చాలామంది కుంగుబాటుకు గురవుతున్నారు. హైదరాబాద్‌లో చాలామంది ఈ తరహా డిప్రెషన్‌తో అనారోగ్యానికి గురవుతున్నట్టు ఎన్జీవోలు చెబుతున్నాయి. హెల్పేజ్ ఇండియా సంస్థ అంచనాల మేరకు నగరంలో 70 ఏళ్లు దాటినవారు 25 లక్షల మందికి పైగా ఉన్నారు. వారిలో 50 శాతం వయోధికులు కుటుంబాలతో కలిసి జీవిస్తుండగా మరో 25 శాతం మంది ఒంటరిగా ఉంటున్నారు. ఇంకొందరు వృద్ధాశ్రమాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. సొంత ఇళ్లలోనే ఉంటున్నా జీవిత భాగస్వామిని కోల్పోయి ఒంటరిగా గడిపేస్తున్నారు.

మనుషులు కావాలి...

బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన శ్రీనివాసమూర్తి ఓ ప్రభుత్వరంగ సంస్థలో పనిచేసి 15 ఏళ్ల క్రితం రిటైరయ్యారు. కూతురు, కొడుకు అమెరికాలో ఉంటుండగా ఐదేళ్ల క్రితం ఆయన భార్యను కోల్పోయారు. అప్పటి నుంచి ఒంటరిగానే ఉంటున్నారు. 'రోజులు, వారాలు, నెలలు గడిచిపోతూనే ఉన్నాయి. అప్పుడప్పుడూ అమెరికా నుంచి పిల్లలు పలకరిస్తారు. 'తిన్నావా, ఆరోగ్యం ఎలా ఉంది. మందులు వేసుకుంటున్నావా' అని ముక్తసరిగా మాట్లాడుతున్నారు. ఇంటిపని, వంట కోసం మనుషులు అవసరం లేదు కానీ రోజూ ఓ రెండు గంటలపాటు మాట్లాడేందుకు ఒక మనిషి ఉంటే బాగుండేది'అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఒక్క శ్రీనివాసమూర్తి ఆవేదన మాత్రమే కాదు. చాలామంది వయోధికులు ఎదుర్కొంటున్న సమస్య.

- ➤ కుషాయిగూడ ప్రాంతానికి చెందిన సత్యనారాయణ ఇంట్లో కొడుకు, కోడలు, మనుమడు, మనుమరాలు అందరూ ఉన్నా, ఉదయం నుంచి రాత్రి వరకు పొడిపొడిగా నాలుగైదు మాటలు మినహా ఆత్మీయమైన పలకరింపులు లేవని, అవన్నీ తన భార్యతోనే దూరమయ్యాయని చెప్పారు.
- ➤ హబ్సిగూడకు చెందిన మరో మహిళ కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్నారు. కేర్‌గివర్స్ కోసం ప్రతినెలా రూ.15,000 చెల్లిస్తున్నారు. తనకు ప్రత్యేకమైన అవసరాలు లేకపోయినా, ప్రతిరోజు ఆమె వచ్చి పలకరించి వెళుతుందని, చిన్నచిన్న పనులు చేస్తుందని చెప్పారు.
- ➤ 'ఇంటిపని చేసేందుకు, ఇతరత్రా సపర్యల కోసం మనుషులను ఏర్పాటు చేసుకొంటారు. కానీ ఇప్పుడు మాట్లాడే మనుషుల కోసం అలాంటి ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తుందని'హెల్పేజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థకు చెందిన శ్యామ్ విస్మయం వ్యక్తం చేశారు.

కేర్‌గివర్స్ సేవలు చాలా ఖరీదు



వయోధికులకు సహాయం చేసేందుకు, ఆసరాగా నిలిచేందుకు నగరంలో ఏజెన్సీలు, కేర్‌గివింగ్ సంస్థలు పనిచేస్తున్నాయి. వృద్ధుల అవసరాలకనుగుణంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. సమయానికి మందులు ఇవ్వడం, సెలైన్‌లు, ఇంజక్షన్లు ఇవ్వడం వంటి వైద్యపరమైన సేవలతో కూడిన నర్సుల కోసం ప్రతినెలా రూ.25,000 నుంచి రూ.30,000 వరకు వెచ్చిస్తున్నారు. స్నానం చేయించడం, డైపర్స్ మార్చడం, సమయానికి భోజనం, మందులు ఇవ్వడం వంటి సేవల కోసం సాధారణ కేర్‌గివర్స్ అందుబాటులో ఉన్నారు. వీరికోసం రూ.15,000 వరకు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇంకా కొన్ని సంస్థలు ఒక గంట సర్వీసును కూడా అందజేస్తున్నాయి. ఆస్పత్రి, గుడికి తీసుకెళ్లేందుకు, ఓ గంటపాటు ఇంటికి వచ్చి యోగక్షేమాలు తెలుసుకొనేందుకు, కిరాణా వస్తువులు, మందులు తెచ్చి ఇచ్చేందుకు కూడా కేర్‌గివర్స్ ఉన్నారు. ఇలా గంటల చొప్పున సేవలు అందజేస్తున్న సంస్థలు ఒక గంటకు రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నట్టు స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఎలాంటి ఆసరా లేకుండా అభద్రతా భావంతో నిస్సహాయంగా బతికేస్తున్న ఒంటరి వృద్ధులు మాట్లాడే మనుషుల కోసం, చిన్న చిన్న సహాయల కోసం పెద్ద మొత్తంలో చెల్లించుకోవాల్సి వస్తోంది.

బాధలు పంచుకోండి..

- మాట్లాడే మనుషులు లేక ఒంటరితనంతో డిప్రెషన్‌కు గురవుతున్న వయోధికుల కోసం హెల్పేజ్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా హెల్ప్‌లైన్‌ను నిర్వహిస్తోంది,
- వయోధికులు టోల్‌ఫ్రీ నంబరు : 18001801253 కు ఫోన్ చేసి తాము ఎదుర్కొంటున్న బాధలు, సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందొచ్చు.
- కాలక్షేపం కోసం మాట్లాడొచ్చు. వయోధికులైన వారికి ఈ టోల్‌ఫ్రీ నంబరు ద్వారా సాంత్వన లభిస్తుంది.
- ఈ హెల్ప్‌లైన్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుంది.

బిజీగా ఉండాలి



డా. విజయలక్ష్మి
జీహెచ్ఎంసీ ఆసరా సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రెటరీ

కొంతకాలంగా ఒంటరిగానే ఉంటున్నాను. కానీ నిత్యం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతాను. దీంతో బాగానే గడుస్తోంది. యోగా, వాకింగ్, పుస్తక పఠనం, టీవీలో నచ్చిన కార్యక్రమాలు చూడడం వల్ల ఒంటరితనాన్ని ఎదుర్కోవొచ్చు. ఒంటరితనం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారు సాధ్యమైనంత వరకు ఏదో ఒక పనిలో ఉంటే కొంత వరకు ఊరట లభిస్తుంది.

డేకేర్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం ఇప్పుడు తెలంగాణలో డేకేర్ సెంటర్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఇది మంచి పరిణామమే. కానీ హైదరాబాద్‌లో ప్రతివార్డుకు ఒక డేకేర్ అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలి. సమీప కాలనీలకు చెందిన వృద్ధులు అక్కడకు వెళ్లి కాలక్షేపాన్ని పొందుతారు.

శ్యామ్, హెల్పేజ్ ఇండియా సంస్థ

దేశమంతటా నాగుల పంచమి.. కందుకూరులో తేళ్ల పంచమి

- కర్ణాటకలోని కొండమవ్వ ఆలయంలో విచిత్ర ఆచారం
- అక్కడ తేళ్లను ఒంటిపై వేసుకున్నా కుట్టవని భక్తుల విశ్వాసం



నారాయణపేట: దేశమంతా నాగుల పంచమి పండుగ జరుపుకుంటే మంగళవారం నారాయణపేట జిల్లా సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని కందుకూరులో మాత్రం తేళ్ల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాద్గీర్ జిల్లా గుర్మిట్కల్ తాలూకా కందుకూరు సమీపంలోని కొండమవ్వ (మహేశ్వరి) అమ్మవారి సన్నిధిలో భక్తులు కొండమవ్వను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా నాగుల పంచమి రోజే ఇక్కడ తేళ్ల పంచమి జరుపుకోవడం ఆచారం. ఈ ఆలయ పరిసరాల్లో తేళ్లు మనుషులకు హాని చేయవు. అమ్మవారి మహిమ వల్లే తేళ్లు తమకు హాని చేయవనేది భక్తుల విశ్వాసం. కొండపై ఆలయ పరిసరాల్లోని ఏ చిన్న రాయిని తొలగించినా.. వాటి కింద తేళ్లు కనిపిస్తాయి. వాటిని చేతితో తాకినా.. పట్టుకున్నా..ముఖం, మెడ నాలుకపై వేసుకున్నా, శరీరంపై పాకించినా కుట్టవు. ఇది అమ్మవారి దివ్యానుగ్రహమని భక్తులు విశ్వసిస్తారు. గుట్టపై ఉండే వాతావరణ పరిస్థితులు, వనమూలికల కారణంగా తేళ్లు కుట్టవని కొందరు విద్యావంతులు చెబుతున్నారు.

గురుకుల విషాహార మృతులు 48

- విద్యార్థుల మరణాలపై 4 వారాల్లో నివేదిక కోరాం: ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని ఐదు గురుకుల పాఠశాలల కార్యదర్శులను ఆదేశించినట్టు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్‌పర్సన్ జస్టిస్ వి రామసుబ్రమణియన్ తెలిపారు. మొత్తం 886 ఫుడ్ పాయిజన్ ఘటనల్లో 48 మంది విద్యార్థులు మృతి చెందినట్టు చెప్పారు. ఈ ఘటనలకు బాధ్యులైన కాంట్రాక్టర్లతోపాటు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకుని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్టు ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలియజేశారని వెల్లడించారు. అదేవిధంగా లగచర్ల ఘటనపై ఇప్పటికే బాధితుల నుంచి ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు వివరాలు సేకరించారని, దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో రెండు రోజుల క్యాంప్ సిట్టింగ్‌లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతోపాటు పలు ఎన్జీఓలు, మానవ హక్కుల ఉద్యమకారులతో కమిషన్ విడివిడిగా సమావేశాలు నిర్వహించింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సయాని, తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కలిసి రామసుబ్రమణియన్ మాట్లాడారు. రెండురోజుల్లో ఫుల్ కమిషన్ విచారించిన 19 కేసులు కలిపి మొత్తం 109 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు.

34,685 పెండింగ్ కేసులు: ఎన్‌హెచ్‌ఆర్‌సీ వద్ద దేశవ్యాప్తంగా 34,685 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు జస్టిస్ రామసుబ్రమణియన్ చెప్పారు. తెలంగాణలో 780 కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 285 పోలీస్ కస్టడీ మరణాలు, 2,535 జ్యుడీషియల్ కస్టడీ మరణాల కేసులు, తెలంగాణలో 4 పోలీస్ కస్టడీ మరణాలు, 30 జ్యుడీషియల్ కస్టడీ మరణాల కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు వివరించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటో కేసుల సంఖ్య ఏటా పెరుగుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా 2021లో 17, 2022లో 60, 2023లో 117, 2024లో 106 సుమోటో కేసులు నమోదు చేశామని, ఈ ఏడాది ఇప్పటికే 50కిపైగా సుమోటో కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సెక్రటరీ జనరల్ భరత్ లాల్, డీజీ (దర్యాప్తు) ఆర్‌పీ మీనా, డిప్యూటీ రిజిస్ట్రార్ (లా) ఇంద్రజిత్, డాక్టర్ ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వెళ్తే.. అభ్యంతరం చెప్పొద్దు!

- వరుసగా లొంగిపోతున్న సీనియర్ మావోయిస్టులు
- ఓ వైపు నిర్బంధం.. మరోవైపు ఎన్‌కౌంటర్లతో కుదుపు
- శాంతి చర్చల ప్రతిపాదనను తెచ్చినా పట్టించుకోని కేంద్రప్రభుత్వం
- తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న సీనియర్ నేతలు
- లొంగిపోతే అభ్యంతరం చెప్పొద్దని పార్టీ అభిప్రాయం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ముప్పై, నలభై ఏళ్ల కిందట అజ్ఞాతంలోకి వెళ్లి సాయుధ పోరాట బాట పట్టిన మావోయిస్టులు ప్రస్తుత సమాజ తీరు తెన్నులు తెలుసుకునేందుకు జనజీవన స్రవంతి లోకి వస్తున్నారా? అన్న ప్రశ్నకు ఔననే సమాధానం వస్తోంది. ఓవైపు పెరిగిన నిర్బంధానికి తోడు మరో వైపు వరుస ఎన్‌కౌంటర్లతో వనాలను వీడి జనాల్లోకి వచ్చేందుకు మావోయిస్టులు మొగ్గు చూపుతున్నట్లు తాజా పరిణామాల ఆధారంగా తెలుస్తోంది.

తీవ్ర నిర్బంధం..

ఆపరేషన్ కగార్ మొదలయ్యాక సగటున పదిహేను రోజులకు ఒక ఎన్‌కౌంటర్ వంతున జరుగుతున్నాయి. ప్రతీ ఎన్‌కౌంటర్‌లో 10–15 మంది మావోయిస్టులు చనిపోతున్నారు. ఇలా పెరిగిన నిర్బంధం .. ఇంకో పక్క రిక్రూట్‌మెంట్లు తగ్గడమే కాక మావోయిస్టుల సప్లై చైయిన్ కూడా కుదుపులకు లోనైంది. దీంతో అడుగు వెనక్కి తగ్గిన మావోయిస్టులు మార్చి 28న శాంతి చర్చల ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. మరోవైపు మావోయిస్టుల కంచుకోటలుగా పేరున్న దండకారణ్యం, కర్రెగుట్టలు, ఏఓబీ, గడ్చిరోలి జిల్లాల్లో సాయుధ దళాల సంచారం కష్టంగా మారింది. ఇదే సమయంలో సరికొత్త సరెండర్ పాలసీని ప్రభుత్వాలు అమల్లోకి తెచ్చాయి. దీంతో ఈ ఏడాది ఆరంభం నుంచి దళ సభ్యులు, ఏరియా కమాండర్లు, జన మిలీషియా, పీఎల్‌జీఏ తదితర మావోయిస్టు పార్టీకి చెందిన వారు పెద్ద ఎత్తున లొంగిపోతున్నారు. ఈనెల 24న ఛత్తీస్‌గఢ్‌లో ఐదు జిల్లాల పరిధిలో ఏకంగా 64 మంది మావోయిస్టులు లొంగిపోవడం ఈ కోవలోకి వస్తుంది.

నంబాల మృతి తర్వాత..

శాంతిచర్చల కోసం చేసిన ప్రయత్నాలు సానుకూల ఫలితాలు ఇవ్వకపోగా, మే 21న జరిగిన గుండెకోట్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు మరణం ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని చేకూర్చింది. పైగా నంబాల కేశవరావు టీమ్‌లో ఉన్న ఇద్దరు సభ్యులు ఎన్‌కౌంటర్‌కు రెండ్రోజుల ముందు అజ్ఞాత దళాలను విడిచి వెళ్లడం పార్టీపై ప్రభావం చూపిందని చెబుతున్నారు. తీవ్ర నిర్బంధం నేపథ్యంలో ఎవరిని నమ్మాలి, ఎవరిని నమ్మకూడదో తెలియని అయోమయ పరిస్థితి పార్టీలో సభ్యులకు ఎదురైనట్టు తెలుస్తోంది. మరోవైపు సీనియర్ నాయకులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు సమాచారం . ఇలా క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ తరఫున దిశానిర్దేశం చేయడం అగ్రనాయకత్వానికి కష్టంగా మారగా.. కిందిస్థాయి నేతలకు అగ్రనాయకులతో కాంటాక్ట్ దొరకడం దుర్లభమనే పరిస్థితులు నెలకొన్నాయి.

గెరిల్లాగా ఉండలేని పక్షంలో..

ఇటీవల జోరుగా కురుస్తున్న వానలతో అడవులు పచ్చబడ్డాయి. అయినా అడవులు మావోయిస్టులకు సేఫ్ జోన్‌గా ఉండలేకపోతున్నాయి. రోజురోజుకు పెరిగిన నిర్బంధం కారణంగా ఒకేచోట తలదాచుకోవడం, క్యాంప్‌లను మార్చడం క్లిష్టమైన వ్యవహారంగా మారింది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో మరింత ఇక్కట్లు తప్పవనే భావనకు వచ్చినట్లు తెలిసింది. ఈ సమయంలో సాయుధ విప్లవ పోరాటమే మిన్న అనుకున్న వారు చావోరేవో అడవుల్లోనే అన్న నిర్ణయానికి రాగా.. అనారోగ్యం, ఇతర ఇబ్బందులు ఉన్నవారు లొంగిపోతే అభ్యంతరం చెప్పొద్దనే అభిప్రాయానికి పార్టీ వచ్చిందనే ప్రచారం సాగుతోంది. దీంతో గడిచిన రెండు వారాలుగా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇరవై ఏళ్లకు పైగా అజ్ఞాత జీవితం గడిపిన మావోయిస్టు లీడర్ల లొంగుబాట్లు పెరిగాయనే వాదన వినిపిస్తోంది.

మార్పుల మదింపు

నంబాల కేశవరావు వంటి నాయకుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోతే, ఆయన మృతదేహానికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించడంలో ప్రభుత్వం చూపిన వైఖరిపై పౌరసమాజం నుంచి వచ్చిన స్పందనను కూడా పార్టీ మదింపు చేసే ఆలోచనలో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాజికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా ముప్పై నలభై ఏళ్ల కిందట గ్రామాలు, పట్టణాల్లో ఉన్న పరిస్థితులకు ఇప్పటి పరిస్థితులకు మధ్య వచ్చిన మార్పును అంచనా వేయడం మంచిదనే అభిప్రాయానికి పార్టీ వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అందుకే లొంగుబాట పట్టిన కేడర్‌ను వారించే ప్రయత్నం చేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



జీఎస్టీ ఎగవేతలను అడ్డుకోండి

సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వస్తు, సేవల పన్నుకు (జీఎస్టీ) ఎగవేతలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖపై మంగళవారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జీఎస్టీ పరిధిలోని సంస్థలు సక్రమంగా పన్ను చెల్లించేలా చూడాలని సూచించారు. అదే సమయంలో చెల్లింపుదారులకు సంబంధించి అనుమానాలు, సందేహాల నివృత్తికి కాల్‌సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సెంటర్ నిర్వహణలో కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించుకోవాలని సూచించారు. జీఎస్టీ, ఇతర పన్నుల విషయంలో పొరుగు రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేసి మేలైన విధానాలను స్వీకరించాలని అన్నారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించేలా కార్యాలయాల్లో ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, ఆ శాఖ డైరెక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖలో 14 మందికి పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, మత్స్య శాఖలో పలువురు అధికారులకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 సంవత్సరానికి గుర్తించిన ప్యానల్ ఆధారంగా, క్లాస్‌–ఏ కేటగిరీలోని అసిస్టెంట్ డైరెక్టర్లను డిప్యూటీ డైరెక్టర్‌లుగా తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ మేరకు మొత్తం 14 మంది అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ, వివిధ జిల్లాల్లో డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు కేటాయించారు. డాక్టర్ డి.బి.రామ్‌జీ (మెదక్), డాక్టర్ ఆర్.బి. శ్రీనివాస రావు (నాగర్‌కర్నూలు), డాక్టర్ బి.శంకర్ (పెద్దపల్లి), డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు (భద్రాద్రి కొత్తగూడెం), డాక్టర్ షేక్ నసీరుద్దీన్ అహ్మద్ (జగిత్యాల), డాక్టర్ ఎం.భరత్ (కామారెడ్డి), డాక్టర్ ఆర్. శ్రీనివాస్ కుమార్ (క్వాలిటీ అసెస్‌మెంట్ ల్యాబ్, హైదరాబాద్), డాక్టర్ ఎ.రాజేశ్వర్ (నిర్మల్), డాక్టర్ వై.రాధాకిషన్ (హనుమకొండ), డాక్టర్ పి.వెంకటేశ్వర్లు (మానిటరింగ్ సెల్, హైదరాబాద్), డాక్టర్ పి.జానయ్య (హైదరాబాద్), డాక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్ (యాదాద్రి భువనగిరి), డాక్టర్ బి.కిషన్ (ఆదిలాబాద్), డాక్టర్ కె.విజయ భాస్కర్ (మేడ్చల్)కు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ నియామకాలు తాత్కాలికంగా, అడ్‌హాక్ ప్రాతిపదికన జరగడం గమనార్హం. కాగా ఉద్యోగి 15 రోజుల్లోగా కొత్త పోస్టులో చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. నిర్దిష్ట కాలంలోగా చేరని పక్షంలో, ఆయన/ఆమె పదోన్నతికి సంబంధించిన హక్కులను కోల్పోతారని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ ఏ పార్టీలో విలీనం కాదు: కొప్పుల



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు.. ఏ పార్టీలో విలీనం కాదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బీఆర్‌ఎస్ బీజేపీలో విలీనం అవుతుందంటూ బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలు ఇయర్ ఆఫ్ ది జోక్ అని ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని, భవిష్యత్‌లో బీజేపీతో బీఆర్‌ఎస్ పార్టీకి ఎలాంటి పొత్తు ఉండదని స్పష్టంచేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేశ్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దని కోరారు. బీఆర్‌ఎస్‌ను అస్థిరపరచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్‌ను సీఎం రమేశ్ చదివారని విమర్శించారు. టీడీపీ నుంచి రాజ్యసభ ఎంపీ అయి ఈడీ, సీబీఐ కేసులకు భయపడి బీజేపీలో చేరిన సీఎం రమేశ్ మాటలకు విలువ ఉందా? అని కొప్పుల ప్రశ్నించారు. 'కేటీఆర్ నా ఇంటికి వచ్చి కలిశారంటున్న సీఎం రమేశ్.. నీ కంపెనీ కోసం, నీ కాంట్రాక్టుల కోసం అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ వెంటపడలేదా?'అని నిలదీశారు. బీఆర్‌ఎస్‌ది తెలంగాణ భావజాలం అయితే, బీజేపీది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమని పేర్కొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతులు

44 మందికి ఎస్‌జీడీసీ హోదా కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌జీడీసీ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు డిప్యూటీ కలెక్టర్లు ఎంవీ రవీంద్రనాథ్, సీహెచ్ మధుమోహన్, వి.అనురాధ, టీఏవీ నాగలక్ష్మి, పి.రాంచందర్, ఎం.మాలతి, ఎస్.రాజేశ్‌కుమార్, కె.సూర్యలత, ఎస్.పద్మావతి, ఎస్.శారదాదేవి, ఎం.లలిత సూర్యకుమారి, ఆర్‌ఎస్ చంద్రావతి, కె.స్వర్ణలత, ఎల్.రమాదేవి, వి.లీలా, ఎస్.రమేశ్‌బాబు, ఎ.విజయకుమారి, బి.శ్రీరాములు, ఎస్.శ్రీను, ఆర్.పాండు, వి.హనుమ, కె.సత్యపాల్‌రెడ్డి, ఆర్.దశరథ్, ఆర్‌ఎస్ చిత్రు, సీహెచ్ రవీందర్‌రెడ్డి, వి.రాములు, టి.పద్మావతి, ఎల్.రమేశ్, బి.రాజాగౌడ్, ఎస్.రవి, ఎస్.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్.రాజేశ్వర్, కె.వెంకారెడ్డి, టి.శ్రీనివాసరావు, పి.సాయిరాం, ఎన్.ప్రసూనాంబ, వి.లచ్చిరెడ్డి, ఎల్.అలివేలు, టి.వినోద్‌కుమార్, వి.శ్రీనివాసులు, కె.రమాదేవి, వి.సుహాసిని, ఎస్.రాధికారమణి, బి.జయశ్రీలకు ఎస్‌జీడీసీలుగా పదోన్నతి లభించింది.

పదోన్నతులపై డిప్యూటీ కలెక్టర్ల సంఘం హర్షం

కాగా, పదోన్నతులు ఇవ్వడం పట్ల డిప్యూటీ కలెక్టర్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ శాఖలో 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించడంపై ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు కె.చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ఎ.భాస్కర్ రావులు మంగళవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. గత నెలలో 33 మందికి అడిషనల్ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించగా.. నెల రోజుల వ్యవధిలోనే ఏకంగా 44 మంది అధికారులకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించి తమది ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వమని చాటుకున్నారని ప్రశంసించారు. ఈ పదోన్నతుల ద్వారా జిల్లాల్లో భూ భారతి, ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు.



మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలుపుతున్న డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి తదితరులు

కోర్టు సమయాన్ని వృథా చేస్తే జరిమానా


వ్యర్థ పిటిషన్లపై హైకోర్టు హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: కోర్టు సమయాన్ని వృథా చేసేలా వ్యర్థ పిటిషన్లు వేస్తే భారీ జరిమానా విధిస్తామని హైకోర్టు హెచ్చరించింది. మృతి చెందిన వ్యక్తి పేరుపై భవనానికి పర్యావరణ అనుమతులిచ్చారని, వాటిని రద్దు చేయాలన్న పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 105, 106, 107, 108, 109, 111, 112, 113, 114లోని భూమిలో హైరైజ్ భవనాల నిర్మాణానికి మృతి చెందిన వ్యక్తి పేరుతో పర్యావరణ అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ శ్రీజయవర్ధన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ శామ్‌కోషి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. మృతి చెందిన వ్యక్తి పేరుతో 2019లో కేంద్రం పర్యావరణ, ఇతర అనుమతులు ఇచ్చిందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ పిటిషన్ విచారణార్హం కాదని, సివిల్ వివాదమైనందున ఆ కోర్టులోనే తేల్చుకోవాలని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ చెప్పారు. నిర్మాణదారు చేసుకున్న డెవలప్‌మెంట్ అగ్రిమెంట్‌లో పిటిషనర్ కూడా భాగస్వామి అని, ఒప్పందం అమలు చేయకపోవడంతో రెరాకు ఫిర్యాదు చేశారన్నారు. అంతేకాదు ఇక్కడా గతంలో ఓ పిటిషన్ దాఖలు చేశారని, ఇది రెండోసారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. రెండోసారి పిటిషన్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి పిటిషన్లు వేసి కోర్టు సమయాన్ని వృథా చేయడాన్ని తప్పుబట్టింది. ఇకపై ఎవరైనా ఇలా పిటిషన్లు వేస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది.

శవాలు కూడా అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం

'సిగాచీ' ఘటనపై బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ప్రమాదంలో మరణించిన కుటుంబాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరించడం లేదని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ప్రమాద ఘటన పట్ల కాంగ్రెస్ బాధ్యతాయుతంగా స్పందించడం లేదని, కనీసం శవాలను కూడా గుర్తించలేని స్థితిలో ఉందన్నారు. ఘటన జరిగి నెల రోజులు కావస్తున్నా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడం లేదని, ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నాయకులపై చిల్లర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించడంతో పాటు గాయపడిన వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు ఇస్తామని సీఎం రేవంత్ ప్రకటించినా నేటికీ సహాయం అందలేదన్నారు. శవాలను అట్టపెట్టెలు, నూనె డబ్బాల్లో పెట్టి బాధిత కుటుంబాలకు అందజేయడాన్ని శ్రీనివాస్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సిగాచీ పరిశ్రమ యాజమాన్యంపై నేటికీ ఎందుకు కేసులు నమోదు చేయలేదని నిలదీశారు. ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిషన్ నివేదికను వెంటనే బయట పెట్టాలన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలి

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ అశోక్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని న్యాయవాదులకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆగస్టు 2న జరగనున్న రాజ్యాంగ సవాళ్ల కార్యక్రమం పోస్టర్‌ను హైకోర్టు వద్ద ఆయన ఆవిష్కరించారు. అనంతరం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. సమాఖ్యవాదం, పౌర స్వేచ్ఛ, సంస్థాగత సమగ్రత తదితర అంశాలపై జరిగే చర్చలో యువత, న్యాయవాదులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌సీఏఏ మాజీ అధ్యక్షుడు ఎ.రవీందర్ రెడ్డి, న్యాయవాదులు ఉమాశంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ, ఎడ్‌టెక్‌ల విస్తరణ

- ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్ రంగాల్లో నిపుణులకు అధిక డిమాండ్
- భారత్‌లో ఇంకా పూర్తిస్థాయిలో పుంజుకోని ఆయా రంగాలు
- యువత ప్రత్యేక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) నైపుణ్యాలకు డిమాండ్ అమాంతం పెరగడంతో అందుకు తగ్గట్టుగానే మన దేశంలో, రాష్ట్రంలో ఎడ్ టెక్ రంగం క్రమంగా గణనీయ వృద్ధిని సాధిస్తోంది. ఏఐ కేంద్రీకృత కోర్సుల విస్తరణకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలు ఊపందుకుంటున్నాయి. విద్యా రంగంలో, నైపుణ్యాలను పెంచుకునే విషయంలో ఏఐను ఏకీకృతం చేయడానికి ఉద్దేశించి ప్రభుత్వ కార్యక్రమాలు ఈ దిశలో ముందుకు సాగుతున్నాయి. ఏఐ, ఎడ్‌టెక్ మార్కెట్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాబోయే సంవత్సరాల్లో ఈ మార్కెట్ పరిమాణంలో గణనీయమైన పెరుగుదల ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వివిధ పరిశ్రమల్లో ఏఐ నైపుణ్యాలకు ఆదరణ పెరగడంతో ఏఐ, ఎంఎల్ సంబంధిత రంగాల్లో నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులకు అధిక డిమాండ్ ఏర్పడుతోంది. తెలంగాణలో మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో ఏఐ, ఎడ్‌టెక్‌లకు కేంద్రంగా అనేక సంస్థలు ప్రత్యేక కోర్సులు, శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నాయి. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు తమ ఏఐ కోర్సు కేటలాగ్‌లను విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వపరంగానూ వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, చలనశీలత వంటి రంగాల్లో ఏఐను ఉపయోగించడంపై దృష్టి సారిస్తోంది. ఏఐ విద్యకు ప్రోత్సాహంతోపాటు సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఏఐ, రొబోటిక్స్ కోర్సులను ప్రవేశపెట్టింది. పరిశ్రమ సంబంధిత ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి, విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అవకాశాలు అందించడానికి సంస్థలు పరిశ్రమలు, టెక్ కంపెనీలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి.

జాబ్స్ బోలెడు.. స్కిల్స్ మూరెడు

కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లర్నింగ్ (ఎంఎల్)లలో ప్రావీణ్య సాధన ఎకో సిస్టమ్ పూర్తిస్థాయిలో ఇంకా మన దేశంలో ఏర్పడలేదని స్మార్ట్ స్టెప్స్ ట్రైనింగ్ అకాడమీ ఫౌండర్ నానబాల లావణ్యకుమార్ అభిప్రాయపడ్డారు. కోవిడ్ సమయంలో కంపెనీలు, ఉద్యోగులంతా క్లౌడ్ ఆధారిత టెక్నాలజీ, అప్లికేషన్లపైనే దృష్టి పెట్టారని.. కానీ అదే సమయంలో అమెరికా, చైనా మాత్రం జెనరేటివ్ ప్రీ–ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ (జీపీటీ)లను తయారు చేసి రేసులో ఎంతో ముందుకెళ్లిపోయాయని చెప్పారు. కానీ భారత్ మాత్రం సంప్రదాయ కోర్సులకే పరిమితమై వెనుకబడిపోయిందన్నారు. ఎట్టకేలకు విశ్వవిద్యాలయాలు అనేక ఏఐ, ఎంఎల్ కోర్సులను ప్రారంభించినప్పటికీ సంక్లిష్టమైన ఈ నైపుణ్యాలను నేర్చుకొనేందుకు అవసరమైన మేర ఫ్యాకల్టీ లేరని లావణ్యకుమార్ అన్నారు. అందుకే గుణాత్మకమైన విద్యను అందించడంలో అధిక శాతం కళాశాలలు, ట్రైనింగ్ కంపెనీలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. అందుకే మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా కావాల్సిన స్కిల్స్ లేక యువత వెనుకబడుతున్నారని.. ఏఐ ఆధారిత కంపెనీలు సైతం ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయన్నారు.

కాలేజీల్లో మౌలిక సదుపాయాలేవి?

చైనాతో పోలిస్తే భారత్‌లోని ఎడ్‌టెక్ కంపెనీల సామర్థ్యాలు పూర్తిస్థాయిలో లేవని క్వాలిటీ థాట్ ఫౌండర్, కెరీర్ గైడెన్స్ కోచ్ రమణ భూపతి అభిప్రాయపడ్డారు. దేశంలోని ప్రతిభావంతులంతా విదేశాలకు వలస వెళ్లడం కూడా దీనికి కారణమన్నారు. ఏఐ రంగంలో నూతన ఆవిష్కరణలకు తగ్గట్టుగా ఎడ్‌టెక్ కంపెనీలు వేగాన్ని పెంచుకోలేకపోవడం, ఏఐ నైపుణ్యాలకు అవసరమైన గణితంలో లోతైన పరిజ్ఞానం విద్యార్థులకు కొరవడటం తదితర కారణాల వల్ల భారత్ కొంత వెనుకబడిందని భావిస్తున్నట్లు చెప్పారు. అయితే ఏఐను బోధించాలంటే ఒక కంప్యూటర్ కాన్ఫిగరేషన్ (రూ. 1.20 లక్షల ధర, గ్రాఫిక్ కార్డ్ తదితరాలతో) ఉన్నది కావాలని.. కానీ మన దేశంలో అలాంటి కంప్యూటర్లు లేని కాలేజీలే 99 శాతం ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎడ్‌టెక్ కంపెనీలు ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణనిస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఇంజనీరింగ్ ప్రధాన బ్రాంచ్‌ల్లో సీట్ల భర్తీ ఇలా...

బ్రాంచ్	మొత్తం సీట్లు	భర్తీ	మిగిలినవి	భర్తీ శాతం
సీఎస్ఈ	30,655	29,488	1,167	96.19
ఐటీ	4,143	3,877	266	93.58
డేటాసైన్స్	8,318	7,826	492	94.09
ఏఐఎంఎల్	15,198	14,648	550	96.44
ఈసీఈ	12,215	10,905	1310	89.28
ఈఈఈ	5,037	3,682	1355	73.10
సివిల్	3,741	2,846	895	76.08
మెకానికల్	3,478	2,382	1096	68.49

ప్రకృతి సోయగాలు

ఉరవకొండ: హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలు విడుదల కావడంతో ఎంపీఆర్ లింక్ చానల్ నుంచి 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. అనంతపురం జిల్లా పెన్నహోబిలం క్షేత్రం మీదుగా ఈ నీరు ఎంపీఆర్‌కు చేరుతోంది. దీంతో పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం ప్రకృతి సోయగాలతో కనువిందు చేస్తోంది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని క్షేత్రానికి వస్తున్న భక్తులు ఇక్కడి సెలయేళ్లలో సరదాగా గడుపుతున్నారు. వనభోజనాలతో సందడి చేస్తున్నారు.




ఉద్భవలక్ష్మి ఆలయానికి చేరువలో ఆహ్లాదాన్ని పంచుతున్న సెలయేరు



ప్రత్యేక ఆకర్షణగా ఉగ్రనరసింహుడి విగ్రహం



కనువిందు చేస్తున్న జలపాతం



పెన్నహోబిలంలోని ఆలయం



కొమ్మకొమ్మకూ గూడు

అందమైన ప్రకృతి రమణీయతలకు నెలవుగా నిలిచిన అనంతపురం జిల్లా పెనకచెర్ల డ్యామ్ వద్ద పక్షి గూళ్లు ఆకట్టుకుంటున్నాయి. కిలకిల రావాలతో ఆహ్లాదాన్ని పంచే గిజిగాడు పక్షి తన పిల్లలను, గుడ్లను కాపాడుకునేందుకు ముళ్ల చెట్ల, నీటి వనరులకు దగ్గరలో ఉండే చెట్ల కొమ్మలకు కిందకు వేలాడేలా కట్టుకున్న గూళ్లు వాటి నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. ఒక్కొక్క గడ్డి పోచను తీసుకువచ్చి అల్లుకున్న గూడులో దాని అద్భుతమైన నైపుణ్యం కనిపిస్తుంది. మగ పక్షి మాత్రమే ఇలా గూడును అల్లే నైపుణ్యం, నేర్పు కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే అరుదైన బార్న్ స్వాలో పక్షులు మట్టితో మోరీల కింద నిర్మించిన గూళ్లు అబ్బురపరుస్తున్నాయి. బర్డ్ ఆర్కిటెక్ట్‌ను పరిశీలించాలంటే ఒకసారి పెనకచెర్ల డ్యామ్‌ను సందర్శించి తీరాల్సిందే.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,044 మంది స్వామివారిని దర్శించుకోగా 28,478 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం అవుతుండగా.. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుపతి -షిర్డీ మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి, షిర్డీతో పాటు ఈ రెండు నగరాలకు మధ్య ఉన్న ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వారి కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. తిరుపతి–సాయినగర్ షిర్డీ ప్రత్యేక రైలు ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 28 వరకు ప్రతి ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 10.45 గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే సాయినగర్ షిర్డీ నుంచి తిరుపతికి మరో ప్రత్యేక సర్వీసు ఆగస్టు 4 నుంచి సెప్టెంబర్ 29 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. ఈ ప్రత్యేక రైళ్లు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, భాల్కీ, ఉద్గీర్, పర్భి రంగం, లాతూర్ జల్నా, ఔరంగబాద్, నాగర్‌సోల్, మన్మాడ్, కోపర్‌గావ్ స్టేషన్లలో ఇరువైపులా ఆగనున్నట్లు వెల్లడించారు.

స్కిట్ పూర్వవైభవానికి సహకరిస్తా

జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు

శ్రీకాళహస్తి: స్కిట్ కళాశాలతో తనకు ఎంతో అనుబంధం ఉందని 2010-11 ప్రాంతంలో మిస్‌మేనేజ్‌మెంట్, పాలిటిక్స్‌తో కళాశాల విహీనంగా మారిందని జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ సుదర్శన్‌రావు అన్నారు. కళాశాల మూత పడడం చాలా బాధ కలిగించిందన్నారు. స్కిట్ కళాశాల పూర్వవైభవానికి పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. మొదటి కౌన్సెలింగ్‌లో అనుమతి వచ్చింటే బాగుండేదని, రెండవ కౌన్సెలింగ్‌లో రావడం సంతోషకరమన్నారు. రెండు మూడేళ్లలో స్కిట్ ఉత్తమమైన ఫలితాలు సాధించే విధంగా పూర్తి సహకారం అందిస్తామన్నారు.

ప్లేస్‌మెంట్‌లపై అవగాహన

చంద్రగిరి: విద్యార్థులకు అందిస్తున్న ప్లేస్‌మెంట్‌లపై మంగళవారం ఎంబీయూ క్యాంపస్‌లోని దాసరి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్లోబల్ డెలివరీ భాగస్వామి రాఘవేంద్ర కులకర్ణి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కొత్త ఐటీ ట్రెండ్‌లు, నియామక ప్రక్రియలు, సేల్స్‌ఫోర్స్, సర్వీస్, జావా వంటి ప్లాట్‌ఫామ్‌లలో నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండ్ గురించి వివరించారు. సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్ మాట్లాడుతూ జెన్‌సీ ప్రోగ్రాం ద్వారా కాగ్నిజెంట్ 2026 ఫ్రెషర్స్ నియామకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఢిల్లీబాబు పాల్గొన్నారు.

- యుక్త వయస్సులోనే గుండెపోట్లు
- ఆకస్మికంగా మృతి చెందుతున్న యువత
- 25 నుంచి 40 ఏళ్లలోపు వారిలో అధిక గుండె సమస్యలు
- జీవనశైలి మార్పులే కారణం

యువత.. హృదయ వేదన!



➤ కర్నూలు నగరంలోని ఆదిత్యనగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ అనే పాతికేళ్ల యువకునికి గత నెలలో గుండెపోటు వచ్చింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశాడు. చేతికి వచ్చిన కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబసభ్యుల ఆవేదన అంతా ఇంతా కాదు.

➤ కల్లూరుకు చెందిన శివకుమార్ అనే 30 ఏళ్ల యువకునికి ఏడాది క్రితమే వివాహమైంది. ఈ నెల మొదటి వారంలో అతనికి అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటు ప్రాణం తీసింది. దీంతో ఆయన భార్యతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

➤ పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో ఈ నెల 5న పీర్ల ఊరేగింపులో నాట్యం చేస్తుండగా గ్రామానికి చెందిన రామాంజనేయులు(42) గుండెపోటుకు గురయ్యాడు. ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటు అంటే ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారికి మాత్రమే వచ్చేది. కానీ ఇప్పుడు పాతికేళ్ల వయస్సు వారికీ వస్తోంది. ఇటీవల కాలంలో పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో యువత గుండెపోటుతో మృతి చెందుతున్నారు. జీవనశైలిలో మార్పులు, వ్యాయామం లేకపోవడం, మితిమీరిన ఆహారపు అలవాట్లు, దురలవాట్లే ఈ పరిస్థితికి కారణమని వైద్యులు చెబుతున్నారు.

బాధితుల్లో 5 శాతం యువత

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీకి ఇటీవల గుండెపోటుతో చికిత్సకు వచ్చేవారి సంఖ్య ఎక్కువైంది. ఇందులో కొందరు ఆసుపత్రికి వచ్చేలోపు, మరికొందరు చికిత్స పొందుతూ మృతి చెందుతున్నారు. ఇంకొందరు కార్డియాలజీ విభాగానికి ఆపరేషన్‌కు వెళ్తున్నారు. ఇలా కార్డియాలజీ విభాగానికి గత సంవత్సరం రోజుల్లో ఓపీకి 22,325 మంది గుండెజబ్బులతో చికిత్సకు రాగా 4,281 మంది విభాగంలో చేరారు. వీరిలో 1,235 మందికి యాంజియోగ్రామ్, 433 మందికి యాంజియోప్లాస్టీ(స్టెంట్) వేశారు. ఇందులో 125 మంది 25 నుంచి 40 ఏళ్ల వయస్సు వారే ఉండటం గమనార్హం. ఇదే పరిస్థితి నగరంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో నెలకొంది. ఆయా ఆసుపత్రులకు ఒక్కో దానికి ప్రతిరోజూ రోజుకు సగటున 10 మంది గుండెజబ్బులతో చికిత్స పొందుతున్నారు. జిల్లాలో 10 శాతం మంది ప్రజలు గుండెజబ్బులతో బాధపడుతున్నట్లు గతంలో నిర్వహించిన ఓ సర్వేలో నిర్ధారణ అయ్యింది. ఆసుపత్రులకు చికిత్స కోసం వస్తున్న వారిలో 5 శాతం మంది యువతే ఉంటున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వంశపారంపర్యం, జన్యులోపాలు, మేనరికపు వివాహం వంటి కారణాలతో పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మించే పిల్లలూ ఇటీవల అధికమయ్యారు.

మారిన ఆహారపు అలవాట్లు

ప్రతి ఒక్కరికీ పోషకాహారం తీసుకుని మరింత ఆరోగ్యంగా ఉండాలన్న ఉత్సుకత అధికమైంది. ఈ క్రమంలో తీసుకోవాల్సిన దానికన్నా అధికంగా ఆహారాన్ని తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఆహారంలో మాంసాహార సేవనం అధికమైంది. డ్రైఫ్రూట్స్ వాడకం పెంచేశారు. అందుకుతగ్గ వ్యాయామం చేయడం లేదు. దీంతో శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతోంది. రక్తనాళాల్లో ఎక్కడికక్కడ బ్లాక్‌లు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలోనే ఉన్న ఫలంగా గుండెపోటు, పక్షవాతం కేసులు అధికమవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు కార్పొరేట్ సంస్కృతితో ఇతర దేశాలు, రాష్ట్రాల్లో లభించే ఆహారాన్ని సైతం ఇక్కడి వారు ఎక్కువ తీసుకుంటున్నారు. సాధారణంగా ఏ ప్రాంతం వాతావరణానికి తగ్గట్లు అక్కడి ప్రజలు ఆహారం తీసుకుంటారు. ఉత్తరాదిలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.. అక్కడి వారు శరీరంలో ఉష్ణోగ్రతను పెంచే ఆహారాన్ని ఎక్కువ తీసుకుంటారు. దక్షిణాదిలో వాతావరణం వేడిగా ఉంటుంది పెద్దలు చెప్పిన ఆహార నియమాలను పాటించాలి. అయితే ప్రాంతీయ భేదం లేకుండా అన్ని ఆహార పదార్థాలను ప్రజలు రుచి చూస్తున్నారు. దీనివల్లే జీవన విధానంలో మార్పులు వచ్చి ఆరోగ్యం దెబ్బతింటోందని వైద్యులు చెబుతున్నారు. అలాగే పాటు ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని పనిచేసే ఉద్యోగాలు కావడంతో అధికబరువున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఈ కారణంగా శరీరంలో కొవ్వు శాతం పెరిగి అనేక అనారోగ్య సమస్యలు పలకరిస్తున్నాయి.

నిద్రలేమి, మానసిక ఒత్తిడి కారణం



ఇటీవల కాలంలో చాలా మంది యువకుల్లోనూ గుండెపోటు వస్తోంది. ఆసుపత్రికి వచ్చే వారిలో 30 శాతానికి పైగా వీరుంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం, మితిమీరిన మానసిక ఒత్తిడి, అనియత జీవనశైలి, నిద్రలేమి, పొగతాగడం, మద్యంసేవనం అలవాట్లు చిన్న వయస్సులో గుండెపోటు రావడానికి కారణం. కొందరు యువత శారీరక దారుఢ్యం కోసం అధికంగా వర్కవుట్స్ చేయడం కూడా గుండెపై ఒత్తిడి పెంచుతోంది.

– డాక్టర్ బి.కిరణ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

తాడిని తలదన్నే రుచి!

- తాటి పండ్లతో అనేక ప్రయోజనాలు
- వాటితో చేసే వంటకాలు అద్భుతం
- నోరూరించేలా గారెలు, బూరెలు

సామర్లకోట: ప్రస్తుత సీజన్‌లో దొరికేది తాటి పండు. ఈ తాటిపండులో అనేక పోషకాలు ఉంటాయి. ముంజెలు, పండ్లు, తేగలు అందిస్తూ అనేక విధాలుగా మనకు తాటి చెట్లు ఉపయోగపడుతున్నాయి. పూర్వం తాటిచెట్లు, ఆకులతో ఇళ్ల నిర్మాణం జరిగేది. క్రమేపీ పెంకుటిళ్లు, ప్రస్తుతం దాబాలు వచ్చాయి. ప్రకృతి మనకు ప్రసాదించిన పండ్లను తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. తాటి పండుతో అనేక రకాల వంటకాలు చేసుకోవచ్చు. వాటి రుచి ఎంతో అద్భుతంగా ఉంటుంది. తాటిచెట్టుకు కాసిన ముంజెకాయలు ముదిరిపోవడంతో తాటి పండ్లుగా మారుతాయి. ఆ పండ్ల గుంజుతో బూరెలతో పాటు అనేక రకాల పిండి వంటలు తయారు చేస్తారు.





రసాయనాలు లేని ఏకైక పండు

గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు 20 ఏళ్ల క్రితం వరకు ప్రస్తుత సీజన్‌లో తాటిపండ్లతోనే కడుపు నింపుకునే వారు. చెట్టు నుంచి పడిన పండును నేరుగా కొందరు, నిప్పులపై కాల్చుకొని మరి కొందరు ఈ పండ్లను తొక్కలు తీసి నేరుగా తినేవారు. అయితే ప్రస్తుతం ఈ పండ్లను దూరం పెడుతున్నారు. తాటిపండులో అనేక పోషకాలు ఉన్నాయి. ఎటువంటి పురుగు మందులు, రసాయనాలు వాడని తాటి పండ్లు వినియోగం ఆరోగ్యదాయకం. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వంటకాలకు డిమాండ్ పెరిగింది. దాంతో పండ్లను రోడ్డు మార్జిన్‌లో విక్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. తాటిపండులో విటమిన్ ఎ,సీలు ఉంటాయి. బి కాంప్లెక్స్ పుష్కలంగా లభిస్తుంది. ఎక్కువగా పీచు పదార్థాలు ఉండటం వలన జీర్ణకోశ వ్యాధులు, మలబద్ధకం దూరం అవుతుంది. రక్త శుద్ధికి, మెదడుకు గ్లూకోజ్ అందించడంలో ఈ పండు దోహదపడుతుంది. నేటి తరం వారికి ఈ తాటిపండు విలువ తెలియడం లేదు. దీనికితోడు తాటి చెట్లను నరికి వేయడంతో ఇవి రానురాను కనుమరుగైపోతున్నాయి.

అనేక వంటకాలు



తాటి పండ్లతో అనేక రకాల వంటకాలను తయారు చేస్తారు. వీటితో చేసే బూరెలు, గారెలు, రొట్టెలు, అప్పాలు ఎంతో రుచిగా ఉంటాయి. తాటికాయ గుంజు తీసి దానిలో వరి నూక, బెల్లం కలిపి బూరెలు, గారెలు, రొట్టెలు తయారు చేస్తారు. కొన్ని మిఠాయి దుకాణాల్లో ఆంధ్రా పిండి వంటకాల పేరుతో తాటి బూరెల విక్రయాలు సాగుతున్నాయి. వీటి ధర కూడా అధికంగానే ఉంటుంది.

అధిక శ్రమతో కూడిన పని



తాటి పండ్లతో పిండి వంటలు చేయడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. శుభకార్యాలలో వేసే బూరెలను సులభంగా తయారు చేయవచ్చు. తాటి పండ్లతో బూరెలు చేయడానికి కనీసం ఇద్దరు ఉండాలి. తాటి పండ్లను నిప్పులపై మగ్గ బెట్టాలి. వాటి తొక్క తీసి గుంజును పీచు లేకుండా తీయాలి. పండ్ల తీపిని బట్టి తగిన మోతాదులో బెల్లం కలపాలి. అప్పటికే నీటిలో నానబెట్టిన నూకను తాటిపండ్ల గుంజులో బాగా కలపాలి. సుమారు 30 నిమిషాలు ఉంచిన తరువాత నూనెలో కావలసిన పరిమాణంలో తాటి బూరెలు, అప్పాలు, గారెలు తయారు చేసుకోవచ్చు. వీటిని ఒకసారి రుచి చూస్తూ వదలిపెట్టే ప్రసక్తి ఉండదు!

– మచ్చా బిందు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

అనేక పోషకాలు



తాటిచెట్ల నుంచి వచ్చే పండ్లలో మంచి పోషకాలు ఉంటాయి. తాటిపండులో విటమిన్లు ఎ,బీ,సీ.. జింక్, పొటాషియం, ఐరన్, క్యాల్షియం వంటి అనేక ఖనిజాలు ఉంటాయి. తాటిపండులో పోషకాలు క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచటంలో తాటిపండు దోహదపడుతుంది. తాటిపండు వికారం తొలగించడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. తాటి పండ్లతో పిండి వంటలు తయారు చేసేవారు కనిపించడం లేదు. ఆ పిండి వంటలు ఎంతో రుచిగా ఉంటాయి. చిన్నతనంలో స్నేహితులతో కలిసి తినే వారం.

– పసల సత్యానందరావు, డాక్టర్, సామర్లకోట

వానాకాలం... విద్యుత్‌తో భద్రం

- వర్షాలతో రైతులు, ప్రజలకు, విద్యార్థులకు పొంచి ఉన్న విద్యుత్ షాక్ ముప్పు
- విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించకుంటే ప్రమాదమే
- 'సాక్షి'తో విద్యుత్ భద్రత సంచాలకులు జి.విజయలక్ష్మి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయి. నిర్లక్ష్యంగా ఉంటే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సామాన్య ప్రజలు, విద్యార్థులు, రైతులు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రత ప్రమాణాలు పాటించి, అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ భద్రత సంచాలకులు, ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి (ఎలక్ట్రికల్ సేఫ్టీ డైరెక్టర్) జి.విజయలక్ష్మి సూచించారు. ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ షాక్, షార్ట్ సర్క్యూట్ వంటి దుర్ఘటనలు జరగడానికి ఎక్కువగా అవకాశం ఉంటుందని, సామాన్య ప్రజలు, విద్యాసంస్థల నిర్వాహకులు తప్పనిసరిగా భద్రత ప్రమాణాలను పాటించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు, నియమాలను ఆమె వెల్లడించారు.

ప్రజలకు హెచ్చరికలు

- తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లను తాకకుండా సమీపంలోని సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- ఇంటి ఆవరణలో ఎర్తింగ్ తప్పనిసరిగా ఉందో, లేదో చూడాలి.
- భవనాలపై విద్యుత్ లైన్‌లకు దగ్గరగా దుస్తులు ఆరవేయకూడదు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాన్ని, వైర్లను తాకకూడదు.
- స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన, విద్యుత్ లైన్ల కింద తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు పెట్టడం ప్రమాదకరం.
- రైతులు తడి చేతులతో స్టార్టర్లు, మోటార్లు పట్టుకోకూడదు.
- ఇంట్లోని స్విచ్ బోర్డులను, కరెంటుకు సంబంధించిన వస్తువులను తడి చేతులతో తాకకూడదు.
- బయట పెట్టిన లైట్లు నీటిలో తడవకుండా చూసుకోవాలి.
- చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రానివ్వకూడదు.
- ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్, టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్‌లను ఆపేయాలి.
- బయటకు వెళ్లినప్పుడు కరెంటు లైన్ కింద సెల్‌ఫోన్ మాట్లాడకూడదు.
- వర్షం, తుపానుల వంటి సమయాల్లో విద్యుత్ సరఫరా లైన్లు ఉన్న ఏ నిర్మాణం కింద ఆశ్రయం పొందకూడదు.
- అన్ని కనెక్షన్లు గట్టిగా, చెక్కుచెదరకుండా ఉన్నాయో, లేదో నిర్ధారించుకుని, ఏవైనా వదులుగా ఉంటే వెంటనే ఎలక్ట్రికల్ ఇన్‌చార్జికి తెలియజేయాలి.

విద్యాసంస్థలు, విద్యార్థులకు భద్రత సూచనలు

- విద్యాసంస్థల్లో ఎలక్ట్రిక్ వైరింగ్, స్విచ్‌లు, జాయింట్లను తనిఖీ చేసి పాడైపోయిన, అరిగిపోయిన మెటీరియల్‌ను వెంటనే మార్చాలి.
- పాఠశాలలు, కళాశాలల ఆవరణలో, చుట్టుపక్కల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రధాన బోర్డులకు కంచె వేయాలి.
- పిల్లలు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.
- మంచి నాణ్యత గల ఎలక్ట్రిక్ పరికరాలను ఉపయోగించాలి.
- హాస్టళ్లు, వసతిగృహాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలను పాటించాలి.
- శ్లాబుల నుంచి వర్షం నీరు లీకవుతుంటే వెంటనే మరమ్మతులు చేసుకోవాలి.
- సబ్ స్టేషన్లు, సరఫరా లైన్లకు దూరంగా పాఠశాలలు ఉండేలా చూసుకోవాలి.
- కుళాయి, నీటి ట్యాంకుల దగ్గర ఎలక్ట్రికల్ ఉపకరణాలను ఉపయోగించకూడదు.
- విద్యాసంస్థల బస్సులు, ఆటోలు, వ్యాన్లను నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి. బస్సులకు విద్యుత్ వైర్లు తగలకుండా చూసుకోవాలి.
- వర్షం నీటితో నిండిపోయిన రహదారుల్లో విద్యుత్ వైర్లు పడిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఆ దారిలో వెళ్లే వాహనాలు, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ స్తంభాలను తాకకూడదు.
- స్కూళ్లకు సెలవులిచ్చినా విద్యార్థులను వర్షం నీటిలో ఆడుకోవడానికి వెళ్లనివ్వకూడదు.

సాగుబడి

ట్రీ ఆఫ్ లైఫ్!

కొబ్బరిలో అద్భుతమైన ఆరోగ్యదాయక లక్షణాలున్నాయి. కొబ్బరి ఒక చక్కని ఆహారం. ఆరోగ్యదాయకమైన కొబ్బరి నీరును, అద్భుతమైన నూనెను అందించే గొప్ప పంట. ప్రపంచవ్యాప్తంగా ఎందరికో జీవనోపాధిని అందిస్తుండటం వలన దీన్ని 'జీవన వృక్షం (ట్రీ ఆఫ్ లైఫ్)'గా పరిగణిస్తారు. కొబ్బరి శాస్త్రీయ నామం కోకోస్ న్యూసిఫెరా ఎల్ (అరేకేసి). కొబ్బరిని ఆహారంగా, ఆథ్యాత్మిక సాధనంగా, పానీయంగా, ఔషధ విలువలున్న నూనెగా ఉపయోగపడుతోంది. పీచుగా అనేక ఉత్పత్తులను తయారుచేసే పరిశ్రమలకు ముడిసరుకుగా ఉపయోగపడుతోంది. 80 కంటే ఎక్కువ దేశాల్లో సుమారు కోటి కుటుంబాలు కొబ్బరిని తమ ప్రాథమిక ఆహారంగా, ఆదాయ వనరుగా ఉపయోగించుకుంటున్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యంత విస్తృతంగా సాగు చేస్తున్న, ఉపయోగించబడే చెట్టుగా మారింది. కొబ్బరి గానుగ నూనెను వంటకు వాడటం ఇటీవల కాలంలో బాగా పెరిగిన నేపథ్యంలో వండర్ ట్రీ ఆఫ్ లైఫ్‌పై స్పెషల్ ఫోకస్...



కొబ్బరి ఆధారిత వ్యవసాయ విధానం తరతరాలుగా అభివృద్ధి చెందిన ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులకు ప్రసిద్ధ ఉదాహరణ. కొబ్బరి చెట్లు ఇంటి పంటల్లో/తోటల్లో ముఖ్యమైన భాగాలు. ఇంటి చుట్టూ కొబ్బరి చెట్లు నాటుకోవటం అనేక దేశాల్లో సుదీర్ఘ కాలపు సంప్రదాయంగా కనిపిస్తుంది. ఇంటి తోటలలోని కొబ్బరి చెట్లు ఆ కుటుంబానికి జీవనాధార వ్యవస్థగా మారాయి.

ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఇలా చెబుతోంది: కొబ్బరి తదితర పంటల వైవిధ్యంతో కూడిన ఇంటి/పెరటి పంటలు రైతు కుటుంబం ప్రాథమిక అవసరాలను తీర్చటంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఆహార భద్రత, ఆదాయ భద్రత, ఉపాధి భద్రత కల్పిస్తుంది. ప్రతికూల వాతావరణ విపత్తులను తట్టుకునే శక్తిని ఇంటి/పెరటి పంటలు మెరుగుపరుస్తాయి. ఇందుకోసం పెరటి తోటల్లో అనేక పంటలు, పశువులు, కోళ్లు, చేపల పెంపకం కూడా కలిసి ఉంటుంది. 15వ శతాబ్దపు మళయాళ కావ్యం 'కృషి గీత'లో కేరళలో మధ్యయుగపు పర్యావరణ అనుకూల సాగు వ్యవస్థల ప్రస్తావన ఉంది. కొబ్బరి ఆధారిత వ్యవసాయ వ్యవస్థలను ఇందులో ప్రముఖంగా పేర్కొనటం విశేషం.

కొబ్బరి సేద్యంలో ఉత్తమ వ్యవసాయ పద్ధతులు...

నాణ్యమైన, స్వచ్ఛమైన లేక జన్యు స్వచ్ఛత కలిగిన కొబ్బరి నారు మొక్కల పూర్తి వివరాలు తెలుసుకొని నమ్మ దగ్గ నారు మొక్కలను ఎంచుకోవాలి. ప్రభుత్వ ఉద్యానశాఖ విభాగం వారి గుర్తింపు పొందిన నర్సరీల నుంచి సేకరించుకొని జాగ్రత్త పడాలి. సంవత్సరం అంతా పండే పంట కాబట్టి నాణ్యత విషయంలో రాజీ పడకుండా నారు మొక్కలను శ్రద్ధగా ముందు జాగ్రత్తతో సేకరించుకొని నాటుకోవాలి. పచ్చి కొబ్బరి బోండం (చౌగాట్ ఆరెంజ్ డ్వార్ఫ్ అంటే నారింజ రంగు గల పొట్టి రకం) తెగులును తట్టుకునే/తెగులును ఎదుర్కొనే (కల్ప రక్ష, కల్ప శ్రీ కల్ప శంకర) రకాలను, కురిడి కొబ్బరి రకం (లక్షద్వీప్ మైకో) మొదలైనవి మేలు.



నటువంటి పూల మొక్కలను గుంపులుగా పెంచితే చీడపీడల నెదుర్కొనేలా పర్యావరణ రక్షణ సేవలు పొందవచ్చు. కొబ్బరి తోటల్లో కొమ్ము పురుగును నివారించేందుకు కొబ్బరి ఆధారిత వివిధ పంటల సాగు ఏక పంటగా కొబ్బరి చెట్ల సాగుకంటే బాగా అనుకూలంగా ఉన్నట్లు రూఢి అయ్యింది.

నాటేందుకు అనుకూల నేలలు...

కొబ్బరి సాగులో అతి ముఖ్యమైన సూత్రం ఏమిటంటే, వెలుతురు బాగా ప్రసరించాలి. కొబ్బరికి అనుకూలమైన నేలలను ఎంచుకుంటే గాలి, వెలుతురు ప్రసరణ బాగా జరిగి నత్రజనిని, కర్బనాన్ని, ఆక్సిజన్‌ను బాగా గ్రహించి పంటలు బాగా ఎదగడానికి సహకరిస్తుంది. చెట్టు ఆకుల్లో కిరణ జన్య సంయోగ క్రియ సామర్థ్యం పెరగాలంటే ఖాళీ భూముల్లో సాధ్యమైనంత వరకు మొక్క నాటడం ఉత్తమం. కేరళలో ఎక్కువగా కొబ్బరి నారు మొక్కలను వెలుతురు కోసం పెద్ద చెట్ల కింద నాటుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల గాలి, వెలుతురు ప్రసరణ సక్రమంగా అందక లేత మొక్కలు చీడ పీడల తాకిడికి తీవ్రంగా గురి అవుతూవుంటాయి. అంతేగాక ఈ చెట్లు పూత పూయడానికి ఎక్కువ కాలాన్ని వెచ్చిస్తాయి కూడా!

కొబ్బరి నారు మొక్కల్ని నీరు సరిగ్గా పారని భూముల్లో నాట కూడదు. ఇలా చేయడం వల్ల ప్రారంభ దశలో పోషకాలు సరిపడక వేర్ల శ్వాసక్రియ సక్రమంగా ఉండదు. ఒక వేళ ఈ పరిస్థితులలో పెరిగినా ఎదుగుదలలో ఆటంకం ఏర్పడి కాయల దిగుబడిలో ప్రతికూల ఫలితాలు ఏర్పడతాయి. లేత మొక్కలకు ఎదిగెందుకు తగిన తేమ అవసరం. అదే తరుణంలో పాదులో నీరు నిలచే పరిస్థితిని తట్టుకోలేవు. కొబ్బరి చెట్లు ఎదగడానికి ముందుగానే మంచి వెలుతురు, గాలిలోని మూలకాలు బాగా గ్రహించేందుకు సహకరించే భూసారం అవసరం. అప్పుడే మొక్కలు బాగా ఎదుగుతాయి.



పంటకు కావలసిన భూభౌతిక వనరులు...

నిర్దిష్టమైన నియమం ప్రకారం ఒక సెంటు భూమి(40 చదరపు మీటర్ల)లో ఒకే ఒక్క కొబ్బరి నారు మొక్కను నాటే ఏర్పాటు చేసుకోవాలి. రైతులందరు కొబ్బరి సాగును ఏక పంటగా పెంచేటపుడు అన్ని మొక్కలకు 7.5మీ. × 7.5 మీ.లు, పొట్టి రకాల మొక్కలను 7.0మీ గీ 7.0మీ. ల ఖాళీ స్థలం ఉండే విధంగా నాటాలి. పెరటి తోటలలాగా ఎక్కువ పంటలను కలిపి పండించే సమయంలో చెట్లకు గాలి బాగా సోకే విధంగా తక్కువ మొక్కలు నాటాలి. రాజీ పడకూడదు. నాటే సమయంలో తక్కువ స్థలం కేటాయిస్తే గాలి ఆడక చెడు వాసన ప్రబలి చీడపీడలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. అంతర పంటలను అనుబంధంగా పండించడం వల్ల చీడపీడల నియంత్రణ బాగా జరుగుతుంది.

తోటలో పక్షులు వాలడానికి పంగ కర్రలు, సన్నని కాడ కలిగి




కొబ్బరి తోటల అభివృద్ధికో పథకం

● కొబ్బరి ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల కోసం రైతులకు కొబ్బరి అభివృద్ధి బోర్డు సహాయం ● దరఖాస్తుకు చివరి తేదీ జూలై 31

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికే సాగులో ఉన్న కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగు ద్వారా ఉత్పాదకతను పెంపొందించటం కోసం కొబ్బరి బోర్డు 2025-26 సంవత్సరానికి గాను రైతులు, రైతు బృందాలు, ఉత్పత్తిదారుల సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కొబ్బరి ఆధారిత పంటల వ్యవస్థ ద్వారా ఉత్పాదకత మెరుగుదలకు క్లస్టర్ ప్రాతిపదికన, బోర్డు నియమ నిబంధనలకు లోబడి రైతు భాగస్వామ్య విధానం ద్వారా ప్రస్తుత తోటల్లో ఉత్పత్తి, ఉత్పాదకతలను మెరుగుపరచడానికి కొబ్బరి బోర్డు ఆర్థిక సహాయం అందిస్తుంది. సూచించిన ఫార్మాట్‌లో దరఖాస్తులు / ప్రతిపాదనలు ఈ నెల 31 లోగా పంపాలి. కీలకమైన ఉత్పాదకాలు, అంతర పంటలు నాటడం, సామగ్రి, పచ్చి ఎరువు విత్తనాలు, మొక్కల రక్షణ రసాయనాలు మొదలైన వాటి ఖర్చులకు బోర్డు సహాయం వరుసగా రెండు సంవత్సరాలు అందించనుంది. కూలీల ఖర్చులు, ఇతర అద్దె సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మొదలైన వాటికి ఈ పథకం వర్తించదు. ఆసక్తిగల రైతు బృందాలు 2025-07-31 ఉదయం 10.30 గంటల్లోగా అవసరమైన పత్రాలతో పాటు సూచించిన ఫార్మాట్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతులు దరఖాస్తులను స్వయంగా లేదా పోస్టు ద్వారా ఇవ్వాల్సిన చిరునామా: డిప్యూటీ డైరెక్టర్, కొబ్బరి అభివృద్ధి బోర్డు, రాష్ట్ర కార్యాలయం, డోర్ నంబర్ 54-14/5-18ఎ, రోడ్ నెం.11, భారతి నగర్, నోవోటెల్ దగ్గర, రింగ్ రోడ్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా - 520008.

పంట రక్షణ...

నారు మొక్కల జీవ క్రియ పెంచడానికి, నారు మొక్కలను నాటిన తర్వాత స్యూడోమొనాస్‌ను నాలుగు ఏడు, పది నెలల్లో 50 గ్రా. చొప్పున వేస్తూండాలి. మొక్కల్ని నాటేటప్పుడు 100 గ్రాముల స్యూడోమోనాస్ పొడితో ద్రావణం చేసి వేరు మొక్కలను అందులో ముంచి నాటాలి. నాటిన మొక్కల హద్దుల వెంబడి గ్లైరిసీడియా మొక్కలను పెంచుతూ, వాటి ఆకులను కత్తిరించి మొక్కల పాదులలో మల్చింగ్ వేయడం వల్ల భూసారంలో మేలు చేసే సూక్ష్మజీవులే గాక సేంద్రియ పదార్థం వల్ల భూభౌతికంగా రసాయనికంగా, జీవన సంబంధమైన ఎరువులు వృద్ధి అవుతాయి. సేంద్రియ సూక్ష్మ పోషకాలు కూడా అభివృద్ధి అయి అందుబాటులో ఉంటాయి. సేంద్రియ ఎరువు తయారవుతూండడం వల్ల పంటలకు పోషకాలు (బయో ఎంజైములు) చెట్ల ఎదుగుదలకు బాగా అనుకూలిస్తాయి. బాగా మగ్గిన వర్మికంపోస్టు (10గ్రా. ఒక చెట్టుకు) లేక పశువుల ఎరువు (ఒక కిలో / చెట్టుకు) వేప చెక్క (2కిలోలు / చెట్టుకు) (ట్రైకోడెర్మా కలిపి (250 గ్రా/ చెట్టుకు) లేత కొబ్బరి మొక్కకు నాటిన తొలి దశలో ఎరువుగా ఉపయోగించుకోవాలి.



జీవవ్యర్థాల పునరుత్పత్తి వినియోగం...

ఏప్రిల్ - మే, సెప్టెంబర్ - అక్టోబర్ నెలల్లో జనుము, జీలుగ పంటల ఆకులను పచ్చి రొట్ట ఎరువుగా చెట్టుకు 100 గ్రాములు పాదులలో వేసినట్లయితే వాతావరణ సంబంధ నత్రజని మాత్రమే గాక కాల్షియం: నత్రజని నిష్పత్తి కూడా బాగా వృద్ధి అవుతుంది. పచ్చి రొట్ట ఎరువును వేయడం వల్ల భూమి లోపలి పొరలలోకి గాలి పుష్కలంగా ప్రవహించేందుకు దోహదం చేస్తుంది. వేరు వ్యవస్థ బాగా వృద్ధి అవడం, తేమ కొరత ఉన్నా కూడా మొక్కలు నిలదొక్కుకుని పెరగడం గమనించవచ్చు.

చెట్లకు నీటిపారుదల చాలా క్లిష్టమైన అంశం వేసవి కాలంలో తేమ కొరతను నివారించేందుకు చెట్టుకు 200 లీటర్ల నీటిని వారానికి ఒక్కసారి అందివ్వడం అతి ముఖ్యమైన విషయం. అత్యధిక ఉత్పత్తిని సాధించేందుకు బిందు సేద్యం అందిస్తూ వినియోగించవలసిన నీటిని పూర్తిగా ఉపయోగించడం అన్నది మరొక విధానం. వర్షాకాలంలో కూడా తగిన విధంగా నీరు ఇవ్వాలి. కోస్తా తీరంలో సముద్రజలాల పారుదలకు వీలున్నప్పుడు 500ల గ్రాముల ట్రైకోడెర్మా విరిడితో నాణ్యమైన వేప చెక్కను, పచ్చి రొట్ట ఎరువుగా పచ్చని ఆకులను చేర్చి వేసుకోవాలి.

పోషకాలమయం కొబ్బరి నూనె!

కొబ్బరి నూనెను తల నూనెగానే చాలా మంది ఉపయోగిస్తుంటారు. కానీ, పోషకాల నిలయమైన కొబ్బరి నూనెను వంటకు ఉపయోగించవచ్చు. మనుషుల ఆయుప్రమాణం ఎక్కువగా ఉండే కేరళ రాష్ట్రంలో వంటకు కొబ్బరి నూనెనే విరివిగా ఉపయోగిస్తారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు సమాచారం ప్రకారం.. ఈ నూనెలోని పోషకాలు, వంటకు ఉపయోగించే విధానాల గురించి తెలుసుకుందాం.



పోషకాలు

కొబ్బరి నూనె - 100 గ్రాములు

- కేలరీలు - 862
- శాచురేటెడ్ ఫ్యాట్ - 87 గ్రా.
- పాలీఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్ - 18 గ్రా.
- మోనోశాచురేటెడ్ ఫ్యాట్ - 6 గ్రా.

ఆరోగ్యపరమైన ప్రయోజనాలు

● కొబ్బరి నూనె జీర్ణశక్తిని పెంచి వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు గురికాకుండా రోగనిరోధక శక్తిని పెంచుతుంది ● ఇందులోని శాచురేటెడ్ ఫ్యాట్స్ గుండెకు హాని కలిగిస్తాయనుకుంటారు. కానీ అది నిజం కాదు. శాచురేటెడ్ ఫ్యాట్స్ గుండెకు మేలు చేస్తాయి. దీన్లోని లారిక్ యాసిడ్ కొలెస్ట్రాల్.. రక్తపోటు వల్ల గుండెకు హాని కలగకుండా రక్షణనిస్తుంది ● కొబ్బరి నూనెలోని షార్ట్ అండ్ మీడియం చైన్ ఫ్యాటీ ఆమ్లాలు శరీర అధిక బరువును తగ్గిస్తాయి. అలాగే కొబ్బరినూనె వాడటం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోకుండా ఉంటుంది ● కొబ్బరినూనె వాడకం వల్ల థైరాయిడ్ ఇతర ఎండోక్రైన్ గ్రంథులు సక్రమంగా పనిచేస్తాయి ● శరీర మెటబాలిక్ రేటును పెంచుతుంది. ఫలితంగా శరీర బరువు అదుపులో ఉంటుంది ● ఈ నూనెలో ఉండే యాంటీమైక్రోబియల్ లిపిడ్స్, లారిక్ యాసిడ్, కాప్రిలిక్ యాసిడ్లు యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ గుణాల్ని కలిగి ఉంటాయి. కాబట్టి కొబ్బరి నూనె వాడకం వల్ల సంబంధిత వ్యాధులు దరి చేరవు ● కిడ్నీల్లో ఏర్పడే రాళ్లను కరిగించే శక్తి కూడా కొబ్బరి నూనెకు ఉంది.



కొబ్బరి నూనెను వంటల్లో ఇలా వాడాలి

● కొబ్బరి నూనె స్మోకింగ్ పాయింట్ 350 ఫారిన్‌హీట్ కాబట్టి ఈ నూనెను అన్ని రకాల వంటలకూ వాడొచ్చు ● కేకు వంటి వంటకాల్లో వెన్నకు బదులుగా కొబ్బరి నూనెను ఉపయోగించొచ్చు. అలాంటప్పుడు వెన్న పరిమాణంలో 25% తక్కువ కొబ్బరి నూనె వాడాలి ● పాప్‌కార్న్ తయారీకి కొబ్బరినూనెను వాడొచ్చు ● వర్జిన్ కోకోనట్ ఆయిల్ వెన్నలా ఉంటుంది. దీన్ని బటర్ మాదిరిగా బ్రెడ్ మీద పూసుకొని తినొచ్చు ● స్మూదీస్, సూప్స్, సాసుల్లో కలుపుకోవచ్చు ● ఈ నూనెతో అన్ని రకాల కూరగాయల వేపుళ్లు వండుకోవచ్చు. పప్పు తాలింపులో వాడొచ్చు.

ఆధారం: భారత ప్రభుత్వ సంస్థ 'కొబ్బరి అభివృద్ధి బోర్డు'.



సూపర్ ఫాస్ట్ కంపోస్టర్!

- సేంద్రియ వ్యర్థాలను 8 గంటల్లోనే కంపోస్టుగా మార్చే రాపిడ్ టెక్నాలజీని కనగొన్న స్టార్టప్
- చెత్త నుంచి ఈ కంపోస్టరే ముందుగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరేస్తుంది
- ఇప్పటికే దేశంలో 1500 చోట్ల పనిచేస్తున్న గోల్డ్ కంపోస్టర్లు





సేంద్రియ వ్యర్థాలను కేవలం 8 గంటల్లో కంపోస్టు ఎరువుగా మార్చే ఆధునిక టెక్నాలజీని బెంగళూరుకు చెందిన వేస్ట్ ఈజ్ గోల్డ్ అనే స్టార్టప్ రూపొందించింది. ఇంత సూపర్ ఫాస్ట్‌గా పోషకవంతమైన కంపోస్టు తయారు చేయగల మరో సంస్థ లేదు. 20 కేజీల నుంచి 10 టన్నుల చెత్తనైనా కేవలం ఎనిమిది గంటల్లో ఎటువంటి హానికరమైన వాయువులను వెలువరించకుండా కంపోస్టుగా మార్చేస్తోంది ఈ సంస్థ రూపొందించి గోల్డ్ కంపోస్టర్. 'సేంద్రియ చెత్తను అత్యంత వేగంగా కంపోస్టుగా మార్చే సూక్ష్మజీవుల మిశ్రమాన్ని, బయోరియాక్టర్ టెక్నాలజీని ఉపయోగించుకునే నాచురల్ బయో మెకానికల్ ప్రాసెస్‌ను అనుసరిస్తున్నాం. టన్నుల కొద్దీ చెత్తనైనా ఒక్క రోజులోనే ఎరువుగా మార్చేస్తాం' అంటున్నారు ఈ స్టార్టప్ అధినేత తివారి.

'అధికంగా వేడిని ఉత్పత్తి చెయ్యకుండా సేంద్రియ వ్యర్థాలను అతివేగంగా విచ్ఛిన్నం చేస్తున్నందు వల్ల మిథేన్ వంటి హానికారక వాయువులు వెలువడకుండా చూస్తున్నాం. దీని వల్ల వ్యర్థాలను కంపోస్టుగా మార్చే పనిలో కాలుష్యం లేకుండా పోయింది. ఆక్సిజన్‌ను ఉపయోగించే సూక్ష్మజీవరాశిని, బయో రియాక్టర్‌ను ఏరోబిక్ డీకంపోజిషన్ పద్ధతిలో వాడటం వల్ల ఇది సాధ్యపడుతోంద'న్నారాయన. మేం తయారు చేసే కంపోస్టును తిరిగి మళ్లీ ఏ ప్రాసెసింగ్ చెయ్యాల్సిన అవసరం లేదని, నిల్వ చేసుకోవచ్చు. లాండ్‌స్కేపింగ్ కోసమైతే అదే రోజు వాడుకోవచ్చు. వ్యవసాయం కోసమైతే 3 నుంచి 7 రోజులు మాగిన తర్వాత పొలాల్లో వేసుకుంటే పోషకాలు పుష్కలంగా భూమికి అందుతాయ'న్నారు తివారి.

వండిన ఆహార వ్యర్థాలు, సేంద్రియ తడి చెత్త, ఎముకలు, మాంసం వ్యర్థాలు, ఈకలు, గుడ్ల పెంకులు, కూరగాయ వ్యర్థాలు, లేత కొబ్బరి బొండాల డొప్పలు, పండ్ల తోటల వ్యర్థాలు, గడ్డి కత్తిరింపులు, టిష్యూ పేపర్, ఎస్టీపీ వ్యర్థాలు.. వంటి వేటినైనా సరే తమ గోల్డ్ కంపోస్టర్ ద్వారా సమర్థవంతంగా 8 గంటల్లో కంపోస్టుగా మార్చవచ్చని తివారి చెబుతున్నారు.

ఇది నిజంగా గోల్డ్ కంపోస్టరే. ఎందుకంటే, పట్టణ వ్యర్థాలను సేకరించిన తర్వాత అందులోని కుళ్లే సేంద్రియ వ్యర్థాలను, కుళ్లని ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను వేరు చేయటం పెద్ద పని. ఈ పనిని కూడా గోల్డ్ కంపోస్టరే చేసేస్తుందని తివారి చెబుతున్నారు. ఇది చాలా ముఖ్యమైన ఆవిష్కరణగా చెప్పవచ్చు.

ఇప్పటికే ఈ కంపోస్టర్లను దేశంలో 150 చోట్ల నెలకొల్పారు. 2,500 టన్నుల చెత్తను 1,200 టన్నుల కంపోస్టుగా మార్చేయటం కూడా జరిగిందట. అయితే ఇదంతా ఒక్క రోజులో జరగలేదు. పదేళ్ల ప్రయాణం, ప్రయాస దీని వెనుక ఉంది అన్నారు తివారి.

ఈ గోల్డ్ కంపోస్టర్లను నగరాలు, పట్టణాల్లో కాలనీలు, వార్డులు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ల దగ్గర నెలకొల్పి ఎక్కడికక్కడే సేంద్రియ వ్యర్థాలను కంపోస్టుగా మార్చేస్తే.. నగరాలు, పట్టణాల మూలంగా చెత్త కొండలుగా పోగుపడే సమస్య ఇట్టే పరిష్కారమైపోతుంది. పార్కులకు, ఇంటిపంటలకు, పంట పొలాలకు కూడా సిటీ కంపోస్టు పెద్ద పరిమాణంలో అందుబాటులోకి వస్తుంది. ఆల్ ద బెస్ట్ టు గోల్డ్ కంపోస్టర్!

సాక్షి ప్లస్
బుధవారం ॥ 30-7-2025

బ్యాంక్‌లు.. అడ్డదారులు!

- పోటీ మధ్య విజయం కోసం కొన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల ఆరాటం
- అనైతిక విధానాలను అనుసరిస్తున్నాయి
- ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్



ముంబై: కొన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు తీవ్రమైన పోటీ ఒత్తిళ్ల మధ్య తాత్కాలిక విజయాల కోసం అనైతిక విధానాలను అనుసరిస్తున్నాయంటూ ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జే ఆరోపించారు. తమిళనాడులోని కరూర్‌లో ప్రైవేటు బ్యాంక్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'లక్ష్యం మంచిదైనప్పుడు దాన్ని సాధించడానికి ఏ పద్ధతి అనుసరించినా మంచిదే'అన్నట్టు సంబంధిత రుణ దాతల యాజమాన్యాలు భావిస్తున్నాయంటూ.. ఆ తరహా విధానాలు బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని తుడిచిపెట్టే స్థాయని హెచ్చరించారు. క్రియేటివ్ అకౌంటింగ్ (నిబంధనల్లో లోపాలను ఆసరాగా చేసుకుని గణాంకాలను సానుకూలంగా పేర్కొంటూ తప్పుదోవ పట్టించడం), నిబంధనలకు కచ్చితంగా కట్టుబడకుండా స్వేచ్ఛగా వ్యవహరించడం, అంతర్గతంగా సరైన నియంత్రణలు లేకపోవడం వంటివి కొన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల్లో సాధారణంగా మారిపోయినట్టు చెప్పారు. దీంతో ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాల్సి వస్తోందని స్వామినాథన్ వివరించారు. నైతిక మార్గంలోనే వృద్ధి ప్రక్రియలను అనుసరించడం అవసరమన్నారు. నమ్మకమైన వ్యవస్థలు, బాధ్యతాయుతమైన నాయకత్వం, స్పందించే సేవలతో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత బ్యాంక్ బోర్డులు, యాజమాన్యాలపై ఉన్నట్టు గుర్తు చేశారు. ఒక బ్యాంక్‌కు గుర్తింపే పెద్ద ఆస్తి అవుతుందన్నారు. పోటీ పెరిగిపోయి, కస్టమర్ల అంచనాలు విస్తృతమవుతున్న నేపథ్యంలో కస్టమర్ ప్రాధాన్యంగా సేవలు అందించడం ద్వారానే నమ్మకం, విశ్వసనీయతకు తోడు, దీర్ఘకాలంలో విలువ సమకూర్చుకోవడం సాధ్యపడుతుందన్నారు. నియంత్రణపరమైన అవసరాల కోసమని నంబర్లను పెంచి చూపించడం కాకుండా.. ఆర్థిక వనరులను ఏ విధంగా వినియోగిస్తున్నారన్నది ముఖ్యమని సూచించారు.

జవాబుదారీగా నడుచుకోవాలి..

కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, కొత్త ప్రాంతాల్లోకి సేవల విస్తరణ పరంగా సరైన స్పష్టత, సమన్వయం, జవాబుదారీతనం అవసరమని స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. డిజిటల్ టెక్నాలజీలను వేగంగా అందిపుచ్చుకుంటున్నట్టే, సైబర్ భద్రత, డేటా నిర్వహణపైనా బలమైన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరాన్ని సూచించారు. టెక్నాలజీ అంతరాలను వేగంగా పరిష్కరించకుంటే వ్యవస్థాగత బలహీనతకు దారితీస్తుందని హెచ్చరించారు.

సంగీత మొబైల్స్ స్టోర్లలో వీవో ఎక్స్ ఫోల్డ్ 5 స్మార్ట్‌ఫోన్లు



హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ బ్రాండ్ 'సంగీత మొబైల్స్' వివో ఎక్స్ ఫోల్డ్ 5, ఎక్స్ 200 ఎఫ్ఈ 5జీ స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి తెచ్చింది. మాదాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో సినీ నటి నిధి అగర్వాల్ వీటిని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంగీత మొబైల్స్ స్టోర్లలో 'వివో ఎక్స్ ఫోల్డ్ 5', ఎక్స్ 200 ఎఫ్ఈ ఫోన్లను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. బడ్జెట్ ధర, కాంపాక్ట్ వివో ఎక్స్ 200 ఎఫ్ఈ.., ఫోల్డబుల్, ప్రీమియం రేంజ్ వివో ఎక్స్ ఫోల్డ్ 5 మొబైల్స్ సంగీత అవుట్‌లెట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో లభిస్తున్నాయి.

వండర్‌షెఫ్ నుంచి ఆటోమేటిక్ టీ మేకర్



హైదరాబాద్: వంటింటి ఉపకరణాల బ్రాండ్ వండర్‌షెఫ్ ప్రపంచంలోనే తొలి ఆటోమేటిక్ టీ మేకర్ 'చాయ్ మ్యాజిక్'ను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. దీని ధర రూ. 4,900గా ఉంటుంది. బటన్ నొక్కితే చాలు దేశీ స్టయిల్‌లో టీ తయారీ చేసి అందించేలా దీన్ని రూపొందించినట్లు వండర్‌షెఫ్ సహ వ్యవస్థాపకులు సంజీవ్ కపూర్, రవి సక్సేనా తెలిపారు. అల్లం, యాలకలు, మిరియాల్లాంటి సుగంధ ద్రవ్యాలు, పాలు మొదలైనవి జోడిస్తే ఇది రుచికరమైన చాయ్‌ని తయారు చేస్తుందని పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-7-2025	
విశాఖ	450-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIOFIN	322	4.77
RELIANCE	1,416.60	2.09
ASIANPAINT	2,406.10	1.97
LT	3,488.00	1.92
EICHERMOT	5,479.50	1.74

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,833.20	-0.93
AXISBANK	1,065.00	-0.8
TCS	3,057.00	-0.72
HDFCLIFE	756.5	-0.62
ITC	408.2	-0.41

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,015
ఎన్ఎస్ఈ	94,795
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,85,128
ఎఫ్ఐఐ	- 4,637
డీఐఐ	+ 6,147

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.40 (రాత్రి 11.30కు)	$ 66.71 (క్రితం ముగింపు)
బ్రెంట్	71.85 (రాత్రి 11.30కు)	$ 69.32 (క్రితం ముగింపు)

ఆర్థిక వ్యవస్థ స్థిరంగానే ఉంది

- ఎగుమతులపై వాణిజ్య అనిశ్చితుల ప్రభావం
- నిదానించిన రుణాలు, పెట్టుబడులు
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక వ్యవస్థ పనితీరు స్థిరంగానే కొనసాగుతున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో దేశీ సరఫరా, డిమాండ్ బలంగా ఉన్నట్టు కార్యకలాపాలను పరిశీలిస్తే తెలుస్తున్నట్టు తన నెలవారీ సమీక్షలో పేర్కొంది. ద్రవ్యోల్బణం నియంత్రిత లక్ష్యం పరిధిలోనే ఉండడం, రుతుపవనాల పురోగతి మెరుగ్గా ఉండడంతో దేశీ ఆర్థిక వ్యవస్థ రెండో త్రైమాసికంలోకి (జూలై-సెప్టెంబర్) బలంగా అడుగుపెట్టినట్టు తెలిపింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరగకపోయినా.. అంతర్జాతీయంగా, ముఖ్యంగా యూఎస్‌లో మందగమనం భారత ఎగుమతులపై ప్రభావం చూపించొచ్చని ఆర్థిక శాఖ తన నివేదికలో అంచనా వేసింది. అమెరికా టారిఫ్‌ల పరంగా అనిశ్చితి అదే పనిగా కొనసాగుతుండడం రానున్న త్రైమాసికాల్లో భారత వాణిజ్య పనితీరును ప్రభావితం చేయొచ్చని తెలిపింది. ప్రైవేటు పెట్టుబడులు, రుణాల్లో వృద్ధి నిదానించడం ఆర్థిక పనితీరు మరింత వేగం పుంజుకోకుండా నియంత్రించొచ్చని అభిప్రాయపడింది. స్థిరమైన ధరల వద్ద ఆర్థిక పనితీరును గమనించినట్టయితే మరింత పటిష్టంగా కనిపిస్తున్నట్టు పేర్కొంది. మొత్తం మీద చూస్తే ఆర్థిక వ్యవస్థ అనుకున్నట్టు సజావుగానే సాగుతోందని అభివర్ణించింది. దేశ స్థూల ఆర్థిక అంశాలు బలంగా ఉన్నట్టు స్పష్టం చేసింది.

నిదానించిన రుణ వితరణ

ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించడం, బ్యాంకుల బ్యాలన్స్ షీట్లు పటిష్టంగానే ఉన్నప్పటికీ రుణ వృద్ధి నిదానించినట్టు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. రుణ గ్రహీతలు ఆచితూచి వ్యవహరించడం లేదంటే రుణ దాతలు రిస్క్‌కు సిద్ధపడకపోవడం కారణమై ఉండొచ్చని పేర్కొంది. తక్కువ వ్యయాల కారణంగా కార్పొరేట్లు బాండ్ల మార్కెట్‌లో నిధులు సమీకరణకు మొగ్గు చూపిస్తుండడం కూడా రుణ వృద్ధి నిదానించడానికి ఒక కారణమై ఉండొచ్చని తెలిపింది. ఉపాధి అనుసంధానిత ప్రోత్సాహక పథకం మద్దతుతో కార్పొరేట్ సంస్థలు పెట్టుబడులతో ముందుకు రావాల్సి ఉందని సూచించింది.

భారత్ నుంచి 3 బిలియన్ డాలర్ల కొనుగోళ్లు

2030 నాటికి డెకాథ్లాన్ లక్ష్యం



న్యూఢిల్లీ: వచ్చే అయిదేళ్లలో (2030 నాటికి) తమ గ్లోబల్ కార్యకలాపాల కోసం భారత్ నుంచి కొనుగోళ్లను 3 బిలియన్ డాలర్లకు పెంచుకోనున్నట్లు (సుమారు రూ. 25,500 కోట్లు) ఫ్రాన్స్‌కి చెందిన స్పోర్ట్స్ రిటైలింగ్ సంస్థ డెకాథ్లాన్ తెలిపింది. తాము గత 25 ఏళ్లుగా భారత్ నుంచి కొనుగోలు చేస్తున్నామని, మేకిన్ ఇండియా విజన్‌కి కట్టుబడి ఉన్నామని సంస్థ ప్రొడక్షన్ హెడ్ ఫ్రెడరిక్ మెర్లివీడ్ తెలిపారు. ప్రస్తుతం తాము అంతర్జాతీయంగా జరిపే కొనుగోళ్ల పరిమాణంలో భారత్ వాటా 8 శాతంగా ఉందని, 2030 నాటికి దీన్ని 15 శాతానికి పెంచుకోనున్నామని చెప్పారు. భారత్‌లో విక్రయాల పరిమాణంలో 70 శాతం వాటా దేశీ సోర్సింగ్‌దే ఉంటోందని, దీన్ని 90 శాతానికి పెంచుకోనున్నామని వివరించారు. నాణ్యత, వేగం, కొత్త ఆవిష్కరణలపరంగా భారత్, తమ గ్లోబల్ తయారీ వ్యవస్థకు మూలస్తంభంగా నిలుస్తోందని ఫ్రెడరిక్ చెప్పారు. డెకాథ్లాన్‌కి భారత్‌లో ఒక డిజైన్ సెంటర్, 83 సరఫరాదార్లు, 113 తయారీ యూనిట్లు, 55 నగరాల్లో 132 స్టోర్స్ ఉన్నాయి. రిటైల్, తయారీ కార్యకలాపాలను విస్తరించేందుకు సుమారు రూ. 933 కోట్లు (100 మిలియన్ యూరోలు) ఇన్వెస్ట్ చేస్తామని కంపెనీ ప్రకటించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో డెకాథ్లాన్ భారత మార్కెట్లో రూ. 4,000 కోట్ల ఆదాయం, రూ. 197 కోట్ల లాభం ఆర్జించింది.

సీడీఎంవోపై లారస్ ఫోకస్..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా సంస్థ లారస్ తమ సీడీఎంవో (కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, తయారీ) విభాగంపై మరింతగా ఫోకస్ చేస్తోంది. ప్రస్తుతం వ్యాపారంలో 30 శాతంగా ఉన్న ఈ విభాగం వాటా సమీప భవిష్యత్తులో 50 శాతానికి పెరిగే అవకాశం ఉందని సంస్థ సీఈవో చావా సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి 110 యాక్టివ్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఇన్వెస్టర్లతో సమావేశంలో చెప్పారు. అటు వైజాగ్‌లో తొలి దశలో 400 కిలోలీటర్ల సామర్థ్యంతో చేపట్టిన ఫెర్మెంటేషన్ ప్లాంటు పనులు ప్రారంభమయ్యాయని, 2026 ఆఖరు నాటికి ఇది అందుబాటులోకి రాగలదని ఆయన తెలిపారు. దీని తుది సామర్థ్యం 2 మిలియన్ లీటర్లుగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రొటీన్స్, కాస్మెటిక్ ప్రొటీన్స్, పాలిమర్స్‌లాంటి వాటిపై కూడా దృష్టి పెడుతున్నట్లు సత్యనారాయణ వివరించారు. మరోవైపు, వచ్చే అయిదేళ్లలో దశలవారీగా రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వివరించారు.

డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో ఎన్నారైలకు నిబంధనల సడలింపు



న్యూఢిల్లీ: పెట్టుబడుల నిర్వహణను సులభతరం చేసే దిశగా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో ప్రవాస భారతీయులకు (ఎన్నారై) సంబంధించిన నిబంధనలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సడలించింది. ఇకపై వీటిలో ట్రేడ్ చేసేందుకు తప్పనిసరిగా క్లియరింగ్ మెంబర్స్ పేర్లను తెలియజేయడం, కస్టోడియల్ పార్టిసిపెంట్ (సీపీ) కోడ్ తీసుకోవాల్సిన ఉండదని సెబీ ఒక సర్క్యులర్‌లో తెలిపింది. అలాగే వాళ్ల పొజిషన్ లిమిట్స్ పర్యవేక్షణ ఇకపై దేశీ ఇన్వెస్టర్ల తరహాలో క్లయింట్ల స్థాయిలోనే ఉంటుందని వివరించింది. సవరించిన నిబంధనలను 30 రోజుల్లోగా అమలు చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజీలు, క్లియరింగ్ కార్పొరేషన్లను ఆదేశించింది. డెరివేటివ్స్ కాంట్రాక్టుల్లో ట్రేడింగ్‌లో ఎన్నారైలకు వెసులుబాటు కల్పించాలన్న బ్రోకర్స్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ ఫోరం చేసిన సిఫార్సుల మేరకు సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఎన్నారైలు తప్పనిసరిగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు తమ క్లియరింగ్ మెంబర్ వివరాలను ఇచ్చి, సీపీ కోడ్ తీసుకోవాల్సి ఉంటోంది. డెరివేటివ్స్ సెగ్మెంట్లో వారి పొజిషన్లను ట్రాక్ చేసేందుకు ఎక్స్ఛేంజీలు దీన్ని ఉపయోగిస్తున్నాయి.

రియల్టీ రంగానికి విరివిగా బ్యాంకు రుణాలు

- నాలుగేళ్లలో రెట్టింపు
- మార్చి చివరికి రూ.35.4 లక్షల కోట్లు
- కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగానికి (రియల్టీ) బ్యాంకులు అండగా నిలుస్తున్నాయి. ఈ రంగానికి బ్యాంకుల రుణ వితరణ నాలుగేళ్లలో రెట్టింపై 2025 మార్చి నాటికి మొత్తం రూ.35.4 లక్షల కోట్లకు చేరింది. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ రంగ కన్సల్టెంట్ అయిన కొలియర్స్ ఇండియా ప్రకటించింది. ఈ రంగానికి చెందిన టాప్-50 లిస్టెడ్ కంపెనీల లాభం, మార్కెట్ పనితీరును విశ్లేషించినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది. ''కరోనా విపత్తు అనంతరం రియల్ ఎస్టేట్ రంగం ఆర్థిక పనితీరు ఎంతో మెరుగుపడింది. ఇతర రంగాల కంటే మెరుగైన పనితీరు చూపించింది. దీంతో ఈ రంగానికి రుణ వితరణలో మంచి పురోగతి నెలకొంది. బ్యాంకుల స్థూల రుణాలు 2021 మార్చి నాటికి రూ.109.5 లక్షల కోట్లు కాగా, 2025 మార్చి నాటికి రూ.182.4 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో రియల్ ఎస్టేట్ రంగానికి బ్యాంకుల రుణ వితణ రెట్టింపైంది. రూ.17.8 లక్షల కోట్ల నుంచి రూ.35.4 లక్షల కోట్లకు పెరిగింది''అని ఆర్‌బీఐ డేటా ఆధారంగా కొలియర్స్ ఇండియా తెలిపింది.

పెరిగిన విశ్వాసం

బ్యాంకుల రుణ వితరణలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం వాటా 20 శాతానికి చేరిందని.. ఈ రంగం పట్ల బ్యాంకుల్లో విశ్వాసం పెరుగుదలను ఇది సూచిస్తున్నట్టు కొలియర్స్ ఇండియా నివేదిక తెలిపింది. ''ఎన్నో అస్థిరతలు నెలకొన్న తరుణంలోనూ భారత రియల్ ఎస్టేట్ రంగం బలంగా నిలబడడమే కాకుండా, ద్రవ్యపరమైన క్రమశిక్షణను చూపించింది''అని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాజ్ఞిక్ తెలిపారు. ఆర్థిక వ్యవస్థలో ఇతర రంగాలతో పోల్చి చూస్తే గత ఆర్థిక సంవత్సరంలో రియల్‌ఎస్టేట్ రంగంలోనే క్రెడిట్ రేటింగ్ అప్‌గ్రేడ్‌లు (రేటింగ్ పెంపు) ఎక్కువగా ఉన్నట్టు కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. నివాస భవనాలు, వాణిజ్యం, పారిశ్రామిక భవంతులు, గోదాములు, రిటైల్, ఆతిథ్యం వసతుల పరంగా డిమాండ్-సరఫరా మెరుగ్గా ఉండడం రియల్ ఎస్టేట్ రంగ రుణ నాణ్యత పటిష్టంగా ఉండేందుకు మద్దతునిస్తున్నట్టు వివరించింది. టాప్-50 కంపెనీలు లాభదాయకత, నగదు ప్రవాహం, బ్యాలన్స్ షీటు పరంగా గత ఐదేళ్లలో పనితీరు గణనీయంగా మెరుగైనట్టు పేర్కొంది. టాప్-50లో 62 శాతం కంపెనీల లాభాల మార్జిన్ 2024-25లో గరిష్టానికి చేరినట్టు వివరించింది.

క్యూ1 ఫలితాలు


ఏషియన్ పెయింట్స్ లాభం డీలా — రూ. 1,117 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 6 శాతం క్షీణించి రూ. 1,117 కోట్లకు పరిమితమైంది. కంపెనీకి ప్రధానమైన డెకొరేటివ్ పెయింట్ల విభాగంలో డిమాండ్ నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,187 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం నామమాత్ర వెనకడుగుతో రూ. 8,924 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 8,943 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు స్వల్పంగా 1 శాతం పెరిగి రూ. 7,659 కోట్లకు చేరాయి. కాగా.. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ రూ. 9,131 కోట్లను అధిగమించింది. దేశీయంగా డెకొరేటివ్ బిజినెస్ అమ్మకాల పరిమాణం 4 శాతం పుంజుకున్నప్పటికీ ఆదాయం 1 శాతంపైగా తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది. వెరసి దేశీ ఆదాయం 1 శాతం డీలాపడి రూ. 7,849 కోట్లకు పరిమితమైంది. అయితే అంతర్జాతీయ అమ్మకాలు 8 శాతం ఎగసి రూ. 736 కోట్లను దాటాయి.

ఫలితాల నేపథ్యంలో ఏషియన్ పెయింట్స్ షేరు 2% బలపడి రూ. 2,402 వద్ద ముగిసింది.

బ్యాంక్ ఆఫ్ ఇండియా జూమ్ — లాభం 32% వృద్ధితో రూ.2,252 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా జూన్ త్రైమాసికంలో స్టాండలోన్‌గా రూ.2,252 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,703 కోట్లతో పోల్చి చూస్తే రూ.2,252 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.18,240 కోట్ల నుంచి రూ.20,518 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం 3 శాతం తగ్గి రూ.6,068 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో వడ్డీ ఆదాయం రూ.6,275 కోట్లుగా ఉంది. వసూలు కాని మొండి రుణాలను (ఎన్‌పీఏలు) తగ్గించుకుంది. స్థూల ఎన్‌పీఏలు 2.92 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.75 శాతానికి దిగొచ్చాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి స్థూల ఎన్‌పీఏలు 4.62 శాతంగా, నికర ఎన్‌పీఏలు 0.99 శాతం చొప్పున ఉన్నాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.1,104 కోట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో కేటాయింపులు రూ.1,216 కోట్లుగా ఉన్నాయి. ప్రొవిజన్ కవరేజీ రేషియో 92.94 శాతానికి, రిటర్న్ ఆన్ అసెట్స్ 9.82 శాతానికి మెరుగుపడ్డాయి.

బీఎస్ఈలో షేరు ధర అర శాతం పెరిగి రూ.112 వద్ద ముగిసింది.

ఎన్‌టీపీసీ.. రూ.3.35 డివిడెండ్ — 11 శాతం పెరిగిన లాభం



న్యూఢిల్లీ: ప్రముఖ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ లిమిటెడ్ జూన్ త్రైమాసికంలో పనితీరు పరంగా రాణించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 11 శాతం బలపడి రూ.6,108 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.రూ.5,506 కోట్లుగా ఉండడం గమనించొచ్చు. ఆదాయం ఇదే కాలంలో రూ.48,529 కోట్ల నుంచి రూ.47,065 కోట్లకు పరిమితమైంది. ట్రేడింగ్ రూపంలో విద్యుత్ విక్రయించడం ద్వారా రూ.2,331 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఇతర ఆదాయం రూ.453 కోట్ల నుంచి రూ.755 కోట్లకు వృద్ధి చెందింది. ఇంధన వ్యయాలను రూ.24,973 కోట్లకు తగ్గించుకుంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇంధనాల కోసం రూ.27,845 కోట్లను వెచ్చించడం గమనార్హం. గురుదీప్ సింగ్‌ను తిరిగి చైర్మన్, ఎండీగా (సీఎండీ) నియమించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఆగస్ట్ 1 నుంచి సీఎండీగా 2026 జూలై 31వరకు కొనసాగుతారని కంపెనీ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ షేరుకు రూ.3.35 చొప్పున తుది డివిడెండ్ జారీకి నిర్ణయించింది. సెప్టెంబర్ 4ను రికార్డు తేదీగా ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌టీపీసీ షేరు 0.5 శాతం ఎగసి రూ. 334 వద్ద ముగిసింది.

వెల్‌స్పన్ కార్ప్ లాభం భళా — రూ. 349 కోట్లు



న్యూఢిల్లీ: ఐరన్ సీట్ల పైపుల తయారీ దిగ్గజం వెల్‌స్పన్ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 41 శాతం జంప్ చేసి రూ. 349 కోట్లను అధిగమించింది. స్టీల్ ప్రొడక్టుల అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 247 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,180 కోట్ల నుంచి రూ. 3,587 కోట్లకు ఎగసింది. దీనిలో స్టీల్ ప్రొడక్టుల విభాగం అమ్మకాలు రూ. 3,137 కోట్ల నుంచి రూ. 3,393 కోట్లకు బలపడ్డాయి. డక్టైల్ ఐరన్ పైప్స్, ఎస్ఎస్ బార్స్ తదితర ప్రొడక్టుల కోసం ఆర్డర్ బుక్ రూ. 19,000 కోట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ దేశ, విదేశాలలో చేపట్టిన ప్రాజెక్టులను 2027కల్లా పూర్తి చేసేందుకు రూ. 5,482 కోట్ల పెట్టుబడులు వెచ్చిస్తోంది. 2025 జూన్‌కల్లా కంపెనీ స్థూల రుణ భారం రూ. 1,032 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో వెల్‌స్పన్ కార్ప్ షేరు 7 శాతం జంప్‌చేసి రూ. 924 వద్ద ముగిసింది.

స్ట్రైడ్స్ ఫార్మా లాభం హైజంప్ — రూ. 114 కోట్లు



న్యూఢిల్లీ: ఔషధ రంగ కంపెనీ స్ట్రైడ్స్ ఫార్మా సైన్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 81 శాతం జంప్ చేసి రూ. 114 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 63 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,054 కోట్ల నుంచి రూ. 1,120 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో స్ట్రైడ్స్ ఫార్మా షేరు 3.5 శాతం ఎగసి రూ. 955 వద్ద ముగిసింది.

జూబిలెంట్ ఫార్మోవా లాభం జూమ్ — రూ. 103 కోట్లు



న్యూఢిల్లీ: ఔషధ రంగ కంపెనీ జూబిలెంట్ ఫార్మోవా ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 49 శాతం జంప్‌చేసి రూ. 103 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 69 కోట్లు ఆర్జించింది. అయితే గత క్యూ1లో రూ. 396 కోట్ల అనూహ్య లాభంతో నికర లాభం రూ. 482 కోట్లకు చేరిన సంగతి తెలిసిందే. కాగా.. ఈ ఏడాది క్యూ1లో మొత్తం ఆదాయం సైతం రూ. 1,732 కోట్ల నుంచి రూ. 1,901 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో జూబిలెంట్ ఫార్మోవా షేరు బీఎస్ఈలో 1.6 శాతం నీరసించి రూ. 1,155 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈ లాభం ప్లస్ — రూ. 2,924 కోట్లు



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్ఎస్ఈ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 14 శాతం పుంజుకుని రూ. 2,924 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 2,567 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం 3 శాతం నీరసించి రూ. 4,798 కోట్లకు పరిమితమైంది. మొత్తం వ్యయాలు 31 శాతం క్షీణించి రూ. 1,053 కోట్లుగా నమోదయ్యాయి.



కేకేఆర్‌ను వీడిన పండిత్

హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నట్లు ఫ్రాంచైజీ వెల్లడి

కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టు హెడ్ కోచ్ చంద్రకాంత్ పండిత్ శిక్షణ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రెండేళ్లుగా కేకేఆర్ కోచ్‌గా పనిచేసిన చంద్రకాంత్... ఇకపై కొనసాగబోవడం లేదని ఫ్రాంచైజీ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కోచింగ్‌లో అపార అనుభవం ఉన్న చంద్రకాంత్ శిక్షణలో కేకేఆర్ జట్టు 2024లో మూడోసారి ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకుంది. అయితే ఈ ఏడాది డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా... స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో విఫలమైంది. 14 లీగ్ మ్యాచ్‌ల్లో కేవలం ఐదింట మాత్రమే నెగ్గి పట్టికలో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ఇదే పేలవ ప్రదర్శన కాగా... ఈ సీజన్‌లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 'ప్లే ఆఫ్స్' రేసుకు దూరమై నిరాశ పరిచింది. 'కేకేఆర్ హెడ్ కోచ్ చంద్రకాంత్ పండిత్ కొత్త అవకాశాలను అన్వేషించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఫ్రాంచైజీ హెడ్ కోచ్‌గా కొనసాగాలనుకోవడం లేదు. రెండేళ్లుగా జట్టుకు ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివి. 2024లో కోల్‌కతా చాంపియన్‌గా నిలవడంలో చంద్రకాంత్ కీలక పాత్ర పోషించారు. క్రమశిక్షణ, అంకిత భావంతో బలమైన జట్టును రూపొందించారు. జట్టుపై ఆయన ప్రభావం ఎంతగానో ఉంది. భవిష్యత్తులోనూ ఆయన విజయవంతం కావాలని ఆశిస్తున్నాం' అని ఫ్రాంచైజీ ప్రకటనలో పేర్కొంది. దేశవాళీల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రకాంత్ పండిత్... 2023 ఐపీఎల్ సీజన్ ఆరంభానికి ముందు కేకేఆర్ జట్టుతో చేరారు. కాగా ఆ ఏడాది ఏడో స్థానంలో నిలిచిన కోల్‌కతా... తర్వాతి సంవత్సరం ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. 2024లో ఐపీఎల్ ట్రోఫీతో పాటు లీగ్ చరిత్రలో అత్యధిక పాయింట్లు, అత్యుత్తమ రన్‌రేట్ సైతం కేకేఆర్ నమోదు చేసుకుంది.





లెడెకీ పసిడి 'సిక్సర్'



మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆరోసారి స్వర్ణ పతకం సొంతం

సింగపూర్: సంవత్సరాలు గడుస్తున్నాయి.... ప్రత్యర్థులు మారుతున్నారు... కానీ ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో మాత్రం విజేత పేరు మారడం లేదు. 2013 నుంచి 2025 వరకు ఏడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లు జరిగాయి. ఇందులో ఆరింటిలో (2013, 2015, 2017, 2022, 2023, 2025) కేటీ లెడెకీకే స్వర్ణ పతకం లభించింది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో లెడెకీ ఫైనల్ చేరుకున్నా అనారోగ్యం కారణంగా ఫైనల్ రేసు నుంచి వైదొలిగింది. లేదంటే లెడెకీ ఖాతాలోనే స్వర్ణం చేరేది. ప్రస్తుతం సింగపూర్‌లో జరుగుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మంగళవారం జరిగిన 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో లెడెకీ తన సత్తా చాటుకుంది. ఇంతకుముందు 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో కాంస్యం నెగ్గిన లెడెకీ... 1500 మీటర్లలో పసిడి పతకం కైవసం చేసుకుంది. 15 నిమిషాల 26.44 సెకన్లలో రేసును ముగించిన ఆమె అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇతర ఈవెంట్ల సంగతి పక్కన పెడితే... 1500 మీటర్లలో తనకు తిరుగులేదని లెడెకీ మరోసారి నిరూపించింది. ఈ విభాగంలో ప్రపంచ అత్యుత్తమ స్విమ్మర్‌గా గుర్తింపు సాధించిన లెడెకీ... దశాబ్ద కాలంగా 1500 మీటర్లలో అత్యుత్తమ మహిళా స్విమ్మర్‌గా కొనసాగుతోంది. ఈ ఈవెంట్‌లో ప్రపంచ 26 అత్యుత్తమ ప్రదర్శనల్లో 25 ఆమె పేరిట ఉన్నాయంటే... 1500 మీటర్లలో ఆమె ఆధిపత్యం ఎలా సాగుతోందో అర్థంచేసుకోవచ్చు. 'నాకు ఈ రేసు అంటే చాలా ఇష్టం. 2013లో మొదటిసారి ప్రపంచ రికార్డు బద్దలు కొట్టినప్పటి నుంచి 1500 మీటర్ల రేసును ప్రేమిస్తున్నా. ఇన్నేళ్లలో ఎన్నో గొప్ప విజయాలు దక్కడం ఆనందంగా ఉంది. కొలనులో అడుగు పెట్టిన ప్రతిసారి అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే భావిస్తా. అందుకు తగ్గట్లే కష్టపడతా. ప్రస్తుత టైమింగ్‌తో సంతోషంగా ఉన్నా' అని లెడెకీ వెల్లడించింది. మంగళవారం పోటీలో ఒకానొక దశలో ప్రపంచ రికార్డు వేగం కంటే ముందున్న లెడెకీ చివర్లో కాస్త వెనుకబడింది. మహిళల స్విమ్మింగ్‌లో ఏకఛత్రాధిపత్యం కనబరుస్తున్న లెడెకీకి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది 22వ స్వర్ణం కాగా... ఓవరాల్‌గా 28వది. ఒలింపిక్స్‌లో సాధించిన 9 పసిడి పతకాలు, మొత్తంగా 14 మెడల్స్ కలుపుకుంటే... ఓవరాల్‌గా ఆమె పతకాల సంఖ్య 42. అందులో 31 స్వర్ణాలు ఉండటం విశేషం. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షురాలు, 2004, 2008 ఒలింపిక్స్ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ స్వర్ణ పతక విజేత క్రిస్టీ కొవెంట్రీ సమక్షంలో లెడెకీ పతకం నెగ్గింది. పోటీల మూడో రోజు మంగళవారం ఐదు అంశాల్లో ఫైనల్స్ నిర్వహించగా... పురుషుల 200 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో రొమేనియాకు చెందిన డేవిడ్ పాపొవిక్ వరుసగా రెండో సారి స్వర్ణ పతకం సాధించగా... పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన పీటర్ కోట్జీ పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాడు. మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో జర్మనీకి చెందిన అన్నా ఎలెన్ సంచలనం సృష్టించింది. అమెరికా స్టార్ స్విమ్మర్ కేట్ డగ్లస్‌ను వెనక్కి నెడుతూ బంగారు పతకం కైవసం చేసుకుంది. పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో ల్యూక్ హబ్సన్ విజేతగా నిలిచాడు.

భారత స్విమ్మర్లకు నిరాశ

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత స్విమ్మర్ల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు భారత స్విమ్మర్లు హీట్స్ దాటి ముందడుగు వేయలేకపోయారు. పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగంలో సజన్ ప్రకాశ్ 24వ స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు దూరమయ్యాడు. ఈ విభాగంలో తొలి 16 స్థానాల్లో నిలిచిన వాళ్లు సెమీస్‌కు అర్హత సాధించారు. భారత్ నుంచి నేరుగా ఒలింపిక్స్ (టోక్యో 2020)కు అర్హత సాధించిన తొలి స్విమ్మర్‌గా రికార్డు సృష్టించిన 31 ఏళ్ల సజన్ ప్రకాశ్... ఈ టోర్నీ 200 ఫ్రీస్టయిల్‌లో 43వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇక 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో ఆర్యన్ నెహ్రా 23వ స్థానంలో నిలిచాడు. మంగళవారం పోటీలో ఆర్యన్ 8 నిమిషాల 21.30 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. తొలి 8 స్థానాల్లో నిలిచిన వాళ్లు ఫైనల్‌కు చేరారు. మరోవైపు 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగంలోనూ ఆర్యన్ 57వ స్థానంతో సరిపెట్టుకోగా... ఎస్పీ లికిత్ 50వ స్థానంలో నిలిచాడు.

సాత్విక్–చిరాగ్ జోడీ శుభారంభం

తొలి రౌండ్‌లో అలవోక విజయం ● మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'కు అన్‌మోల్, తస్నీమ్

మకావు: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం వేచి చూస్తున్న భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి మకావు ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–13, 21–15తో లో హాంగ్ యీ–ఎన్జీ ఇంగ్ చెయోంగ్ (మలేసియా) జంటపై గెలిచి శుభారంభం చేసింది. 36 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జోడీకి ఏ దశలోనూ పోటీ ఎదురుకాలేదు. మహిళల డబుల్స్‌లో ప్రియ–శ్రుతి మిశ్రా (భారత్) జోడీ కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో ప్రియ–శ్రుతి 21–15, 16–21, 21–17తో జి లింగ్ హువాంగ్–వాంగ్ జు మిన్ (చైనీస్ తైపీ)లపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మహిళల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్స్ అన్‌మోల్, తస్నీమ్ మీర్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో అన్‌మోల్ 21–11, 21–13తో ఫాతిమా (అజర్‌బైజాన్)పై, తస్నీమ్ 21–14, 13–21, 21–17తో టిడాప్రోన్ క్లీబైసన్ (థాయ్‌లాండ్)పై గెలుపొందారు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో టాప్ సీడ్ చెన్ యు ఫె (చైనా)తో తస్నీమ్; రెండో సీడ్ బుసానన్ (థాయ్‌లాండ్)తో అన్‌మోల్ తలపడతారు.

టాప్ సీడ్ గాయత్రి జంటకు షాక్

మహిళల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. లిన్ జియో మిన్–పెంగ్ యు వె (చైనీస్ తైపీ) జోడీతో జరిగిన మ్యాచ్‌లో గాయత్రి–ట్రెసా జంట 21–16, 20–22, 15–21తో ఓడిపోయింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో అపూర్వ–సాక్షి (భారత్) 8–21, 11–21తో తియో మె జింగ్–గో పె కి (మలేసియా) చేతిలో ఓటమి చవిచూశారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో హరిహరన్–రూబన్ (భారత్) 21–15, 19–21, 14–21తో టోరి ఐజవా–దైసుకె సానో (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు. డింకూ సింగ్–అమాన్ (భారత్) జోడీ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో 21–18, 21–17తో లా చెయుక్ హిమ్–యెంగ్ షింగ్ చోయ్ (హాంకాంగ్) జంటపై నెగ్గి మెయిన్ 'డ్రా'కు చేరుకుంది.

మెయిన్ 'డ్రా'కు హేమనాగేంద్ర జోడీ

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తాండ్రంగి హేమనాగేంద్ర బాబు–ప్రియ (భారత్) జోడీ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హేమనాగేంద్ర బాబు–ప్రియ జోడీ 21–17, 21–19తో జి వె హి–యాన్ ఫె చెన్ (చైనీస్ తైపీ) ద్వయంపై విజయం సాధించింది.





జెనీ బుచార్డ్

వీడ్కోలు ముందు విజయం

మాంట్రియల్: సొంతగడ్డపై టెన్నిస్ ఆటకు వీడ్కోలు పలకాలని నిర్ణయం తీసుకున్న కెనడా స్టార్, జెనీ బుచార్డ్... నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 టోర్నీలో శుభారంభం చేసింది. దాంతో ఆమె రిటైర్మెంట్ మరో మ్యాచ్ తర్వాతే జరగనుంది. సింగిల్స్ తొలి రౌండ్‌లో బుచార్డ్ 6–4, 2–6, 6–2తో ఎమిలియానా అరాంగో (కొలంబియా)పై గెలిచింది. 31 ఏళ్ల బుచార్డ్ 2014లో ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరి... వింబుల్డన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. అదే ఏడాది కెరీర్ బెస్ట్ 5వ ర్యాంక్‌కు చేరుకున్న ఆమె 2015లో యూఎస్ ఓపెన్ సందర్భంగా కన్‌కషన్‌కు గురైంది. ఆ తర్వాత ఫామ్ కోల్పోయి వెనుకబడిపోయింది. ప్రస్తుతం 1062వ ర్యాంక్‌లో ఉన్న బుచార్డ్‌కు నేషనల్ బ్యాంక్ ఓపెన్ నిర్వాహకులు 'వైల్డ్ కార్డు' కేటాయించారు. ఈ టోర్నీ రెండో రౌండ్‌లో 17వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)తో ఆడుతుంది.

స్మృతి చేజారిన 'టాప్' ర్యాంక్

రెండో స్థానానికి భారత ఓపెనర్ ● తాజా నంబర్‌వన్ నాట్ సీవర్



దుబాయ్: భారత స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్ ర్యాంక్ చేజారింది. ఐసీసీ మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ఆమె నంబర్‌వన్ స్థానానికి ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ ఎసరు తెచ్చింది. దీంతో భారత వైస్ కెప్టెన్ రెండో స్థానానికి పడిపోగా... బ్రంట్ రెండేళ్ల తర్వాత అగ్రస్థానానికి చేరుకుంది. 2023లోనూ ఆమె టాప్ ర్యాంక్‌లో కొనసాగింది. నిజానికి ఇంగ్లండ్ పర్యటనలో రెండు పరిమిత ఓవర్ల ద్వైపాక్షిక సిరీస్‌ల్లో స్మృతి మంధాన అద్భుతంగా ఆడింది. మూడు వన్డేల్లో నిలకడైన ప్రదర్శన కనబరిచింది. 115 పరుగులు చేసింది. అయితే భారత్‌కు సిరీస్‌ను కోల్పోయినప్పటికీ ఇంగ్లండ్ సారథి నాట్ సీవర్ 160 పరుగులు చేసింది. దీంతో ఆమె 731 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకోగా... కేవలం 3 రేటింగ్ పాయింట్ల తేడాతో స్మృతి (728) వెనుకబడిపోయింది. ఐసీసీ విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో స్మృతి మినహా సహచరులు హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్‌లు పురోగతి సాధించారు. కెప్టెన్ హర్మన్ 21వ ర్యాంక్ నుంచి 11వ స్థానానికి... జెమీమా 15 నుంచి రెండు స్థానాల్ని మెరుగుపర్చుకొని 13వ ర్యాంకుకు చేరింది. వన్డే బౌలర్ల జాబితాలో భారత స్పిన్నర్ దీప్తి శర్మ నిలకడగా నాలుగో స్థానంలో కొనసాగుతుండగా, టాప్–3లో వరుసగా సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్), ఆష్లే గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా), మేగన్ షట్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.

రన్నరప్ పాయస్–అంకుర్ జోడీ



న్యూఢిల్లీ: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) బ్యూనస్ ఎయిర్స్ కంటెండర్ లెవెల్ టోర్నీలో భారత్‌కు రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం లభించాయి. అర్జెంటీనా రాజధానిలో జరిగిన ఈ టోర్నీలో... పురుషుల డబుల్స్ విభాగం ఫైనల్లో పాయస్ జైన్–అంకుర్ భట్టాచార్య జోడీ... మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో హర్మీత్ దేశాయ్–యశస్విని జంట పరాజయం పాలయ్యాయి. పాయస్–అంకుర్ 5–11, 7–11, 11–9, 9–11తో కజుకి హమాదా–హిరోము కొబయాషి చేతిలో... హర్మీత్–యశస్విని 15–17, 7–11, 11–13తో హుగో కాల్డెరానో–బ్రూనా తకహాషి (బ్రెజిల్) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మానవ్ ఠక్కర్ 10–12, 5–11, 5–11తో మిజుకి (జపాన్) చేతిలో ఓడి కాంస్యం గెల్చుకున్నాడు.

ఆస్ట్రేలియా 8 వెస్టిండీస్ 0

- విండీస్ పర్యటనలో అజేయంగా ఆసీస్
- ఆడిన 8 మ్యాచ్‌ల్లోనూ ఘనవిజయం
- ఆఖరి టి20లో 3 వికెట్లతో గెలుపు
- 5–0తో టి20 సిరీస్ క్లీన్‌స్వీప్

సెయింట్ కిట్స్: బౌలర్ల కృషికి బ్యాటర్ల సహకారం తోడవడంతో... వెస్టిండీస్‌తో చివరి టి20లో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న ఆసీస్ భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఆఖరి పోరులో 3 వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా 5 మ్యాచ్‌ల సిరీస్‌ను 5–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పటికే టెస్టు సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకున్న కంగారూలు... ఇప్పుడు టి20ల్లోనూ అదే జోరు కనబర్చగా... సొంతగడ్డపై వెస్టిండీస్ కనీస ప్రతిఘటన చూపలేకపోయింది. వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా మొదట బౌలింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య వెస్టిండీస్ 19.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మైర్ (31 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... రూథర్‌ఫోర్డ్ (17 బంతుల్లో 35; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కెప్టెన్ షై హోప్ (9), కేసీ కార్టీ (1), బ్రాండన్ కింగ్ (11), షెఫర్డ్ (8) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో బెన్ డ్వార్‌షుయి 3 వికెట్లు పడగొట్టాడు. కెరీర్‌లో వందో అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన ఆడమ్ జంపా ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 17 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (12 బంతుల్లో 30; 1 ఫోర్, 4 సిక్స్‌లు), మిచెల్ ఓవెన్ (17 బంతుల్లో 37; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), కామెరూన్ గ్రీన్ (32; 5 ఫోర్లు), ఆరోన్ హార్డీ (28 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) తలాకొన్ని పరుగులు చేయడంతో మరో 3 ఓవర్లు మిగిలుండగానే ఆసీస్ లక్ష్యాన్ని ఛేదించింది. విండీస్ బౌలర్లలో అకీల్ హుసేన్ 3 వికెట్లు పడగొట్టగా... జాసెన్ హోల్డర్, అల్జారీ జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. బెన్ డ్వార్‌షుయికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', గ్రీన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.






మంగళవారం టైగర్స్ డే సందర్భంగా ముంబైలోని బైకుల్లా జూలో కొలనులో జలకాలాడుతున్న రాయల్ బెంగాల్ టైగర్ 'శక్తి'. గ్లాస్ ఎన్‌క్లోజర్ పైకి పంజా విసురుతున్న పులిని చూసి భయపడుతున్న చిన్నారి

సమగ్ర శిక్ష నిధులను విడుదల చేయండి

ప్రధాని మోదీకి స్టాలిన్ విజ్ఞప్తి

చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.2,000 కోట్లకు పైగా విద్యా నిధులను వెంటనే విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను అమలు చేయాలని కోరారు. ప్రధానమంత్రి రెండు రోజుల తమిళనాడు పర్యటన సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ద్వారా స్టాలిన్ ఈ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను, రాజేంద్ర చోళన్ గౌరవార్థం ఒక స్మారక నాణెంను ప్రధాని ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్టాలిన్ మోదీకి లేఖ రాశారు. '2018 నుంచి తమిళనాడు ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోంది. దీని వల్ల విద్యా ఫలితాల్లో స్థిరమైన మెరుగుదలలు జరుగుతున్నాయి. తమిళనాడు పాఠశాల విద్యా వ్యవస్థ ప్రస్తుతం 43.90 లక్షల మంది విద్యార్థులు, 2.2 లక్షల మంది ఉపాధ్యాయులు మరియు 32,000 మందికి పైగా సహాయక సిబ్బందికి వసతి కల్పిస్తోంది. ఇంత కీలకమైన మరియు పెద్ద ఎత్తున పథకానికి నిధులను నిలిపివేయడం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును **తీవ్రంగా** ప్రభావితం చేస్తుంది. కానీ **నిధుల విడుద**లకు కేంద్రం జాతీయ విద్యా విధానం అమలు చేయాలని ఒక ముందస్తు షరతు పెట్టింది. ఇందులో కొన్ని నిబంధనలకు, ముఖ్యంగా త్రిభాషా విధానాన్ని విధించడం, పాఠశాల విద్యను 5+3+3+4 ఫార్మాట్‌కు పునర్నిర్మించడం గురించి రాష్ట్రానికి చట్టపరమైన, విధాన ఆధారిత అభ్యంతరాలు ఉన్నాయి. కాబట్టి.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.2,149 కోట్లను వెంటనే విడుదల చేయాలి. 2025–26 సంవత్సరానికి మొదటి విడత చెల్లింపును వేగవంతం చేయాలి'అని స్టాలిన్ లేఖలో పేర్కొన్నారు. దశాబ్దం క్రితం మంజూరు చేసి, ఇంకా పెండింగ్‌లో ఉన్న బహుళ రైల్వే ప్రాజెక్టులను అమలు చేయాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. అనంతరం .. ''తమిళనాడు విద్యార్థుల విద్యకు నిధులు, పేద, మధ్యతరగతి ప్రజల రవాణా కోసం రైల్వే ప్రాజెక్టులు, మత్స్యకారుల జీవనోపాధి, సేలం డిఫెన్స్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి గురించి గౌరవనీయ ప్రధాన మంత్రి మోదీకి మేం ఒక వినతిపత్రం సమర్పించాం. ప్రజల మనోభావాలకు, రాష్ట్ర అభివృద్ధికి విలువనిస్తూ ప్రధానమంత్రి తగిన పరిష్కారాలను అందిస్తారని విశ్వసిస్తున్నా''అని స్టాలిన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

చైనాలో భారీ వరదలు

30 మంది మృతి, లక్ష మందికి పైగా తరలింపు

బీజింగ్: ఉత్తర చైనాలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా 30 మంది మరణించారు. 130 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లు, వంతెనలు తెగిపోయాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రాణనష్టాన్ని నివారించడానికి పూర్తి స్థాయిలో సహాయక చర్యలు చేపట్టాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశించారు. దేశ రాజధాని వరదలతో అతలాకుతలమైంది. రాజధానిలోనే 80,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేలాది మందిని ఖాళీ చేయవలసి రావడంతో రాత్రంతా సహాయక చర్యలు కొనసాగాయి. బీజింగ్ సమీపంలోని షాంగ్జీ, హెబీ ప్రావిన్సులు కూడా కుండపోత వర్షాల వల్ల దెబ్బతిన్నాయి. హెబీలోని బావోడింగ్ నగరంలో దాదాపు 20,000 మందిని వారి ఇళ్ల నుంచి తరలించారు. హువైరౌ జిల్లాలో వరదలతో ఒక వంతెనను కూపోయింది. మియున్ జిల్లాలోని ప్రాంతాన్ని భారీ వర్షం ముంచెత్తిన తరువాత, ఉబ్బిన కింగ్‌షుయ్ నది రహదారులు దెబ్బతిన్నాయి. బీజింగ్ అంతటా డజన్ల కొద్దీ రోడ్లు మూసివేయబడ్డాయి లేదా దెబ్బతిన్నాయి. మియున్ జిల్లాలో నది ఉప్పొంగుతోంది. షాంగ్జీ ప్రావిన్స్‌లోని లిన్ఫెన్ సిటీలోని జిక్సియన్ కౌంటీలో ఎల్లో రివర్ ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం సాయంత్రం వరకూ వరద కొనసాగింది. కొండలన్నీ జలపాతాలు అయ్యాయి. కార్లు సెయిలింగ్ బోట్లను తలపించాయి. దక్షిణ చైనాలో కూడా భారీ వర్షాలు కురిశాయి. హాంకాంగ్ ఈ సంవత్సరం మొదటిసారిగా అత్యధిక వర్షపు తుపాను హెచ్చరికను జారీ చేసింది. బీజింగ్‌కు దక్షిణంగా, కో–మే తుఫాను సమీపిస్తుండటంతో జెజియాంగ్, జియాంగ్సు, అన్హుయ్ ప్రావిన్సుల్లో కూడా భారీ వర్షాలు కురవనున్నాయి.



రాజధాని బీజింగ్‌లోని ఓ వీధిలో వరద పరిస్థితి

పూర్తి స్థాయిలో సహాయక చర్యలు : జిన్‌పింగ్

వరద ప్రభావిత ప్రంతాల్లో సహాయక చర్యలు పూర్తి స్థాయిలో చేపట్టాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. తప్పిపోయిన వారని వెదకడానికి, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంతవరకు ప్రాణనష్టాన్ని తగ్గించాలని అధికారులను ఆదేశించారు. **ఈ ఏడాది సంభవించిన ప్రకృతి వైపరీత్యాల వల్ల చైనాకు 54.11 బిలియన్** యువాన్లు (ఆరున్నర లక్షల కోట్లు) నష్టం వాటిల్లిందని అత్యవసర నిర్వహణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో 90శాతానికి పైగా వరదల వల్లే కలిగాయని వెల్లడించింది.

వరుస వరదలు..

బీజింగ్‌లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు కొత్తేమీ కాదు. ఈ వేసవిలో చైనాలోని అనేక ప్రాంతాలు తీవ్రమైన వాతావరణాన్ని ఎదుర్కొన్నాయి. ఈ నెల ప్రారంభంలో దేశంలోని తూర్పు ప్రాంతంలో రికార్డు స్థాయిలో వేడిగాలులు వీచగా, దేశంలోని నైరుతి ప్రాంతాన్ని వరదలు ముంచెత్తాయి. సోమవారం, బీజింగ్ సమీపంలోని చెంగ్డే నగరంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో నలుగురు మరణించారు. ఎనిమిది మంది గల్లంతయ్యారు. ఈ నెల ప్రారంభంలో, టైఫూన్ విఫా తూర్పు చైనాను తాకినప్పుడు, షాన్డాంగ్ ప్రావిన్స్‌లో ఇద్దరు మరణించారు. 10 మంది గల్లంతయ్యారు. ఈ నెల ప్రారంభంలో నైరుతి చైనాలోని యాన్ నగరంలో కొండచరియలు విరిగిపడి ముగ్గురు మరణించారు. 2023లో భారీ వర్షాలు, వరదల కారణంగా 33 మంది మృతి చెందారు. 18 మంది గల్లంతయ్యారు. జూలై 2012లో వరదలు 79 మందిని బలిగొన్నాయి. ఇప్పటివరకు ఇదే అత్యంత తీవ్రమైన విపత్తు.

న్యూయార్క్‌లో కాల్పులు

నలుగురు మృతి, ఒకరికి గాయాలు ● ఆత్మహత్య చేసుకున్న నిందితుడు

వాషింగ్టన్: న్యూయార్క్ సెంట్రల్ మాన్‌హట్టన్‌లో సోమవారం కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారితో సహా నలుగురు మరణించారు. అనంతరం నిందితుడు తనను తాను కాల్చుకుని మృతి చెందాడు. బుల్లెట్ రెసిస్టెంట్ జాకెట్ ధరించి, పొడవాటి రైఫిల్ ధరించిన ఒక వ్యక్తి 44 అంతస్తుల మాన్‌హట్టన్ కార్యాలయ భవనంలోకి నడుచుకుంటూ వస్తున్నట్లు కనిపించాడు. మొదట తనకు అడ్డు వచ్చిన న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌ను కాల్చి చంపాడు. తరువాత మహిళను, సెక్యూరిటీ గార్డును కాల్చి చంపాడు. లాబీలో మరో పురుషుడిని కాల్చి చంపాడు. అక్కడి నుంచి లిఫ్ట్‌లో 33వ అంతస్తుకు వెళ్లి.. అక్కడా రెండు రౌండ్లు కాల్పులు జరపడంతో వ్యక్తి మృతి చెందాడు. అనంతరం హాలులోకి వెళ్లి తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఐదుగురిని కాల్చగా, వారిలో నలుగురు మరణించారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. కాల్పుల జరిపిన వ్యక్తిని హవాయికి చెందిన 27 ఏళ్ల షేన్ తమురాగా గుర్తించారు. కాల్పులు జరిపిన తమురాకు హ్యాండ్‌గన్ లైసెన్స్ ఉంది. పోలీసులు తమురా రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితునికి మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నాయని న్యూయార్క్ పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ తెలిపారు. గతంలో ఎలాంటి నేర నేపథ్యం లేదన్నారు.

ఈ ఘటనతో అమెరికాలో ఈ ఏడాది 254 కాల్పుల ఘటనలు జరిగినట్లు తుపాకీ సంబంధిత హింసను ట్రాక్ చేసే గన్ వయొలెన్స్ ఆర్కైవ్ తెలిపింది. కాల్పుల్లో మృతి చెందిన ఎన్‌వైపీడీ అధికారిని 36 ఏళ్ల దిదారుల్ ఇస్లాంగా గుర్తించారు. ఇస్లాం బంగ్లాదేశ్ నుంచి వలసవచ్చారు. 2021 నుంచి డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. 'ఇస్లా న్యూయార్క్ నగరాన్ని ఎంతో ప్రేమించే వ్యక్తి. ఆయన ఒక హీరో.. ప్రజలను కాపాడటం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారు. ఈరోజు ఆయన జీవితం విషాదకరంగా ముగిసింది.'అని న్యూయార్క్ పోలీసు విభాగం తెలిపింది. అతనికి ఇద్దరు పిల్లలున్నారు. భార్య ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భవతి.



హ్యాండ్‌గన్‌తో కార్యాలయంలోకి వస్తున్న తమురా

రాజ్యసభలో ఖర్గేకు జేపీ నడ్డా క్షమాపణలు

న్యూఢిల్లీ: రాజ్యసభలో మంగళవారం అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆపరేషన్ సిందూర్‌పై మాట్లాడుతూ ప్రధాని మోదీపై తీవ్రమైన ఆరోపణలు చేయడాన్ని కేంద్ర మంత్రి జె.పి.నడ్డా తప్పుపట్టారు. ఖర్గే మతి తప్పి మాట్లాడుతున్నారని, మానసిక సమతుల్యత కోల్పోయారని విమర్శించారు. మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని సభాపతిని కోరారు. అయితే, నడ్డా చేసిన విమర్శలపై ఖర్గేతోపాటు విపక్ష ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నడ్డా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై నడ్డా స్పందిస్తూ.. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నానని, క్షమాపణ కోరుతున్నానని చెప్పడంతో వివాదం ముగిసింది. ప్రధాని మోదీ అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడని, ఆయనను చూసి దేశమంతా గర్విస్తోందని చెప్పారు. మోదీని స్థాయిని, హోదాను లెక్కచేయకుండా ఖర్గే ఇష్టానుసారంగా మాట్లాడడం సరైంది కాదని అన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ కోర్టు ఉత్తర్వు వాయిదా

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన చార్జిషీట్‌పై ఢిల్లీ కోర్టు మంగళవారం తన ఉత్తర్వును వాయిదా వేసింది. ఈ కేసు ఫైల్స్‌పై మరింత లోతుగా పరిశీలన జరగాల్సి ఉందని పేర్కొంది. ఆగస్టు 7, 8న తమ ఎదుట హాజరు కావాలని దర్యాప్తు అధికారిని ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే ఆదేశించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులను ఈడీ నిందితుల జాబితాలో చేర్చిన సంగతి తెలిసిందే.

గాజాలో మరణాలు 60 వేల పైనే

డెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్–హమాస్ మధ్య 21 నెలలుగా జరుగుతున్న యుద్ధంలో 60 వేల మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య విభాగం మంగళవారం తెలిపింది. మంగళవారం నాటికి 60,034 మంది చనిపోగా మరో 1,45,870 మంది క్షతగాత్రులుగా మిగిలారని పేర్కొంది. మృతుల్లో కనీసం సగం మంది మహిళలు, చిన్నారులేనని తెలిపింది. వైద్యరంగ నిపుణులతో కూడిన గాజా ఆరోగ్య విభాగం తెలిపే గణాంకాలను అత్యంత విశ్వసనీయమైనవిగా ఐరాస ఇతర స్వతంత్ర నిపుణులు కితాబునిస్తున్నారు. ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్ ఫలితంగా గాజాలోని అత్యధిక ప్రాంతంలో విధ్వంసమే మిగిలింది. 90 శాతం మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులుగా మారారు. ఆ ప్రాంతంలో అత్యంత తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నాయి.

తాజాగా మరో 70 మంది మృతి

పరిస్థితులు దారుణంగా కనిపిస్తున్నా ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు మాత్రం యథాప్రకారం కొనసాగుతున్నాయని స్థానిక ఆస్పత్రి వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 24 గంటల వ్యవధిలో కనీసం 70 మంది చనిపోయారని తెలిపాయి. వీరిలో సగం మంది ఆహార కేంద్రాల వద్ద గుమికూడిన వారేనన్నాయి. సోమవారం దక్షిణ గాజా ప్రాంతంలోకి ప్రవేశించిన ఆహార ట్రక్కుల వద్దకు వచ్చిన వారిపై ఇజ్రాయెల్ జరిపిన కాల్పుల్లో 33 మంది చనిపోయినట్లు ఆస్పత్రులు వెల్లడించాయి. మిగతా వారు సెంట్రల్ గాజాలోని ఆహార కేంద్రం వద్ద జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నాయి. అదేవిధంగా, నుసెయిరత్ నగరంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడుల్లో తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న 12 మంది చిన్నారులు, 14 మంది మహిళలు సహా 30 మంది అసువులు బాశారని అల్–ఔదా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

కరువు వట్టిదే: ఇజ్రాయెల్

గాజాలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియన్ సార్ తీవ్రంగా స్పందించారు. అంతర్జాతీయంగా తమపై ఒత్తిడి పెంచేందుకు గాజాలో కరువు ఉందంటూ తప్పుడు ప్రచారం మొదలైందని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఒత్తిడుల వల్ల కాల్పుల విరమణతోపాటు బందీల విడుదలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఇలాంటి ప్రకటనలతో హమాస్ వైఖరి మరింత కఠినంగా మారితే తమ ప్రతిస్పందన సైతం తీవ్రంగానే ఉంటుందన్నారు.

గాజాలో అమానవీయ పరిస్థితులపై ప్రధాని మౌనం సిగ్గు చేటు: సోనియా గాంధీ

న్యూఢిల్లీ: గాజాలో ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్ నరమేధంతో సమానమైందని కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ అభివర్ణించారు. మానవీయతే మచ్చ తెచ్చే పరిణామాలు గాజాలో చోటుచేసుకుంటున్నా మోదీ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుండటంపై ఆమె మండిపడ్డారు. ఇలాంటి వైఖరి మన రాజ్యాంగ విలువలకు ద్రోహం చేసినట్లేనన్నారు. ఈ మేరకు ఆమె దైనిక్ జాగరణ్‌లో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. పాలస్తీనా విషయంలో మన దేశం దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాన్ని స్పష్టంగా, ధైర్యంగా, నిష్కపటంగా వెల్లడించాలని ఆమె ప్రధాని మోదీని కోరారు. ఇజ్రాయెల్ అమానవీయ చర్యలను ఎప్పటికప్పుడు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

పాకిస్తాన్ భార్యను తోడ్కొని రావాలి

లోక్‌సభలో బేణీవాల్ సరదా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో హాట్‌హాట్‌గా చర్చ జరిగింది. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ హనుమాన్ బేణీవాల్ సోమవారం రాత్రి సభలో వ్యాఖ్యలో పార్టీలకు అతీతంగా ఎంపీలంతా కాసేపు హాయిగా నవ్వుకున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశానికి పాకిస్తాన్ భార్యగా మారిపోయిందని, ఆ భార్యను మన ఇంటికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ''భీకర దాడులతో పాకిస్తాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం. ఈ ఆపరేషన్‌కు సిందూర్ పేరుపెట్టారు. అంటే పాకిస్తాన్ నుదుటిపైనా సిందూరం అద్దినట్లే. హిందూ సంప్రదాయం ప్రకారం మహిళలు పవిత్ర సిందూరాన్ని తమ భర్తగా భావిస్తారు. పాకిస్తాన్‌పై భారత్‌పై సిందూరం పెట్టింది కాబట్టి పాకిస్తాన్ ధర్మపత్నిగా మారిపోయినట్లే. ఇక వధువును తోడ్కొనిరావడం ఒక్కటే మిగిలి ఉంది. దయచేసి మీరు(ప్రభుత్వం) వెళ్లి, పాకిస్తాన్‌ను ఇంటికి తీసుకురండి''అని కోరారు. ప్రసంగం త్వరగా ముగించాలని స్పీకర్ సూచించగా, అర్ధరాత్రి సమయంలో మాట్లాడే అవకాశం ఇచ్చారని, తన ప్రసంగం రేపు పత్రికలో ప్రచురితం కాదని, ఇక సోషల్ మీడియాను మేనేజ్ చేసుకోవాల్సిందే అని హనుమాన్ బేణీవాల్ చెప్పగా సభలో మరోసారి నవ్వుల విరిశాయి.

భారత్ గురించి మీకు చెబుతా..!

కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ నర్మగర్భ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా కాంగ్రెస్ నాయకత్వం మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై ఆ పార్టీ ఎంపీ మనీశ్ తివారీ సామాజిక మాధ్యమాల్లో నర్మగర్భంగా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. మంగళవారం తివారీ ఎక్స్‌లో.. ఆపరేషన్ సిందూర్ చర్చలో ఎంపీలు శశి థరూర్, మనీష్ తివారీలకు కాంగ్రెస్ అవకాశమివ్వలేదంటూ వచ్చిన వార్తా కథనాన్ని జోడిస్తూ.. మనోజ్ కుమార్ నటించిన పూరబ్ ఔర్ పశ్చిమ్ సినిమాలోని 'భారత్ కా రెహ్నే వాలా హూ, భారత్ కీ బాత్ సునాతా హూ'అనే పాటను ఉటంకించారు. భారత వాసులారా..భారత్ గురించి మీకు చెబుతా..అని దీనర్థం. ఆపరేషన్ సిందూర్ అనంతరం విదేశాలకు పంపించిన దౌత్య బృందాల్లో భాగస్వాములుగా ఉన్న థరూర్, తివారీలకు పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చలో మాట్లాడే అవకాశముందంటూ వార్తలు రావడం తెల్సిందే. అయితే, వీరిద్దరికీ కాంగ్రెస్ మాట్లాడే అవకాశమివ్వలేదు. దీనిపై ఎంపీ తివారీ త్రివర్ణ పతాకం కనిపిస్తున్న ఫొటోను షేర్ చేస్తూ..1970లనాటి సినిమా పాటను జోడించారు. అనంతరం పార్లమెంట్ వెలుపల మీడియా ఈ వ్యాఖ్యలపై అర్థమేంటని అడగ్గా.. 'అంగ్లంలో ఓ సామెతుంది..'నా మౌనాన్ని అర్థం చేసుకోలేకుంటే..నా మాటలను సైతం ఎన్నటికీ అర్థం చేసుకోలేవు'అంటూ స్పందించారు. ఆ పోస్ట్ ఎవరిని ఉద్దేశించి చేశారని ప్రశ్నించగా..జర్నలిస్టులు కదా పరిశోధించండి' అంటూ దాటవేశారు. తన వ్యాఖ్యలకు అర్థాన్ని మాత్రం వివరించలేదు. అయితే, తివారీ తనకు లోక్‌సభలో మాట్లాడే అవకాశమివ్వాలని అధిష్టానాన్ని కోరినట్లు తెలిసింది. అదేవిధంగా, కాంగ్రెస్ వర్గాలు శశి థరూర్‌కు మాట్లాడే అవకాశమిచ్చానా ఆయన మాత్రం మరో అంశంపై మాట్లాడుతానని తెలిపినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతర పరిణామాలు, కేంద్రం చర్యలపై ఈ ఇద్దరు ఎంపీలు ప్రభుత్వాన్ని సమర్థించడంపై కాంగ్రెస్ అధిష్టానం గుర్రుగా ఉన్నట్లు వార్తలు రావడం తెల్సిందే.

ఉక్రెయిన్‌పై రష్యా తీవ్ర దాడులు

29 మంది పౌరులు మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని ఓ జైలు, ఆస్పత్రిపై రష్యా గైడ్ బాంబులు, బాలిస్టిక్ క్షిపణులతో జరిపిన దాడుల్లో కనీసం 29 మంది చనిపోయారు. మరో 10, 12 రోజుల్లో ఉక్రెయిన్‌తో ఒప్పందం కుదుర్చుకోకుంటే రష్యాను తీవ్ర ఆంక్షలు, టారిఫ్‌లతో శిక్షిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేసిన కొద్ది గంటల్లోనే ఈ దాడులు జరగడం గమనార్హం. జపొరిఝియా ప్రాంతంలోని బిలెన్‌కివ్‌స్కా జైలుపై రష్యా ఆర్మీ నాలుగు గైడ్ బాంబులను వేసింది. దీంతో జైలు ప్రాంగణం మొత్తం ధ్వంసమైంది. ఈ ఘటనలో 17 మంది ఖైదీలు చనిపోగా 80 మంది వరకు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కనీసం 40 మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. నీప్రో ప్రాంతంలోని కమియన్‌స్కేపై జరిగిన మరో దాడిలో మూడంతస్తుల నివాస భవనంతోపాటు ప్రసూతి ఆస్పత్రి, సిటీ ఆస్పత్రి వార్డు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో గర్భిణీ సహా నలుగురు చనిపోయారు. మరో 8 మంది గాయాలపాలయ్యారని అధికారులు తెలిపారు. ఖర్కివ్‌పై జరిగిన దాడిలో ఐదుగురు చనిపోయారు. వేర్వేరు ప్రాంతాలపై జరిగిన దాడుల్లో మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రష్యా సోమవారం రాత్రి ఉక్రెయిన్ వ్యాప్తంగా 73 నగరాలు, పట్టణాలు, గ్రామాలపై జరిపిన దాడుల్లో 29 మంది మృతి చెందారని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యాకు గడువును 50 రోజుల నుంచి 12 రోజులకు కుదిస్తూ ట్రంప్ చేసిన ప్రకటనను ఆయన స్వాగతించారు. ఈ ప్రపంచంలో ఒక్క రష్యా మినహా అందరూ శాంతిని కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఇలా ఉండగా, ట్రంప్ తాజా గడువుపై రష్యా తనదైన శైలిలో స్పందించింది. రష్యాతో ట్రంప్ హెచ్చరికల గేమ్ ఆడుతున్నారని పేర్కొంది. 'రష్యా అంటే ఇజ్రాయెల్ కాదు, ఇరాన్ అంతకన్నా కాదు'అని సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్, మాజీ అధ్యక్షుడు మెద్వెదెవ్ వ్యాఖ్యానించారు.

'ఏరోఫ్లోట్' కోలుకునేందుకు ఏడాది పట్టొచ్చు

రష్యాపై తీవ్ర సైబర్ దాడి నష్టంపై నిపుణుల అంచనా

మాస్కో: రష్యా ప్రభుత్వ విమానయాన సంస్థపై సోమవారం జరిగిన సైబర్ దాడి చాలా తీవ్రమైందని తెలుస్తోంది. దాడి కారణంగా అధికారులు కనీసం వంద విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. దీని నుంచి కోలుకునేందుకు కనీసం ఏడాదైనా పడుతుందని మీడియా కథనాలు చెబుతున్నాయి. కార్యకలాపాలను యథాప్రకారం కొనసాగించేందుకు మాస్కోలోని షెరెమెటియెవో ఎయిర్‌పోర్టు నుంచి కార్యకలాపాలను కొనసాగించింది. సైబర్ దాడితో ప్రత్యక్ష ఆర్థిక నష్టాలతోపాటు మౌలిక వనరులను సైతం ఏరోఫ్లోట్ కోల్పోయినట్లు చెబుతున్నారు. కేవలం ఐటీ వ్యవస్థలను పునరుద్ధరించేందుకే కనీసం రెండు నెలలు పట్టొచ్చని ఐటీ నిపుణులు అంటున్నారని కొమ్మెర్సాంట్ వార్తా పత్రిక తెలిపింది. కీలకమైన వ్యూహాత్మక సంస్థగా ఏరోఫ్లోట్‌ను ప్రభుత్వ గుర్తించింది. దాడి నేపథ్యంలో ప్రభుత్వం ఈ సంస్థపై ఆంక్షలను కూడా విధించే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఈ దాడికి పాల్పడింది తామేనంటూ బెలారస్‌తో సంబంధమున్న 'కిబెర్‌పార్టిజాని బీవై, సైలెంట్ క్రో'అనే రెండు హ్యాకర్ గ్రూపులు ప్రకటించుకున్నాయి. ఈ ఏడాది జనవరిలో సుమారు లక్ష మందికి సంబంధించిన వ్యక్తిగత డేటాను లీక్ చేసింది కూడా ఈ హ్యాకర్ గ్రూపులే కావడం గమనార్హం.

జార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆరుగురు కావడియాలు మృతి, 24 మందికి గాయాలు
- బస్సు, ట్రక్కు ఢీకొనడంతో ఘటన

రాంచీ: జార్ఖండ్‌లోని దియోగఢ్ జిల్లాలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శివభక్తులు కావడియాలు వెళ్తున్న బస్సును ఎదురుగా వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. ఘటనలో బస్సులోని నలుగురు మహిళలు సహా ఆరుగురు కావడియాలు చనిపోగా, 24 మంది గాయపడ్డారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు అంటున్నారు. మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జమునియా వద్ద ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన 8 మందిని దియోగఢ్‌లోని ఎయిమ్స్‌కు తరలించామని, మిగతా వారు సదర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని దియోగఢ్ డిప్యూటీ కమిషనర్ నామన్ పీయూష్ లక్రా చెప్పారు. ట్రక్కు ఢీకొనడంతో బస్సు డ్రైవర్ కిందపడి చనిపోయాడని చెప్పారు. దెబ్బతిన్న బస్సు అలాగే కొంతదూరం వెళ్లి రోడ్డు పక్కన ఇటుకలను ఢీకొట్టి నిలిచిపోయిందన్నారు. ఆ ట్రక్కులో గ్యాస్ సిలిండర్లు ఉన్నాయన్నారు. కావడియాలు దియోగఢ్ నుంచి బాసుకీనాథ్ ఆలయానికి వెళ్తుండగా ఘోరం జరిగిందని తెలిపారు. ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం, బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

మావోయిస్టు మృతి ● మందుపాతర పేలి ముగ్గురు జవాన్లకు గాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందగా.. మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో డీఆర్జీ, ఎస్టీఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలు మంగళవారం సుక్మా–దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు మందు పాతర పేల్చగా డీఆర్జీకి చెందిన ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. ఈ సందర్భంగా భారీ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఘటనాస్థలి నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులైన జవాన్ల ఆరోగ్యం నిలకడగా ఉందని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ చెప్పారు. ఘటన అనంతరం కూంబింగ్‌ను ముమ్మరం చేశామని వివరించారు.

బంగ్లాదేశ్‌లో మైనార్టీల ఇళ్లు ధ్వంసం

మరమ్మతులు చేయాలని ప్రభుత్వం ఆదేశం

ఢాకా: బంగ్లాదేశ్‌లో అల్లరి మూకలు రెచ్చిపోయాయి. మైనార్టీలైన హిందువుల ఇళ్లే లక్ష్యంగా దాడికి తెగబడ్డాయి. పదుల సంఖ్యలో ఇళ్లను ధ్వంసం చేశాయి. రంగ్పూర్‌లో శనివారం రాత్రి నుంచి అదివారం ఉదయం వరకు ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 17 ఏళ్ల హిందూ యువకుడు ఓ వర్గానికి వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు పుకార్లు వ్యాపించాయి. దాంతో హింస చెలరేగింది. అల్లరి మూకలు హిందువుల ఇళ్లపై దాడి చేశాయి. 12కుపైగా ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వాటిని వీలైనంత త్వరగా మరమ్మతు చేయాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ అధికారులను మంగళవారం ఆదేశించారు. హింసకు కారణమైన యువకుడిని పోలీసులు అరెస్టు చేశాడు. అతడు ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకుంటున్నాడు. మరోవైపు హింసకు పాల్పడినవారి కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

చిన్నారిపై లైంగిక వేధింపులు.. భారత సంతతి పైలట్ అరెస్ట్

న్యూయార్క్: చిన్నారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత సంతతికి చెందిన పైలట్‌ను శాన్ ఫ్రాన్సిస్కో అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు అరెస్ట్ చేశారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 9.35 గంటల సమయంలో డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ల్యాండవగా అధికారులు అందులోకి ఎక్కి పైలట్‌గా ఉన్న రుస్తోమ్ భగ్వాగర్(34)ను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. పదేళ్లలోపు చిన్నారిపై అతడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో కేసు నమోదైంది. తన తల్లితో డేటింగ్ చేసిన భగ్వాగర్ తనను లైంగికంగా వేధించినట్లు ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఆరేళ్లప్పుడు మొదలైన వేధింపులు తనకు 11 ఏళ్లు వచ్చేవరకు సాగించాడని, ఈ విషయం తన తల్లికీ తెలుసునని ఆమె పేర్కొంది. ఆమె సమక్షంలోనూ ఇవి సాగాయని ఫిర్యాదు చేసిందని అధికారులు వెల్లడించారు.

కెనడా విమాన ప్రమాదంలో భారతీయుడు మృతి

ఒట్టావా: కెనడాలోని న్యూఫౌండ్‌ల్యాండ్ ప్రాంతంలో చిన్న విమానం కూలిన ఘటనలో భారతీయుడొకరు ప్రాణాలు కోల్పోయారు. డీర్ లేక్ సమీపంలో ఈ నెల 26న ఈ ఘటన చోటుచేసుకుంది. డీర్ లేక్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే విమానం కూలింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఏకైక వ్యక్తి గౌతమ్ సంతోష్(27) ప్రాణాలు కోల్పోయారని టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం మంగళవారం వెల్లడించింది. ఈ ఘటనలో విమానం పైలట్ సైతం అక్కడికక్కడే చనిపోయారని పేర్కొంది. ఇందుకు కారణాలు తెలియాల్సి ఉందని తెలిపింది.

కరీంనగర్ జిల్లాలోని మునులగుట్ట అనేది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ




శాతవాహన యుగం

1. కొంతమంది చరిత్రకారులు శాతవాహనుల తొలి రాజధాని 'ధాన్యకటకం' కాదని తేల్చారు. అయితే వారి తొలి రాజధాని ఏది?
   1) కొండాపురం 2) రాచకొండ
   3) ఏలేశ్వరం 4) కోటిలింగాల
2. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) డాక్టర్ సుక్తాంకర్
   4) డాక్టర్ కె.గోపాలాచారి
3. శాతవాహనులు విదర్భ ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) కె.పి.జయస్వాల్ 4) డాక్టర్ సుక్తాంకర్
4. శాతవాహనుల తొలి ప్రాంతం మహారాష్ట్ర అని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) సుక్తాంకర్
   3) పి.టి.శ్రీనివాస్ 4) కె.పి.జయస్వాల్
5. శాతవాహనుల మూలస్థానం పైఠాన్ ప్రాంత మని పేర్కొన్నవారు?
   1) డాక్టర్ కె.గోపాలాచారి
   2) కె.వి.జయస్వాల్
   3) వి.వి.మిరాసి 4) డాక్టర్ సుక్తాంకర్
6. కరీంనగర్ జిల్లాలో మహానగర శిథిలాలు బయల్పడిన ప్రాంతం ఏది?
   1) కోటిలింగాల 2) కదంబపూర్
   3) తొగర్రాయి 4) పెద్దబంకూర్
7. నాణేలపై కనిపిస్తున్న తొలి శాతవాహన రాజు ఎవరు?
   1) శ్రీముఖుడు 2) నారన
   3) గోబద 4) సమగోపుడు
8. శాతవాహన వంశ స్థాపకుడు, మొదటి పాలకుడు ఎవరు?
   1) మొదటి శాతకర్ణి 2) కన్హుడు
   3) రెండో శాతకర్ణి 4) శ్రీముఖుడు
9. శ్రీముఖుడి పాలనా కాలం?
   1) క్రీ.పూ. 231-200
   2) క్రీ.పూ. 231-208
   3) క్రీ.పూ. 231-205
   4) క్రీ.పూ. 225-200
10. శ్రీముఖుడు మొదట అవలంబించిన మతం?
    1) జైనం 2) వైదికం
    3) బౌద్ధం 4) శైవం
11. పుష్యమిత్ర శుంగుడు ఉత్తర భారతదేశంలో మౌర్యవంశాన్ని నిర్మూలించి మగధలో క్రీ.పూ. 187లో శుంగవంశాన్ని స్థాపించే సమయంలో పాలన కొనసాగిస్తున్న శాతవాహన రాజు?
    1) శ్రీముఖుడు 2) కన్హుడు
    3) మొదటి శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
12. రాప్సన్, బారువా అనే చరిత్రకారులు ఏ నదిని 'కణ్ణబెణ్ణా'గా పేర్కొన్నారు?
    1) గంగా 2) గోదావరి
    3) కృష్ణా 4) వైన్ గంగా
13. శ్రీముఖుడి తర్వాత రాజ్యాధికారానికి వచ్చిన పాలకుడు?
    1) కన్హుడు 2) పులోమావి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) మొదటి శాతకర్ణి
14. నానాఘాట్ శాసనాన్ని వేయించిందెవరు?
    1) దేవీ నాగానిక 2) గౌతమీ బాలాశ్రీ
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) రెండో శాతకర్ణి
15. రెండో శాతకర్ణి మగధ, కళింగ ప్రాంతాలను కూడా ఆక్రమించి పాలన సాగించాడని ఏ పురాణంలో పేర్కొన్నారు?
    1) మత్స్య 2) గరుడ
    3) వరాహ 4) యుగ పురాణం
16. ఏ పాలకుడి కాలంలో శక, యవన, కళింగ, పహ్లావాదులు శాతవాహనుల రాజ్య భాగాలను ఆక్రమించారు?
    1) స్వాతికర్ణ 2) లంబోదరుడు
    3) అపీలకుడు 4) మేఘస్వాతి
17. 'బృహత్కథ', 'వాత్స్యాయన కామసూత్ర', 'కావ్య మీమాంస'లో ఏ పాలకుడికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది?
    1) శ్రీముఖుడు 2) మొదటి శాతకర్ణి
    3) కుంతల శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
18. శర్వవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) కుంతల శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) హాలుడు
    4) మొదటి పులోమావి
19. శాతవాహనుల్లో 15వ రాజు?
    1) హాలుడు
    2) మొదటి పులోమావి
    3) గౌరకృష్ణ 4) రెండో శాతకర్ణి
20. 'గాథాసప్తశతి' గ్రంథ రచయిత ఎవరు?
    1) హాలుడు 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) మొదటి పులోమావి
    4) గౌతమీపుత్ర శాతకర్ణి
21. 'త్రి సముద్ర తోయ పీతవాహన' అనేది ఎవరి బిరుదు?
    1) మొదటి పులోమావి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) యజ్ఞశ్రీ శాతకర్ణి 4) మొదటి శాతకర్ణి
22. ఏ పాలకుడి కాలంలో తెలుగు ప్రాంతమంతా శాతవాహనుల ఆధీనంలోకి వచ్చింది?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) మొదటి పులోమావి 4) హాలుడు
23. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలన్నింటినీ కలిపి పాలించిన చివరి శాతవాహన చక్రవర్తి ఎవరు?
    1) రెండో శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) శివశ్రీ 4) రెండో పులోమావి
24. శాతవాహన వంశానికి చెందిన చివరి పాలకులు రాజ్యాన్ని పంచుకొని పాలించారని కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతం ఎవరి పాలనలో ఉందని వారు పేర్కొన్నారు?
    1) కౌశికీ పుత్ర శాతకర్ణి
    2) నాలుగో పులోమావి
    3) విజయశ్రీ 4) చంద్రశ్రీ
25. 'ధాన్యకటకం'ను రాజధానిగా చేసుకొని పాలించిన రాజు?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) నాలుగో పులోమావి 4) హాలుడు
26. శాతవాహనుల్లో చివరి పాలకుడెవరు?
    1) విజయశ్రీ 2) చంద్రశ్రీ
    3) శివశ్రీ 4) నాలుగో పులోమావి
27. నాలుగో పులోమావిని ఓడించే నాటికి శ్రీశాంతమూలుడు ఎక్కడ బలవంతమైన నాయకుడిగా ఉన్నాడు?
    1) విదర్భ 2) విజయపురి
    3) మహారాష్ట్ర 4) కళింగ
28. శాతవాహన పాలకుల వరసక్రమం?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి, రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి, హాలుడు, యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
    4) హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
29. శాతవాహనుల కాలంలో ద్రవ్యపరమైన ఆదాయాన్ని భద్రపరిచే వ్యక్తిని ఏమని పిలిచేవారు?
    1) మహామాత్రులు 2) హిరణ్యకుడు
    3) మహాసేనాపతి 4) నిబంధకారుడు
30. శాతవాహనుల కాలంలో రాజాజ్ఞలు, రాజ్య వ్యవహారాలను పత్రాల్లో రాసి భద్రపరిచే వ్యక్తి?
    1) నిబంధకారుడు 2) లేఖకుడు
    3) హిరణ్యకుడు 4) అమాత్యుడు
31. నిబంధకారులకు మరో పేరు?
    1) అమాత్యులు 2) మహామాత్రులు
    3) అక్షపటకులు 4) భాండాగారికులు
32. కరీంనగర్ జిల్లాలోని మునులగుట్ట అనేది?
    1) వైదిక స్థావరం 2) విద్యా కేంద్రం
    3) బౌద్ధ స్థావరం 4) జైన స్థావరం
33. శాతవాహన కాలంలో 'కులపెద్దలను' ఏ పేరుతో పిలిచేవారు?
    1) గ్రామణి 2) నిబంధకారులు
    3) అక్షపటకులు 4) గహపతులు
34. శాతవాహనుల కాలంలో పంటలో ఎన్నో వంతును భూమిశిస్తుగా వసూలు చేసేవారు?
    1) 6 2) 5 3) 4 4) 3
35. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'స్కంధావారం' అనే పదానికి అర్థం?
    1) మిలటరీ క్యాంప్ 2) కంటోన్మెంట్
    3) రక్షణదుర్గం 4) రాజకోట
36. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'కటకం' అనే పదానికి అర్థం?
    1) సైనిక శిబిరం 2) రక్షణ దుర్గం
    3) రాజకోట 4) సైన్యాగారం
37. ఖారవేలుడు ఏ నగరాన్ని గాడిదలతో తొక్కించి నేలమట్టం చేశాడు?
    1) వినుకొండ 2) పిథుండ
    3) హన్మకొండ 4) ఓరుగల్లు
38. శాతవాహన కాలంనాటి చేతివృత్తిదారులైన 'సాలెవారు' అంటే?
    1) వధకులు 2) కాసకారులు
    3) కోలికులు 4) తిలపిష్టకులు
39. శాతవాహనుల కాలంలో 'గధికులు' అనే చేతివృత్తి వారు చేసే పని?
    1) మెరుగు పెట్టడం
    2) కుండల తయారీ
    3) కంచు పని
    4) సుగంధ ద్రవ్యాల తయారీ
40. శాతవాహనుల కాలంలో వృత్తిపనివారు చెల్లించే పన్ను పేరేమిటి?
    1) కరుకర 2) శ్రేణి
    3) శ్రేష్ఠి 4) కాలిక
41. శాతవాహనుల కాలంలో 'సేలవధకులు'గా ఎవరిని పేర్కొనేవారు?
    1) కవులు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
42. శాతవాహనుల కాలంలో 'పనకరులు' అంటే ఎవరు?
    1) కంచు పనివారు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
43. కులాలు వేటి నుంచి ఆవిర్భవించాయి?
    1) వృత్తి సంఘాలు 2) ధర్మాలు
    3) స్మృతులు 4) వర్తక సంఘాలు
44. శాతవాహనుల కాలం నాటి ప్రజల ప్రధాన ప్రయాణ సాధనం?
    1) గుర్రం బండి 2) ఎడ్ల బండి
    3) కుక్కల బండి 4) ఒంటె బండి
45. శాతవాహనుల కాలంలో విదేశాలతో వర్తకం చేసేవారిని ఏమని పిలిచేవారు?
    1) శ్రేణులు 2) నిగమాలు
    3) సార్థవాహులు 4) బిడారులు
46. శాతవాహనుల 'నాణేల'పై ప్రధానంగా కనిపించేది?
    1) ఓడముద్ర 2) చాపముద్ర
    3) వృషభం 4) సింహం
47. శాతవాహనుల 'టంకసాల' నగరం ఏది?
    1) కొండాపురం 2) పెదబంకూరు
    3) ధూళికట్ట 4) హన్మకొండ
48. శాతవాహనులతో ఎక్కువగా వర్తక వ్యాపారం నిర్వహించిన విదేశీయులు?
    1) అరేబియన్లు 2) పర్షియన్లు
    3) గ్రీకులు 4) రోమన్లు
49. శాతవాహనులు సముద్ర తీరంతోపాటు ఏ నదుల ద్వారా కూడా విదేశీ వ్యాపారం నిర్వహించేవారు?
    1) కృష్ణా, గోదావరి 2) మూసీ, గోదావరి
    3) మూసీ, కృష్ణా 4) గంగా–గోదావరి
50. 'గౌతమీ బాలశ్రీ' ఎవరి తల్లి?
    1) మొదటి శాతకర్ణి 2) రెండో శాతకర్ణి
    3) శ్రీముఖుడు 4) గౌతమీపుత్ర శాతకర్ణి
51. శాతవాహనుల కాలంలో అధికంగా చెలామణిలో ఉన్న లోహం ఏది?
    1) వెండి 2) బంగారం
    3) రాగి 4) కంచు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 3; 5) 1; 6) 2; 7) 3; 8) 4; 9) 2; 10) 1; 11) 3; 12) 4; 13) 1; 14) 1; 15) 4; 16) 2; 17) 3; 18) 1; 19) 4; 20) 1; 21) 2; 22) 1; 23) 2; 24) 1; 25) 2; 26) 4; 27) 2; 28) 4; 29) 2; 30) 1; 31) 3; 32) 4; 33) 4; 34) 1; 35) 1; 36) 4; 37) 2; 38) 3; 39) 4; 40) 1; 41) 3; 42) 4; 43) 1; 44) 2; 45) 3; 46) 1; 47) 1; 48) 4; 49) 2; 50) 4; 51) 1.

మనిషిలో యురైట్రైటిస్ వ్యాధిని కలిగించేది?



జీవులు - వర్గీకరణ

జీవులు సుమారు 3,500 బిలియన్ సంవత్సరాల క్రితం భూగోళంపైన ఏర్పడ్డాయి. వీటి గురించి వివరంగా తెలుసుకొనేందుకు వాటి వర్గీకరణ అవసరం. దీన్ని ఆధారంగా చేసుకొని అరిస్టాటిల్ మొదట శాస్త్రీయంగా వర్గీకరించే ప్రయత్నం చేశాడు. ఇతడు మొట్టమొదట మొక్కలను గుల్మాలు, పొదలు, వృక్షాలు అని, జంతువులను ఎరుపు రక్తం ఉన్నవి, ఎరుపు రక్తం లేనివి అని వర్గీకరించాడు.

తర్వాత లిన్నేయస్ రెండు రాజ్యాల వర్గీకరణను అభివృద్ధి చేశారు. వాటిలో

1) వృక్షరాజ్యం, 2) జంతురాజ్యం.

సూక్ష్మదర్శినిని కనుగొన్న తర్వాత కణ నిర్మాణం వరకు పరిశీలించి కణ కవచం ఉన్న వాటిని ఒక సమూహంగా, కణ కవచం లేని వాటిని వేరొక సమూహంగా వర్గీకరించారు. అలాగే విట్టేకర్ 1969లో కణ నిర్మాణాన్ని బట్టి జీవులను ఐదు రాజ్యాలుగా వర్గీకరించాడు.

1) మొనీరా 2) ప్రొటిస్టా
3) ఫంగీ 4) ప్లాంటేరియా
5) ఆనిమేలియా

1. **మొనీరా:** ఏకకణ నిర్మాణం కలిగిన జీవులను వీటిలో చేర్చారు. ఆర్కి బ్యాక్టీరియా, యూబ్యాక్టీరియం, మైకోప్లాస్మా, ఆక్టినోమైసిటిస్ మొదలైన కేంద్రక పూర్వజీవులు (ప్రోకేరియోట్స్) ఉన్నాయి. ఆర్కిబ్యాక్టీరియాలో కఠినమైన ఆవాసాలలో నివసించేవి ఉన్నాయి.
   1) హాలోఫిల్స్ – అత్యధిక లవణయుత ప్రాంతాలు
   2) థర్మోఅసిడోఫిల్స్ – వేడినీటి చలమలలో..
   3) మిథనోజెన్స్ – బురద ప్రదేశాల్లో

   ఇవి ఆవులు,గేదెలు వంటి వాటి జీర్ణాశయాలలో జీవిస్తూ వాటి విసర్జక పదార్థాల నుంచి మీథేన్ (బయోగ్యాస్) ఉత్పత్తికి దోహదపడుతాయి.

- యూబ్యాక్టీరియా అనేవి అత్యధికంగా ఉండే సూక్ష్మజీవులు. వీటిలో గోళాకార (కోకై), దండాకార (బాసిల్లై), కామా ఆకారం (విబ్రియో),సర్పిలాకార (స్పైరిల్లం) బ్యాక్టీరియాలు ఉంటాయి. వీటి కణ కవచం మ్యూరిన్‌తో నిర్మితమై ఉంటుంది. వీటిలో రైబోసోమ్‌లు తప్ప ఇతర కణాంగాలు ఉండవు.
- సయనో బ్యాక్టీరియాలు నత్రజని స్థాపనలో తోడ్పడతాయి. కొన్ని పరపోషిత బ్యాక్టీరియాలు పాలను పెరుగుగా మార్చటంలో, జీవనాశకాల ఉత్పత్తిలో, లెగ్యూమ్ మొక్కల వేరు బుడిపెల్లో ఉండి నత్రజని స్థాపనలో తోడ్పడతాయి. కొన్ని బ్యాక్టీరియాలు మొక్కలు, జంతువుల్లో వివిధ రకాల వ్యాధులను కలగజేస్తాయి. బ్యాక్టీరియాలను ఫ్రెండ్స్ అండ్ ఫోయిస్ అని, ప్రకృతి పారిశుధ్య కార్మికులు అని కూడా పిలుస్తారు. ట్రైకోడెస్మియం ఎరిథ్రియం ఎర్ర సముద్రంలో ఉంటుంది.
- మైకోప్లాస్మా అనేది అతి చిన్న కణం. ఇది మొక్కల్లో మంత్రగత్తె చీపురుకట్ట,పశువుల్లో ప్లూరో నుమోనియా,మనుషుల్లో మైకోప్లాస్మల్ యురిథ్రైటిస్ వంటి వ్యాధులను కలగజేస్తుంది.
- ఆక్టినోమైసిటిస్‌కు చెందిన స్ట్రెప్టోమైసిస్ ప్రజాతులు యాంటిబయోటిక్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడతాయి.

2. **ప్రొటిస్టా:** ఏక కణ నిజ కేంద్రక జీవులు. వీటిలో మొక్కలు, జంతువుల లక్షణాలు ఉండటం వల్ల వీటిని నిర్దిష్టంగా నిర్వచించలేదు. ఉదా: యూగ్లినా, జిగురుబూజులు.

- డయాటాలు డయాటమేసియస్ మృత్తికలు ఏర్పరుస్తాయి, ఇవి సిలికాన్‌ను కలిగి ఉండటం వల్ల పాలిష్ చేయడానికి, నూనెలు, ద్రవాల వడబోతకు ఉపయోగపడతాయి. మధ్యధరా సముద్రంలో ఎరుపు అలలు కనిపించడానికి కారణం వాటిలో డైనోఫ్లాజెల్లేట్స్ ఉండటమే.

రాజ్యం	కణరకం	కేంద్రకం	కణ కవచం	శరీర సంవిధానం	పోషణ
మొనీరా	ప్రోకేరియోట్	ఉండదు	సెల్యులోస్ లేనిది	కణయుతం	స్వయం పోషణ, పరపోషణ
ప్రొటిస్టా	యూకేరియోట్	ఉంటుంది	కొన్నింటిలో ఉంటుంది	కణయుతం	స్వయం పోషకం
ఫంగీ	యూకేరియోట్	ఉంటుంది	ఉంటుంది (ఖైటిన్)	బహుకణయుతం	పూతికాహారులు / కొన్ని పరాన్న జీవులు
ప్లాంటె	యూకేరియోట్	ఉంటుంది	ఉంటుంది (సెల్యులోజ్)	కణజాలయుతం	స్వయం పోషకాలు
ఆనిమేలియా	యూకేరియోట్	ఉంటుంది	ఉండదు	కణజాలయుతం / అవయవ వ్యవస్థలు	పరపోషితాలు (జాంతవభక్షణ/ హోలోజోయిక్)

ఈ వర్గంలోని ప్రొటోజోవన్లు కణకవచం లేని జంతువుల ఆదిమమైన బిందువులుగా భావించే జీవులు ఉదా:అమీబా,ప్లాస్మోడియం,పారమీసియం.

3. **శిలీంధ్రాలు (ఫంగి):** ఇవి ఎక్కువగా పూతికాహారులు. కొన్ని పరాన్న జీవులు మరికొన్ని సహజీవులు. వీటిలో ఈస్ట్, రొట్టెల బూజులు, పుట్టగొడుగులు, టాడ్ స్టూల్స్ (విషపూరిత పుట్టగొడుగులు) మొదలైనవి ఉంటాయి. వీటి కణ కవచం ఖైటిన్‌తో నిర్మితమై ఉంటుంది. వీటిలో నిల్వ ఆహారం గ్లైకోజన్.

- కొన్ని శిలీంధ్రాలు కాటుక తెగులు (యుస్టిలాగో), కుంకుమ తెగులు (పక్సీనియా), ఎర్రకుళ్లు (కొలిటోట్రైఖం), మాడు వ్యాధి (ఆల్టర్నేరియా) వంటి వాటిని కలిగిస్తాయి.
- ఈస్ట్ అనే శిలీంధ్రం కిణ్వణ ప్రక్రియలో తోడ్పడుతుంది.
- పెన్సీలియం నోటేటం అనే శిలీంధ్రం నుంచి 1928లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్ అనే యాంటిబయోటిక్ ఇంజక్షన్‌ను తయారు చేశాడు.
- అగార్, అయోడిన్ లాంటివి ఎరుపురంగు శైవలాల నుంచి లభిస్తాయి.

4. **ప్లాంటె:** వీటిలో నిజ కేంద్రక, హరితయుత స్వయం పోషకాలు ఉన్నాయి. వీటిలో కొన్ని నత్రజని లోపించిన నేలల్లో పెరిగి కీటకాలను ఆహారంగా తీసుకొంటాయి.
   ఉదా: యూట్రిక్యులేరియా (బ్లాడర్‌వర్ట్), నెపెంథిస్ (పిచ్చర్‌ప్లాంట్) మొదలైనవి. కొన్ని పరాన్న జీవ మొక్కలుగా **ఉదా:** కస్కుట, మరికొన్ని వృక్షోప జీవులుగా ఉంటాయి. మొక్కలు ముఖ్యంగా శైవలాలు, బ్రయోఫైటా, టెరిడోఫైటా, జిమ్నోస్పెర్మ్స్, ఆంజియో స్పెర్మ్స్‌గా విభజించారు.
5. **ఆనిమేలియా:** కణ కవచం లేని పరపోషిత నిజ కేంద్రక జీవులు. వీటిలో అవయవ వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఇవి ఆహారాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీసుకొని జీర్ణక్రియను కలిగి శక్తిని పొందుతాయి. వీటిలో నిల్వ ఆహార పదార్థం కొవ్వు / గ్లైకోజన్ రూపంలో ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. బ్యాక్టీరియాను మొదట కనుగొన్నది?
   ఎ) రాబర్ట్‌హుక్
   బి) ఆంటోని వాన్‌లీవెన్ హుక్
   సి) రాబర్ట్‌బ్రౌన్ డి) ష్లీడెన్
2. వైరస్ అంటే?
   ఎ) తీపి పదార్థం బి) చేదు పదార్థం
   సి) విష పదార్థం డి) ద్రవ పదార్థం
3. లెగ్యూమ్ మొక్కల వేరు బుడిపెల్లో నత్రజని స్థాపన చేసేది?
   ఎ) వైరస్ బి) ప్రొటోజోవా
   సి) థాలస్ డి) బ్యాక్టీరియా
4. బయో పెస్టిసైడ్స్‌ను దేని నుంచి తయారు చేస్తారు?
   ఎ) ఇ–కొలీ బి) థయోబాసిల్లస్
   సి) బాసిల్లస్ థురెంజియన్సిస్
   డి) పైవన్నీ
5. రెండు రాజ్యాల వర్గీకరణలో ఏ అంశాలు పరిగణనలోకి తీసుకున్నారు ?
   ఎ) బాహ్య స్వరూప లక్షణాలు
   బి) కణజాల లక్షణాలు
   సి) ప్రత్యుత్పత్తి అంశాలు
   డి) ఎ, సి
6. పూతికాహారులు అంటే?
   ఎ) అతిదేయి నుంచి ఆహారాన్ని సేకరరించేవి
   బి) నిర్జీవ పదార్థాల నుంచి ఆహార సేకరించేవి
   సి) ఇతర జీవుల నుంచి ఆహారాన్ని పొందుతూ దానికి లాభాన్ని చేకూర్చేవి
   డి) స్వయంగా ఆహారాన్ని తయారు చేసుకొనేవి
7. బ్యాక్టీరియాలో ఉండి శిలీంధ్రాల్లో ఉండనిది?
   ఎ) గ్లైకోజన్ బి) కణకవచం
   సి) మీసోసోమ్ డి) రైబోసోమ్
8. ప్రొటోజోవా ఏ రాజ్యానికి చెందుతుంది?
   ఎ) ప్రొటిస్టా బి) ఫంగై
   సి) మొనీరా డి) ప్లాంటె
9. కాంతిని శోషించి పదార్థాలను తయారు చేసుకునే సముదాయం?
   ఎ) మొనీరా బి) ఫంగై
   సి) ఆనిమేలియా డి) ప్లాంటె
10. దయాటాలు ఏ కోవకు చెందుతాయి?
    ఎ) ఫంగై బి) మొనీరా
    సి) ప్లాంటె డి) ప్రొటిస్టా
11. వైరాయిడ్‌లో కేవలం...
    ఎ) ప్రోటీన్స్ ఉంటాయి
    బి) కాప్సిడ్ ఉంటాయి
    సి) ఆర్ఎన్ఏ ఉంటుంది
    డి) ఏదీకాదు
12. మనిషిలో యుర్రైట్రైటిస్ వ్యాధిని కలిగించేది?
    ఎ) మైకోప్లాస్మా
    బి) వైరాయిడ్
    సి) ప్రయాన్ డి) ప్లాస్మోడియం
13. టాడ్‌స్టూల్స్ అంటే?
    ఎ) తినదగిన పుట్టగొడుగులు
    బి) విషపూరిత పుట్టగొడుగులు
    సి) సాగు చేసే పుట్టగొడుగులు
    డి) పుట్టగొడుగుల విత్తనాలు
14. ఎర్ర సముద్రంలో ఉండే శైవలం?
    ఎ) ట్రైకోడెస్మియం ఎరిథ్రకం
    బి) నాస్టాక్ సి) అనబినా
    డి) రైజోబియం
15. కణ కవచం లేని నిజ కేంద్రక కణాలు?
    ఎ) బ్యాక్టీరియా బి) శిలీంధ్రాలు
    సి) ప్రొటోజోవా
    డి) ఏదీకాదు
16. చెరకు ఎర్రకుళ్లు తెగులును కలిగించేది?
    ఎ) పక్సీనియం బి) కొలిటోట్రైఖం
    సి) పెన్సీలియం డి) యుస్టిలాగో
17. పొటాటో స్పిండిల్ ట్యూబర్ వ్యాధి దేనివల్ల వస్తుంది ?
    ఎ) ప్రియాన్ బి) టీఎంవీ
    సి) వైరాయిడ్
    డి) పైవన్నీ
18. బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసేవి?
    ఎ) ఆర్కి బ్యాక్టీరియా
    బి) యూ బ్యాక్టీరియా
    సి) ఫంగీ
    డి) లైకెన్స్
19. మధ్యధరా సముద్రంలో అలలు ఎరుపు రంగులో కనిపించడానికి కారణం?
    ఎ) వాల్‌వాక్స్ బి) గోనియోలాక్స్
    సి) డయాటమ్స్ డి) క్లోరెల్లా

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) సి; 5) డి; 6) బి; 7) సి; 8) ఎ; 9) డి; 10) డి; 11) సి; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ; 19) బి.

విద్య, ఉద్యోగ సమాచారం

యూసీఎస్ఎల్, కర్ణాటకలో 12 గ్రాడ్యుయేట్/డిప్లొమా అప్రెంటిస్‌లు

కర్ణాటక రాష్ట్రం మాల్పేలో ఉడిపి కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్/టెక్నీషియన్(డిప్లొమా)/ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 12.
» **విభాగాలు:** ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వెల్డర్స్, ప్లంబర్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరంగ్ డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 16.07.2025 నాటికి 18 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు గ్రాడ్యుయేట్ పోస్టులకు రూ.12,000, టెక్నీషియన్(డిప్లొమా) పోస్టులకు రూ.10,200, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.8000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, విద్యార్హతల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.08.2025
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

స్విమ్స్, తిరుపతిలో 100 నర్సింగ్ అప్రెంటిస్‌లు

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్‌వీఐఎంఎస్) తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో టెర్షియరీ కేర్ రిఫరల్ సెంటర్ నర్సింగ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 100.
» **అర్హత:** బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(హానర్స్) నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. రాష్ట్ర నర్సింగ్ రిజిస్ట్రేషన్ కౌన్సిల్ ద్వారా నమోదు చేసుకొని ఉండాలి. హిందూ మతానికి చెందిన వారై ఉండాలి. నర్సింగ్ డిగ్రీ 2021 తర్వాత పూర్తిచేసిన వారు మాత్రమే అర్హులు.
» **వయసు:** 30.06.2025 నాటికి 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు మొత్తం రూ.21,500 (ఎన్‌ఏటీఎస్ ద్వారా రూ.4,500, ఎస్‌వీఐఎంఎస్ ద్వారా రూ.17,000)
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
» **పరీక్ష తేది:** 18.08.2025.
» **ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ తేది:** 19.08.2025.
» **ఇంటర్వ్యూ తేది:** 20.08.2025.
» **ఫైనల్ సెలక్షన్ లిస్ట్ తేది:** 25.08.2025.
» **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ వైవిధ్యం

భూమిపై ఉన్న విభిన్న జీవ జాతుల సముదాయాన్నే 'జీవ వైవిధ్యం'గా పేర్కొనవచ్చు. ఇది మానవుడికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ భూమిపై మనుగడ సాగించడానికి తోడ్పడుతోంది. ఆహార, శక్తి వనరులు, ఔషధాలు, కలప, నార, పీచు రూపంలో మొక్కలు మానవుడికి ఉపయోగపడుతున్నాయి. జంతువులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న జీవ వైవిధ్యానికి ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న చర్యల వల్ల నష్టం వాటిల్లుతోంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా దీనికి తీవ్ర స్థాయిలో ముప్పు పొంచి ఉన్నట్లు యూఎన్ఈపీ (United Nations Environment Programme) ఇటీవల ప్రకటించింది. గత శతాబ్దకాలంలో అనేక వన్య జీవులు కనుమరుగైన నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో పర్యావరణ అంశాల ప్రాధాన్యం పెంచారు. అందువల్ల అభ్యర్థులు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలి.

జీవ వైవిధ్యం - నేపథ్యం

జీవ సంబంధ వైవిధ్యం (Biological Diversity) అనే పదాన్ని మొదట రేమండ్ ఎఫ్. డాస్మన్ అనే పరిరక్షణవేత్త 1968లో "A Different Kind of Country" పుస్తకంలో ఉపయోగించాడు. 1985లో వాల్టర్ జి. రోజెన్ అనే శాస్త్రవేత్త 'జీవ వైవిధ్యం'(Bio diversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించాడు. జీవులతో ముడిపడి ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను జీవ సంబంధ వైవిధ్యంగా పేర్కొంటారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ (IUCN) ప్రకారం.. ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జన్యువులు, జాతులు, జీవావరణ వ్యవస్థల సముదాయమే జీవ వైవిధ్యం. ప్రకృతిలో ఇది సహజంగా ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణ భావన 1980 నుంచి బలపడింది. అడవులను సంరక్షించడంలో భాగంగా.. అక్కడ ఉండే అన్ని రకాల జీవులు, వాటి తెగలు, వాటిలోని విభిన్న జన్యువులు, జీవులు మధ్య ఉన్న సంబంధాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచించారు.

జీవ వైవిధ్యం - వివిధ స్థాయిలు

1. **జన్యు వైవిధ్యం (Genetic Diversity):** ఒక జాతి జీవుల్లో ఉండే విభిన్న జన్యువుల సముదాయమే జన్యు వైవిధ్యం.
   ఉదా: మనుషుల్లో వివిధ తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, నిగ్రాయిడ్); మానవుడిలో విభిన్న రక్త గ్రూపులు.
2. **జాతి వైవిధ్యం (Species Diversity):** ఒక నిర్దిష్ట ప్రాంతంలోని విభిన్న జాతులకు చెందిన జీవుల సముదాయాన్ని 'జాతి వైవిధ్యం'గా పేర్కొంటారు. దీని ఆధారంగా ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న 17 మెగా బయోడైవర్సిటీ దేశాలను గుర్తించారు. ఈ రకమైన వైవిధ్యం జీవుల వర్గీకరణలో ఉపయోగపడుతుంది.
3. **ఆవరణ వ్యవస్థ వైవిధ్యం (Ecosystem Diversity):** విభిన్న రకాల భూచర, జలచర ఆవరణ వ్యవస్థల సముదాయాన్ని 'ఆవరణ వ్యవస్థ వైవిధ్యం' అంటారు.

పైన పేర్కొన్నవాటితో పాటు మైక్రోబియల్ డైవర్సిటీ, అగ్రి బయోడైవర్సిటీ లాంటి విభిన్న స్థాయి జీవ వైవిధ్యం కూడా ఉంటుంది. రాబర్ట్ విట్టేకర్ అనే శాస్త్రవేత్త జీవ వైవిధ్యాన్ని 3 రకాలుగా విభజించాడు.

1. **α - జీవ వైవిధ్యం:** దీన్ని Species Richness అంటారు. ఒక ఆవరణ వ్యవస్థలోని జాతి వైవిధ్యాన్ని ఇది తెలుపుతుంది.
2. **β - వైవిధ్యం:** రెండు భిన్న ఆవరణ వ్యవస్థల్లో జాతి వైవిధ్యంలోని భేదాన్ని ఇది తులనాత్మకంగా తెలుపుతుంది.
3. **γ - వైవిధ్యం:** ఒక విశాల భౌగోళిక ప్రాంతంలోని విభిన్న జీవ సమాజాల్లో మొత్తం వైవిధ్యాన్ని 'గామా వైవిధ్యం'గా పేర్కొంటారు.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

మెక్సికో 2002లో ప్రపంచవ్యాప్తంగా అధిక జీవ వైవిధ్యం, సంప్రదాయ విజ్ఞానానికి నిలయంగా ఉన్న దేశాలను (Like-minded Mega Diverse Countries) గుర్తించింది. Conservation International గుర్తించిన 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితా..

1. ఆస్ట్రేలియా 2. బ్రెజిల్
3. చైనా 4. కొలంబియా
5. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో
6. ఇక్వెడార్ 7. ఇండియా
8. ఇండోనేషియా 9. మడగాస్కర్
10. మలేషియా 11. మెక్సికో
12. పపువ న్యూగినియా
13. పెరూ 14. ఫిలిప్పీన్స్
15. దక్షిణాఫ్రికా
16. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
17. వెనిజులా

ఈ జాబితాలో పేర్కొన్న మొదటి దేశంలో అత్యధిక జీవ వైవిధ్యం, చివరి దేశంలో తక్కువ జీవ వైవిధ్యం ఉంటుంది.

జీవ వైవిధ్య హాట్ స్పాట్స్

అధిక జీవ వైవిధ్యానికి నిలయంగా ఉండి ముప్పు పొంచి ఉన్న జీవ భౌగోళిక ప్రాంతాలను 'బయోడైవర్సిటీ హాట్స్పాట్స్'గా పేర్కొంటారు. నార్మన్ మేయర్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త ఈ భావనను మొదటిసారిగా ప్రతిపాదించాడు. 1985-90లో ఈయన ప్రచురించిన "The Environment" అనే ఆర్టికల్లో దీని గురించి ప్రస్తావించాడు. 1996లో Conservation International ఈ భావనపై పరిశోధన చేసి మేయర్స్తో ఏకీభవించింది. ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతాన్ని బయోడైవర్సిటీ హాట్స్పాట్గా గుర్తించడంలో రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

1. కనీసం 1500 జాతుల నాళిక కణజాలయుత మొక్కలు (Vascular Plants) ఎండమిక్ (స్థానియ) జాతులుగా ఆ ప్రాంతానికే పరిమితమై ఉండాలి.
2. కనీసం 70 శాతం తమ సహజ ఆవాసాన్ని లేదా వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి.

1999లో ఇలాంటి 25 ప్రాంతాలను గుర్తించారు. ఆ తర్వాత మరో 10 ప్రదేశాలను గుర్తించారు. నార్మన్ మెయర్స్ 1999లో "Hotspots: Earth's Biologically Richest and Most Endangered Terrestrial Eco-region" పుస్తకాన్ని ప్రచురించారు. 2000లో దీన్ని 'నేచర్' అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురించారు. 2007లో రస్సెల్ మిట్టర్ మియర్ అనే శాస్త్రవేత్త "Hotspots Revisited" అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రపంచంలో ప్రస్తుతం 35 బయోడైవర్సిటీ హాట్స్పాట్లు ఉన్నాయి. అవి:

ఉత్తర, మధ్య అమెరికా

1. కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2. మ్యాడ్రియన్ పైన్ ఓక్ ఉడ్లాండ్స్
3. మిసో అమెరికా 4. కరేబియన్ దీవులు

దక్షిణ అమెరికా

1. టంబెస్ చోకో మ్యాగ్డెలిన
2. ట్రాపికల్ ఆండీస్
3. చిలీయన్ వింటర్ రెయిన్ఫాల్ వాల్డివియన్ ఫారెస్ట్
4. బ్రెజిల్ సిర్రాడో
5. బ్రెజిల్ అట్లాంటిక్ ఫారెస్ట్

యూరప్, మధ్య ఆసియా

1. కాకాసస్
2. మధ్య ఆసియా అడవులు
3. మధ్యధరా ప్రాంతం
4. ఇరాన్ అనతోలియన్

ఆఫ్రికా

1. పశ్చిమ ఆఫ్రికా - గినియా అడవులు
2. సక్యులెంట్ కరూ
3. కేప్ ఫ్లోరోస్టిక్ ప్రాంతం
4. మపుటలాండ్ - పాండో లాండ్ ఆల్బని
5. తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6. ఈస్ట్రన్ అఫ్రోమోంటేన్
7. హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8. మడగాస్కర్ - హిందూ మహాసముద్ర దీవులు

ఆసియా పసిఫిక్

1. పశ్చిమ కనుమలు - శ్రీలంక
2. హిమాలయాలు 3. ఇండో బర్మా
4. నైరుతి చైనా 5. ఫిలిప్పీన్స్
6. సుందా లాండ్ 7. వాలేసియా
8. న్యూ కాలిడోనియా
9. ఈస్ట్ మెలనేసియా అడవులు
10. పాలినేసియా మైక్రోనేసియా
11. న్యూజిలాండ్ 12. జపాన్
13. నైరుతి ఆస్ట్రేలియా 14. తూర్పు ఆస్ట్రేలియా.

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్యసమితి 'జీవ వైవిధ్య దశాబ్దం'గా దేన్ని ప్రకటించింది?
   ఎ) 2001-10 బి) 2011- 20
   సి) 2021-30 డి) 1991-2000
2. 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం' ఏ రోజు నిర్వహిస్తారు?
   ఎ) ఏప్రిల్ 22 బి) మే 22
   సి) జూన్ 20 డి) డిసెంబర్ 21
3. "Convention on Biological Diversity" అంతర్జాతీయ ఒప్పందాన్ని రూపొందించింది?
   ఎ) యునెస్కో బి) యూఎన్ఈపీ
   సి) ఎ, బి డి) ఏదీకాదు
4. భారత్లోని ఏ ప్రాంతంలో 'లయన్ టెయిల్డ్ మకాక్' అనే కోతి కనిపిస్తుంది?
   ఎ) పశ్చిమ కనుమలు
   బి) ఈశాన్య హిమాలయాలు
   సి) తూర్పు కనుమలు
   డి) అండమాన్ నికోబార్ దీవులు
5. "Conservation International" అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ ఎక్కడ ఉంది?
   ఎ) మెక్సికో బి) నైరోబి
   సి) లండన్ డి) వాషింగ్టన్
6. ప్రపంచంలోని 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో లేనిది?
   ఎ) శ్రీలంక బి) వెనిజులా
   సి) కొలంబియా డి) ఇండోనేసియా
7. ప్రపంచంలోని మెగా బయోడైవర్సిటీ కేంద్రాల్లో భారత్ స్థానం?
   ఎ) 3 బి) 5 సి) 7 డి) 9
8. జీవవైవిధ్య సంరక్షణ కోసం కుదుర్చుకున్న "Convention on Biological Diversity" (BD) అంతర్జాతీయ ఒప్పందం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   ఎ) 1993 బి) 1994
   సి) 1995 డి) 1996
9. 'నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ' ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై బి) బెంగళూరు
   సి) తిరువనంతపురం డి) గాంగ్టక్
10. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    ఎ) జెనీవా బి) న్యూఢిల్లీ
    సి) వాషింగ్టన్ డి) నైరోబి
11. 'వరల్డ్ ఎర్త్ డే'ను ఎప్పుడు నిర్వహిస్తారు?
    ఎ) మార్చి 22 బి) ఏప్రిల్ 22
    సి) సెప్టెంబర్ 16 డి) అక్టోబర్ 12
12. భారత్లో ఉభయచర వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతం ఏది?
    ఎ) వింధ్య పర్వతాలు
    బి) పశ్చిమ కనుమలు
    సి) పశ్చిమ హిమాలయాలు
    డి) తూర్పు కనుమలు
13. బట్టమేక పక్షులు (Great Indian Bustard) ఎక్కువగా ఏ రాష్ట్రంలో కనిపిస్తాయి?
    ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
    సి) మధ్యప్రదేశ్ డి) రాజస్థాన్
14. కర్ణాటకలో ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
    ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
15. ఏ జీవి నుంచి లభించే ప్రత్యేక నూనెను ఔషధాలు, పర్ఫ్యూమ్ల తయారీలో ఉపయోగిస్తారు?
    ఎ) చింకారా బి) కృష్ణజింక
    సి) కస్తూరి జింక డి) సాంబారు దుప్పి
16. 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' చిహ్నం ఏది?
    ఎ) ధ్రువ ఎలుగుబంటి
    బి) పాండా
    సి) నీలి తిమింగలం డి) ఏదీకాదు
17. 'వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' ఎక్కడ ఉంది?
    ఎ) బెంగళూరు బి) గౌహతి
    సి) డెహ్రాడూన్ డి) తిరువనంతపురం
18. దేశంలో ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?
    ఎ) గిర్ అడవులు
    బి) వేనాడ్ అభయారణ్యం
    సి) పెంచ్ జాతీయ పార్కు
    డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) బి; 3) బి; 4) ఎ; 5) డి; 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి; 11) బి; 12) బి; 13) డి; 14) సి; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ.

A European visitor to the..



BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3) / is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study any books on Freud before writing a paper on psychoanalysis.
   1) Much books 2) few books 3) some books 4) more books
   5) No correction required
7. A European visitor to the Far East must accommodate self from the habits of life that may seem very strange to him.
   1) Himself to 2) his self to 3) himself for 4) his self from 5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied for the three previous years.
   1) from previous three years
   2) during the previous three years
   3) three years previous
   4) during the three previous years
   5) No correction required
9. She always manage to hurt her mother's feelings.
   1) do manage
   2) does manage
   3) did manages
   4) do managed
   5) No correction required
10. It is the people who matters in a democracy.
    1) whom matters
    2) whose matters
    3) whose matter
    4) who matter
    5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
    1) dissent 2) decent
    3) descent 4) dissuade
    5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
    1) Fight, draw
    2) Position, aspect
    3) Plight, drain
    4) Struggle, issue
    5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
    1) proper, for
    2) correct, along
    3) suitable, among
    4) valid, from
    5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
    1) ways, deep
    2) methods, destroyed
    3) paths, shortened
    4) means, annihilated
    5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
    1) apposite, position
    2) opposite, fact
    3) relevance, media
    4) significance, party
    5) applaudable, generation

Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the ________ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelsalam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought 2) thinking 3) think 4) thinned 5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense 2) suspect 3) suspected 4) suspecting 5) suspects
29. 1) convicted 2) allowed 3) acquitted 4) arrested 5) prosecuted
30. 1) are to 2) will be 3) will been 4) have been 5) were

KEY

1) 3; 2) 2; 3) 4; 4) 5; 5) 4; 6) 3; 7) 1; 8) 2; 9) 2; 10) 4; 11) 3; 12) 3; 13) 4; 14) 4; 15) 1; 16) 4; 17) 1; 18) 5; 19) 1; 20) 3; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5.